
# విస్థాపన - విధ్వంసం



కె. బాలగోపాల్




కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

# విస్థాపన - విధ్వంసం


మానవహక్కుల వేదిక ప్రచురణ

**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 37

ప్రచురణ కాలం : అక్టోబర్ 2016

కాపీలు : 1000

వెల : 100 రూపాయలు

కవర్ : అనంతు

**ముద్రణ :**
అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126
శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 233041941
Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**

ఎస్. జీవన్ కుమార్

3-12-117/ఎ-2/బి, పి.ఎస్. కాలనీ,

గణేష్‌నగర్, రామాంతపూర్,

హైదరాబాద్-500013

ఫోన్: 040-27039519

**ప్రజాశక్తి, నవోదయ బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

**1990**ల తర్వాత ప్రభుత్వాల 'అభివృద్ధి' విధానాలు పేదలపై సునామీలా ఎలా విరుచుకుపడ్డాయో తెలుగునేల మీద ప్రతిపాదించబడిన ఒక్కొక్క సెజ్‌నూ, కారిడార్‌నూ, పరిశ్రమనూ, ప్రాజెక్టునూ తీసుకుని వివరంగా వ్యాసాలు రాశారు బాలగోపాల్. ఆ వ్యాసాలన్నిటినీ కలిపి ఐదు పుస్తకాలుగా తీసుకొస్తున్నట్టు గత ఏడాది ప్రచురించిన **'అభివృద్ధి – విధ్వంసం'** పుస్తకంలో తెలియజేశాం. ఆ సిరీస్‌లో ఇది రెండవది.

'అభివృద్ధి' మంచిచెడుల మీద భిన్నాభిప్రాయాలున్న వారికి సహితం ఒక విషయంలో ఏకాభిప్రాయం ఉంటుందనుకుంటున్నాం. అది ఈ ప్రాజెక్టుల వల్ల జరుగుతున్న విస్థాపన. ఊర్లకు ఊర్లు ఖాళీ చేయాల్సి రావడం, ప్రజలకు జరుగుతున్న నష్టానికీ వారికి లభిస్తున్న పరిహారానికీ పొంతన లేకపోవడం, పునరావాసమనేది చట్టంలో ఇప్పటికీ ఒక హక్కుగా లేకపోవడం, ప్రజల అసంతృప్తి ఉద్యమంగా మారినప్పుడు దానిని కఠినంగా అణచివేయాలని చూడడం...ఇవన్నీ గత 20, 30 ఏళ్ళలో అనేకచోట్ల చూశాం. ఇంకా చూస్తూనే ఉన్నాం. 'అభివృద్ధి' కోసం విస్థాపన అనివార్యమని భావించేవాళ్ళు కూడా వీరి పరిస్థితి పట్ల సానుభూతి చూపగలరు. కాని ప్రత్యామ్నాయాల వైపు ఆలోచించరు. ఇటువంటి 'అభివృద్ధి' అసలు అవసరమా అని ఆలోచించరు.

"ఒకరి సంతోషం మరొకరికి విచారం కాకూడదు. విషాదం అసలే కాకూడదు. దేశ అభివృద్ధి అన్నా, రాష్ట్ర అభివృద్ధి అన్నా...అక్కడ బతికే వారందరి అభివృద్ధిగా అర్థం చేసుకున్నప్పుడే అది న్యాయమైన భావన అనిపించుకుంటుంది...

(నిర్వాసితులయ్యే) ప్రజానీకం జీవితాలను, జీవన మార్గాలను కాపాడే పథకం ప్రాజెక్టు రచనలో భాగం అయినప్పుడే దానిని నిజమైన అభివృద్ధి అనగలం. అదేమీ లేకుండా ప్రాజెక్టులు కట్టేసి కొన్ని వందల వేల కుటుంబాల జీవనాధారాన్ని తొలగించి

దేశాన్ని అభివృద్ధి చేశామంటే అంగీకరించడానికి వీలు లేదు" అని బాలగోపాల్ ఈ వ్యాసాలలో పదే పదే చెప్పారు.

ఇందులోని వ్యాసాలన్నీ రెండు తెలుగు రాష్ట్రాలలోనూ గత రెండు దశాబ్దాలలో పెద్దఎత్తున జరిగిన విస్థాపన దృశ్యాల చిత్రపటాలే. ఆదివాసుల విస్థాపన గురించి, నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల జరుగుతున్న విస్థాపన గురించి **'ఆదివాసులు: చట్టం అభివృద్ధి', 'జలపాతాలు'** పుస్తకాలలో వచ్చాయని వాటిమీద రాసిన వ్యాసాలను ఇందులో చేర్చలేదు. అలాగే విస్థాపనపై వచ్చిన కోర్టు తీర్పుల మీద రాసిన వ్యాసాలనూ ఇందులో చేర్చలేదు. అవి వేరే పుస్తకంగా తెస్తున్నాం.

దేశ 'అభివృద్ధి' పేరు మీద, దేశ ప్రజల 'అభివృద్ధి' పేరు మీద జరుగుతున్న ఈ విధ్వంసాన్ని అర్థం చేసుకుని ఆచరణకు పురికొల్పడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందని నమ్ముతున్నాం.

**మానవహక్కుల వేదిక**

**25 సెప్టెంబర్ 2016**

# ఇందులో...


1. నందనవనం పేరిట మూసీ నదిని చంపొద్దు ................................ 7
2. అందరి నిర్బాధ్యతా ఫలితం చినగంజాం .................................. 13
3. కుంటి సాకుల నీడన చట్టం ................................................ 16
4. బస్తీలను తొలగించాలా అభివృద్ధి చేయాలా? ............................... 19
5. చావు ఖర్చులు వద్దంటున్న మద్దువలస నిర్వాసితులు ..................... 22
6. కొల్లేటివాసుల కొంప కొల్లేరయింది ........................................ 27
7. అభివృద్ధి – త్యాగం............................................................ 32
8. జీవో 68 కంటే మెరుగైనది కావాలి ........................................ 36
9. గంగవరం పోర్టు కథ కాల్పుల దాకా ఎట్లా వచ్చిందంటే? ................ 41
10. సెజ్‌లపైన అర్థంలేని సిఫారసులు .......................................... 46
11. రాచకొండ విస్థాపన ఫైరింగ్ రేంజ్ దగ్గరే ఆగిపోతుందా? ................ 50
12. 'శ్రీ సిటీ' సెజ్ కోసం భూసేకరణ ఆపాలి ................................. 55
13. కృష్ణపట్నం పట్టపోళ్ళ భవిష్యత్ ఏమిటి? .................................. 60
14. రిలయన్స్‌కు ఏ రూల్స్ వర్తించవా? ........................................ 65
15. సెజ్‌లు అన్ని విధాలా వినాశనకరం ........................................ 70
16. భూమి మాకు, పట్టా మీకు ! ................................................ 80
17. సాగుభూమిని ముంచకుండా తాగునీరు ఇవ్వలేమా !...................... 85
18. యెల్లంపల్లి, మిడ్ మానేరు నిర్వాసితులకు న్యాయం చేయండి ............ 89
19. పోరాటపటిమను కోల్పోయామా? .............................................. 95
20. తప్పును సవరించుకుంటే తప్పా? ........................................... 100
21. విస్థాపనే అభివృద్ధా !......................................................... 104
22. అభివృద్ధి వికృత ఫలాలు ...................................................... 110
23. కాకినాడ, పోలేపల్లి: రెండు సెజ్ వ్యతిరేక పోరాటాలు..................... 114
24. సింగరేణి బొగ్గు బీళ్ళ పాలసీ : ఓపెనయ్యేకొద్దీ విధ్వంసం................ 130
25. అభివృద్ధి పిడికిలిలో చిన్న జనం ........................................... 146

# ‘నందనవనం’ పేరిట మూసీ నదిని చంపొద్దు

**మూ**సీనదిలో రోడ్లు, తోటలు! నది మధ్య చెరువులో జలక్రీడలు! నది గర్భంలోనో ఒడ్డునో అంగళ్ళు, వ్యాపార కేంద్రాలు, పార్కులు, పూలమొక్కల నర్సరీలు!

మరి నది? ఇప్పటి దాకా మనం మూసీ నది అనుకుంటున్న దాని మధ్యన ఒక తూము కట్టి ఆ తూముకు నదిని పరిమితం చేస్తారంట. అధికార్లు పరిమితం చేస్తారు కాబట్టి మూసీనది చచ్చినట్టు ఆ తూముకు పరిమితం అయి ప్రవహిస్తుందంట. ఈ తూము పోను మిగిలిన ప్రదేశమంతా రోడ్లకూ తోటలకూ నర్సరీలకూ అంగళ్ళకూ, బహుశ నదీ తీర రెస్టారెంట్‌లకూ కేటాయించబడుతుంది. బొంబాయి నుండి, బెంగుళూరు నుండి విజయవాడ వైపు పోయే భారీ వాహనాలు నగరంలోని రద్దీని తప్పించుకొని బాపూఘాట్ నుండి నాగోల్ దాకా మూసీనదిలోని రహదారి మీద ప్రయాణించి వేగంగా నగరాన్ని దాటుతాయి. నగర మధ్యతరగతి జనం ట్యాంక్‌బండ్‌కు పోనక్కరలేకుండ మూసీతీరానికి పోయి సాయంకాలాలు సేద తీరవచ్చు. హోటళ్ళవాళ్ళూ షాపింగ్ కాంప్లెక్స్‌ల వాళ్ళూ లక్షల వ్యాపారం చేసుకోవచ్చు.

ఇది పిచ్చి తుగ్లక్ కథ కాదు. నందనవనం ప్రాజెక్టు. హైదరాబాద్‌వాసులు ఈ ప్రాజెక్టు గురించి చాలా కాలంగా వింటున్నారు. కాని ఇంత మరీ పిచ్చిపని ప్రభుత్వం చేయదులెమ్మని ఉదాసీనంగా ఉంటున్నారు. అదే పొరపాటు.

## నందనవనం ప్రాజెక్టు

మూసీ నదిని నగర సుందరీకరణకు (నగర సుందరీకరణను మూసీ నది వ్యాపారీకరణకు) లోబరచే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం గత కొంత కాలంగా కొద్దికొద్దిగా అమలు చేస్తూనే ఉంది. ప్రజోపయోగ కార్యక్రమాలలో మొట్టమొదట ప్రజలను తరిమివేయాలి కాబట్టి నది ఒడ్డున ఉన్న జనాన్ని బలవంతంగా తొలగించే పనిని మొదట చేపట్టారు. నదీతీరంలో మొత్తం 12 జనావాసాలలో 2300 పైగా ఉన్న కుటుంబాలను బలప్రయోగంతో అక్కడి నుండి పంపించి వేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. వీటిలో అతి పెద్దవి చాదర్‌ఘాట్ సమీపం లోని కమల్‌నగర్, మూసానగర్‌లు. వీరి ఇళ్ళు నిన్నమొన్న వేసుకున్న గుడిసెలు కావు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పక్కాగృహాలు. చాలామందికి పట్టాలున్నాయి, కరెంటు కనెక్షన్ ఉంది, రేషన్ కార్డులున్నాయి, ప్రభుత్వమే కట్టిచ్చిన అపార్ట్‌మెంట్స్ సహితం ఉన్నాయి. అయినప్పటికీ వాటికి ప్రభుత్వం అక్రమ నివాసాలు అని పేరుపెట్టి బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేసేసరికి ఆ జనావాసాల ప్రజలు హైకోర్టుకు పోయి ఇళ్ళ కూల్చివేతపైన స్టే తెచ్చుకున్నారు.

కూల్చివేత ప్రయత్నం ఆ విధంగా తాత్కాలికంగా ఆగిపోగా, ప్రభుత్వం నది లోపల రోడ్ల నిర్మాణం మొదలుపెట్టింది. బాపూఘాట్ నుండి జియాగూడ దాకా నది ఒడ్డున ఖాళీ జాగా దొరికింది కాబట్టి ఒడ్డు మీద రోడ్డు వేస్తున్నారు. జియాగూడ నుండి దిగువకు నది ఒడ్డున జనావాసాలున్నాయి. వారందరినీ తొలగించాలంటే చాలా ఖర్చవుతుంది. కాబట్టి జియాగూడ నుండి పురానాపూల్ (పాత బ్రిడ్జి) దాకా నదిలోనే హాయిగా రోడ్డు వేసేస్తున్నారు. నదికి గౌరవ సూచకంగా రోడ్డు పక్కన గోడ కట్టి నదిని ఆ గోడకు ఆవల ఉండమని ఆదేశిస్తున్నారనుకోండి. కానీ ఇంకా దిగువన ఆ మాత్రం గౌరవం కూడ మూసీకి ఇవ్వడం లేదు. ఇమ్లిబన్ నుండి చాదర్‌ఘాట్ కాజ్‌వే దాకా దక్షిణభాగాన నదిలోనే విశాలమైన రహదారి నిర్మాణం జరుగుతున్నది. ఈ రహదారి చాదర్‌ఘాట్ రోడ్డు బ్రిడ్జి కింద నుండి, రైలు బ్రిడ్జి కింద నుండి ప్రయాణం చేసి మళ్ళీ ఒడ్డెక్కి తిరిగి పాత మలక్‌పేట దగ్గర నదిలోకి దిగి మళ్ళీ ఒడ్డెక్కి మూసారాంబాగ్ కాజ్‌వే దాటి.... ఈ విధంగా సాగుతుంది.

నది లోపల రోడ్లేమిటి అని తొందరపడి ఆశ్చర్యపోవద్దు. రోడ్లు మాత్రమే కాదు, అంతా పూర్తయ్యేసరికి నది లోపల పూదోటలు (కనీసం నర్సరీలు), యూకలిప్టస్, సుబాబుల్ మొదలయిన వృక్షరకాల తోటలు, పార్కులు, పార్కుహోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్స్‌లు అన్నీ ఉంటాయి.

## నగరానికి వరద, దిగువన నీటి కొరత

మరి నది ఎక్కడికి పోతుంది? నిజానికి మొన్నటి వరద లాంటిది వస్తే నది మాత్రమే ఉంటుంది. మిగిలినదంతా పోతుంది. కానీ నందనవనం అనే ప్రాజెక్టు స్వప్నంలో మూసీనది ఒద్దికగా ఒక చిన్న పాయగా, తన ఒకప్పటి ప్రవాహ మార్గంలో నెలకొన్న సుందర నగర విశేషాలను తిలకిస్తూ ఇన్నాళ్ళూ ఇంత విచ్చలవిడిగా ప్రవహించానే అని సిగ్గుపడుతూ పిల్లకాలవయి ప్రవహిస్తుంది.

రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పార్కులు నది లోపల కట్టాలంటే నదీ ప్రవాహం తగ్గించాలి కాబట్టి జియాగూడకు ఎగువన ఉన్న కేసరి హనుమాన్ – గణేశ్ దేవాలయాల దగ్గర నది మీద కొత్త రిజర్వాయర్ కట్టబోతున్నారు. ఆ రిజర్వాయర్ నదిగర్భంలో వెలసే నర్సరీలకూ పార్కులకూ నీళ్ళిస్తుంది. అంతేకాక అందులో ఈత పోటీలు, పడవ పోటీలు నిర్వహిస్తారు. ఇకమీదట జలక్రీడలలో ఒలింపిక్స్‌కు హైదరాబాద్ నుండి క్రీడాకారులు తప్పకపోతారు (ఈ లోపల నదికి వరదొచ్చి వాళ్ళూ వాళ్ళ క్రీడాభిమానమూ మునిగిపోకపోతే).

ప్రపంచాన్ని తన కంప్యూటర్ స్క్రీన్‌పైన చూసుకొని అదే ప్రపంచమని భావించే ముఖ్యమంత్రి పాలనలో అధికార్ల మెదళ్ళలో ఇటువంటి ఆలోచనలు పుట్టడం ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. కానీ నగర సుందరీకరణ పేరిట సాగుతున్న ఈ మూసీ వ్యాపారీకరణను నగరవాసులూ, మూసీ పరీవాహక ప్రాంతవాసులయిన రంగారెడ్డి, నల్గొండ జిల్లా ప్రజలూ మౌనంగా ఆమోదించవలసిందేనా?

మూసీనదిని కేవలం హైదరాబాద్ నగరానికి సంబంధించిన విషయంగా చూడడం కంటే అన్యాయం వేరే ఏమీ ఉండదు. హైదరాబాద్‌కు దిగువన ఆ నది చాలా దూరం ప్రవహిస్తుంది. మూసీకి చిన్న చిన్న ఆనకట్టలు కట్టి కనీసం 40 గ్రామాల ప్రజలు సాగునీరు పొందుతున్నారు. ప్రత్యక్షంగా దీనివల్ల దాదాపు 50 వేల ఎకరాలు సాగుకావడమే కాక చెరువులలో, బావులలో ఊట పెరిగి ఇంకొక 50 వేల

ఎకరాలు సాగవుతున్నాయి. కొంత కాలంగా నగరం నుండి నదిలోకి చేరుతున్న కాలుష్యం వల్ల ఆ సాగునీరు విషపునీటిగా మారుతున్నది. మంచినీటి వనరులు కూడా కలుషితం కావడం వల్ల హైదరాబాద్‌కు పాలు, కూరగాయలు అమ్ముకోవడానికి వచ్చేవాళ్ళు ఇక్కడి నుండి మంచినీళ్ళు తీసుకొనిపోతున్నారు! ఇప్పుడు నందనవనం ప్రాజెక్టు వాళ్ళకు ఏం మిగులుస్తుందో చూడాలి. నందనవనం కోసం నదీ ప్రవాహాన్ని తగ్గించడానికి జియాగూడకు ఎగువన కడుతున్న రిజర్వాయర్ వల్ల నది దిగువ భాగంలో సాగునీటి లభ్యత తగ్గిపోయే ప్రమాదం ఉంది. వర్షపాతం తక్కువ ఉన్న సంవత్సరాలలో ఇది తప్పనిసరిగా జరుగుతుంది. నందనవనం నగరవాసులందరి ప్రయోజనం కోసమని కొంచెం సేపు ఒప్పుకున్నా, నగరవాసుల ప్రయోజనాల కోసం వేలాది దిగువ ప్రాంతం రైతుల సాగునీటి అవసరాలను తాకట్టు పెట్టడం న్యాయమేనా? అయినా ఈ ప్రాజెక్టు నగరవాసులందరి ప్రయోజనాల కోసం కూడా కాదు. కొందరిని ఊరి వెలుపలికి తరిమేసి, మరికొందరి వ్యాపార ప్రయోజనాల కోసం, వ్యాహ్యాళి కోసం, విలాసాల కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఇది.

మరొక వైపు నదీ పరీవాహక ప్రాంతంలో తోటలు, రోడ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు కట్టడం వలన నదికి సహజంగా ఉండే ప్రవాహ స్వేచ్ఛ ఉండదు. వర్షం ఎక్కువ వచ్చిన సంవత్సరాలలో – ఉదాహరణకు ఈ సంవత్సరంలో లాగ – ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ గేట్లతోపాటు కొత్తగా కట్టబోయే రిజర్వాయర్ గేట్లు కూడా ఎత్తివేయక తప్పదు కాబట్టి, ఈ నిర్మాణాలూ వాటిలోని మనుషులూ మునిగిపోవడమే కాక నది నీళ్ళు గట్టుపైకి పొంగి నగరం – ముఖ్యంగా పాత నగరం – మునిగిపోయే ప్రమాదం ఉంటుంది. అంతేకాక, సహజంగా వంకరలు తిరిగి ప్రవహించే నదికి తూము కట్టి నేరుగా ప్రవహించేటట్టు దాని ప్రవాహ గమనాన్ని మారిస్తే వరదలొచ్చినప్పుడు వేగం పెరిగి ముంపు ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. మొన్నటి వరదలు నందనవనం పూర్తికాక ముందు వచ్చాయి కాబట్టి సరిపోయింది గానీ ఆ ప్రాజెక్టు పూర్తయిన తరువాత వచ్చి ఉంటే వరద తాకిడికి నగరం ఎంతగా దెబ్బతిని ఉండేదో.

సాధారణ సంవత్సరాలలో దిగువప్రాంత రైతులకు సాగునీటి లేమి, అతివృష్టి సంవత్సరాలలో నగరానికి వరద ప్రమాదం తెచ్చే ఈ ప్రాజెక్టును మనం మౌనంగా ఆమోదించవలసిందేనా?

## ఎటువంటి పునరావాసం?

కనీసం మొన్నటి వరదలయినా ప్రభుత్వానికి కళ్ళు తెరిపించి ఉండవలసింది. తెరిపించకపోగా, కోర్టు నుండి స్టే తెచ్చుకున్న మూసీ పరిసరవాసులను వరదలను అడ్డం పెట్టుకొని తొలగించాలని ప్రభుత్వం ప్రయత్నించింది. నందనవనం సాధ్యమైనా కాకపోయినా ఫరవాలేదు, ముందు ఈ జనాన్ని ఖాళీ చేయించేస్తే తరువాత చూసుకోవచ్చుననేది మన పాలకుల వైఖరి.

వాళ్ళను ఎక్కడికి తరిమేయాలి? సాగర్ రోడ్లో నగరం వెలుపల ఉన్న కర్మన్‌ఘాట్‌కు, లేదా గుడిమల్కాపూర్‌కు. ఈ రెండు చోట్లా ప్రభుత్వం ఈ జనాన్ని తరలించాలనుకుంటున్న జాగా పైన ప్రభుత్వానికే హక్కు లేదు. ఆ భూములు కోర్టు వ్యాజ్యాలలో ఇరుక్కొని ఉన్నాయి. పైగా ఇప్పటికే కర్మన్‌ఘాట్‌కు తరలిపోయిన వారి అనుభవం ఏమిటంటే, అంత దూరం నుండి నగరానికి రోజూ వచ్చి పనిచేసుకొని పోవడం కష్టసాధ్యమని. ఆ ప్రజలంతా నగరంలోని వివిధ ప్రాంతాలలో కూలి చేసుకొని బ్రతుకుతారు. రిక్షాలు లాగి, ఆటోలు నడిపి, ఇళ్ళల్లో పాచిపని చేసి, మూటలు మోసి బతుకు తెరువు సంపాదించుకుంటారు. కర్మన్‌ఘాట్ నుండి వారు పనిచేసుకొనే స్థలాలకు రానుపోను సమయం, ఖర్చు, కొత్త ఇళ్ళ దగ్గర అభద్రత పెరగడంతో ఒక్కొక్క కుటుంబం ఆదాయం సగానికి మించి పడిపోయింది. స్త్రీలు, పిల్లలు పనికిపోవడమే మానేశారు. ఇప్పటిదాకా 'నందనవనం' సాధించింది ఈ ప్రజల జీవనాధారాన్ని కొల్లగొట్టడం మాత్రమే.

ప్రభుత్వం ఏదో పేరు చెప్పి ఏదో పని చేస్తే మనం సహించి ఊరుకోవలసిన అవసరం లేదు. దానివల్ల ప్రయోజనం ఎంత, నష్టం ఎంత, ప్రయోజనం ఎవరికి, నష్టం ఎవరికి అనేది చూడాలి. మూసీనదిలో కాలుష్యాన్ని నివారించి ఆ నది నీటిని శుభ్రపరిచే కార్యక్రమానికి ప్రభుత్వం పరిమితమైతే ఫరవాలేదు. నిజానికి అది అవసరం కూడా. కానీ నందనవనం పేరిట మూసీనదిని వ్యాపార అవసరాల కోసం, పర్యాటక వినోద అవసరాల కోసం వాడుకోవాలని చూడడం ఆ నదిపైన ఆధారపడి బతుకుతున్న దిగువ ప్రాంత రైతాంగానికి నష్టకరం, ఆ నది ఒడ్డున దశాబ్దాలుగా బతుకుతున్న నగర శ్రామిక ప్రజల జీవనానికి నష్టకరం, మొత్తంగానే నగర (ముఖ్యంగా పాతనగరం) వాసులకు నష్టకరం.

అందుకే నందనవనం పేరిట జరుగుతున్న నష్టాన్ని నివారించి మూసీనదిని కాపాడుకుందాం అన్న నినాదంతో కదిలిరమ్మని నగర ప్రజలకే కాక మూసీనది పరీవాహక ప్రాంత ప్రజలందరికీ పిలుపునిస్తున్నాం.

**మూసీ బచావో ఆందోళన్ కరపత్రంగా వచ్చింది**

**9 డిసెంబర్ 1998**

---

మూసీ బచావో ఆందోళన్‌లో మొత్తం 26 సంఘాలున్నాయి. అవి మూసానగర్, కమల్ నగర్, పద్మానగర్, చాదర్‌ఘాట్ దర్వాజ, పెట్లబుర్జు వెల్ఫేర్ అసోసియేషన్స్, పీపుల్స్ ఇనీషియేటివ్ నెట్‌వర్క్, ఎపిసిఎల్‌సి, మానవహక్కుల వేదిక, విరసం, తెలంగాణ జనసభ, ప్రజాకళా మండలి, సమాజ్‌వాది జనపరిషద్, ఉద్యోగక్రాంతి, బహుజన రిపబ్లిక్ పార్టీ, మహిళా చేతన, అస్మిత, పి.ఓ.డబ్ల్యు, పి.ఓ.డబ్ల్యు (స్త్రీ విముక్తి), ఎ.ఐ.డి.ఎస్.ఓ. ఎ.ఐ.పి.ఆర్.యఫ్, ఐ.యఫ్.టి.యు. (ప్రతిఘటన), NAPM, Village Reconstruction Organisation, COVA, Committee Against Pollution.

# అందరి నిర్బాధ్యతా ఫలితం
# చినగంజాం

ఏ తప్పూ చేయని అమాయకుల ప్రాణాలు పోవడం ఎప్పుడయినా బాధ కలిగిస్తుంది. కానీ ఆ బాధలో కూడా హెచ్చుతగ్గులుంటాయి. ఒక్కొక్క పరిస్థితిలో ఆ చావును నివారించడం కష్టసాధ్యమనో, లేక వారి బాధ్యత కూడా కొంత ఉందనో అనుకోగలుగుతాము. అప్పుడు మరీ అంత బాధ అనిపించదు. అటువంటి ఉపశమనమేదీ లేని ఘటన ఫిబ్రవరి 11న చినగంజాంలో ఇద్దరి ప్రాణాలు తీసిన పోలీసు కాల్పులు. కాల్పులలో చనిపోయిన పుల్లారెడ్డి, రాఘవరెడ్లు తమ చావుకు ఎంత మాత్రం బాధ్యులు కారు.

అరెస్టు చేసిన ముద్దాయిలను దౌర్జన్యంగా విడిపించుకోవడానికి గుమిగూడిన గుంపుపైన కాల్పులు జరిపామని ఇంకొల్లు సి.ఐ. పృథ్వీ నారాయణ అన్నారు కానీ అటువంటి గుంపు ఒకటి గుమిగూడిందో లేదో గానీ, పుల్లారెడ్డి, రాఘవరెడ్డి మాత్రం అందులో భాగం కాదు. చినగంజాం మండల కేంద్రంలోని మార్కెట్‌కు వందల మంది రైతులు ప్రతి రోజూ వచ్చినట్లే వచ్చారు ఆ ఇద్దరూ ఆ రోజు సాయంత్రం.

అయినా అరెస్ట్ చేసిన ముద్దాయిలను విడిపించుకోవడం కోసం రైతులు గుమిగూడడానికి ఆ ముద్దాయిలు ఆ ఊరిలో లేరు. వాళ్ళపైన కేసులున్నది చినగంజాం పోలీస్ స్టేషన్‌లోనే అయినా, వారిని అరెస్ట్ చేసింది చినగంజాం పరిసరాలలోనే అయినా, వారిని బంధించినది మాత్రం చినగంజాం పోలీస్ స్టేషన్‌లో కాదు. ఇరవయ్యో ముప్పయ్యో కిలోమీటర్ల దూరాన ఉన్న ఇంకొల్లులో. ఈ చివరి ముక్క మాత్రం

చెప్పకుండా కాల్పుల ఘటనకు సహేతుకంగా కనిపించే ఒక వివరణ ఇచ్చి పత్రికలకెక్కించి ప్రజలను నమ్మింప చేశారు పోలీసులు.

పోనీ ఏ అర్థంలోనైనా ఆనాటి పోలీసు కాల్పులను నివారించడం కష్టసాధ్యమా అంటే కానేకాదు.

ఆనాడు ఇంకొల్లు సి.ఐ. అరెస్ట్ చేసిన రైతులు, వారి అరెస్ట్ గురించి ఆందోళన చెందిన (వాళ్ళను విడిపించడానికి దాడి చేయకున్నా) రైతులు హంతకులు కారు, ముఠాకోర్లు కారు, రాబోయే పంచాయితీ ఎన్నికలలో రిగ్గింగ్ చేయడం కోసం సమాయత్తమైన తెలుగుదేశం కార్యకర్తలు కారు, కాంగ్రెస్ కార్యకర్తలు కారు. మరి వారెవరు? చినగంజాం పరిసరాలలో రాబోతున్న ఉప్పు ఫ్యాక్టరీ వల్ల భూగర్భ జలాలు ఉప్పుమయమై తమ పొలాలు నాశనం అవుతాయని ఆందోళన చెందుతున్న 'రైతన్నలు'.

చినగంజాం దగ్గర 12 గ్రామాల ఇళ్ళకూ, పొలాలకూ అతి దగ్గరగా కేంద్ర ప్రభుత్వం 565 ఎకరాల భూమిని ఉప్పు తయారీకి 'స్నోవైట్ సాల్ట్స్' అన్న ఒక కంపెనీకి లీజుకు ఇచ్చింది. దాని యజమాని ఆనంద్ అని పిలవబడే ప్రవాసాంధ్రుడు. అతను కులానికి 'రెడ్డి' కాకున్నా ఇంటి పేరులో 'రెడ్డి' వుండబట్టి అసలు పేరు ముందు, ఇంటి పేరు వెనుక పెట్టి ఇంగ్లీష్ స్టయిల్‌లో ఎ.పి.రెడ్డి అనే పేరుతో ప్రవాసాంధ్రంలో చలామణి అయ్యాడంటారు. ఇక్కడున్నట్టే అక్కడ కూడా 'పేరు వెనక తోకలకు' విలువ వుంది కదా!

వెనక్కి వచ్చిన తరువాతనో, రాకముందేనో అతను ఈ లీజు పొందాడు. పొలాల పక్కన, మంచినీటి బావుల పక్కన ఉప్పుమళ్ళు తయారు చేసి సముద్రం నుంచి నీళ్ళు తీసుకొచ్చి ఆ నీటిని ఎండబెట్టి ఉప్పు తయారు చేసినట్టయితే చుట్టు పక్కల తాగునీరు, సాగునీరు ఉప్పుమయమవుతాయని ఒకరు చెప్పనక్కరలేదు. ఆ తెలివి కేంద్ర ప్రభుత్వ అధికారులకు వుండవలసింది. వారికి లేకున్నా, గతంలో ఇదే భూమిని ఉప్పు తయారీకి లీజుకి ఇచ్చినప్పుడు గొడవ చేసి రద్దు చేయించిన రైతుల ఆందోళనైనా నేర్పవలసి వుండింది. అదే జరిగి వుంటే 11వ తేదీ నాటి కాల్పులు జరిగి వుండేవి కావు.

కేంద్ర ప్రభుత్వం భూమి లీజుకు ఇచ్చినా, ఉప్పు తయారీకి లైసెన్స్ ఇచ్చినా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి పొందకుండా ఉత్పత్తి మొదలుపెట్టడం

చట్ట విరుద్ధం. లీజు పొంది సంవత్సరం గడచినా 'స్నోవైట్ సాల్ట్స్' ఆ అనుమతిని ఇప్పటికీ పొందలేదు. పొందకుండా ఉత్పత్తికి ఉపక్రమించడం చట్టవిరుద్ధం కాబట్టి జిల్లా మేజిస్ట్రేటు కూడా అయిన జిల్లా కలెక్టరు ఆ పనిని ఆపి వుండవచ్చును.

కలెక్టర్ ఆ పని చేయకపోగా, చినగంజాం ఎమ్మార్వో తనకు ఉన్న అధికారాన్ని మించిన ఆజ్ఞ జారీ చేసి హైకోర్టులో 'స్టే' తెచ్చుకునే అవకాశం సదరు 'స్నోవైట్ సాల్ట్స్'కు (ఉద్దేశపూర్వకంగా కాదు గానీ) ఇచ్చాడు. ఆ తరువాత ఎమ్మార్వో నుండి కలెక్టర్ దాకా అందరూ 'ఒకసారి చేయి కాలింది చాలు'నంటూ తమకున్న అధికారాన్ని వినియోగించడానికి నిరాకరిస్తున్నారు. రైతులు నేరుగా హైకోర్టుకు పోయారు. రొయ్యల చెరువులపైన సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పుల్లో జనావాసాలకు దగ్గరగానూ, పొలాలకు దగ్గరగానూ నేలపైన ఉప్పు నీటిని నిలవుంచే పరిశ్రమలను అనుమతించ వద్దని చెప్పిన సంగతి, 'స్నోవైట్ సాల్ట్స్' ఇప్పటికింకా కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి పొందని సంగతి హైకోర్టు దృష్టికి తీసుకుపోయారు. హైకోర్టయినా ఆనంద్‌గారి చట్టవిరుద్ధమైన ప్రయోగానికి బ్రేక్ వేసి ఉండవచ్చును. కానీ హైకోర్టు కూడా 'చూద్దాం' అనింది.

ఇంక గత్యంతరం లేక రైతులే దానికి అడ్డంపడ్డారు. అతను రక్షణగా తెచ్చుకున్న పోలీసులు వారిపైన విరుచుకుపడ్డారు. కేసులయ్యాయి. ముద్దాయిలైన ఎనిమిది మందిని అరెస్ట్ చేసే నెపంతో రైతులకు బుద్ధిచెప్పాలని నిర్ణయించుకున్న ఇంకొల్లు సి.ఐ. పృథ్వీనారాయణ అరెస్ట్ చేసిన వారిని ఇంకొల్లులో పెట్టి, పెద్ద పోలీసు బలగంతో చినగంజాం వచ్చి, మార్కెట్ దగ్గరున్న జనంపైన లాఠీలు ప్రయోగించి, బాష్పవాయువు విడిచి, తరిమికొట్టి, కాలుజారి కిందపడి, దానివల్ల గాభరాపడి కాల్పులు జరిపి ఇద్దరిని చంపాడు.

కొన్నేళ్ళ క్రితం ఇదే అధికారి గుంటూరు జిల్లాలోని పాతనాగిరెడ్డిపల్లెలో ఇద్దరు రైతులను ఇంతే అన్యాయంగా కాల్చి చంపాడు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం అతనిపైన చర్య తీసుకొని వున్నా ఈ కాల్పులను నివారించి ఉండవచ్చు.

**నీహార్ ఆన్‌లైన్ పత్రిక**
**ఫిబ్రవరి 2000**

# కుంటిసాకుల నీడన చట్టం

పేదవాళ్ళెక్కడయినా తమకు హక్కులు లేని జాగాలో ఇళ్ళు వేసుకుంటే అధికార యంత్రాంగం యావత్తు వాళ్ళమీద ఎట్లా విరుచుకుపడుతుందో మనకు తెలుసును. మనమేమయినా అడిగితే 'పేదవాళ్ళయితే కావచ్చును గానీ దురాక్రమణ చేసినప్పుడు చట్టం చూస్తూ ఊరుకోజాలదు కదా' అని మన నోళ్ళు మూసేస్తారు.

డబ్బు, అధికారం ఉన్నవాళ్ళు చేసే దురాక్రమణ విషయానికొచ్చేసరికి ఈ చట్టం కళ్ళు చాలా సులభంగా మూసుకుపోగలవనడానికి చాలా ఉదాహరణలున్నాయి. అప్పుడు మనమేమయినా అడిగితే 'మా అంతట మేము ఏమీ చేయలేము. కోర్టు నుండి మీరేదయినా ఆర్డర్ తీసుకురండి' అంటారు అధికారులు. పేదల మీదికి సులభంగా బయలుదేరి వచ్చే బుల్‌డోజర్లకు వీళ్ళ విషయంలో స్టార్టింగ్ ట్రబుల్ వచ్చేస్తుంది.

సికిందరాబాద్ లాలాగూడ ప్రాంతంలోని ఎర్రకుంట దురాక్రమణ దీనికొక ఉదాహరణ. పేరు సూచించినట్టు అదొక చెరువు. రజకులు కొన్ని తరాలుగా బట్టలు ఉతుక్కుంటున్న చెరువు. కావడానికి ప్రైవేట్ భూమే కాని హుడా వారు దానిని 'వాటర్ బాడీ'గా గుర్తించారు. నగరంలో ఎవరూ – తమ స్వంత భూములలో సహితం – హుడా అనుమతించిన భూమి వినియోగానికి భిన్నంగా కట్టడాలు గానీ నిర్మాణాలు గానీ చేపట్టడానికి వీలు లేదు. అందుకు భిన్నంగా ఆ భూమిని వినియోగించడానికి వీలు లేదు.

అయినప్పటికీ ఎర్రకుంటలో కొంతకాలంగా ప్లాట్ల అమ్మకం, కొనుగోళ్ళు సాగుతున్నాయి. ఈ పని చేస్తున్నది కనీసం ఆ భూమి స్వంతదారులు కారు. వారే

చేసినా, వాటర్ బాడీగా గుర్తించిన భూమిలో ప్లాట్లు వేయడం, అమ్మడం చట్టవిరుద్ధం అయి ఉండేదే. కానీ ఆ పని చేస్తున్నది స్వంతదారులు కారు. శేషుబాబు, అప్పారావు అనే ఇద్దరు పెద్దమనుషులు. పక్కనున్న సర్వే నెంబరు 160లో తనకున్న హక్కులు చూపించి ఎర్రకుంటలో శేషుబాబు ప్లాట్లు అమ్ముతున్నాడు. ఎంత లేదన్నా 10 లేక 15 ఏళ్ళ నుండి ఇది జరుగుతున్నది. మొదట్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అయితే కాలక్రమంలో అతని ఆశే అతనిని రజకులకు శత్రువును చేసింది. వాళ్ళను ఖాళీ చేయించేస్తే ఎర్రకుంట మొత్తం అమ్ముకోవచ్చుననుకున్నాడు.

వాళ్ళు బట్టలుతుక్కోవడానికి నీళ్ళు నిలవ ఉండే చోట అతను చెరువు కట్టను దౌర్జన్యంగా తెగగొట్టాడు. రజకులు గొడవ పెట్టుకొని మళ్ళీ తాత్కాలికంగా కట్ట పోసుకున్నారు. అయితే వాళ్ళు అప్రమత్తంగా లేని టైం చూసి మళ్ళీ మళ్ళీ శేషుబాబు మనుషులు చెరువు కట్టను తెగగొట్టేస్తున్నారు. ఈ ఘర్షణ నాలుగేళ్ళుగా సాగుతున్నది.

ఇంతవరకు ఒకెత్తయితే హైదరాబాద్ నగర పాలకుల వైఖరి ఇంకొక ఎత్తు. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, హుడా, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ అనే నలుగురు అధికారులు ఇక్కడ అధికారం చలాయిస్తారు. శేషుబాబు, అతని వెన్నంటి వచ్చిన అప్పారావుల అక్రమాలు వాళ్ళకు తెలుసును. అతనిని దురాక్రమణదారునిగా స్పష్టంగా పేర్కొంటూ, అతనిని నిరోధించడానికి చర్య తీసుకోవలసిందిగా కోరుతూ 'హుడా' ఉపాధ్యక్షులు జిల్లా కలెక్టర్‌కు రాసి మూడేళ్ళయింది. జిల్లా కలెక్టర్ ఒకసారి కాదు, మూడుసార్లు అదే విషయం చెప్తూ (అంతకంటే ఘాటయిన పదజాలం ఉపయోగిస్తూ) ఆ దురాక్రమణదారులపైన చర్య తీసుకొమ్మని నగర మునిసిపల్ కమిషనర్‌కు ఉత్తరాలు రాశారు. నగర మునిసిపల్ కమిషనర్ ఇప్పటి దాకా కాగితం మీద ఏమీ పెట్టలేదు గానీ, రజక సంఘాల వాళ్ళు పోయి అడిగితే దురాక్రమణలు నిరోధించమని హుడా ఉపాధ్యక్షులు కలెక్టర్‌కు, పోలీసులకు రాస్తే పని జరిగిపోతుందని అంటాడు. ఆ సంగతి మళ్ళీ వెళ్ళి హుడా ఉపాధ్యక్షుల వారితో చెపితే ఆమె 'ఈ పని ఎంతమాత్రం మాది కాదు. ఏ భూమి వినియోగం ఏమిటని నిర్ణయించటం వరకే మేము చేసేది. దానిని అమలు చేయించవలసింది నగర మునిసిపల్ కమిషనర్, పోలీసులే అంటారు. కావాలంటే

ఈ సంగతి రాసి సంతకం చేస్తానంటారు. పోలీసులనడిగితే తక్కిన ముగ్గురు అధికార్లలో ఎవరయినా ఒకరు తమకు ఆదేశాలిస్తే తాము వెంటనే కదులుతామంటారు.

అధికారుల ఈ విన్యాసాన్ని అడ్డం పెట్టుకొని శేషుబాబు, అప్పారావు తమ అమ్మకం కొనసాగిస్తున్నారు. వారికి రజకులు తప్ప వేరే ఎవ్వరూ అడ్డం లేరు. కాబట్టి వారు రజకుల మీద పడ్డారు. రజకుల కోసం ప్రభుత్వం వేసిన బోర్‌ను పగలగొట్టారు. తట్టలు తట్టలు మట్టి తీసుకొచ్చి చెరువు శికంలో పోసి అక్కడ నీళ్ళు నిలవకుండా చేశారు. నిలిచిన కొద్ది నీళ్ళలో నూనె కలిపి బట్టలు ఉతకడానికి పనికి రాకుండా చేశారు. ఎప్పటికప్పుడు చెరువు కట్ట మళ్ళీ మళ్ళీ తెగ్గొడుతూ ఆ కొద్ది నీటిని కూడా బయటకు పంపించేస్తున్నారు.

'చట్టం' అనేది ఈ దౌర్జన్యాన్ని మౌనంగా చూస్తున్నది. అది పాపం దానంతటది ఏ దౌర్జన్యాన్నీ ఆపలేదు. దానిని అమలు చేసే అధికార్ల చొరవ ఎంత ఉంటే దాని ప్రభావం అంత ఉంటుంది. వారిలో నిజాయితీ ఎంత ఉంటే దాని పనితనం అంత ఉంటుంది. హైదరాబాద్‌లో గుడిసెవాసులను నిర్దాక్షిణ్యంగా తొలగించి రోడ్ల వెడల్పు కోసం, ఇతర రకాల 'అభివృద్ధి' కోసం జాగా కల్పించే చట్టం, తెలుగుదేశం పార్టీకి సన్నిహితులయిన ఈ భూమి దురాక్రమణదారుల కాడికొచ్చేసరికి కుంటిసాకులు వెతుకుతూ నీళ్ళు నమిలే స్థితికి నెట్టబడిందంటే నగర అధికారుల చేవ అంతటిది.

కనీసం నాలుగేళ్ళుగా ఈ విషయమై ఆందోళన చేస్తున్న రజకులు వారిని దారికి తేగలరా?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**2 ఏప్రిల్ 2000**



# బస్తీలను తొలగించాలా అభివృద్ధి చేయాలా?

'హుసేన్‌సాగర్ నాలా' పరిసర బస్తీవాసులు మొన్నటి మంగళవారం నగరంలో తీసిన ఊరేగింపు నగరంలో నివాస హక్కుల పోరాటంలో రెండవ మైలురాయిగా చెప్పుకో వచ్చు.

మొదటిది మూసీతీర వాసులు నందనవనానికి వ్యతిరేకంగా చేసిన, చేస్తున్న ఆందోళన.

హుసేన్‌సాగర్ అలుగు పారిన నీటిని మూసీనదికి చేరవేసే కాలవకు ఇప్పుడు హుసేన్‌సాగర్ నాలా అన్న పేరు వచ్చింది. మొన్నటి వర్షాలలో హుసేన్‌సాగర్ నుండి విపరీత వేగంతో పొర్లివచ్చిన నీటిని ఈ 'నాలా' తనలో ఇముడ్చుకోలేక పోవడం వల్ల హైదరాబాద్ నగర మధ్య భాగంలో అనేక వాడలు జలమయం అయ్యాయి.

దీనికి కారణం 'నాలా' గట్టు కుదించుకుపోయేంతగా రెండు వైపులా కట్టడాలు తయారు కావడమేనని ప్రభుత్వం ఆనాటి నుండి అంటున్నది. అసలు హుసేన్‌సాగర్‌లోకి అంత నీరు రావడానికి తుఫానే కారణమా అన్న ప్రశ్న ప్రభుత్వం వేసుకోదు. అన్ని చెరువులకూ ఉన్నట్టే హుసేన్‌సాగర్‌కు కూడా నీటిని చేరవేసే 'కాచ్‌మెంట్' ఒకటుంది. అందులో వేరే చెరువుల అలుగులు దాటి ప్రవహించే నీటిని తీసుకొచ్చే వాగులూ వంకలూ ఉన్నాయి. ఆ చెరువుల పరిస్థితి ఏమిటి, వాటి కట్టల పరిస్థితి ఏమిటి, మొత్తంగా హుసేన్ సాగర్ కాచ్‌మెంట్ పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్నలు వేసుకోకుండా 'నాలా' గట్టు కుదించుకు పోవడమే వరదలకు కారణమని ప్రభుత్వం నిర్ధారించేసింది.

అదట్లాగుంచి, నాలా గట్టును దురాక్రమణ చేసిన కట్టడాలలో పేదల బస్తీలే కాదు, మధ్యతరగతి అపార్ట్‌మెంట్లూ ఉన్నాయి, వైస్‌రాయ్ హోటల్ వంటి ధనిక వర్గాల ఆస్తులూ ఉన్నాయి.

కాని వైస్‌రాయ్ హోటల్‌ను ఏం చేయబోరు. అపార్ట్‌మెంట్స్‌ను ఏమైనా చేయబోతారేమో తెలీదు. పేదల బస్తీలను మాత్రం 'ఏది ఏమైనా తొలగించవలసిందే'నని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అశోక్ గజపతిరాజు ప్రకటించారు. ఆ బస్తీల ప్రజలకు నగరంలోనే ప్రత్యామ్నాయ నివాస స్థలం చూపించాలని అంటే, 'అవును రాష్ట్ర అసెంబ్లీ ఆవరణలోనూ సెక్రటేరియట్ ఆవరణలోనూ ఖాళీ స్థలం ఉంది. అక్కడ వారికి నివాసాలు కల్పిద్దామా' అని వ్యంగ్యంగా అంటున్నారు రాజుగారు. ఇంకెక్కడా చోటు దొరకకపోతే ఆ పని కూడా చేయవచ్చును గానీ, మన పాలకులకెంత అహంకారమో చూడండి.

పునరావాసం సంగతి అటుంచి, బాధితులే ఎంత సులభంగా దోషులయి పోయారో కూడా చూడండి. వరదల వల్ల నష్టపోయింది 'నగరం'. నష్టం చేసింది కాలవ గట్టు మీదికి దురాక్రమణ చేసి ఇళ్ళు కట్టుకున్న బస్తీవాసులు. వాళ్ళు కూడా నష్టపోలేదా అంటే అది వారు తెలివితక్కువతనం వల్ల చేసుకున్న చేటు అంటున్నారు.

కానీ వరదలకు కారణమేదైనా – బస్తీవాసులు అనాలోచితంగా కాలవ గట్టును కుదించి వేసే పద్ధతిలో ఆవాసాలు నిర్మించుకోవడం కూడా ఒక కారణమేనని ఒప్పుకున్నా – వరదల వల్ల ప్రధానంగా నష్టపోయిందెవరన్న ప్రశ్నకు మాత్రం రెండు జవాబులు లేవు. కానీ బస్తీవాసులకు ఆ సానుభూతి రెండు రోజులు కూడా దక్కలేదు. మూడవ రోజు నుండి వాళ్ళు నగరవాసుల కళ్ళకు దోషులుగా తప్ప బాధితులుగా కనిపించడం లేదు. విజయనగరం రాజు గారి మాటలలో వారిని 'ఏది ఏమైనా అక్కడి నుండి తొలగించవలసిందే!'

ఎక్కడికి? మూసీ బస్తీలను 1998 నాటి వరదలప్పుడు తరలించిన కర్మన్‌ఘాట్‌లో ఇంకా చోటుందనీ వీరిని కూడా అక్కడికి తరలించవచ్చుననీ మొదట నగర పాలకులు ప్రకటించారు. నగరానికి 15–20 కిలోమీటర్ల దూరంలో కర్మన్‌ఘాట్ వంటి వివాదగ్రస్తమైన సీలింగ్ భూములు ఇంకా కూడా ఉంటాయి కాబట్టి వారిని ఈ కర్మన్‌ఘాట్‌కు కాకపోతే ఇంకొక కర్మన్‌ఘాట్‌కు తరలించగలరు.

'మేము ఆటో డ్రైవర్లం. ఇళ్ళలో అంట్లుతోమే పనిమనుషులం. రోడ్లు ఊడ్చే కార్పొరేషన్ స్వీపర్లం. మెకానిక్కులం. ప్రభుత్వ కార్యాలయాలలో నాలుగవ తరగతి ఉద్యోగులం. మమ్మల్ని నగరం నుండి వెలివేయడం మాకే కాదు, నగరానికి కూడా మంచిది కాదు' అని హుసేన్‌సాగర్ నాలా బస్తీవాసులు మొన్న ఇచ్చిన నినాదం నగర పాలకుల చెవిన పడిందో లేదో గానీ ఆ ప్రజలను దోషులుగా (పోనీ, వట్టి దోషులుగా) కాక బాధితులుగా చూడగలిగితే ఈ విషయం వాళ్ళు చెప్పకుండానే అర్థం కాగలదు.

బస్తీలకు ('స్లమ్స్') సంబంధించిన ఒక కొత్త జాతీయ విధానాన్ని ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యనే ముసాయిదా పత్రాన్ని రూపొందించింది. అందులో బస్తీ నిర్వచనాన్నే సాధారణ పాలనా యంత్రాంగం దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకంగా ప్రతిపాదించారు. ప్రజలు అక్రమంగా ఆవాసాలు నిర్మించుకున్న స్థలం అని కాక, ప్రభుత్వం రోడ్లు నీళ్ళు స్కూళ్ళవంటి కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమైన స్థలం అని నిర్వచించారు. నిర్వచనం మారితే దానిని మనం చూసే పద్ధతే మారిపోతుంది. నగర పాలకులు బస్తీలను చూడగానే ఎప్పుడు తొలగించాలా అని ఆలోచించే బదులు వాటిని ఏ విధంగా మెరుగుపరచాలని ఆలోచించాలని అన్నారు.

భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూలులో మునిసిపాలిటీలకున్న అధికారాలను క్రోడీకరించిన చోట కూడా 'బస్తీల అభివృద్ధి' అనే కర్తవ్యం ఉందే తప్ప బస్తీల నిర్మూలనం అనేది లేదు.

బస్తీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ ముసాయిదా విధానపత్రం మీద చర్చ ఇంకా ఎక్కడా జరగలేదు. సాధారణ పాలనా యంత్రాంగం వైఖరికన్నా అందులోని వైఖరి మెరుగే అయినప్పటికీ లోపాలు కూడా ఉన్నాయని నివాస హక్కుల ఉద్యమకారులంటున్నారు. ఏమైతేనేం, దానిపైన చర్చ జరగాలి, ఒక ప్రజాస్వామికమైన విధాన రూపకల్పన జరగాలి.

అంతవరకు ఎక్కడా బస్తీల తొలగింపు, నిర్మూలనం జరగకూడదనీ, బస్తీలను 'నగరం' సమస్యగా కాక, బస్తీవాసుల సమస్యగా గుర్తించి వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇచ్చి ఆలోచించడం అలవరచుకోవాలనీ మనమెందుకు డిమాండ్ చేయకూడదు?

**ప్రజాతంత్ర వారపత్రిక**

**1 అక్టోబర్ 2000**

# చావు ఖర్చులు వద్దంటున్న మడ్డువలస నిర్వాసితులు

**తె**లంగాణ వాసులకు శ్రీకాకుళం ఎక్కడో ఉన్నట్లు అన్పిస్తుంది. నక్సలైట్ ఉద్యమం పుణ్యాన ఆ పేరు సుపరిచితమే గానీ అంతకంటే ఆ జిల్లా గురించి ఏమీ తెలీదు. అది మన రాష్ట్రంలోనిదేనన్న అనుభూతి కూడా కలగదు.

శ్రీకాకుళం జిల్లాలోనూ హైవేకి (అంటే మద్రాసు కలకత్తా జాతీయ రహదారికి) సమీపంలో జరిగే విషయాలకొచ్చే ప్రచారం లోతట్టు ప్రాంతాలకు రాదు. అటువంటి ఒక లోతట్టు ప్రాంతమైన వంగర మండలంలో కొంత కాలంగా ఒక ఆందోళన జరుగుతున్నది. అది మడ్డువలస ప్రాజెక్టు నిర్వాసితుల ఆందోళన.

మడ్డువలస ప్రాజెక్టు కొత్తది కాదు. కొత్తది అయి ఉంటే పునరావాసానికి సంబంధించి ఈ మధ్య అరకొరగానయినా ఉనికిలోకి వచ్చిన పునరావాస సూత్రాలు వర్తించి ఉండేవి. పునరావాస సూత్రాలే కాదు, ప్రాజెక్టుల ఆమోదానికి సంబంధించి కూడా ఇప్పుడు కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. ఆ రోజులలో – అంటే 1970లలో – ఏ ప్రాజెక్టునయినా ఆయకట్టుదార్ల అవసరాల కోణం నుండి, నిర్మాణ వ్యయం కోణం నుండి మాత్రమే చూశారు తప్ప ఆయకట్టుదార్లకొచ్చే ప్రయోజనాన్ని ముంపు ప్రాంతాల ప్రజలకు కలిగే నష్టంతో బేరీజు వేసే ప్రయత్నం చేయలేదు.

ఇప్పుడు పరిస్థితి కొంచెం మారిందంటే అర్థం నిర్వాసితుల సమస్యలకు సూత్రబద్ధమైన గుర్తింపు లభించిందని కాదు. ప్రాజెక్టు భూమి సేకరణకు సంబంధించి

ఇప్పటికీ 1894లో అప్పటి బ్రిటిష్ పాలకులు చేసిన భూసేకరణ చట్టం తప్ప వేరే చట్టమేదీ లేదు. కనీసం, ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం తక్కువని భావించిన రైతు కోర్టుకు అప్పీల్ చేసుకోవడంలో కొంత జాప్యం జరిగినట్టయితే ఆ జాప్యాన్ని ఉపేక్షించి అప్పీల్ స్వీకరించవచ్చునన్న ఒక్క సవరణ కూడా స్వతంత్ర భారత సంక్షేమ రాజ్యం ఆ చట్టానికి చేయలేదు. ఇక నిర్వాసితుల పునరావాసాన్ని గురించి ఆనాడు ఈనాడు కూడా చట్టం లేదు.

అయినప్పటికీ కొన్ని విధానపరమైన జాగ్రత్తలూ, నియమాలూ ఈ మధ్య ఉనికిలోకి వచ్చాయి. ప్రాజెక్టువల్ల రాబోయే ఆయకట్టుతో పోల్చినప్పుడు ముంపు చెప్పుకోదగ్గ మోతాదులో వున్నట్టయితే అటువంటి ప్రాజెక్టు చేపట్టనే వద్దని ఇప్పుడు భావిస్తున్నారు. ఇంకొక రకంగా చెప్పాలంటే, ఎక్కువమందిని నిర్వాసితులను చేసే ప్రాజెక్టు కట్టినట్టయితే వారందరికీ ఏ కొంచెం పునరావాసం కల్పించాలన్నా చాలా ఖర్చవుతుంది. కాబట్టి ప్రాజెక్టు డిజైన్‌లోనే ముంపు తక్కువగా ఉండేటట్టు చూసుకోవాలి. అది సాధ్యం కాకపోతే ఆ ప్రాజెక్టును చేపట్టనే కూడదు అని ఇప్పుడు భావిస్తున్నారు. ఆయకట్టులో 15 శాతం మించి ముంపు ఉన్నట్టయితే అటువంటి ప్రాజెక్టు చేపట్టనే వద్దనేది ఇప్పుడు చాలావరకు ఆమోదం పొందిన విధాన నియమం.

అటువంటివేమీ లేని రోజులలో చేపట్టిన మడ్డువలస ప్రాజెక్టులో ముంపు (మనం లెక్కపెట్టే పద్ధతిని బట్టి) 30 శాతం నుండి 80 శాతం దాకా ఉంది. అధికార లెక్కల ప్రకారం మడ్డువలస ఆయకట్టు 24,700 ఎకరాలు. ముంపు 8 వేల ఎకరాలని ప్రభుత్వం, 13,500 ఎకరాలని స్థానిక రైతులు అంటున్నారు. ప్రభుత్వం లెక్కలే తీసుకున్నా, ఆయకట్టులో ముంపు 30 శాతంపైననే ఉంది. పైగా సాగు కాబోయే 24,700 ఎకరాలలో 8 వేల ఎకరాలు ఇప్పటికే బోర్లు, చెరువుల కింద సాగవుతున్న మాగాణి. అంటే కొత్తగా తయారు కాబోయే మాగాణి కేవలం 16,700 ఎకరాలు. ముంపును గురించి రైతులు చెబుతున్న లెక్క సరైనదనుకుంటే 16,700 ఎకరాలకు కొత్తగా నీళ్ళివ్వడానికి 13,500 ఎకరాలను ముంచుతున్నారు. అంటే ఆయకట్టు పరిమాణంలో ముంపు పరిమాణం 80 శాతం.

1970లలో పునాదిరాయి వేసి భూమి సేకరణ మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టును అప్పుడే కట్టేసి ఉంటే అయిందేదో అయిపోయిందనుకోక తప్పేది కాదేమో కానీ

మద్దువలస ఇప్పుడే – అంటే మొదలుపెట్టిన 25 ఏండ్ల తర్వాత ముగింపుకొచ్చింది. ఈ మధ్య కాలంలో నర్మదా బచావో ఆందోళన నడిచింది. నిర్వాసితుల హక్కుల గురించి అవగాహన పెరిగింది. దానికితోడు ప్రపంచ బ్యాంకు అప్పు ఇచ్చే ప్రాజెక్టుల విషయంలో పునరావాసాన్ని గురించి కొన్ని కచ్చితమైన ప్రమాణాలు పెట్టడం జరుగుతున్నది. ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా అటువంటి ప్రమాణాలను ప్రభుత్వం తనకు ఉండే వెసులుబాటును బట్టి అమలు చేయడానికి సిద్ధపడుతున్నది.

ఇవన్నీ చూస్తూ కూడా మద్దువలస నిర్వాసితులు ఎందుకు ఊరుకుంటారు? మీ ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి అవుతూ ఉండవచ్చును గానీ ఇది 1970ల నాటి ప్రాజెక్టు కాబట్టి అప్పటి పద్ధతిలోనే మీతో వ్యవహరిస్తామంటే ఎందుకు ఒప్పుకుంటారు?

నిర్వాసితులు కాబోయే వారు 25 వేల మంది అని స్థానికుల అంచనా. ముంపు భూమి ఎన్ని ఎకరాలో కచ్చితంగా తెలియనట్టే ఈ సంఖ్య కూడా కచ్చితంగా తెలియదు. ప్రాజెక్టు డిజైన్ సమగ్రంగా తెలిసింది ప్రభుత్వానికి మాత్రమే కాబట్టి ప్రభుత్వమే చెప్పాలి, కానీ చెప్పదు. ప్రజలు తప్పనిసరయి తమ అంచనాలు రూపొందించుకుని ప్రకటిస్తున్నారు గానీ అవి సరయినవో కాదో ప్రభుత్వం చెప్పదు. అసలు నోరు విప్పదు.

మనది 'పారదర్శకత' గురించి నిత్యం మాట్లాడే ప్రభుత్వం కదూ! అది వట్టి అసత్యమని అనలేము కానీ చాలా 'సెలెక్టివ్' సత్యం. ఎప్పుడు ఎక్కడ పారదర్శకంగా ఉండాలో ఎరిగిన ప్రభుత్వం మనది. ప్రాజెక్టుల గురించి నిర్వాసితుల దగ్గర పారదర్శకంగా ఉండడం తగదని వారికి తెలుసు.

నిర్వాసితులు 25,000 కాకపోతే 20,000 అనుకోండి. ఎంతైనా అది పెద్ద సంఖ్యే. వారందరూ భూములు, లేక స్థిరాస్తులు కలిగినవారు కారు. అంటే వారికి నష్టపరిహారం ఒక్క పైసా కూడా రాదు. స్థిరాస్తులు కలవాళ్ళలో కూడా 1970లలోనే నష్టపరిహారం తీసేసుకున్న వారు మెట్ట భూమికి ఎకరానికి 2 వేలు, మాగాణికి 6 వేలు తీసుకొని ఊరుకున్నారు. దాని మీద అప్పీల్‌కు పోవచ్చునని కూడా వారికెవరూ ఆ రోజులలో చెప్పలేదు. ప్రభుత్వం చెప్పాలనుకోలేదు. అప్పట్లో ప్రభుత్వాలు పారదర్శకత గురించి మాట్లాడలేదు కాబట్టి తప్పుపట్టలేము కాబోలు! అయితే ఆ రెండు వేలో

ఆరువేలో ఇచ్చి కాగితం మీద భూమి సేకరణ 1970లలోనే చేసేశారు కానీ ప్రాజెక్టు రాలేదు కాబట్టి రైతులు అక్కడే కొనసాగారు. సేద్యమూ చేసుకున్నారు. ఇప్పుడు వెళ్ళిపోయే కాలం వచ్చేసరికి ఆనాడు తీసుకున్న రెండు లేక ఆరు వేలలో ఒక్క పైసా కూడా వారి దగ్గర ఇప్పుడు లేదు. 'డబ్బు తీసేసుకొని, ఆ తర్వాత కూడా భూమిని ఇరవై ఏళ్ళపాటు ఉచితంగా అనుభవించి, ఇప్పుడు పొమ్మంటే పునరావాసం కావాలంటారా?' అని వాళ్ళను అధికారులేకాక ప్రాజెక్టు ఎప్పుడెప్పుడు పూర్తి అవుతుందా అని ఆతురతతో ఎదురుచూస్తున్న ఆయకట్టుదార్లు కూడా నిందిస్తున్నారు గానీ, నష్టపరిహారం తీసుకున్న వారితో సహా ఇప్పుడు ఖాళీచేసి పోవాల్సిన వారిలో మెజార్టీ చేతిలో చిల్లిగవ్వ లేకుండా తరలిపోవాల్సిన వారే. కొద్దిమంది మాత్రమే ఈ మధ్యకాలంలో నష్టపరిహారం పొందిన కారణంగా 'ఒప్పందాల అవార్డు' కింద సుమారుగా డబ్బులు పొందగలిగారు. అయితే వారు కూడా తమకున్న ఆస్తిని తిరిగి ఆ పైసలతో కొనజాలరు.

అందుకే నష్టపరిహారం చాలదు, పునరావాసం కావాలి అనేది అన్ని వర్గాల నుండి వస్తున్న డిమాండ్. ఒక్క మడ్డువలసలోనే కాదు, అన్ని ప్రాజెక్టులలోనూ వస్తున్న డిమాండ్. నిర్వాసితులకు ప్రాజెక్టు ఆయకట్టులోనే భూమి ఇవ్వాలనీ (ప్రాజెక్టు రావడం వల్ల సాగు యోగ్యమైన భూమి పెరిగే అవకాశం ఉంది కాబట్టి ఇది అసాధ్యం కాదు), లేదా (వారి వారి వృత్తులను బట్టి) రిజర్వాయర్‌లో చేపల వేటపైన వారికే మొదటి హక్కు ఇవ్వాలనీ, రిజర్వాయర్ ఒడ్డున (ఫోర్‌షోర్‌లో) చెట్లు లేక వనాల పెంపకంపైన హక్కు వారికే ఇవ్వాలనీ, ఒక గ్రామానికి చెందిన నిర్వాసితులందరికీ ఒకే చోట ఇళ్ళ స్థలాలు ఇచ్చి రోడ్లు, లైట్లు, స్కూలు, గ్రామ పంచాయితీ ఆఫీసు మొదలైన అన్ని వసతులతోనూ పునరావాస గ్రామాలు నిర్మించాలనీ నిర్వాసితుల ఉద్యమాలు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ చేస్తున్నాయి. మడ్డువలస నిర్వాసితులు కూడా డిమాండ్ చేస్తున్నారు.

వారు రెండు ప్రత్యక్షమైన ఉదాహరణలు చూపిస్తున్నారు. అవి రెండూ కూడా మడ్డువలస లాగే మధ్యతరహా ప్రాజెక్టులు. ప్రపంచ బ్యాంక్ నిధులతో కాక దేశీయ నిధులతో కడుతున్న ప్రాజెక్టులు. ఒకటి పొరుగున వున్న విశాఖపట్నం జిల్లా మాడుగుల మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు కాగా రెండవది దూరాన ఆదిలాబాద్ జిల్లా అసిఫాబాద్

మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు. పెద్దేరులో నిర్వాసితుల సంఖ్య 188 మాత్రమే. వారి పునరావాసానికి ప్రభుత్వం తలసరి ఒక లక్షా 72 వేలు మంజూరు చేసింది. వట్టివాగు నిర్వాసితులు 645 మంది. వారి పునరావాసానికి ప్రభుత్వం తలసరి ఒక లక్షా 30 వేలు మంజూరు చేసింది. ప్రతి కుటుంబానికీ సాగు భూమి ఇస్తూ పూర్తిస్థాయి పునరావాస గ్రామాలను నిర్మించారు. నిర్వాసితుల హక్కుల గురించి మరీ ఎక్కువగా పట్టించుకుంటే ప్రాజెక్టులే కట్టుకోలేమనుకునే వారికి ఇవి రెండూ మంచి ఉదాహరణలు. ముంపు తక్కువ ఉండేటట్టు ప్రాజెక్టు స్థలాన్నీ డిజైన్‌నూ ఎంపిక చేసినట్టయితే ముంపుకు గురయ్యే కొద్దిమందికి పూర్తిస్థాయి పునరావాసం కల్పిస్తూ కూడా ప్రాజెక్టులు కట్టుకోవచ్చునని ఇవి నిరూపిస్తున్నాయి.

మరి ఈ స్పృహ ఏ కోశానా లేని రోజులలో చేపట్టిన మద్దువలసకు కూడా ఇదే స్థాయి పునరావాస కార్యక్రమం చేపట్టేటట్టయితే 25 వేలమంది నిర్వాసితులకు తలసరి ఒక లక్ష రూపాయలు మంజూరు చేసినా 250 కోట్లు అవుతుంది. ప్రాజెక్టు ఖర్చే 112 కోట్లయినప్పుడు పునరావాసానికి 250 కోట్లు ఎక్కడ నుండి తేగలమని మన పాలకులు అంటున్నారు. ఇంత తెలివితక్కువ ప్రాజెక్టు చేపట్టడం మీ తప్పే కాబట్టి ఈ ప్రశ్నకు మీరే జవాబు చెప్పండని ప్రభుత్వాన్నే అడగవచ్చు. అయితే నిర్వాసితుల ఉద్యమాలు అంత మొండిగా ఉండగల పరిస్థితి లేదు కాబట్టి, అంత మొత్తం కాకపోతే అందులో సగం మంజూరు చేయగలవా? మూడవ వంతు, లేక నాల్గవ వంతు మంజూరు చేయగలవా? అని అడగడానికి సిద్ధపడక తప్పదు.

ప్రభుత్వం అందులో నూరవ వంతు మాత్రమే – అంటే తలసరి 1200 రూపాయల చొప్పున 2.9 కోట్లు మాత్రమే మంజూరు చేస్తానంటున్నది. అది చావు ఖర్చులకు కూడా రాదని నిర్వాసితులు అంటే అందులో తప్పేముంది?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**24 ఫిబ్రవరి 2002**

# కొల్లేటివాసుల కొంప కొల్లేరయింది

ఇల్లు నీటిలో మునిగిపోతే 'కొంప కొల్లేరయింది' అంటారు.

ఇప్పుడు కొల్లేరువాసుల కొంపే కొల్లేరయింది. 2 లక్షల 25 వేల మంది నివసించే 78 గ్రామాలను ప్రభుత్వం పక్షుల అభయారణ్యంగా ప్రకటించి, అక్కడ నివసించే వారు వ్యవసాయానికి రసాయన ఎరువులు, మందులు, కరెంట్ మోటార్లు వాడకూడదనీ, చేపల వేటకు మోటారు బోట్లు వాడకూడదనీ, సహజంగా చెరువులలో, కాలవలలో చేపలు పట్టుకోవచ్చును గానీ చేపల చెరువులు నిర్మించకూడదనీ ఆదేశించింది.

జీవో 120 అని పిలవబడే ఈ ఆదేశాన్ని హైకోర్టు కూడా ఆమోదించింది కాబట్టి ఇంక మీరంతా ఖాళీచేసి పొండని అధికారగణం కొల్లేరు గ్రామాలపైకి దిగుతున్నారు. జనం ప్రస్తుతానికి ప్రతిఘటిస్తున్నారు.

కొల్లేరు అనేది భారతదేశంలోనే అతి పెద్ద మంచి నీటి సరస్సులలో ఒకటని ప్రభుత్వ గెజిటీర్లు అంటాయి. ఇది ఉత్తరాన గోదావరి డెల్టాకు, దక్షిణాన కృష్ణానది డెల్టాకు మధ్యన ఉంది. సైబీరియా వంటి దూర ప్రాంతాల నుండి అనేక పక్షిజాతులు అక్కడికి వలస వస్తుంటాయి. కాలక్రమంలో అక్కడ సరస్సు ఇగిరిపోయి ఇక్కడొక చెరువు అక్కడొక ఏరు, మధ్యలో పొలాలు, ఊర్లు ఏర్పడ్డాయి. కృష్ణా జిల్లాలో 7 మండలాలలో, పశ్చిమ గోదావరి జిల్లాలో 2 మండలాలలో మొత్తం 122 గ్రామాలు ఇప్పుడు 'కొల్లేరు'లో ఉన్నాయి. ఈ గ్రామాల జనాభా 3 లక్షలు.

కొల్లేరు చుట్టుకొని పరిశ్రమలు వెలిశాయి. ఒక కెమికల్ ఫ్యాక్టరీ, చక్కెర మిల్లులు, డిస్టలరీలు వచ్చాయి. వీటి కాలుష్యం కాలవల ద్వారా 'కొల్లేరు'లోకి పోతున్నది. కొల్లేరులోని నీటి వనరులన్నీ కాలక్రమంలో కలుషితం అయ్యాయి. ఈ కాలుష్యం వల్ల కొల్లేటి ప్రజల జీవితమూ దెబ్బతినే ఉండాలి గానీ, పక్షుల రాక తగ్గిపోయిందనేది ప్రధాన విషయం అయింది.

పక్షులు రావద్దనీ, పక్షుల గుంపులు గుమిగూడే ప్రాంతం మనుషులకు అహ్లాదకరంగా ఉండదనీ అనడం లేదు గానీ, 'పర్యావరణ' ఆందోళనలో పక్షులు, జంతువుల కంటే ఎక్కువగా కాకున్నా వాటితో సమానంగానయినా మనుషుల కష్టాలకు చోటు ఇవ్వడం అవసరం. పర్యావరణ ఉద్యమాన్ని మనిషి కేంద్రం చేసుకొని అర్థం చేసుకునేవారూ ఉన్నారు, మనిషిని పర్యావరణానికి శత్రువును చేసి చూసేవారూ ఉన్నారు.

కొన్ని సంవత్సరాల క్రితం రెండవ కోవకు చెందిన పర్యావరణ ఉద్యమకారులు 'కొల్లేరు'కు ప్రతినిధులు కావడం  కొల్లేటి ప్రజల దురదృష్టం. వాళ్ళు హైకోర్టులో కేసు వేసి, కొల్లేటిని 'అభయారణ్యం' (శాంక్చువరీ)గా ప్రకటించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించమని కోరారు.

మా ఊరికి రోడ్డు వేయమని ఆదేశించండి, మా కులానికి రిజర్వేషన్ ఇమ్మని ఆదేశించండి, మా ఊరిలో ఆస్పత్రి పెట్టమని ఆదేశించండి అని కోర్టులో కేసువేస్తే 'ఇది పాలసీకి సంబంధించిన విషయం, కోర్టులేం చేయగలవు' అని సంశయించే కోర్టు ఈ విషయంలో ఏ సంశయం లేకుండా, కొల్లేరును అభయారణ్యంగా ప్రకటించడానికి వన్యప్రాణుల (పరిరక్షణ) చట్టం కింద చర్యలు తీసుకోవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

హైకోర్టు చెప్పింది కాబట్టి ఇంక ఆలస్యం ఎందుకని 1999 అక్టోబర్ 4న రాష్ట్ర ప్రభుత్వం జీవో 120 జారీ చేసింది. కొల్లేరు అని పిలువబడే ప్రాంతంలో 30,885 హెక్టార్ల ప్రాంతాన్ని పక్షుల అభయారణ్యంగా ప్రకటించింది. అక్కడ 78 గ్రామాలున్నాయి. 2,25,000 జనాభా నివసిస్తుంది. వీరంతా అక్కడే నివసించదలచుకుంటే నివసించవచ్చును గానీ పక్షుల రాకపోకలకు నష్టకరమైన జీవన

విధానాన్ని అనుసరించకూడదు. వ్యవసాయానికి రసాయనిక ఎరువులు వాడకూడదు. ఇంటికే తప్ప పొలంలో గానీ పిండి గిర్నీలో గానీ కరెంట్ వాడకూడదు.

ఈ 78 గ్రామాలలో 20 వేల ఎకరాల పట్టా భూమి ఉంది. 9 వేల ఎకరాల డి-ఫారం భూమి వుంది. ఏ పట్టా లేకుండా పేదలు ఆక్రమించుకున్న భూమి ఉంది. పట్టా భూమిలో వ్యవసాయం, చేపల చెరువులూ ఉన్నాయి. వీటి మీద ఆధారపడి బతుకుతున్న 2,25,000 మంది ప్రజలు ఇక నుంచి ప్రకృతిసిద్ధమైన వ్యవసాయ పద్ధతులలోనే బతకాలని జీవో 120 అంటుంది. దేశమంతా రసాయన ఎరువులను, కరెంట్ మిషన్లను విడిచిపెట్టి ప్రకృతి వ్యవసాయం చేసుకుంటూ బతకాలని నమ్మే వారున్నారనుకోండి. అయితే బలవంతంగా కొల్లేటి గ్రామాల ప్రజలపైన మాత్రమే ఆ నిర్ణయం రుద్దడం న్యాయమా? దీని వల్ల వాళ్ళ జీవన ప్రమాణం కచ్చితంగా పడిపోతుంది.

పారిశ్రామిక కాలుష్యాన్ని గట్టిగా నివారించి మా పాటికి మమ్మల్ని బతకనిస్తే పక్షుల రాకకు పెద్దగా ఆటంకమేమీ ఉండదనీ, కావాలంటే రసాయన పదార్థాల వాడకంపైన హేతుబద్ధమైన పరిమితులు పెడితే ఫర్వాలేదు గానీ మొత్తంగానే నిషేధించి మా జీవన విధానాన్ని ముప్పై ఏళ్ళు వెనక్కి నెట్టడం భావ్యం కాదనీ ఆ గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తున్నారు.

ప్రభుత్వానికి మరొక ప్రత్యామ్నాయం ఉంది. మొత్తంగా ఈ అభయారణ్యంలోని ప్రైవేట్ భూమినంతా సేకరించి అక్కడ బతుకుతున్న ప్రజలకు బయట పునరావాసం కల్పించవచ్చును. పునరావాసం గురించి ప్రభుత్వమేమీ మాట్లాడడం లేదు గానీ, భూమి సేకరణ కావాలంటే చేస్తానంటున్నది. అయితే పట్టా భూములకు మాత్రమే నష్టపరిహారం (మార్కెట్ ధరగా ప్రభుత్వం భావించిన దాని ప్రకారం) ఇస్తామనీ, డి-ఫారం భూములకు తోచినంత ఎక్స్‌గ్రేషియా మాత్రమే ఇస్తామనీ అంటున్నది. ఎక్స్‌గ్రేషియో అనేది ఎకరానికి 300 రూపాయలకు మించి ఉండదని ప్రభుత్వ అధికారులే అంటున్నారు.

దీనిపై డి-ఫారం భూములలోని చేపల చెరువుల రైతులు ఎక్కువ ఆందోళన చేస్తున్నారు. వీరంతా ఎస్.సి., బి.సి. కులాలకు చెందిన వారు. వేరే బతుకుతెరువు లేక వీరు 1970లలో ప్రభుత్వ భూములు సాగుచేసుకోవటం మొదలుపెట్టగా, 1976లో

ప్రభుత్వమే జీవో 118 జారీ చేసి వీరందరికీ తలా 50 సెంట్ల చొప్పున భూమి అసైన్‌మెంట్ కింద ఇచ్చి, చేపల చెరువులు వేసుకోవడానికి అనుమతి ఇచ్చి, సొసైటీలు పెట్టుకొమ్మని ప్రోత్సహించి, అప్పులు కూడా ఇచ్చింది.

ఆ తర్వాత 136 సొసైటీలు ఏర్పడ్డాయి. వాటి సభ్యుల సంఖ్య 10,400. వీరు దాదాపు 6 వేల ఎకరాలలో ప్రభుత్వ ప్రోత్సాహంతో చేపల చెరువులు చేసుకుంటున్నారు. వీళ్ళను చూసి, అంతకు ముందెన్నడో డి-ఫారం భూములు పొందిన వారు కూడా 2000 లేక 3000 ఎకరాలను చేపల చెరువులుగా చేసుకున్నారు.

ఈ సొసైటీల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం వివరమైన ప్రణాళిక కూడా జారీ చేసింది. వారికి అప్పులిచ్చింది. బ్యాంకుల నుండి అప్పులిప్పించింది. ప్రభుత్వాన్ని నమ్మి వారు అప్పులు తీసుకున్నారు. పెట్టుబడి పెట్టారు. చేపల చెరువు నిర్మాణానికి 25 వేల రూపాయల దాకా ఖర్చుపెట్టారు. చేపల పెంపకానికి సంవత్సరానికి 40,000 రూపాయలు పెట్టుబడి పెట్టారు. చాలామంది ఇంకా ఆ అప్పులలో ఉన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా ఏ నష్టపరిహారం లేకుండా వెళ్ళిపొమ్మనీ చేపల చెరువులన్నీ కూల్చేస్తామనీ అంటే వాళ్ళెక్కడికి పోతారు?

కోర్టుకు పోయారు. జీవో 120 చెల్లదన్నారు. పక్షుల అభయారణ్యం కోసం 2,25,000 మంది ప్రజలు నివసించే ప్రాంతాన్ని నోటిఫై చేయడం, తమ జీవన ప్రమాణాలను తీవ్రంగా దిగజార్చే ఆంక్షలు పెట్టడం అన్యాయం అన్నారు. నిజానికి కొల్లేరు చుట్టూ ఉన్న ఫ్యాక్టరీల కాలుష్యాన్ని ఆపితే కొల్లేటిలో జీవిస్తున్న ప్రజల జీవన విధానం పక్షుల రాకకేమీ ఆటంకం కాదన్నారు. ఆహ్లాదకరమైన కొల్లేటి ప్రకృతిలో భాగమై ఎప్పటి నుండో జీవిస్తున్న తమకు జీవనాధారం లేకుండా చేసి కొల్లేరు ఇచ్చే ఆహ్లాదాన్ని పర్యాటకులకు రిజర్వ్ చేయడం అన్యాయం అన్నారు. పోనీ అక్కడ నుండి వెళ్ళిపోదామంటే పట్టా భూములకే తప్ప డి-ఫారం భూములకు నష్టపరిహారం ఇవ్వబోమనీ, పునరావాసం ఎవ్వరికీ ఇవ్వబోమనీ జీవో ప్రకటించడంవల్ల ఆ ప్రత్యామ్నాయం కూడా లేకుండా పోయిందన్నారు. దాదాపు 25 ఏళ్ళుగా ప్రభుత్వం అనుమతితో ప్రభుత్వం ప్రోత్సాహంతో ప్రభుత్వ సంస్థలిచ్చే అప్పులకు తమ శ్రమనూ తమ దగ్గరున్న కొద్దిపాటి పెట్టుబడినీ జతచేసి చేపల సాగుచేస్తున్న ఎస్.సి., బి.సి. రైతుల పొట్ట ఇట్లా కొట్టడం జీవించే హక్కుపైన దాడి అన్నారు. భారత రాజ్యాంగం

కింద ప్రభుత్వం ప్రజలతో ఈ రకంగా వ్యవహరించడం చెల్లదన్నారు. నిజానికి భూమి సేకరణ చేసేటప్పుడు డి–ఫారం భూములకు పట్టాభూముల లాగే మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలనీ, సివిల్ కోర్టుకు అప్పీలు చేసుకునే హక్కు మాత్రమే డి–ఫారం భూముల రైతులకు ఉండదనీ రాష్ట్ర ప్రభుత్వమే గతంలో కోర్టు తీర్పుల ననుసరించి 23–12–93న జీవో నెంబరు 1307ను జారీ చేసింది. జీవో 120 ఆ మేరకయితే కచ్చితంగా చెల్లదు కాని వారి వాదనతో హైకోర్టు ఒప్పుకోలేదు. వన్యప్రాణుల (పరిరక్షణ) చట్టం కింద అనుసరించవలసిన పద్ధతిని సక్రమంగానే అనుసరించి జీవో జారీ చేశారు కాబట్టి ఆ జీవో చెల్లుతుందన్నారు. విషయం పట్ల సానుభూతి లేనప్పుడు ప్రొసీజర్ పేరుమీద కేసులను కొట్టేయటం మన కోర్టులకు పరిపాటే.

ఇప్పుడింక ఉద్యమాన్ని తీవ్రతరం చేసి చంద్రబాబును ఒప్పించే ప్రయత్నం చేయాలా లేక ఢిల్లీకి పోయి సుప్రీంకోర్టును ఆశ్రయించాలా అన్న ప్రశ్న కొల్లేటి ప్రజల ముందు ఉంది. వారు రెండవ దాన్నే ఎంచుకోవటం చంద్రబాబు పాలన గురించి సరైన అంచనాయే కావచ్చును గానీ సుప్రీంకోర్టు ఇంతకంటే భిన్నంగా స్పందిస్తుందని నమ్మడం కూడా కొంచెం కష్టమే.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**31 మార్చి 2002**

# అభివృద్ధి - త్యాగం

ప్రాజెక్టు అంటే అభివృద్ధి. అభివృద్ధి సమాజానికి అవసరం. కాబట్టి ప్రాజెక్టులను వ్యతిరేకించవద్దు. నీకేదయినా నష్టం జరుగుతుందా, దానికి పరిహారం అడుగు, అందుకోసం కొట్లాడు. అంతే తప్ప ప్రాజెక్టుకు అడ్డం పడొద్దు.

ఈ తర్కం పాలకులు మాత్రమే అనుసరిస్తే పెద్దగా ఆశ్చర్యపోనక్కరలేదు. కానీ వామపక్ష పార్టీలతో సహా ప్రజల పక్షాన నిలబడేవారు చాలామంది దీనికి బానిసలయ్యారు. అది నీటి పారుదల ప్రాజెక్టు గానీ, ఏదయినా ఖనిజం ప్రాజెక్టు గానీ, పట్టణీకరణ ప్రాజెక్టు గానీ - అన్నిటికీ ఈ తర్కం వర్తిస్తున్నది.

'అభివృద్ధి' అనే మాటకు అర్థమే లేదనీ, దానికి ఎవరూ ఏ త్యాగమూ చేయనక్కరలేదనీ చెప్పడం నా ఉద్దేశం కాదు. అయితే ఏమిటి, ఎందుకు, ఎవరు అన్న ప్రశ్నలు అసలే వేసుకోకుండ ఈ తర్కాన్ని దిగమింగడం సబబు కాదు.

ఖనిజాలు ఎక్కువగా అటవీ ప్రాంతాలలోనే దొరుకుతాయి. వాటిని వెలికి తీసే ఏ ప్రాజెక్టయినా అడవుల విధ్వంసానికి దారితీస్తుంది. అడవులు అధిక సందర్భాలలో ఆదివాసీ ప్రజల ఆవాసాలు. వారి జీవితాలు అటువంటి ప్రాజెక్టుల వల్ల ఛిద్రమవుతాయి. అందువల్ల అటువంటి ప్రాజెక్టుల విషయంలో తరచి చూడకుండా అనిర్వచనీయమైన అభివృద్ధి భావనకు దాసోహమంటామంటే కష్టం.

ఒరిస్సాలోని తూర్పు కనుమల కొండలు బాక్సైట్ ఖనిజానికి ప్రసిద్ధి. బాక్సైట్ అల్యూమినియంకు ముడి ఖనిజం. అది ప్రపంచంలో అత్యధికంగా లభించే దేశాలలో

ఇండియా ఒకటి. ఇండియాలో అత్యధికంగా లభించే ప్రాంతం ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌ల సరిహద్దయిన తూర్పు కనుమల ప్రాంతం.

పెద్ద పెద్ద కంపెనీలు ఒరిస్సా అడవులలోని బాక్సైట్ ఖనిజం తవ్వకం కోసం లీజు ఇవ్వమని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్లికేషన్లు పెడుతున్నాయి. అక్కడ అయిపోయిన తరువాత లేదా అయిపోజేసే క్రమంలో మన దగ్గరికీ వస్తాయి. ఎందుకంటే ఒరిస్సాలోని నిక్షేపాలకు కొనసాగింపుగా విశాఖపట్నం ఏజెన్సీలోనూ అంత విస్తారంగా కాకున్నా చెప్పుకోదగ్గ మోతాదులో బాక్సైట్ నిక్షేపాలున్నాయి.

ఈ 'అభివృద్ధి'కి ఇప్పటిదాకా ఒరిస్సా ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రధాన ఆటంకం స్థానిక ఆదివాసుల నుండే. కోందు, పరజ, జోడియా, డొంగారియా తెగల ఆదివాసులు అడవులలోకి బాక్సైట్ కంపెనీల చొరబాటును గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. మా అడవులలో మాపాటికి మమ్మల్ని బతకనివ్వండి. ఇక్కడి నుండి మమ్మల్ని తరిమేయొద్దు అంటున్నారు. 'అయ్యో పాపం' అనగల ఒరిస్సా మధ్యతరగతి మేధావులు 'మరి ఆ గనులు అభివృద్ధికి అవసరం కదా' అనే వాదన దగ్గర ఆగిపోతున్నారు. బయటి రాష్ట్రాల నుండి ప్రఖ్యాతులూ, ప్రఖ్యాతులుకాని వారూ చాలామంది ఒరిస్సా ఆదివాసుల పోరాటాలకు మద్దతు ప్రకటిస్తున్నారు గానీ ఆ రాష్ట్రంలోని మేధావివర్గం మాత్రం స్తబ్దంగా ఉంది.

అల్యూమినియం చాలా వాటికి అవసరం. దానితో గిన్నెలు, ప్లేట్లు తయారు చేస్తారు. విమానాల్ని మొత్తంగానే అల్యూమినియంతో చేస్తారు. ఇతర వాహనాల 'ఫ్రేం' తయారీలో కూడా అదే లోహాన్ని వాడతారు. మందుల ప్యాకింగ్‌లో పల్చటి అల్యూమినియం ఫాయిల్స్ వాడతారు. కాబట్టి ప్రస్తుత నాగరికతలో అల్యూమినియంకు ప్రాముఖ్యం ఉన్నమాట వాస్తవమే.

కానీ ఈ నాగరికతా విశేషం స్థానిక ప్రజల జీవితాలకేమయినా ఇస్తుందా అన్న ప్రశ్న వేసుకోకుండా అది నాగరికతా విశేషం కాబట్టి, దాని వెలికితీత అభివృద్ధికి అవసరం కాబట్టి దానికి ఎవరూ అడ్డం రావద్దనే వాదన సరయినదేనా?

ఒరిస్సా ఏజెన్సీలో వెలికి తీసే బాక్సైట్ ఖనిజం నుండి వచ్చే అల్యూమినియంతో స్థానికంగానే గిన్నెల ఫ్యాక్టరీ నెలకొల్పి ప్రజలకు చవగ్గా గిన్నెలు అందజేస్తున్నట్టయితే,

లేకపోతే మందుల ప్యాకింగ్‌లో ఉపయోగించే ఫాయిల్స్ తయారుచేసే ఫ్యాక్టరీ నెలకొల్పి, మందుల ప్యాకింగ్ యూనిట్లు నెలకొల్పి మందులు చవగ్గానో విరివిగానో అందించేటట్టయితే అల్యూమినియం వల్ల వచ్చే అభివృద్ధి అమూర్తమయినది కాదనీ, అది స్థానికులకు కూడా అభివృద్ధి అనీ అంగీకరించవచ్చు. అయినప్పటికీ దానికి ఆదివాసులే ఎందుకు త్యాగాలు చేయాలి అన్న ప్రశ్న వేసుకోవచ్చు. అందరూ ఆ త్యాగాన్ని పంచుకునే మార్గం లేదా అని తర్కించుకోవచ్చు. అది వేరే చర్చ.

కానీ ఒరిస్సాలో బాక్సైట్ తవ్వకాలకు పోటీపడి లైసెన్స్‌లు పొంది ఆదివాసులతో తలపడుతున్న వారెవ్వరూ ఆ అల్యూమినియంతో స్థానిక జీవితాలను ఏ రకంగానూ అభివృద్ధి చేసే ఆలోచన చేయడం లేదు. నేరుగా విశాఖపట్నం రేవుకు తీసుకొచ్చి ఓడలెక్కించి ఎగుమతి చేయబోతున్నారు.

నిజానికి లైసెన్స్ పొందుతున్న వారిలో ప్రముఖులయిన ఆదిత్య బిర్లా ఆ బాక్సైట్ నుండి అల్యూమినియం తయారీ సహితం చేపట్టడం లేదు. బాక్సైట్‌ను శుద్ధిచేయగా వచ్చిన అల్యూమినానే(అల్యూమినియం ఆక్సైడ్) నేరుగా ఎగుమతి చేస్తున్నారు.

ఇది ప్రపంచ అభివృద్ధికి దోహదపడుతుండవచ్చును గానీ మా జీవితాలకేమొస్తుంది అన్న ప్రశ్న స్థానికులు ఎందుకు వేసుకోకూడదు? వాళ్ళకేమొస్తుంది? రెండు పంటలు పండించే పచ్చటి భూములలో గనులొస్తాయి. అవి ఓపెన్ కాస్ట్ గనులు కాబట్టి ఉద్యోగాలెక్కువ రావు. దుమ్ము, ధూళి మాత్రం ఎక్కువే వస్తాయి. ఆ గనుల నుండి తవ్వి తీసే ఖనిజాన్ని శుభ్రం చేసే రిఫైనరీలలో యంత్రీకరణ చాలా దూరం పోయింది కాబట్టి వాటి లోనూ ఉద్యోగాలెక్కువ రావు. రకరకాల వ్యర్థపదార్థాలు మాత్రం దండిగా వస్తాయి. ఒక వేళ గనులలోనూ రిఫైనరీలలోనూ ఉద్యోగాలు వచ్చినా అవి స్థానికులకు పెద్దగా రావు. వాటికి కావలసిన 'యోగ్యత' వారిలో ఉండదు. ఇంకేమొస్తుంది? ఇంకేం రాదు. ఆదిత్య బిర్లాకు లాభాలొస్తాయి. భారత్‌కు విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. మొదటిది ఆదిత్య బిర్లాకు అభివృద్ధే, రెండవది దేశానికి అభివృద్ధే, మొత్తమంతా కలిపి మానవ నాగరికతకు ఏదో ఒక అర్థంలో అభివృద్ధే. కానీ కోరాపుట్, రాయగడ, కలహండి జిల్లాల తూర్పు కనుమల గ్రామాలకు ఇంత ధూళి, అంత ఎర్రమట్టి తప్ప అభివృద్ధి అనేదేదీ లభించదు.

నిజమే, గనులలో, రిఫైనరీలలో ఉద్యోగాలెక్కువ దొరకకపోయినా అవి నెలకొల్పారంటేనే వాటిని ఆవరించి కొన్ని వ్యాపారాలూ కొన్ని వృత్తులూ అభివృద్ధి చెందుతాయి. ఇవి స్థానికంగా కొంత ఉపాధి అవకాశాన్ని ఇస్తాయి. కానీ ఈ అవకాశాలను చేజిక్కించుకోవడానికి ఏజెన్సీ బయటి నుండి చాలామంది వస్తారు. ఏజెన్సీవాసులయిన ఆదివాసులకు అవి కూడా పెద్దగా దక్కవు.

అంతే కాకుండా ఈ హడావుడి తాత్కాలికమైనదే. ఒక గని ఇరవై ఏళ్ళలో, మరొకటి ఇరవై అయిదేళ్ళలో ఖాళీ అయిపోతాయి. ఆదిత్య బిర్లాగారు మూటాముల్లె సర్దుకొని వెళ్ళి పోతారు. అప్పటికి బాక్సైట్ పుణ్యాన వారి ఆస్తే కాక పెట్టుబడిదారీ వర్గంలో వారి స్థాయి పెరిగి ఉంటుంది. ఇంకొంచెం లీడింగ్ కార్పొరేట్ హౌస్ అయి ఉంటారు. కానీ అడవులలో ఏం మిగిలి ఉంటుందంటే పెద్ద పెద్ద గుంతలు, ఎర్రమట్టి వంటి వ్యర్థపదార్థాలు నిండిన స్లర్రీపాండ్స్ (విసర్జిత పదార్థాల చెరువులు), ఆరిపోయిన పొగగొట్టాలు, పోను పోను బీటలు వారి శిథిలాలయ్యే కంపెనీ కార్యాలయాలు. అప్పటికే అడవికి వెలి అయి ఏ జిల్లా కేంద్రం లోనో అడుక్కుంటూ, రిక్షా తొక్కుకుంటూ, వ్యభిచారం చేసుకుంటూనో ఉన్న ఆదివాసుల పిల్లలు తర్వాతెప్పుడో వెనక్కి తిరిగివచ్చి తమ తల్లిదండ్రులు పచ్చటి ప్రకృతి మధ్య బతికిన చోట 'అభివృద్ధి' వదలి వెళ్ళిన పెద్ద పెద్ద గుంతలను చూసి ఏమనుకోవాలి? వచ్చి వెళ్ళింది 'అభివృద్ధి' అని మాత్రం అనుకోలేరు.

అయినప్పటికీ దీని కోసం వారు త్యాగాలు చేయవలసిందేననే మేధావి వర్గాన్నీ, రాజకీయ వర్గాన్నీ ఏమనాలి?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**5 జూన్ 2005**



# జీవో 68 కంటే మెరుగైనది కావాలి

ప్రజలు చాలా చాలా కారణాలుగా తమ ఇళ్ళు, ఊర్లు, పొలాలు కోల్పోయి 'నిర్వాసితులు' అవుతుంటారు.

సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, రహదార్లు మొదలయిన వాటికి భూమి కావలసి వచ్చినప్పుడు, ఆ భూమిని అనుభవిస్తున్న ప్రజలను తొలగించి ప్రభుత్వం దానిని ఆయా అవసరాల కోసం తీసేసుకుంటుంది.

'నా భూమి నేనెందుకు ఇవ్వాలి?' అని నిరాకరించే హక్కు ప్రజలకు లేదు. 'ప్రజావసరం' కోసం భూమి ఇమ్మంటే ఇయ్యవలసిందే. ఏది ప్రజావసరం అనే దానికి చట్టంలో నిర్వచనమేదీ లేదు. అయితే కోర్టులు ఆ మాటను చాలా ఉదారంగా వ్యాఖ్యానించాయి. రైల్వేలైన్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, పాఠశాలలు మొదలయినవే కాదు, ధనవంతులు మాత్రమే ఉపయోగించే విమానాశ్రయాలు, నగరాలను సుందరంగా తీర్చిదిద్దడానికి చేపట్టే నిర్మాణాలు మొదలయినవి కూడా 'ప్రజావసరమే'

ప్రభుత్వం తీర్చే ప్రజావసరాలే గాక, ప్రైవేట్ కంపెనీల అవసరాల కోసం ప్రభుత్వం చేపట్టే భూమి సేకరణకు కూడా అభ్యంతరం చెప్పే హక్కు భూమి స్వంతదారులకు లేకుండా చట్ట సవరణ చేశారు.

బలవంతంగా చేపట్టే ఈ భూమి సేకరణ వల్ల ఆ భూమిని అనుభవించే హక్కును కోల్పోయే ప్రజలకు అందుకు మారుగా ఏం లభిస్తుంది? 110 సంవత్సరాలుగా అమలులో ఉన్న భూమి సేకరణ చట్టం ప్రకారం ఆ భూమి మీద యాజమాన్యం హక్కు కలిగి ఉన్న వారికి మాత్రమే నష్టపరిహారం లభిస్తుంది. ఇది సహితం ఒక హింసాత్మకమైన తంతుగా నడుస్తున్నది. ప్రభుత్వం మార్కెట్ ధర చెల్లించే పేరిట అతి

తక్కువ ఇస్తుంది. దానిపైన అతగాడు నిర్దిష్ట కాలపరిమితిలో వ్యాజ్యం వేయకపోతే, ఆ మొత్తమే భూమి స్వంతదారునికి లభించే నష్టపరిహారం. నిర్దిష్ట కాలపరిమితిలో దానిపై అప్పీలు చేసుకొని, కేసు నడుపుకొని, తగిన సాక్ష్యాలు పెట్టుకొని న్యాయం పొందాలి. ఉన్నవాళ్ళు ఈ ప్రక్రియను తమకు అనుకూలంగా మలచుకొని చాలా ప్రయోజనం పొందారు గానీ సగటు నిర్వాసితులకు అది సాధ్యం కాదు. మధ్యవర్తుల మీద, వకీళ్ళ మీద నమ్మకం పెట్టుకొని చివరికి లభించిన అదనపు నష్టపరిహారంలో సగంపైగా వారికి అప్పగించిన వారే మెజారిటీ.

అదట్లావుంచి, ఆ భూమిపైన యాజమాన్య హక్కులేని వాళ్ళకు చట్టం ఏ నష్టపరిహారం ఇవ్వదు. ప్రభుత్వమే డి–ఫారం పట్టాలు ఇచ్చి అనుభవించే హక్కు కల్పించిన వారుంటారు. ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోతుందా అన్న ఆశతో భూమిని ఏళ్ళ తరబడి సాగుచేసుకుంటూ అర్జీలు పెట్టుకుంటూ ఉన్న వాళ్ళుంటారు. పట్టా లేకపోతే ఏమయిందని అర్జీ కూడా పెట్టుకోకుండా ప్రభుత్వ భూమిని నిరాఘాటంగా సాగుచేసుకుంటున్న వారుంటారు. భూమిని పశువులను మేపడానికీ, జాలర్లయితే వలలు ఎండబెట్టుకోవడానికీ ఉమ్మడిగా వాడుకుంటున్న వారుంటారు. భూమి మీద ఉన్న తాడి, చింత, మామిడి మొదలయిన చెట్ల ఫలాలన్నీ వృత్తిరీత్యాగానీ, అవసరార్థం గానీ ఉమ్మడిగా అనుభవిస్తున్న వారుంటారు.

ఆ భూమిని ప్రభుత్వం తీసుకుంటే ఆయా ప్రజలు చాలా నష్టపోతారు గానీ వాళ్ళకు చట్టం ఏ నష్టపరిహారం ఇవ్వదు.

భూమికి పట్టావున్న రైతుకు నష్టపరిహారం ఇస్తారు గానీ ఆ భూమిలో కూలి చేసుకునే కూలీలకు ఏమీ ఇవ్వరు. రైతులు భూమి కోల్పోయిననాడు, కూలివాళ్ళు పని చేసుకునే అవకాశాన్ని కూడా కోల్పోతారు కదా! అయినప్పటికీ చట్టం వారికేమీ ఇవ్వదు.

నష్టపరిహారం ఇవ్వడం ఇవ్వకపోవడం ఒకెత్తు కాగా, ఆ తరువాత ఎక్కడకు పోయి, ఏం చేసుకొని బతుకుతారనేది తరచుగా వచ్చే దానికంటే పెద్ద ప్రశ్న. బుద్ధి పుట్టిన చోటికిపోయి ఇళ్ళు కట్టుకొని బతకడం సాధ్యం కాదు కదా? పెద్ద సంఖ్యలో జనం ఇళ్ళ స్థలాలను, ఇళ్ళు కట్టుకోవడానికి అవసరమైన పరికరాలను, వ్యవసాయానికి భూమిని కొనుక్కోవడానికి బయలుదేరారని తెలియగానే అన్ని ధరలూ పెరిగిపోతాయి. యాజమాన్య హక్కు ఉన్నవారు సైతం ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో అంత ఆస్తి

కాదు కదా, అందులో సగం కూడా కొనుక్కోలేరనేది అనుభవం ద్వారా నిర్వాసితులందరూ తెలుసుకున్న వాస్తవం.

ఈ పరిస్థితి ఎప్పటి నుండో ఉంది గాని ప్రాజెక్టు నిర్వాసితులు నోరులేని జనం – ప్రధానంగా ఆదివాసులు – కావడంతో చాలా కాలంపాటు దీనికి వ్యతిరేకంగా పెద్ద ఆందోళనలేవీ రాలేదు. ఇప్పుడొక దశాబ్ద కాలంగా వస్తున్నాయి. కొన్ని నిర్దిష్టమైన డిమాండ్లు ముందుకొచ్చాయి. భూమి యాజమాన్య హక్కుకేగాక వాడకపు హక్కుకూ నష్టపరిహారం ఇవ్వాలనీ, ఆ భూమి ఏ ప్రాజెక్టు కిందకో, రిజర్వాయర్ కిందకో పోవడం వల్ల కోల్పోయిన ఉపాధి అవకాశానికీ నష్టపరిహారం ఇవ్వాలనీ, నిర్వాసిత గ్రామాలను గ్రామాలుగానే తిరిగి ప్రభుత్వం కట్టివ్వాలనీ, కేవలం ఇళ్ళే కాదు, రోడ్లు, కరెంటు, కాల్వలు, పంచాయితీ కార్యాలయం వగైరాలన్నీ కట్టివ్వాలనీ అడుగుతున్నారు. నిర్వాసితులందరికీ సాగుచేసుకొనడానికి భూములు గానీ ఇతర నిర్దిష్ట రూపాలలో జీవనాధారం గానీ కల్పించాలని కూడా అడుగుతున్నారు. నిర్వాసితుల జీవన ప్రమాణం గతంకన్నా హీనస్థితికి పడిపోకుండా చూడాలని అడుగుతున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే సమగ్ర పునరావాసం అడుగుతున్నారు. ప్రాజెక్టులు దేశ 'అభివృద్ధి' కోసం అవసరమయితే నిర్వాసితులు దేశ ప్రజలే కాబట్టి వారి జీవన ప్రమాణం పడిపోకుండా ఉండే పద్ధతిలో వారికి ఒక సంఘంగా, సమూహంగా పునరావాసం, కొత్త జీవితం కల్పించడం న్యాయమనీ, దానికయ్యే ఖర్చు కూడా 'అభివృద్ధి' ఖర్చుగా ప్రభుత్వం భరించాలనీ అడుగుతున్నారు. అసలు ప్రాజెక్టు వల్ల వచ్చే ప్రయోజనం మొదట నిర్వాసితులకే కల్పించాలన్న ఆలోచన సహితం ఈ మధ్య కాలంలో నిర్వాసితుల ఉద్యమాలలో బలపడింది.

ప్రజల ఆలోచనలలో, చైతన్యంలో ఈ మార్పులు గడచిన దశాబ్ద కాలంలో వచ్చాయి గానీ, చట్టంలో ఏ మార్పు రాలేదు. కనీసం సుప్రీంకోర్టయినా పునరావాస హక్కును 'జీవించే హక్కు'లో భాగంగా వ్యాఖ్యానించి దానినొక హక్కుగా ప్రజలకు కల్పిస్తుందేమోనని ఆశించి నర్మదా డ్యాంను సుప్రీంకోర్టులో సవాలు చేసిన నర్మదా ప్రాజెక్టు నిర్వాసితులకు ఘోరమైన ఆశాభంగమయింది. వాళ్ళకే కాదు నిర్వాసితులందరికీ అయింది. నిర్వాసితులకు పునరావాస హక్కనేది లేదనీ, ప్రభుత్వం దయతలచి ఇస్తే తీసుకోవలసిందే తప్ప డిమాండు చేయడానికి వీలులేదనీ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పునరావాస హక్కు పేరిట జీవో 68ని జారీ చేసింది. ఇందులో ఉన్నది నిజానికి పునరావాస హక్కు కాదు. భూమి సేకరణ చట్టంలో ఉన్నదానికన్నా ఇంకొంచెం మెరుగయిన నష్టపరిహారపు హక్కు మాత్రమే. సేకరించిన భూమిపైన యాజమాన్య హక్కు ఉన్నవారికే గాక వాడకపు హక్కు ఉన్నవారికి సహితం కొంత నష్టపరిహారం ఇస్తుంది. ఆ భూమిలో కూలి చేసుకొని బ్రతికే వారికి సైతం కొంచెం ఇస్తుంది.

ప్రభుత్వం దీనికి ఏ పేరు పెట్టినా, తిరిగి ఇంకొక చోట నివాసం ఏర్పరచుకోవడానికీ, మళ్ళీ ఏదయినా ఉపాధి దొరికే దాకా పూట గడవడానికీ మాత్రమే ఈ మొత్తం ఉపయోగపడుతుంది. అంతే తప్ప కోల్పోయిన ఉపాధి అవకాశం స్థానంలో కొత్త ఉపాధి మార్గాన్ని కల్పించదు. చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే భూమి సేకరణ చట్టం కింద ఇచ్చే నష్టపరిహారమూ ఇటువంటిదే, తిరిగి అంత భూమి కొనుక్కోవడానికి అదెప్పుడూ ఉపయోగపడదు. ఏదో ఒక రకంగా మళ్ళీ స్థిరపడే దాకా బతుకు గడపడానికి మాత్రమే పనికొస్తుంది. ఈ జీవో ఇచ్చేది అంతకంటే భిన్నం కాదు.

అది కూడా తెలివిగా నడుచుకుంటేనే, లేకపోతే అందుకు కూడా పనికి రాదు. వందలు లేక వేల సంఖ్యలో జనం చేతిలో డబ్బులొచ్చిపడ్డాయని తెలియగానే వారి చుట్టూ ముసిరే వాళ్ళు చాలామంది ఉంటారు. ఆకర్షణీయమైన వస్తువుల నుండి అందమైన ఆశల దాకా అమ్మజూపుతారు. అదేదీ కాకున్నా, నాలుగు రోజులు హాయిగా తిని, తాగి డబ్బు అంతా పాడుచేసుకున్నవారూ ఉన్నారు.

వస్తుంది, వస్తుందని ప్రజలు ఎదురు చూసిన పునరావాస హక్కు ఇంత పరిమితమైన రూపంలో రావడం బాధాకరమైనప్పటికీ, దీనిని తెలుసుకోవడం, ఉన్నంతలో అమలు చేయించుకోవడం అవసరం కాబట్టి, దీనిలో నియమాలను అర్థం చేసుకొని నిజమైన పునరావాస హక్కు దిశగా మెరుగుపరచుకోవడమూ అవసరం కాబట్టి, ఈ జీవోను ప్రజలందరికీ అందుబాట్లోకి తేవడం అవసరం. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఈ ప్రచురణ ద్వారా ఆ పని చేసింది. జీవో ఇంగ్లీష్ ప్రతినీ, దాని తెలుగు అనువాదాన్నీ పక్క పక్కనే ప్రచురించడం ద్వారా, ప్రభుత్వ అధికార్లతో మాట్లాడేటప్పుడు 'మీరు చెప్తున్న విషయం జీవోలో లేదు' అని వారు దబాయించినట్టయితే అప్పటికప్పుడే ఇంగ్లీషు ప్రతిని కూడా చూపించి 'సరయితే ఏముందో చెప్పు' అని నిలదీసే అవకాశం కల్పించారు.

పైన చెప్పినట్లు, ఈ జీవోలో చాలా విషయాలు ఉన్నట్లు కనిపించినా, ఉన్న నివాసం నుండి తొలగించిన తరువాత వేరొకచోట నివాసం ఏర్పరచుకొని, మళ్ళీ ఏదయినా ఉపాధి అవకాశం సంపాదించుకునే దాకా రోజు గడవడానికి అవసరమైన ఆసరా భూమి ఉన్నవాళ్ళకే గాక, వ్యవసాయ కూలీలకూ, వివిధ వ్యవసాయేతర వృత్తుల వారికి కొంత మేరకు కల్పించడం ఈ జీవోలోని ప్రధాన విషయం. తక్కినవన్నీ ప్రభుత్వానికి వీలయితే, చేయదలిస్తే, చేయగలననుకుంటే తప్ప ఒక హక్కుగా ఇస్తున్నవి కావు. షెడ్యూల్డు తెగలకు మాత్రం కొంచెం అదనపు హక్కు కల్పించారు.

'పునరావాస విధానం' అని పేరు పెట్టుకున్న ఈ జీవోలో కొట్టొచ్చినట్టు కనిపించే మరొక లోపం ఉంది. ఈ జీవోలోని తొలిపలుకులు చదివితే ఇది ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యకలాపాల వల్ల నిర్వాసితులయ్యే వారందరికీ వర్తిస్తుందని అనిపించవచ్చును గానీ వివరాలలోకి పోయినట్టయితే నీటిపారుదల ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులయ్యే వారిని మాత్రమే ఉద్దేశించి జారీ చేశారు అన్న అనుమానం వస్తుంది. ఉదాహరణకు పట్టణాల ఆధునీకరణ పేరిట కూల్చే మురికివాడల ప్రజల అవసరాలకు ఈ జీవోను అన్వయించడం చాలా కష్టం. ఏ మేధావి దీనిని రాసాడో గాని అతనికి నిర్వాసితులలో ఎన్ని రకాలుంటారన్న జ్ఞానం సహితం లేనట్టుంది. అట్లాగని 'ఇది మాకు వర్తించదు లెమ్మని నీటిపారుదల ప్రాజెక్టు నిర్వాసితులు కాని వారు దీనిని విస్మరించడం సరయినది కాదు. జీవో (లేక విధాన పత్రం) తొలిపలుకులు దానికి విశాల ప్రాతిపదిక ఉన్నట్లు ప్రకటించాయి కాబట్టి, అన్ని రకాల నిర్వాసితులకూ దానిని తగిన రీతిలో వ్యాఖ్యానించి అన్వయింపజేయాలని డిమాండ్ చేయాలి.

ఈ అవసరాలన్నింటికీ ఈ ప్రచురణ ఉపయోగపడుతుందని ఆశిస్తాను.

**పి.ఎస్. అజయ్‌కుమార్ రాసిన**
**'GO నెం. 68 పునరావాసం కాదు (కాస్త) మెరుగైన నష్టపరిహార విధానం'**
**పుస్తకానికి ముందుమాట, అక్టోబర్ 2005**

# గంగవరం పోర్టు కథ
# కాల్పుల దాకా ఎట్లా వచ్చిందంటే...

గంగవరం ఘటన కిందటి సంవత్సరంలోనే జరగవలసి ఉండిందంటే అభ్యంతరకరంగా తోస్తుందేమో ! కానీ అది నిజం. 'గంగవరం రేవు'ను నిర్మించబోయే దిబ్బపాలెం తీరం వద్ద చేపల వేట మొత్తం వారం రోజులలోగా ఆగిపోవాలని విశాఖపట్నం ఆర్‌డివో దొరవారు గత జులై 30న తాఖీదు జారీ చేశారు. ఈ రోజు చట్టాన్ని ధిక్కరించారన్న నింద ఎదుర్కొంటున్న మత్స్యకారులు ఆ రోజే ఆ పనిచేసి ఉంటే మొన్నటి యుద్ధం 9 నెలల కిందే జరిగి ఉండేది. ఆ రోజు వారు చట్టాన్ని గౌరవించారు. హైకోర్టులో కేసు వేశారు. ఒకటి కాదు, రెండు కేసులు వేశారు. ప్రభుత్వం తనంతట తానే ఆర్‌డివో తాఖీదును అమలుచేయబోమనీ, నిర్వాసితులను సంప్రదించి వారికి పునరావాస పథకం రూపొందించిన తరువాతే దిబ్బపాలెం తీరం వద్దనున్న మత్స్యకారుల పడవులను తొలగిస్తామనీ హైకోర్టుకు హామీ యిచ్చింది.

ఆ హామీ అమలయివుంటే మొన్నటి ఘర్షణ జరిగేదే కాదు, కాల్పులు జరిగేవీ కావు. కోర్టు స్టే ఇవ్వకముందే తానే కోర్టుకు హామీ ఇచ్చిన అధికార యంత్రాంగానికి ఇంతలో ఏమయింది? నిర్వాసితులు ఇంకా సంతృప్తి చెందలేదని తెలిసి కూడా పడవలను తొలగించడానికి ఎందుకు తొందరపడ్డారు? గంగవరం పోర్టు ప్రమోటర్లు తొందర పెట్టారని వినికిడి. అది ప్రభుత్వరంగ పోర్టు కాదు. ప్రైవేట్ రంగానికి చెందినది. ప్రైవేట్ పెట్టుబడులను బతిమాలి బామాలి రాష్ట్రంలోకి రప్పించుకుంటున్న పాలకులు వారు అలిగితే భరించలేరు. 'ఇంక ఆలస్యం చేస్తే ప్రాజెక్టునే వదులుకోవలసి వస్తుంది' అని వారు బెదిరిస్తే తట్టుకోలేరు.

హైకోర్టుకిచ్చిన హామీ ప్రకారం అర్హులయిన మత్స్యకారులందరికీ తాత్కాలిక భృతి ఏర్పాటు చేశాం, యారాడ దగ్గర జెట్టీ కట్టిస్తున్నాం, అర్హులు కానివారు తమకు కూడా ఇవ్వాలని అల్లరి చేయడం వల్లనే గొడవ జరిగింది అని ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ గారు మీడియాతో అన్నారు. తనకున్నట్టే ఎదుటి వారికి కూడా అభిప్రాయాలు ఉంటాయని ఆయన గుర్తిస్తే ఇక్కడొక వివాదం ఉందని గ్రహిస్తారు. గుర్తించకపోవడం వల్ల తనది సత్యం, ఎదుటి వారిది అల్లరి అనుకుంటున్నారు. ఒకటి కాదు, కనీసం మూడు వివాదాలున్నాయి. వాటి గురించి క్లుప్తంగానైనా తెలుసుకుంటే తప్ప చోడిపల్లి నూకరాజు ఎంత నిష్కారణంగా చనిపోయాడో అర్థం కాదు.

'గంగవరం పోర్టు' అని పిలవబడే ఆధునిక రేవు దిబ్బపాలెం తీరంలో వెలుస్తుంది. కాబట్టి దిబ్బపాలెం గ్రామాన్ని మొత్తం ప్రభుత్వం సేకరించి పోర్టు ప్రమోటర్లకు అప్పగించాలనుకుంది. అయితే దిబ్బపాలెం తీరాన పడవలు పెట్టుకొని చేపల వేట చేసుకొని బతుకుతున్నది ఒక్క దిబ్బపాలెం గ్రామస్తులే కాదు. గంగవరం, జాలవారిపల్లిపాలెం, పెదపల్లిపాలెం, చినపల్లిపాలెం మత్స్యకారులు కూడా దిబ్బపాలెం తీరాన్ని ఆసరా చేసుకునే చేపలు పట్టుకొని బతుకుతున్నారు. మొదట్లో ప్రభుత్వం ఈ ప్రాజెక్టు భూమి సేకరణ విషయంలో పూర్తిగా తంపుదాయకంగా వ్యవహరించింది. మాకు గంగవరం వగైరా గ్రామాలతో పని లేదు. మేము సేకరిస్తున్నది దిబ్బపాలెం భూమిని మాత్రమే. ఆ భూములకు భూసేకరణ చట్టం కింద నష్టపరిహారం చెల్లిస్తాం. వేరే ఊళ్ళ వాళ్ళ జీవనం పోతే పోతుంది. దానికి మేమేమీ ఇవ్వం. వారంతా దిబ్బపాలెం తీరాన ఉన్న పడవులను వేరే ఎక్కడకైనా తరలించాలి. కావాలంటే అప్పికొండ అనే ఊరి దగ్గర పడవలు పెట్టుకొని అక్కడ చేపల వేట చేసుకోవచ్చు...ఇలా.

2005 జులై 30 నాటి ఆర్‌డివో దొరవారి ఆదేశం సారాంశం ఇదే. మత్స్యకారుల ఆందోళనను ప్రభుత్వం తప్పుపడుతున్నది గానీ వాళ్ళు ఆందోళన చేయకపోతే ఇప్పుడు అమలుచేస్తున్నామని అధికారులు గొప్పగా చెప్తున్న పునరావాస పథకం ఊసే వినపడేది కాదు. మత్స్యకారులు అంతకుముందు నుంచీ చేస్తున్న ఆందోళన స్థాయి జులై 30 నాటి ఆర్‌డివో దొరవారి ఆదేశం తరువాత పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పటికి రెండు నెలలు ముందు విడుదల చేసిన సహాయ పునరావాస విధానం అని పిలవబడే జీవో 68ని అమలుచేయాలన్న డిమాండ్‌తో వారు

కోర్టుకెక్కారు. ప్రాజెక్టువల్ల తమ నివాస స్థలాన్ని కోల్పోయి నిర్వాసితులయ్యే వారినే కాక, నివాస స్థలాలు కోల్పోకున్నా ఉపాధి అవకాశాలు, జీవనాధారం కోల్పోయే వారిని కూడా బాధితులుగా గుర్తించడం ఈ జీవోలోని కొత్త విషయం.

భూమి సేకరణ చట్టం కింద ఇచ్చే స్థిరాస్తుల నష్టపరిహారమే కాక స్థిరాస్తులు లేని వారికి, ఉపాధి అవకాశాలు కోల్పోయేవారికి కొంత ఆర్థిక సహాయం ఇవ్వడం, కొత్తగా నివాసాలు ఏర్పరచుకోవటానికి, ఉపాధి అవకాశాలు పొందడానికి ఉపకరించే పునరావాస పథకాన్ని ప్రతిపాదించటం ఈ జీవోలోని మరొక ప్రత్యేకత. దీని కోసం ప్రతి ప్రాజెక్టులో ఒక సహాయ పునరావాస అధికారి (అడ్మినిస్ట్రేటర్) ఉంటారు. వారు నిర్వాసితులను, బాధితులను సంప్రదించి పునరావాస ప్యాకేజీ రూపొందించాలి.

ఈ జీవో నిరుడు ఏప్రిల్ నెలలో జారీ అయింది. జులై నెలలో గంగవరం తదితర గ్రామాల ప్రజలను దిబ్బపాలెం తీరాన ఉన్న పడవలను తొలగించమని ఆదేశించినప్పుడు ఈ జీవో ఉందనీ, దాని ప్రకారం వాళ్ళంతా నిర్వాసితులు కాకున్నా బాధితులనీ, వారికీ కొంతమేరకు పునరావాస హక్కు ఉంటుందనీ అధికారులకు ఎందుకు గుర్తుకు రాలేదు?

మత్స్యకారులు కోర్టుకెక్కి ఆ జీవోను అమలుచేయమని అడిగినప్పుడు గానీ వారికి అది గుర్తుకు రాలేదు. అప్పుడు దానిని అమలుచేస్తామనీ, అప్పటిదాకా దిబ్బపాలెం నుంచి పడవలు తీసేయమని వారిపై ఒత్తిడి పెట్టబోమనీ కోర్టుకు హామీ ఇచ్చారు. ఆ హామీ సమగ్రంగా అమలు కాకుండానే బలవంతంగా పడవలు తరలించే ప్రయత్నం చేసి ఘర్షణకు తామే కారణం అయ్యారు.

బాధితులయిన మత్స్యకారుల గుర్తింపు సక్రమంగా జరగలేదన్నది మత్స్యకారుల ఆరోపణ. ఎవరివద్దనైతే మత్స్యశాఖ మంజూరు చేసే గుర్తింపు కార్డులున్నాయో వారిని మాత్రమే ప్రభుత్వం లెక్కించింది. అయితే కారు నడపడానికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అయినట్టు చేపల వేట చేయడానికి గుర్తింపుకార్డు తప్పనిసరి కాదు. కాబట్టి అందరూ తీసుకోలేదని మత్స్యకారుల వాదన. దీనిని మూర్ఖంగా కొట్టిపారేయడం ఎందుకు? నిజానిజాలు తేల్చే సహేతుకమైన మార్గాలు లేవా? 'అంత్యోదయ' వంటి పథకాల కోసం గ్రామాలలోని అతి పేద కుటుంబాలను గుర్తించవలసి వచ్చినప్పుడు గ్రామ

సభ నిర్వహించి గ్రామస్తులందరినీ కూర్చోబెట్టి బహిరంగంగా వాకబు చేయటం సత్ఫలితాన్ని ఇచ్చిందని అధికారులే అంటున్నారు. మత్స్యకారులు ఎవరు అన్న నిర్ణయం కూడా గ్రామసభను నిర్వహించి బహిరంగంగా వాకబు చేయడం ద్వారా జరిపి ఉండవచ్చును కదా?

మొదట్లో 'అప్పికొండకు పోయి అక్కడ పడవలు పెట్టుకొని చేపలు పట్టుకోండి' అని ఆదేశించిన ప్రభుత్వం ఆ తరువాత దిగివచ్చింది. ప్రత్యామ్నాయ స్థలంలో జెట్టీ నిర్మించి ఇస్తానంది. అప్పికొండ సంవత్సరంలో తొమ్మిది నెలలు మాత్రమే చేపల వేటకు అనుకూలంగా ఉంటుందని మత్స్యకారులు అభ్యంతరం తెలుపగా యారాడ దగ్గర జెట్టీ కడతానంటున్నది. అది కూడా అంత అనుకూలం కాదనీ, పోర్టుకు మరింత దగ్గరగా మరొక ప్రత్యామ్నాయ స్థలం ఉందనీ మత్స్యకారులు అంటున్నారు. చేపల వేట గురించి వారికంటె తెలిసినవారు లేరు కాబట్టి ఈ ప్రత్యామ్నాయాలన్నీ వారితో చర్చించడానికి అభ్యంతరం ఎందుకుండాలి? అన్నిటికంటే ముఖ్యమైనది పునరావాసం. దిబ్బపాలెం వారికి మాత్రం గాజువాక దగ్గర కాలనీ ప్రతిపాదిస్తున్నారు. మిగిలిన గ్రామాల వాళ్ళను బాధితులుగా గుర్తించినా కూడా పునరావాస కాలనీ ప్రస్తావన లేదు.

దిబ్బపాలెంవారు సహితం గాజువాకలో ఉంటూ యారాడ దగ్గర పడవలు పెట్టుకొని చేపల వేట చేసుకోలేరు. చేపల వేట సెక్రటేరియట్‌లో ఉద్యోగం కాదు పదింటికి పోయి అయిదింటికి ఇంటికి వచ్చేయడానికి. వాతావరణాన్ని బట్టి సముద్రంలో ఆటుపోట్లను బట్టి వేటకు పోతారు, తిరిగి వస్తారు. తీరం వెంబడే వలలు ఆరేసుకుంటారు. పడవలు బాగుచేసుకుంటారు. రేవు దగ్గర ఊరు లేనిదే మత్స్యకారుల జీవనం సాధ్యం కాదు. యారాడ దగ్గర జెట్టీ కట్టి ఒక ఊరివారికి ఎక్కడో కాలనీ కట్టిచ్చి తక్కినవారికి పునరావాసం చూపించకుండా చేతులు దులిపేసుకుంటే ప్రభుత్వం బాధ్యత తీరిపోదు.

ఈ కారణాలుగా మత్స్యకారులు ఇంకా అసంతృప్తితో ఉండగానే ప్రమోటర్ల ఒత్తిడి వల్ల కాబోలు బలవంతంగా వాళ్ళ పడవలు తొలగించే ప్రయత్నం అధికారులు మొదలు పెట్టారు. ప్రతిఘటన వస్తుందనీ అల్లరి జరుగుతుందనీ వారికి తెలుసు. అయితేనేం? ఒకరిని చంపారు, ప్రజలందరినీ భయకంపితులను చేశారు, పడవల్ని

బలవంతంగా తొలగించారు. ఆ తర్వాతైనా నష్టపరిహారం, పునరావాసం విషయాలు పరిష్కారమయ్యే దాకా ఆగారా? ఊహు. పోర్టు నిర్మాణ పనుల్ని కొనసాగిస్తూనే ఉన్నారు. పైకి ఏమన్నా 'విజయం' సాధించినందుకు హైదరాబాద్‌లోని పాలకులు ఆ అధికారుల్ని మెచ్చుకునే ఉంటారు.

ఒకటే అనుమానం. నాలుగూళ్ళ ప్రతిఘటనకే ఇంత బీభత్సం చేశారే – రేపు పోలవరంలో ఏం చేయబోతారో?

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**1 ఏప్రిల్ 2006**

# ‘సెజ్’లపై అర్థంలేని సిఫారసులు

ప్రత్యేక ఆర్థిక మండలుల (ఎస్.ఇ.జడ్) విధానాన్ని పునఃపరిశీలించమని కేంద్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం రెండు ప్రతిపాదనలు చేసినట్టు పత్రికలు రాశాయి. ఒకటి, ప్రత్యేక ఆర్థిక మండలుల విస్తీర్ణం 5000 హెక్టార్లు మించకూడదని. రెండు, భూసేకరణను కంపెనీలే చేసుకోవాలి తప్ప ప్రభుత్వం చేపట్టకూడదని.

తెలిసి మాట్లాడుతారో, తెలియక మాట్లాడుతారో, తమ అజ్ఞానాన్ని ప్రదర్శించు కుంటారో, ప్రజలను అజ్ఞానులుగా భావిస్తారో తెలియదు గానీ ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలలో వ్యతిరేకత ఉందని అర్థమయినప్పుడల్లా అధికారికంగానే ఈ రకమైన అవాకులు చెవాకులు వినిపిస్తుంటాయి. ప్రత్యేక ఆర్థిక మండలుల పట్ల వ్యతిరేకత మహారాష్ట్రలో మొదట వినిపించింది. బెంగాల్‌లో తీవ్రరూపం తీసుకుంది. ఒక పక్క ఈ నిరసన ధ్వనులు వినిపిస్తుండగానే వేరొక పక్క అధికారికంగానే హెచ్చరిక ధ్వనులు వినిపించసాగాయి. మొదట అన్నిటా అంతిమ నిర్ణేత అయిన సోనియా గాంధీ నోటి నుండి కొన్ని ఆణిముత్యాలు రాలాయి. రెండు పంటల భూములు, సారవంతమైన భూములు తీసుకోవద్దని వారి ఉవాచ. కానీ ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం ‘అవిచ్ఛిన్నమైన భూభాగం’ కావాలంటుంది. ప్రత్యేక ఆర్థిక మండలి అనేది ఒక పారిశ్రామిక లేక వర్తక టౌన్‌షిప్ కాబట్టి అది అనివార్యం. కాని 10 వేలు లేక 15 వేల ఎకరాల అవిచ్ఛిన్నమైన సారహీనమైన భూములు థార్ ఎడారి వెలుపల ఎక్కడ దొరుకుతాయి? దేవరకొండ, పెనుగొండ తాలూకాలలో సహితం దొరుకుతాయా? అంతేకాక, ప్రత్యేక ఆర్థిక మండలిని ఏర్పాటు చేసేది ఉబుసుపోక కాదు, ఎగుమతి వ్యాపారాన్ని పెద్దెత్తున చేపట్టడానికి. దగ్గరలో ఓడరేవు, నాలుగులైన్ల రహదారి,

కరెంటుతో నడిచే రెండు లైన్ల రైలు మార్గం వంటి వేగవంతమైన రవాణా సౌకర్యాలు లేని చోట అది నెలకొల్పడం జరగదు. అవిచ్ఛిన్నమైన సారహీనమైన నేలలున్న చోట అటువంటి రవాణా వ్యవస్థ ఉండదు. ఎక్కడా లేదు. కాబట్టి సోనియా గాంధీ గారి చిట్కాను అమలు చేయాలంటే మట్టిరాళ్ళు తప్ప ఏమీలేని ప్రాంతాలలో కిలోమీటరుకు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అత్యాధునిక రవాణా వ్యవస్థను మొదట ఏర్పాటు చేయాలి. ఆ తరువాత అక్కడ ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేయాలి. అసలే ప్రత్యేక ఆర్థిక మండలులకు ఇచ్చే అసంఖ్యాకమైన రాయితీల వల్ల తడిసి మోపెడు ఖర్చవుతుంటే అదనంగా ఈ ఖర్చు కూడా పెట్టుకొని ఏం సాధించాలి?

అయినా, సారవంతమైన భూములుండే రైతుల పట్ల సానుభూతి ఉంటే చాలా? సారహీనమైన భూములుండే వారు రైతులు కారా? పైగా వారు ఎక్కువగా సామాజికంగా బలహీన వర్గాలకు చెందినవారయి ఉంటారనేది కూడా వాస్తవం కాదా? ఈ సూచన వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతినకూడదన్న ఆందోళన నుండి పుట్టినదే తప్ప రైతుల క్షేమాన్ని ఎంచి కాదు.

ఇప్పుడు మరికొన్ని ఆణిముత్యాలు మంత్రివర్గ ఉపసంఘం నోటి నుండి రాలాయి. ఎస్.ఇ.జడ్ విస్తీర్ణం 5000 హెక్టార్లు మించి ఉండకూడదట. 5000 హెక్టార్లంటే 12500 ఎకరాలు. అంటే రెండు, లేక మూడు పెద్ద గ్రామాల మొత్తం భూభాగం కాగలదు. చిన్న గ్రామాలయితే పది దాకా ఖాళీ కాగలవు. ఇది ప్రజలలో వస్తున్న నిరసనకు ఏ విధంగా సమాధానం కాగలదు? ఎక్కువ గ్రామాల ప్రజలైతే నిరసనను ఎదుర్కోవడం కష్టం కాబట్టి విస్థాపితం అయ్యే గ్రామాల సంఖ్యను తగ్గించడం మేలన్నదా ఈ ప్రతిపాదన వెనకున్న ఆలోచన? అభివృద్ధి కోసమని చెప్పి ఊర్లు ఖాళీ చేయించడం ఏ విధంగా సబబన్న అభ్యంతరానికి ఇదేం జవాబు?

అన్నిటినీ మించిన ఆణిముత్యం భూసేకరణను ప్రభుత్వం చేయకూడదనీ, ఎస్.ఇ.జడ్‌లో వెలిసే కంపెనీలే చేసుకోవాలనేది. ఇది చట్టపరంగానూ సాధ్యం కాదు, ఆచరణ పరంగానూ సాధ్యం కాదు. బలవంతంగా ఒకరి భూములు సేకరించే అధికారం ప్రభుత్వానికి తప్ప వేరే ఎవ్వరికీ లేదు. నష్టపరిహారం ఇచ్చినంత మాత్రాన అది బలవంతపు భూసేకరణ కాక మానదు. ఎందుకంటే భూమిని కోల్పోయే రైతు నష్టపరిహారం ఎక్కువిమ్మని అడగవచ్చు, అందుకోసం కోర్టుకు పోవచ్చును...కానీ భూసేకరణ చట్టం పరిధిలోకి వచ్చే ప్రభుత్వ డిమాండ్‌ను కాదనడానికి మాత్రం

లేదు. ప్రైవేట్ వ్యక్తులకు గానీ కంపెనీలకు గానీ అటువంటి అధికారం లేదు. స్వచ్ఛందంగా అమ్మితే కొనుక్కోవలసిందే తప్ప అమ్మి తీరవలసిందేనని బలవంతం చేయడానికి వీలు లేదు.

ఈ కారణంగానే భూసేకరణ చట్టాన్ని 1984లో సవరించి కంపెనీల అవసరాల కోసం కూడా ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేయవచ్చునన్నారు. అంతకు ముందు 'ప్రజావసరం' కోసం మాత్రమే ఆ చట్టం కింద భూసేకరణ చేయడం సాధ్యమయ్యేది. అయితే ఫ్యాక్టరీలు నెలకొల్పదలచుకున్న కంపెనీలు తమకు అవసరం అయ్యే 100, 200 ఎకరాల భూమిని రైతుల నుండి కొనుక్కోవాలంటే వారు స్వచ్ఛందంగా అమ్మడానికి ఇష్టపడనప్పుడు - లేదా కంపెనీకి రాబోయే లాభాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ ధర అడిగినప్పుడు అది అసాధ్యం కావడాన్ని దృష్టిలో ఉంచుకొని 'అభివృద్ధి' ప్రయోజనాల దృష్ట్యా అవసరం అని భావించి కంపెనీల కోసం కూడా ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేపట్టవచ్చునని చట్టాన్ని సవరించారు.

ఇప్పుడు ప్రత్యేక ఆర్థిక మండలులకు అవసరమైన భూమిని ఆ కంపెనీలే కొనుక్కోవాలనడంలో అర్థం ఆ సవరణ అనవసరమనా? 100, 200 ఎకరాల కొనుగోలే కష్టసాధ్యంగా ఉంటే ఒకే చోట 10,000 ఎకరాలకు పైబడిన భూమిని స్వచ్ఛందంగా రైతులు అమ్మేస్తారనీ, కంపెనీలు కొనుక్కోగలరనీ భావిస్తున్నారా? నిజానికి అప్పటికీ ఇప్పటికీ ప్రజలు తెలివి మీరారు. అనేక రాయితీలు పొంది దండిగా లాభార్జన చేయబోయే ప్రత్యేక ఆర్థిక మండలుల నుండి దానికి తగ్గట్టు రేటు డిమాండ్ చేయబోతారు. వాటికి ఒప్పుకొని ప్రత్యేక ఆర్థిక మండలులలో కంపెనీలు పెట్టుబడులు పెట్టబోతాయని మన పాలకులు అనుకుంటున్నారా?

కాగా, ప్రత్యేక ఆర్థిక మండలిని రూపొందించే దశలో ఒక 'కంపెనీ' అనేదేదీ ఉండనక్కరలేదు, ఉండబోదు. అక్కడ ఏ కంపెనీలు పెట్టుబడులు పెట్టబోతాయనేది ఈ దశలో నిర్ణయం కానక్కరలేదు. ఈ దశలో కేవలం ఒక ప్రమోటర్ ఉంటాడు. అతనిని ప్రత్యేక ఆర్థిక మండలుల చట్టం 'డెవెలపర్' అంటుంది. భూసేకరణ ప్రభుత్వం చేయగా దానికి ఇచ్చే పైసలు అతను పెట్టుకుంటాడు. ఆ తరువాత మరిన్ని పెట్టుబడులు పెట్టి ఆ భూభాగాన్ని 'అభివృద్ధి' చేసి అక్కడ పెట్టుబడులు పెట్టగల కంపెనీలను ఆహ్వానిస్తాడు. తన ఖర్చు, తన లాభం కూడా వారి నుండి వసూలు చేసుకుంటాడు. వారికి అప్పగించగా మిగిలిన భూమిని వేరే వాళ్ళకు లీజుకు ఇచ్చుకుంటాడు. వేల

ఎకరాల భూములలో సంస్థలు నెలకొల్పబోయే కంపెనీలన్నీ ఒకేసారి నిర్ణయం తీసుకొని వచ్చి, ఒకేసారి రైతులతో మాట్లాడుకొని భూములు కొనుక్కొంటారని ఎవరైనా అనుకుంటే వారికి ప్రత్యేక ఆర్థిక మండలుల గురించి ప్రాథమిక అవగాహన సహితం లేదనుకోవాలి.

ఈ డెవెలపర్ లేక ప్రమోటర్‌ది జూదం లాంటి వ్యాపారం కాబట్టి – ఏ కంపెనీలు వస్తాయో, ఎంత ఇవ్వడానికి సిద్ధపడతాయో అతనికి తెలియదు కాబట్టి – అతను 10, 12 వేల ఎకరాల భూమిని రైతులు కోరినన్ని పైసలిచ్చి కొనుక్కోవడం కల్ల కాబట్టి మంత్రివర్గ ఉపసంఘం సూచనకు అసలే అర్థం లేదు.

ఈ డెవెలపర్ లేక ప్రమోటర్ అనేవాడు ఒక కంపెనీ కాకపోవచ్చు కాబట్టి 'కంపెనీ' కోసం ప్రభుత్వం భూసేకరణ చేయవచ్చునన్న అధికారం ప్రత్యేక ఆర్థిక మండలుల భూసేకరణకు ఉపయోగపడదని ఉపసంఘం గుర్తించిందంట. చాలా సంతోషం. ఆలస్యంగానైనా ఈ వాస్తవాన్ని గుర్తించారు. అంటే ఇప్పటిదాకా దేశంలోని భిన్న ప్రాంతాలలో ప్రత్యేక ఆర్థిక మండలుల కోసం జరిగిన భూసేకరణ చట్టరీత్యా చెల్లదని గ్రహించారు. అయితే ఇది పరిష్కారం లేని సమస్య అని గుర్తించవలసింది పోయి భూసేకరణ కంపెనీలే చేసుకోవాలని సూచించడంలో అర్థమేమయినా ఉందా? ప్రత్యేక ఆర్థిక మండలుల ఆలోచననే విడిచిపెట్టాలన్న సూచన చేసి ఉంటే వారు గుర్తించిన వాస్తవానికి తర్కబద్ధమైన పర్యవసానాన్ని సూచించినట్టు ఉండేది.

అయినా ఏమీ జరగబోదని మనకు తెలుసును. డెవలపర్ అనేవాడు కంపెనీ కాదు కాబట్టి ఎస్.ఇ.జడ్‌ల భూసేకరణ చెల్లదని ఎవరో ఒకరు కోర్టుకు పోబోతారు. డెవలపర్ చివరికి ఆ భూమిని ఒక కంపెనీకే అమ్మబోతాడు కాబట్టి అంతిమ పరిశీలనలో కంపెనీ కోసం భూసేకరణ చేసినట్టేనని ప్రభుత్వం వాదించబోతుంది. కోర్టులు అంగీకరించ బోతాయి. అంగీకరించకపోతే భూసేకరణ చట్టాన్ని సవరించి కంపెనీల సరసన 'ప్రత్యేక ఆర్థిక మండలుల'ను కూడా చేర్చి, ఈ సవరణ 2005 నుండి ఉనికిలోకి వస్తుంది అనబోతారు.

ఈ లోపల మాత్రం ఇటువంటి మాయ మాటలు వింటుంటాం.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**8 ఏప్రిల్ 2007**

# రాచకొండ విస్థాపన ఫైరింగ్ రేంజ్ దగ్గరే ఆగుతుందా?

నల్గొండ – రంగారెడ్డి జిల్లాలలో 30 వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణం గల భూ భాగంలో భారత సైన్యానికి రైఫిల్ ఫైరింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేయబోతారన్న ప్రతిపాదన చాలాకాలంగా చర్చలో ఉంది. అడపాదడపా సర్వేలు, జీపులు వేసుకొని అధికారులు హడావుడిగా వచ్చిపోవడం జరుగుతుంటుంది. ఎందుకు వస్తున్నారో ఏం చేయబోతారో వాళ్ళు ప్రజలకు చెప్పరు. చెప్పాలన్న పట్టింపు లేదు, చెప్పే అలవాటు లేదు. వాళ్ళ హడావుడి కొంచెం ఎక్కువైనప్పుడల్లా ప్రజలు గాభరా పడడం, ఆందోళన వ్యక్తం చేయడం, స్థానికంగా బలం ఉన్న సిపిఐ వారు నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంటుంది. ఈ ఆందోళనకు జవాబుగా ఎవరూ ఏమీ చెప్పరు. ఆందోళన అనవసరమనరు, అసలేమీ జరగబోదనరు, జరగబోయేదేమిటో చెప్పరు.

ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌ను ఉద్దేశించింది కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సైనిక బలగాల అవసరం కోసమే అయినా, భూసేకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే తప్ప కేంద్ర ప్రభుత్వానికి లేదు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వానికి విషయం తెలియకుండా పోయే అవకాశం లేదు.

ఈ ప్రాంతాన్ని రాచకొండ ప్రాంతం అంటారు. నిజానికి రాచకొండ అనేది ఒక ఊరు. దాని కేంద్రంగా ఒకనాడు అక్కడ ఒక రాజ్యం ఉండేది. రాజ్యం

నెలకొల్పడానికి వేరే కారణాలు ఎన్ని ఉన్నా ఇది శత్రు దుర్భేద్యమైన ఇలాఖా అనేది చూడగానే తోస్తుంది.

ఈ ప్రాంతం విశిష్టమైన నైసర్గిక స్వరూపం గల భూభాగం. నల్గొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోనూ, రంగారెడ్డి జిల్లా ఇబ్రాహీంపట్నం మండలంలోనూ పరచుకొని ఉంది. గుట్టలు, ఎగుడు దిగుడు నేలలు, చిట్టడవి ఉన్న ఈ ప్రాంతం లంబాడా తండాల మయం. 40 దాకా తండాలుంటాయి. వేరే శ్రామిక కులాలవారూ కొందరున్నప్పటికీ లంబాడా గిరిజనులదే ఎక్కువ జనాభా. ఇబ్రహీంపట్నం నుండైనా, నారాయణపురం నుండైనా ఇక్కడికి ప్రవేశించగానే ఒక ప్రత్యేకమైన ప్రాంతంలోకి ప్రవేశించిన అనుభూతి కలుగుతుంది. రాష్ట్ర రాజధానికి కేవలం 60–70 కిలోమీటర్ల దూరాన ఉన్నామనిపించదు. ఎక్కడో నాగరికత అంచుకు వెళ్ళిపోయినట్లు అనిపిస్తుంది.

కృష్ణానది బేసిన్‌లోని రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రాంతమంతటిలాగా ఇది కూడా తీవ్ర వర్షాభావ ప్రాంతమే. అయితే నేల ఎగుడు దిగుడు గుట్టలమయంగా ఉండడం వల్ల పల్లపు ప్రాంతాలలో కుంటలు ఉండడమే కాక భూగర్భ జలాలు కృష్ణా బేసిన్‌లోని ఇతర ప్రాంతాల కంటే మెరుగుగా ఉన్నాయి. దానిని ఆసరా చేసుకొని రాళ్ళు, బండల మధ్య వరి మళ్ళు చేసి పచ్చటి పంటలు పండించిన ఘనత తండావాసులదే. వేరే ఎవరూ ఇంత సాహసం చేసి ఉండేవారు కాదు. ఈ కష్టం వేరే ఎవరివల్ల అయి ఉండేదీ కాదు. ఎవరికి లంచాలివ్వాలో వారికంతా ఇచ్చి, ఎంత ఖర్చుపెట్టుకోవాలో అంతా పెట్టుకుని ఆపైన కరెంటు దొంగతనానికి కూడా వెరవక దాదాపు అన్ని తండాలలోనూ కరెంటు బోర్లు వేసుకున్నారు. ఒకటీ రెండూ కాదు 50 బోర్ల దాకా ఉన్నాయి ఒక్కొక్క తండాలో. 175 ఇళ్ళున్న కపిలవాయి తండాలో 60 బోర్లున్నాయి! బోర్ల కింద వరి పండించడంతో పాటు వర్షాధార భూములలో ఆముదాలు, జొన్నలు, సజ్జలు పండిస్తారు. పట్టాభూములు ఎంత ఉన్నాయో దానిలో సగం దాకా అసైన్‌మెంట్ (లావోణిపట్టా) భూములున్నాయి. అవన్నీ వర్షాధారాలే.

ఈ రెండింటి కంటే ఎక్కువగా అడవి భూములున్నాయి. ఆ అడవి పెద్ద జీవనాధారం తండావాసులకు. వంట చెరుకు సేకరించి బయటి గ్రామాలలో అమ్ముకొని బతికేవాళ్ళు చాలామంది ఉన్నారు. ఇది కూడా చాలా కష్టంతో కూడుకున్న పనే.

రోజంతా కష్టం చేస్తే 20 రూపాయలు మిగులుతాయని రాచకొండ తండా వాసులంటారు. ఇది కాక కుంకుడుకాయ నుంచి తేనె దాకా ఎంతో కొంత విలువైన చిన్నతరహా అటవీ ఉత్పత్తులూ ఉన్నాయక్కడ.

ప్రభుత్వం చేసిన ఒకే మేలు అనేక గ్రామాలలో వనసంరక్షణ సమితులను ఏర్పాటు చేయడం. నిజానికి సారవంతమైన గోదావరి లోయ, తూర్పు కనుమకొండలలో ఆదివాసుల నుంచి రిజర్వ్ ఫారెస్టును కాపాడడానికి వనసంరక్షణ సమితులను ఒక సాధనంగా ప్రయోగిస్తున్నారు గానీ వాటివల్ల నిజంగా ప్రజలకు మేలు జరిగేది తెలంగాణ, రాయలసీమ జిల్లాలలోని వర్షాభావ ప్రాంతాలలో ఉన్న చిట్టడవులలోనే. రాచకొండ ప్రాంతంలో వనసంరక్షణ సమితులు కానుగ, జామాయిల్, సీతాఫలాలు పెంచి వందల కుటుంబాలకు జీవనం ఇస్తున్నాయి.

రాళ్ళు, గుట్టల నేలల నుంచి జీవనాన్ని పిండిన లంబాడా గిరిజనుల శ్రమను 'అభివృద్ధి'గా చూడగల దృక్పథం మన పాలకుల వద్ద లేదు. గుట్టలమయమైన రాచకొండ ప్రాంతం రైఫిల్ షూటింగ్ ట్రైనింగ్‌కు బాగా పనికొస్తుందన్నదొకటే వారికి తోచింది. 1993 నుంచి దీని కోసం సర్వేలు జరుపుతున్నారు. అప్పట్లో నల్గొండ జిల్లాలో 21,838 ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 9,243 ఎకరాలు దీనికి కేటాయించబడతాయన్నారు. ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం నల్గొండ జిల్లాలో 18,471 ఎకరాలు సేకరించబోతారట. రంగారెడ్డి జిల్లా సంగతి తెలీదు. నల్గొండలో సేకరించబోయేదంతా సంస్థాన్ నారాయణపురం మండలం భూమే. గ్రామాల వారీగా ఆ వివరాలు.

| గ్రామం పేరు | సేకరించే భూమి (ఎకరాలలో) | తరి పొలం | మెట్ట భూమి | లావోణి పట్టా భూమి | బంజరు | అడవి |
|---|---|---|---|---|---|---|
| జనగామ | 897.25 | - | 254.07 | - | 403.18 | 240.00 |
| నారాయణపూర్ | 2,331.35 | 8.00 | 810.11 | 1,513.24 | - | 1,202.36 |
| మహమ్మదాబాద్ | 501.08 | - | 361.36 | 10.00 | 2.35 | 126.27 |
| రాచకొండ | 13,864.37 | 22.36 | 1,371.08 | - | - | 11,460.32 |
| ఓయిలపల్లి | 546.09 | 2.01 | 543.08 | - | - | - |
| చిల్లాపూర్ | 330.00 | - | 203.30 | - | 126.10 | - |
| **మొత్తం** | **18,471.34** | **33.09** | **3,544.20** | **1,523.24** | **533.00** | **13,030.15** |
| (నారాయణపూర్ మండలం) | | | | | | |

ఈ పట్టికను అర్థంచేసుకునేటప్పుడు ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. 'తరి పొలం'గా ప్రభుత్వం గుర్తించేది చెరువులు, కుంటల కింది భూమినే. బోర్ల కింద ఉన్నది మెట్టభూమిగానే నమోదవుతుంది. రెండోది – బంజరు, అడవి అనే భూములలోనూ వ్యవసాయం చేస్తున్న వారు చాలామంది ఉన్నారు. వనసంరక్షణ సమితులూ ఉన్నాయి. కుంకుడుకాయ, తేనె, వంట చెరుకు మొదలైనవి సేకరించి అమ్ముకుంటున్న వారూ చాలా మంది ఉన్నారు. వీరెవ్వరూ భూమి కోల్పోయే రైతుల జాబితాలో ఉండరు. ప్రభుత్వం లెక్కపెట్టే బాధిత రైతులు–పట్టాదారులు, లావోణి పట్టాదారులు–702 మంది మాత్రమే. ఇందులోనూ కచ్చితంగా నష్టపరిహారం దక్కేది పట్టాదారులకే. లావోణి పట్టాదారులకు ఏమిస్తారో, ఎంత ఇస్తారో తెలీదు. పట్టా భూములైనా తిండి పెడతాయి తప్ప భూసేకరణ జరిగినప్పుడు వాటికొచ్చే నష్టపరిహారం అంతంత మాత్రమే. రాచకొండ గుట్టలలో భూముల అమ్మకమూ, కొనుగోలూ జరిగింది తక్కువే. ఎకరా 60 వేలు మించి అమ్ముడు పోయింది లేదు. కాబట్టి పట్టా రైతులతో సహా వేలాది కుటుంబాలు – ప్రధానంగా లంబాడా గిరిజనులు – చేతిలో మహా అయితే చిల్లర పైసలతో వీధిన పడతారు. ఎవ్వరూ చేయని సాహసంతో బండలు పిండి రాచకొండను సస్యశ్యామలం చేసిన వారి శ్రమ సాధించిన అభివృద్ధికి మన్మోహన్‌సింగ్ నిర్వచనంలో అభివృద్ధి అన్న గుర్తింపు లేదు కాబట్టి వాళ్ళకు అంతకంటే అర్హత లేదనుకుంటాను.

అయితే ఫీల్డ్ ఫైరింగ్ రేంజే శాశ్వతం కాకపోవచ్చు. రాచకొండ రాబోయే రోజులలో మన్మోహన్‌సింగ్ నిర్వచించే అభివృద్ధికి కేంద్రం కావచ్చు. టూరిజంలో ఈకో–టూరిజం అనీ అడ్వెంచర్ టూరిజం అనీ లాభసాటి భావనలు వచ్చాయి. హైదరాబాద్ నుంచి మరీ దూరం పోనక్కర లేకుండా, టయోటా కారును నారాయణపురం దగ్గరో, ఇబ్రహీం పట్నం దగ్గరో ఆపి రాళ్ళు, రప్పలు, గుట్టలు, చిట్టడవులు నిండిన విశాల భూభాగంలో కొన్ని గంటలు 'థ్రిల్లింగ్'గా విహరించి సాయంత్రం వెనక్కిపోయి వైస్‌రాయ్ హోటల్ చేరుకోవచ్చు. అప్పుడు కష్టించి వ్యవసాయ అభివృద్ధి సాధించిన లంబాడాలు ఒక సంవత్సరంలో పొందుతున్న ఆదాయం రేపు టూరిజం కంపెనీ వారికి వారంలో రాగలదు. పైగా ఇది నిన్న మొన్నటిదాకా మావోయిస్టుల రాచకొండ దళం యథేచ్ఛగా విహరించిన ప్రాంతం కాబట్టి వారు

బసచేసిన రాళ్ళ మధ్యనే మనం కూడా రెండు నిమిషాలు విశ్రమించి కోకాకోలా తాగిన 'థ్రిల్' కూడా పొందవచ్చు. బహుశా దీనిని విప్లవ టూరిజం అనబోతారేమో. బ్రోచర్‌లో ఇది కూడా చేర్చి రేటు పెంచవచ్చు. రాచకొండకు ఈ వైభవం కలిగే నాటికి ఈనాడక్కడ సేద్యంచేసి బతుకుతున్న వేలాది లంబాడా కుటుంబాలు ఎక్కడుంటాయో, ఎలాగుంటాయో!

మానవహక్కుల వేదిక బులెటిన్-8<br>మే 2007

# శ్రీసిటీ సెజ్ కోసం భూసేకరణ ఆపాలి

రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా వరదయ్యపాలెం, సత్యవేడు మండలాలలో 'స్పెషల్ ఎకనమిక్ జోన్' ఏర్పాటు చేయడం కోసం దాదాపు 12 వేల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని తాపత్రయపడుతున్న సంగతి తెలిసిందే. అందులో మూడింట రెండు వంతులు రైతుల పట్టా భూమికాగా, మిగిలిన ఒక వంతు బంజరు భూమి. అయితే ఆ బంజరు భూమిలో కూడా చాలావరకు భూమిలేని పేదలకు డి-ఫారం (స్థానిక పరిభాషలో డికెటి) పట్టాలు ఇచ్చి ఉన్నారు కాబట్టి దాదాపు మొత్తం 12 వేల ఎకరాలూ వ్యవసాయ భూములే. అక్కడ చాలా చెరువులు, వందల సంఖ్యలో బావులు, బోర్లు ఉన్నాయి. వరిమళ్ళు, మామిడి తోటలు, మల్లె, రోజా మొదలైన పూతోటలు, శెనక్కాయలు, సజ్జలు పండే మెట్ట భూములు ఉన్నాయి. ఈ నీటి వనరులన్నిటినీ పూడ్చి, తోటలన్నిటినీ నరికి, వరిమళ్ళు సాఫుచేసి ఏవో పరిశ్రమలు నెలకొల్పడం కోసం ఒక ప్రత్యేక ఆర్థిక క్షేత్రాన్ని తయారు చేయాలన్న ఆలోచన ఎంతవరకు ఉచితమైనది?

ఈ భూములు 16 గ్రామాలలో పరుచుకొని ఉన్నాయి. జనాభా 25 వేల దాకా ఉంటుంది. పశువులయితే ఒక్కొక్క ఊరిలో 4 వేల సంఖ్యలో ఉన్నాయి. వ్యవసాయ భూములే తప్ప ప్రజల ఆవాసాలు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రభుత్వం అంటున్నప్పటికీ ఇక్కడ ఉంటూ ఎక్కడో పనిచేసుకొని బతకడం అయ్యే పని కాదు. కాబట్టి ఈ ప్రజలంతా ఏదో ఒక రోజు 'స్వచ్ఛందంగా' ఇళ్ళు ఖాళీ చేసి పశువులను మాంసం పరిశ్రమకు అమ్మి వెళ్ళిపోవలసి ఉంటుంది.

## ఇదంతా దేనికోసం?

స్పెషల్ ఎకనమిక్ జోన్ అంటే ప్రత్యేక ఆర్థిక క్షేత్రం అని అర్థం. మామూలుగా ఒకరు ఒక ఫ్యాక్టరీ నెలకొల్పాలంటే భూమి కొనుక్కొని, కరెంటు కనెక్షన్ కోసం, నీటి సరఫరా కోసం, రోడ్ల కోసం వివిధ ప్రభుత్వ శాఖలకు అర్జీలు పెట్టుకొని సాధించుకోవాలి. వారికి ఆ బెడద లేకుండా ప్రభుత్వమే ఒక విశాల భూభాగం నుండి ప్రజలను తరిమేసి, రోడ్లు వేసి, కరెంటు వ్యవస్థ, నీటి వ్యవస్థ ఏర్పాటు చేసి, అక్కడ సంస్థలు ఏర్పాటు చేసే వారికి రకరకాల పన్ను రాయితీలు, కార్మిక చట్టాల నుండి మినహాయింపు ఇచ్చే ఏర్పాటును స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఎస్.ఇ.జడ్.) అంటారు. మామూలుగా అయితే ప్రభుత్వం దానిని తన చేతిలోనే ఉంచుకొని అక్కడ సంస్థలు ఏర్పాటు చేయడానికి రమ్మని ప్రైవేటు కంపెనీలకు ఆహ్వానం పలుకుతుంది. ఇక్కడ ఆ బరువు కూడా ప్రభుత్వం దించేసుకుంది. శ్రీసిటీ (ప్రై) లిమిటెడ్ అనే సంస్థకు ఈ ఎస్.ఇ.జడ్. క్షేత్రాన్ని అప్పగించి దానిని కంపెనీలతో నింపే బాధ్యతను వారిపైన పెట్టింది. మరి అక్కడ ఏ రకమైన పరిశ్రమలు రాబోతాయి? శ్రీసిటీ వారికి తెలుసునో తెలియదోగానీ ప్రభుత్వానికి మాత్రం తెలియదు. ప్రజలకు తెలియజెప్పలేదు. అవి గ్రామీణులకు పని కల్పించే పరిశ్రమలా లేక భారీగా పెట్టుబడులు పెట్టి పదిమంది విద్యావంతులకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చే సంస్థలా? అదీ తెలీదు. వాటివల్ల వాతావరణ కాలుష్యం ఎంత ఉంటుంది? పోయినవాళ్ళు పోగా మిగిలినవారి బతుకుల మీద ఈ ఎస్.ఇ.జడ్. ప్రభావం ఏ విధంగా ఉండబోతోంది? అది సహితం తెలీదు. అసలు నిజంగా 'అభివృద్ధి' అనేది వస్తుందా లేక క్షేత్రం యావత్తు చెన్నై రహదారికి దగ్గరగా ఉంది కాబట్టి నాలుగు పెద్ద హోటళ్ళు, రెండు ధాబాలు మాత్రమే వెలుస్తాయా? ఏమో తెలీదు.

ఏమీ తెలియకుండా 25 వేల ప్రజానీకం తమ జీవన వనరులన్నీ శ్రీసిటీ వారికి అప్పగించి ఎందుకు వెళ్ళిపోవాలి? అభివృద్ధి కోసం ప్రజలు త్యాగం చేయాలి అంటున్నారు. అది ఎట్లాంటి అభివృద్ధో తెలియకుండా కూడా త్యాగం చేయాలా? ఆ అభివృద్ధి స్వభావం ఏమిటో, దానివల్ల ఎవరికి ఏమి ఒరుగుతుందో స్పష్టంగా సూచించి, దానికోసం భూములు అప్పగించే ప్రజలకు వచ్చే నష్టమెంతో కూడా అంచనా వేసి, ఆ అభివృద్ధి మేలో, ఇప్పుడుండే బతుకులే మేలో నిర్ణయించడం సబబు కాదా? ఆ నిర్ణయం చేయడంలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం సబబు కాదా?

కాదన్నట్టు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. అబద్ధాలు చెప్పి, తప్పుడు ఆశలు కల్పించి, కొంతమందిని తన వ్యూహానికి అనుకూలంగా మలచుకొని, మిగిలినవారికి వారిని చూపించి లోబరుచుకొని, చివరికి ఆలస్యం చేస్తే ఏమీ ఇవ్వకుండా భూములు తీసుకుపోతాం అని బెదిరించి భూములు స్వాధీనం చేసుకునే ఆలోచనతో ఉంది ప్రభుత్వం.

వ్యవసాయంలో భద్రత లేదు కాబట్టి ఉద్యోగం సంపాదించుకోవాలన్న ఆశ వ్యవసాయ కుటుంబాల యువకులకు ఉంటుంది. దానిని ప్రభుత్వం మోసపూరితంగా వాడుకుంటున్నది. భూమిని కోల్పోయిన ప్రతీ కుటుంబంలోనూ ఒకరికి ఎస్.ఇ.జడ్.లో ఉద్యోగం ఇస్తామన్న హామీ అధికారులు ఇస్తున్నారు. అక్కడ ఏ కంపెనీలు రాబోతాయో కూడా తెలియనివారు ఉద్యోగాల హామీ ఎట్లా ఇయ్యగలరు? బట్టల మిల్లులో, చెప్పుల కర్మాగారాలో నెలకొల్పితే అందరికీ కాకున్నా కొందరికి ఉద్యోగాలు దొరకవచ్చునేమో. కానీ ఐ.టి. కంపెనీలు వస్తే? అయినా వచ్చేవన్నీ ప్రైవేటు కంపెనీలయినప్పుడు, బహుశా విదేశీ పెట్టుబడులతో కూడిన కంపెనీలయినప్పుడు స్థానికులకు ఉద్యోగాలు వస్తాయన్న హామీ రాష్ట్ర ప్రభుత్వం ఎట్లా ఇవ్వగలదు? ప్రైవేట్ కంపెనీలకు అటువంటి ఆదేశం జారీ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందా? అసలు గతంలో ప్రభుత్వరంగ సంస్థల కోసం భూములు స్వాధీనం చేసుకున్న చోటయినా ఉద్యోగాలిస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందా? విశాఖపట్నం ఉక్కు కర్మాగారం కోసం, రామగుండం సూపర్ థర్మల్ కేంద్రం కోసం భూములు ఇదే హామీ కారణంగా అప్పగించిన రైతు కుటుంబాల యువకులు 30 సంవత్సరాలుగా ఆ హామీ అమలు కోసం కోర్టుల చుట్టూ తిరుగుతుండడం వాస్తవం కాదేమో ప్రభుత్వాన్ని చెప్పమనండి!

సేకరించబోయే భూమిలో దాదాపు మూడవ వంతు డికెటి పట్టా భూములు కావడంతో డికెటి పట్టాదారులకు కూడా స్వంత పట్టా ఉన్న రైతులతో సమానంగా భూములకు నష్టపరిహారం ఇస్తామన్న హామీ ప్రభుత్వం ఇస్తున్నది. రాష్ట్రంలో ఎక్కడయినా అట్లా ఇచ్చారేమో ప్రభుత్వాన్ని అడగండి! స్వంత పట్టా అయినా, డికెటి పట్టా అయినా భూసేకరణ చేసినప్పుడు నష్టపరిహారం ఇవ్వాలని మన రాష్ట్ర హైకోర్టు ఏడుగురు జడ్జీల బెంచి 'ఎల్.ఎ.ఓ, చేవెళ్ళ వర్సస్ మేకల పాండు' కేసులో ఇచ్చిన తీర్పు అన్యాయమంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకొని 'స్టే' తీసుకోలేదా? తీసుకోలేదేమో ప్రభుత్వాన్ని అడగండి! అక్కడ 'స్టే' తీసుకొని ఇక్కడ సమానంగా ఇస్తామంటే మనం నమ్మాలా?

పట్టా ఉన్న రైతులకయినా ప్రభుత్వం ఇవ్వబోయే నష్టపరిహారం ఏ రకమైన పునరావాసం ఇస్తుంది? ఎకరానికి రెండున్నర లక్షలో మూడు లక్షలో ఇస్తారంట. ఇక్కడున్నది ఎక్కువగా రెండు, మూడెకరాల రైతులు. వారికి ఆరేడు లక్షల నష్టపరిహారం వస్తుందేమో గాని అందరికీ అంత మొత్తాదులో అప్పులూ ఉన్నాయి. రైతు వ్యవసాయం చేస్తున్నంత కాలం అప్పులవాళ్ళు మెడమీద కూర్చోకపోవచ్చు గానీ భూమి అప్పగించి పోతున్నాడని తెలిస్తే బాకీ తీర్చేదాకా కదలనివ్వరు. ఇంక చిన్న రైతులకు ఏమి మిగులుతుంది? భూమి లేని కూలీలకు ఎట్లాగూ నష్టపరిహారం రాదు. ఈ రెండు వర్గాలూ కలిపితే నిర్వాసితులు కాబోయే జనాభాలో వారే మెజారిటీ అవుతారు.

శ్రీసిటీ కంపెనీకి, వారి ఆహ్వానం మీద రేపు రాబోయే కంపెనీలకు వచ్చే లాభాన్ని, వారి అభివృద్ధిని 'దేశం అభివృద్ధి'గానో, 'రాష్ట్ర అభివృద్ధి'గానో పిలిచేవారు ఈ వేలాది ప్రజలకు కలిగే నష్టాన్ని 'దేశం నష్టం' గాను, 'రాష్ట్రం నష్టం'గాను భావించి దేశం, లేక రాష్ట్రం దానిని భరించాలని ఎందుకు అడగరు? అటువంటి చట్టం గానీ, విధానం గానీ దేశంలో ఎందుకు లేదని ఎందుకడగరు? ఉన్నవాళ్ళ అభివృద్ధి కోసం లేనివాళ్ళు పూర్తిగా పతనం అయ్యే ప్రగతిని ఎందుకు అంగీకరించాలి?

1970లలో నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ కేంద్రం కోసం భూములు అప్పగించి వలసవచ్చి వరదయ్యపాలెం మండలంలోని తొండూరు సొసైటీ, శ్రీహరికోట కాలనీలలో ఉంటున్న జనాన్ని చూస్తే ప్రభుత్వం ఇచ్చే హామీలు ఎంత బూటకమో అర్థం అవుతుంది. ఒక్కొక్క కుటుంబానికి అయిదెకరాలు ఇస్తామన్నారు. రెండున్నర ఎకరాలే ఇచ్చారు. అది కూడా రాళ్ళు, రప్పలు, పాము పుట్టలు నిండిన బంజరు ఇచ్చారు. దానికి పట్టా ఇవ్వడానికి 20 సంవత్సరాలు, రెండు హైకోర్టు కేసులు అవసరం అయ్యాయి. చివరికి దక్కింది డికెటి పట్టాయే. ఒక్కొక్క కుటుంబంలోనూ ఒక్కొక్కరికి ఉద్యోగం ఇస్తామన్నారు. అందరికీ కలిపి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఎస్.ఇ.జడ్. కోసం ఆ ప్రజలు మళ్ళీ ఊళ్ళు ఖాళీ చేయాలి.

ప్రభుత్వం ఒక భరోసాతో ఉన్నట్టుంది. కొన్ని గ్రామాలలో – ముఖ్యంగా సత్యవేడు మండలంలో 20 నుండి 50 ఎకరాల దాకా భూములున్న అగ్రకులాల భూస్వాములు ఉన్నారు. వాళ్ళకు 50 లక్షల నుండి 1 కోటి రూపాయల దాకా నష్టపరిహారం దక్కుతుంది. కాబట్టి వాళ్ళు భూములు ఇచ్చేసి వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నారు. వాళ్ళే ఆ ఊర్లలో 'పెద్దమనుషులు' కాబట్టి మిగిలిన జనం నోరు నొక్కుకొని

వారి వెంటపోతారని ప్రభుత్వం ఆశిస్తున్నది. చెరివి గ్రామంలో ఇప్పటికే ఇది జరిగింది. ఆ పంచాయితీలో భాగమైన చిగురుపాలెంవాసులు చెరివి గ్రామపెద్దలు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం తమ సమ్మతితో చేసుకున్నది కాదని అంటున్నప్పటికీ ఆ ఊరికి సంబంధించిన ఒప్పందం జరిగిపోయినట్టే ప్రభుత్వం మాట్లాడుతున్నది. ఇటువంటి మోసాలకు లొంగవద్దని పేదలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

నష్టపరిహారం, ఉద్యోగాలు తరువాతి సంగతి. అంతకంటే మౌలికమైన ప్రశ్నే ప్రభుత్వాన్ని అడుగుదాం. ఎప్పుడు వస్తాయో, ఎన్ని వస్తాయో తెలియని కంపెనీల కోసం 12 వేల ఎకరాల సాగుభూమిని, పళ్ళతోటలను, పూతోటలను ఎందుకు ఖాళీ చేయించాలి? మహా అయితే ఒక్కొక్క కంపెనీకి నూరు, ఇన్నూరు ఎకరాల భూమి అవసరం అవుతుందేమో. ఎవరి సాగులోనూ లేని బంజరు ఆ మేరకు దొరకదా? శ్రీకాళహస్తి సమీపంలో అటువంటి బంజరు చాలా ఉందని ఆ ప్రాంత ఎమ్.ఎల్.ఎ. ప్రకటించి ఉన్నాడు. ఒకే చోట ఒక పెద్ద ఎస్టేట్ లాంటిది తయారుచేసి, ముందే రోడ్లూ కరెంటూ నీళ్ళూ ఏర్పాటు చేసి రాబోయే కంపెనీలకు అప్పగించాలన్న ఈ ఆలోచన ఎందుకు? విడివిడిగా బంజరు భూములు, కోర్టు వివాదాలలో ఉన్న 2000 ఎకరాల శ్రోత్రియం భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి. శ్రోత్రియందార్లు కోర్టులో గెలిచినా ఆ భూములకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవచ్చు. వాళ్ళు సంతోషంగానే ఇచ్చేయగలరు. అటవీ భూమి కూడా రెండు మండలాలలోనూ విస్తారంగా ఉంది. వేరేచోట అడవుల పెంపకానికి బంజరు భూమి అప్పగించి ఇక్కడి అటవీ భూమిని తగు మొత్తంలో రేపు రాబోయే ఏదయినా కంపెనీకి కేటాయించవచ్చు. నిజంగా కంపెనీ పెట్టి అభివృద్ధి చేయాలన్న కోరిక ఉన్నవారికి ఒక్కొక్కరికీ ఒక్కొక్క చోట తగు మాత్రం భూమి ఇవ్వడానికి 16 ఊర్లు ఖాళీ చేయించనక్కరలేదు. ఈ ప్రత్యామ్నాయాలన్నీ ఉండగా, పేద రైతులు, కూలీల జీవనాధారం అయిన 12 వేల ఎకరాల సాగు భూములే అభివృద్ధికి కావలసి వచ్చాయా?

ఈ ప్రశ్నలు మనమెందుకు అడగకూడదు? దీనికి జవాబు చెప్పేంతవరకు భూసేకరణ ప్రయత్నాలన్నీ ఆపమని ప్రభుత్వాన్ని ఎందుకు డిమాండ్ చేయకూడదు?

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**సెప్టెంబర్ 2007**

# కృష్ణపట్నం పట్టపోళ్ళ భవిష్యత్ ఏమిటి?

కృష్ణపట్నంలో 'అల్ట్రా మెగా థర్మల్ ప్లాంట్'ను ఇంకా కట్టలేదు. పోర్టు విస్తరణే 16 గ్రామాల పట్టపోళ్ళ (మత్స్యకారుల) బతుకును ప్రశ్నార్థకం చేసింది. పోర్టు విస్తరణ కూడా నిజానికి ఇంకా జరగలేదు. దాని కోసం తీరం మీద జరుగుతున్న లెవెలింగ్ పనులే చేపల వేటను చంపేశాయి. అంతా అయిపోయి 5,600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు థర్మల్ కేంద్రాలొక పక్క , వాటికోసం బొగ్గు దిగుమతి చేసుకోవడానికి ప్రధానంగా ఉద్దేశించిన పోర్టు మరొక పక్క పూర్తిస్థాయిలో వచ్చేస్తే అక్కడ మత్స్యకారులనే వారు ఒక్కరైనా మిగులుతారా?

రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఒకానొక సంకేతంగా కృష్ణపట్నం పత్రికలలో తరచుగా దర్శనం ఇస్తుంటుంది. దాని వెనక ఉన్న చీకటి కథ మాత్రం పత్రికలలో కనిపించదు. ప్రాజెక్టులకు భూములు తీసుకునేటప్పుడు స్వంత భూమి ఉన్న రైతులకు ఎకరానికింత నష్టపరిహారం ఇచ్చి, ఇళ్ళు ఖాళీ చేయవలసి వచ్చేవారికి ఎక్కడో ఒక చోట ఇళ్ళ స్థలం చూపిస్తే సరిపోతుందని ప్రభుత్వం భావిస్తుంది. చట్టం గుర్తించే యాజమాన్య హక్కేదీ లేకుండా ఆ నేల మీద, ఆ ప్రకృతి మీద ఆధారపడి బతికే జనం వాళ్ళ లెక్కలోకే రారు.

కానీ ఈ 'అభివృద్ధి' చాలా ప్రాథమిక దశలో ఉండగానే ప్రభుత్వం దాచిపెట్టిన విషయాలు బయటపడుతున్నాయి. ఈ తీరం వెంబడి ఉన్న గ్రామాలలో నివసిస్తూ సముద్రంలో, కండలేరు నదిలో, బకింగ్‌హాం కాలవలో చేపలు, రొయ్యలు పట్టుకొని

జీవించే జనం వేట దొరకక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పోర్టుకు సంబంధించిన నిర్మాణాలు చేపట్టే చోట నేల లెవెలింగ్ చేయడం కోసం అవసరమైన మట్టిని పోర్టు యాజమాన్యం సముద్రంలో నుండే 'డ్రెడ్జింగ్' చేసి తీసుకొస్తోంది. మట్టి తవ్వుకుంటూ, ఇక్కడి మట్టి అక్కడ పోసుకుంటూ హడావుడిగా తిరిగే 'తవ్వోడల' పుణ్యాన జలజీవాల పునరుత్పత్తి బాగా దెబ్బతినింది.

మొదట రాష్ట్ర ప్రభుత్వం ఇదేమీ తనకు పట్టనట్టు, తన నిర్ణయాలతో దీనికేమీ సంబంధం లేనట్టు నటించింది. ఊరు ఖాళీ చేసి పోవలసి ఉన్న ఆదాలనగర్, మిద్దిరేవు, రామలింగాపురం అనే మూడు మత్స్యకారుల గ్రామాలకు మాత్రం ముత్తుకూరు దగ్గర కాలనీ కట్టిస్తానంది. పోర్ట్‌లో ఉద్యోగాలు ఇస్తామని కూడా అంటున్నారు గానీ అది అబద్ధం అని అందరికీ తెలుసు. నిర్మాణం జరుగుతున్న దశలో మట్టితట్టలు మోసే పని కొందరికి దొరుకుతుంది గానీ ఆ తరువాత మారుమూల గ్రామాల మత్స్యకారులు చేయగల పనేమీ పోర్ట్‌లో దొరకదు.

కానీ ఆ మూడు గ్రామాల వారికేకాక మొత్తం 16 గ్రామాల పట్టపోళ్ళ జీవనం ఇప్పటికే దెబ్బతినింది, ఇంకా పెద్దెత్తున దెబ్బతినబోతోంది. నేలటూరు, కృష్ణపట్నం, ఆదాలనగర్, రామలింగాపురం, ఈపూరు వెంకన్నపాలెం, మిట్టపాలెం, కోనేటి మిట్ట, బీచికాలనీ, మద్దిరేవు, గుమ్మళ్ళ దిబ్బ, లింగవరం, వరగలి, మోమిడి గ్రామాలలో వెయ్యి కుటుంబాలకు పైబడి మత్స్యకారులుంటున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ముందుకొచ్చి డ్రెడ్జింగ్ పనులు నడుస్తున్నంత కాలం ఈ సమస్య ఉంటుందని చెప్పి కొంత నష్టపరిహారం ఇచ్చే ఆలోచన చేస్తున్నదని వింటున్నాం.

తూర్పుగోదావరి జిల్లా తాళ్ళరేవు దగ్గర రిలయెన్స్ కంపెనీవారి సహజవాయువు ప్రాజెక్టు విషయంలోనూ ఇదే జరుగుతున్నది. అక్కడ కూడా ప్రాజెక్టు నిర్మాణాల నిమిత్తం నేలను లెవెల్ చేయడానికి అవసరమైన మట్టిని సముద్రం నుండే డ్రెడ్జర్ల సహాయంతో తవ్వి తీసుకొచ్చారు. కృష్ణపట్నం రేవు కండలేరు సముద్రాన్ని కలిసే చోటికి దగ్గరున్నట్టే, అది గాడేరు సముద్రాన్ని కలిసే చోటికి దగ్గర. అక్కడ కూడా మత్స్యకారులకు వేట బాగా ఉండేది. కానీ 'తవ్వోడల' పుణ్యాన ఇసుక అడ్డదిడ్డంగా మేటవేసి, నీళ్ళు బురదై, జలజీవాల పునరుత్పత్తి దెబ్బతినడం, మత్స్యకారుల పడవల రాకపోకలు కష్టతరం కావడం జరిగింది. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం డ్రెడ్జింగ్

ఎంతకాలం జరగబోతుందో అంత కాలానికి మాత్రం నెలకింత అని లెక్కగట్టి మత్స్యకారులకు నష్టపరిహారం ఇచ్చింది. ఇక్కడ కూడా ఆ విధంగా ఇచ్చే ప్రతిపాదన ఉన్నట్టుంది.

కానీ రేవు నిర్మాణం పూర్తయి డ్రెడ్జర్లన్నీ వెళ్ళిపోయిన తరువాత కూడా సమస్య ఉంటుంది. ఉండడమే కాదు, అప్పుడే అసలు సమస్య మొదలవుతుంది. అందుకే ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి నాలుగు కాసులు చేతిలో పెట్టిందని మురిసిపోవద్దని మత్స్యకారులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

మన రాష్ట్రంలో ఎక్కడా ఇప్పటిదాకా 1000 మెగావాట్ల సామర్థ్యాన్ని మించిన థర్మల్ కేంద్రాలు లేవు. కృష్ణపట్నంలో ఒకటి 4,000 మెగావాట్లు, మరొకటి 1,600 మెగావాట్లు, మొత్తం 5,600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు థర్మల్ కేంద్రాలు రాబోతున్నాయి. వీటి కోసం రోజుకు 5.84 లక్షల ఘనపు మీటర్ల నీళ్ళు సముద్రం నుండి తీసుకుంటారు. ఈ నీళ్ళు తిరిగి సముద్రంలోకే పోతాయి గానీ ఇంత పెద్దెత్తున ప్రతిరోజూ సాగర మథనం జరుగుతుండగా మత్స్యకారులు పడవలేసుకుని చేపల వేటకు పోయి వస్తుంటారనుకుంటే భ్రమే.

కాగా, కాలుష్యం ప్రమాదమూ చాలా ఉంటుంది. థర్మల్ కేంద్రాల నుండి వచ్చే ప్రధానమైన కాలుష్యం బూడిద. ఈ రెండు ప్లాంట్లలో పెద్దదైన రిలయన్స్ వారి 4000 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని విదేశీ బొగ్గుతో నడుపుతారనీ, దానిలో బూడిద మన బొగ్గు కంటే మూడవ వంతు తక్కువ ఉంటుందనీ అంటున్నారు. అయినప్పటికీ, 4,000 మెగావాట్ల థర్మల్ కేంద్రం నుండి వెలికి వచ్చే బూడిద రామగుండంలోని ఎన్.టి.పి.సి థర్మల్ కేంద్రం కంటే రెండున్నర రెట్లు ఎక్కువ ఉంటుంది. రెండవ థర్మల్ కేంద్రం ప్రధానంగా మన బొగ్గుతో నడుస్తుంది కాబట్టి బూడిద కాలుష్యం పూర్తి పరిమాణంలో ఉంటుంది.

ఈ బూడిదను నీటితో కలిపి పెద్ద పెద్ద చెరువులలో ఉంచుతారనీ, దానిని ముడి సరుకుగా వాడుకునే పరిశ్రమలు ఆ బూడిదను ఎప్పటికప్పుడు తీసుకుపోతుంటాయనీ, అందువల్ల బూడిద కాలుష్యం ఎక్కువ కాలం ఉండదనీ అంటారు గానీ ఇది చెప్పినంత సజావుగా జరగదని అనుభవం తెలుపుతుంది.

రామగుండం థర్మల్ కేంద్రమే దీనికి ఉదాహరణ. ఎండల కాలంలో బూడిద ఎండి చుట్టూ ఉన్న ఆవాసాలపైన, పొలాలపైన మంచులాగ కమ్ముకొని అక్కడి వారి జీవితాన్ని దుర్భరం చేస్తుంది. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్ సముద్రం పక్కన ఉంటుంది కాబట్టి, పగటి సమయంలో గాలి సముద్రం వైపు వీస్తుంది కాబట్టి, ఈ బూడిద సముద్రం మీదికి పోతుంది. దాంతోపాటు తీరంమీద నెలకొనబోయే జనావాసాల మానవ కాలుష్యమూ సముద్రంలోకే పోతుంది. ప్రాజెక్టు కాలనీ తీరానికి అర్ధ కిలోమీటర్ లోపలికి ఉండాలని పర్యావరణ అనుమతి పత్రం అంటుంది కాని దాని మురుగునీరు సముద్రంలోకి వెళ్ళదన్న భరోసా ఏమీ లేదు. అందువల్ల రాబోయే కాలంలో ఈ తీరంలో చేపల వేట సాధ్యపడదు. అంటే 16 గ్రామాల మత్స్యకారులూ తట్టాబుట్టా సర్దుకొని పిల్లాజెల్లాతో సహా వెళ్ళిపోవలసి ఉంటుంది. వాళ్ళకు థర్మల్ ప్రాజెక్టులోనో, పోర్టులోనో పనులు కల్పిస్తామన్న హామీ ఇచ్చి వాళ్ళ నోళ్ళు మూయించే ప్రయత్నం నాయకులు ఇప్పటికే చేస్తున్నారు. కాని ఇది వట్టి దగా. అభివృద్ధి పేరిట ఇప్పుడు మన నాయకులు రాష్ట్రంలోకి ఆహ్వానిస్తున్న ఏ పరిశ్రమలోనూ పెద్ద చదువులు లేని వారికి పిడికెడుకు మించి ఉద్యోగాలు ఇవ్వలేదు.

'ఇంకెక్కడన్నా పోయి చేపలు పట్టుకోండి' అంటుందేమో ప్రభుత్వం. ఎక్కడికి పోయినా ఇప్పటికే అక్కడ చేపల వేట చేస్తూ బతుకుతున్న వారు ఉండవచ్చు. అప్పుడు వారికీ వీరికీ కొట్లాట పెట్టడమే కదా ప్రభుత్వం చేసేది! ఎక్కడైనా ఖాళీ ఉన్నా అక్కడ నివాసానికి కాలనీ కావాలి, సహజంగా ఏర్పడిన రేవు లేకపోతే కనుక జెట్టీ కావాలి. 'పునరావాసం' అనే మాటకేమైనా అర్థం ఉంటే ఇవన్నీ కల్పించాలి. అటువంటి ఆలోచనేదీ ప్రభుత్వం చేయడం లేదు. ఇటువంటి వాళ్ళకోసం జాతీయ పునరావాస విధానం రాబోతున్నదని చాలా ఏళ్ళుగా వింటున్నాం. అటువంటి బిల్లు ఒకటి ఇప్పుడు పార్లమెంటు ముందు ఉంది. త్వరలో అది చట్టం కాబోతున్నదని ప్రధానమంత్రి మొన్నటి గణతంత్ర దినోత్సవం నాడు అన్నారు. దానికేమీ తొందరలేదు గానీ ప్రాజెక్టులకు మాత్రం ఎక్కడలేని తొందర ఉంటుంది. ఆ బిల్లులో ఏముందో ప్రజలకు తెలీదు. అదింకా చట్టం కాలేదు. సమాజం దాని మంచి చెడులు చర్చించలేదు. అంత లోపల లక్షలాదిగా ప్రజల విస్థాపన మాత్రం జరిగిపోతుంటుంది.

కృష్ణపట్నం తీరప్రాంత మత్స్యకారులు ఈ వాస్తవాలను అర్థం చేసుకొని తమ హక్కులకూ, జీవనానికీ ఏ విలువా లేనట్టు నడుచుకుంటున్న ప్రభుత్వానికి ప్రజలంటే ఏమిటో, వారి సంకల్పం ఎటువంటిదో నేర్పించాలని కోరుతున్నాం. సమాజంలోని సకల ప్రజాతంత్ర శక్తులూ, మంచినీ మానవతనూ అభిమానించే వ్యక్తులూ వారికి అండగా నిలబడాలని కోరుతున్నాం.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**15 ఫిబ్రవరి 2008**

# రిలయన్స్‌కు ఏ రూల్సూ వర్తించవా?

**తా**ళ్ళరేవు మండలం గాడిమొగ దగ్గర నెలకొన్న రిలయన్స్‌వారి సహజవాయువు ప్రాజెక్టు రెండు మండలాలలో ఎంతలేదన్నా 12 వేల మత్స్యకారుల పొట్టగొట్టిన వైనం తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పుడందరూ ఎరిగినదే.

'రిలయన్స్‌ను కేంద్ర ప్రభుత్వమే ఏమీ చేయలేదు' అని జిల్లా అధికారులు నమ్మో నమ్మకో తమ అశక్తతను వ్యక్తం చేసినప్పటికీ మత్స్యకారులు మాత్రం నిస్సహాయంగా చేతులెత్తేయలేదు. తమ జీవనాన్ని పోగొట్టిన ప్రాజెక్టును వారు నిరసిస్తున్నారు, న్యాయం కోరుతున్నారు. ప్రతిరోజూ టి.వి. కెమెరాల ముందు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మీద నిప్పులు చెరుగుతూ దుమ్మెత్తిపోస్తూ కనిపించే ప్రతిపక్ష పార్టీలు గానీ, ప్రజాసంఘాలు గానీ వారికి అండగా రాకున్నా వారికి తెలిసిన పద్ధతిలో ప్రతిఘటిస్తున్నారు. ప్రతిఘటన మత్స్యకారులకు కొత్త కాదు గానీ తుఫానులను ప్రతిఘటించడం వేరు, పెట్టుబడిని ప్రతిఘటించడం వేరు. దీనికి తెలిసినన్ని కిటుకులు దానికేం తెలుసు?

రిలయన్స్‌కిచ్చిన 217 ఎకరాల భూమిలో 80 ఎకరాలలో మడ అడవులుండేవి. తక్కిన భూభాగంలో చేపల చెరువులూ, రొయ్యల చెరువులూ ఉండేవి. మడ అడవులుండే భూమిని ఏ పరిశ్రమకైనా అప్పగించడం చట్టాల పరిధిలో అంత సులభం కాదు. ప్రభుత్వం ఒకవేళ చట్టాన్ని పక్కనపెట్టి అప్పగించేసినా కోర్టులు ఒప్పుకోవు. తీరప్రాంత పర్యావరణ రక్షణలో మడ అడవులకుండే ప్రాధాన్యం అటువంటిది.

అయినప్పటికీ రిలయన్స్‌కు ఆ భూమి అప్పగించారంటే దాని వెనుకొక కథ ఉంది. మొదట ఆ భూమిని ప్రైవేటు భూమిగా చూపించి ఎవరి నుండో కొనుక్కున్నారు.

స్థానిక సామాజిక కార్యకర్తలు ఆ విషయాన్ని గ్రహించి కోర్టులో కేసు వేయకపోతే కథ అక్కడితో అయిపోయేది. ఆ తరువాత ప్రభుత్వమే ఆ భూమిని రియలన్స్ వారికి ఎకరా 50 వేలకు ఇచ్చేసింది. మడ అడవులుండే భూమిని ఎట్లా ఇస్తారని ఎవరైనా అడగగలరని ఇచ్చిన వారికీ, తీసుకున్నవారికీ కూడా తెలుసు. కాబట్టి రిలయన్స్‌వారే స్థానిక ప్రజలకు హెచ్చు కూలి ఇచ్చి రాత్రికి రాత్రే మడ అడవి మొత్తం కొట్టేయించారు. ఆ తరువాత పర్యావరణ నివేదిక తయారుచేసి బహిరంగ ప్రజా విచారణ చేపట్టారు. ఆ నివేదిక ప్రకారం రిలయన్స్ కిచ్చిన భూమికి మూడు హద్దుల వెంబడి మడ అడవులున్నాయి గానీ (నాలుగవ హద్దు తాళ్ళరేవు – భైరవపాలెం రోడ్డు) ఆ భూమిలో మాత్రం మడ అడవులు లేవు. చుట్టూ ఉన్న మడ అడవులకు నష్టం కలిగించని పద్ధతిలో రిలయన్స్ వారు పర్యావరణ రక్షణ చేపట్టాలన్న షరతులతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తన సమ్మతి వెనువెంటనే తెలిపేసింది.

## తుఫానులకు ఇంత తెలివెక్కడిది?

అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు సందేహం వచ్చింది. వారి దగ్గరున్న మ్యాపులను చూస్తే ఈ ప్రాంతంలో గోదావరి నదికి ఉత్తరాన, నది ఒడ్డుదాకా, కోరింగ అభయారణ్యం అనే రక్షిత ప్రాంతం ఉండాలంట. దానిలో అరుదైన జంతుజాలాలు, మడ అడవులు ఉండాలంట. కానీ పర్యావరణ అనుమతి కోసం రిలయన్స్ వారు పంపిన ప్రతిపాదనతో జతచేసిన మ్యాపులో ఆ అభయారణ్యం ప్రస్తావనే లేదట. దీని సంగతేమిటి మహాశయా అని వారు రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణాధికారిని అడిగారు.

ఆ అధికారి ఈ ప్రశ్నలకు తొణకలేదు, బెణకలేదు. మ్యాపులో అభయారణ్యం ఎందుకు లేదన్న ప్రశ్నకు జవాబు చెప్పకుండా, అభయారణ్యానికి గానీ, రిజర్వ్ ఫారెస్టుకు గానీ నష్టం వాటిల్లకుండా రిలయన్స్‌వారు సహజవాయువు పైప్‌లైన్లను నది గర్భంగుండా తీసుకురావడం ద్వారా 'తగు జాగ్రత్తలు తీసుకుంటారని మాకు అనిపిస్తున్నది' అనీ, వారికి అప్పగించిన భూమి పరిసరాలలో పాడైపోయిన మడ అడవులున్నాయి కాబట్టి రిలయన్స్ వారు వాటిని ఉద్ధరించడానికి ప్రయత్నించడం అభిలషణీయమనీ, మొత్తంమీద 'కోరింగ అభయారణ్యానికి చెప్పుకోదగ్గ హాని జరగదని నమ్మకంగా చెప్పగలం' అనీ జవాబు చెప్పారు. మ్యాపులో చూపించని అభయారణ్యానికి హాని జరగడం ఏమిటి, జరగక పోవడం ఏమిటి?

ఇంకెప్పుడైనా అడవిలో చెట్లు నరికారని పేదల మీద కేసులు పెట్టినప్పుడు ఈ కథ జ్ఞాపకం చేసుకుందాం.

ఈ విధంగా దొడ్డిదారిన భూమి పొందిన రిలయన్స్‌వారు ఆ 217 ఎకరాలనూ చదును చేసి తమ పరిశ్రమ నిర్మాణం మొదలుపెట్టారు. అప్పటివరకు అక్కడ కొన్ని చేపల చెరువులూ, రొయ్యల చెరువులూ ఉండేవని చెప్పాము కదా. తాళ్ళరేవు మండలం గోపాలపురానికి చెందిన దళితులూ, ఇతర పేదలూ ఆ చెరువులలో కూలి చేసుకుని జీవనం పొందేవారు. మొత్తం 70 మందికి జీవనం దొరికేది. రిలయన్స్‌వారు ఆ భూములు తీసుకున్న తరువాత చెరువుగట్లన్నీ తెంపేసి నేలంతా చదును చేశారు. గోపాలపురం పేదలకు జీవనం పోయింది.

చట్టం పరిభాషలో వారు ప్రాజెక్టు నిర్వాసితులు కారు గానీ ప్రాజెక్టు బాధితులు. అంటే వాళ్ళ గుడిసెలు పదిలంగానే ఉన్నాయి గానీ పని పోయింది. 2005 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో నెం. 68 ప్రకారం వారికి 750 రోజుల దినకూలి నష్ట పరిహారంగా దక్కాలి. కానీ అటువంటి జీవో ఒకటి లేనట్టు, గోపాలపురం పేదలకు ఏ హక్కులూ లేనట్టు జిల్లా అధికారులు నటిస్తున్నారు. అటువంటి జీవో ఉందని జనానికి కూడా తెలీదు కాబట్టి వాళ్ళూ ఆ హక్కు అడగలేదు గానీ మా గతేమిటని మాత్రం అడిగారు. రిలయన్స్‌వారి పరిశ్రమలో మీకు ఉద్యోగాలొస్తాయని జవాబు చెప్పారు. ప్రస్తుతం నడుస్తున్న కట్టడం పనులలో గోపాలపురానికి చెందిన 20 మందికి మాత్రమే కాంట్రాక్ట్ కార్మికులుగా పని దొరికింది. కట్టడం పని అయిపోయిన తరువాత అదీ ఉండదు.

ఇక మత్స్యకారుల విషయానికొస్తే, దాదాపు 12,000 జనాభా గల రెండు గ్రామ పంచాయతీల వారు తమ జీవనాన్ని కోల్పోయారు. ఆ గ్రామాలు తాళ్ళరేవు మండలానికి చెందిన గాడిమొగ, ఐ. పోలవరం మండలానికి చెందిన భైరవపాలెం. ఆ జనం సముద్రం లోనూ, అక్కడికి సమీపంలో సముద్రంలో కలిసే గాడేరు, నీలారం నదులలోనూ చేపలు, రొయ్యలు పట్టుకొని జీవించేవారు. మంచి ఆదాయం పొందేవారు. ఆ నదులలోకి నీళ్ళు తెచ్చే కాలవలన్నిటినీ రిలయన్స్‌వారు నేల చదును చేసే క్రమంలో మూసేశారు. నేల చదును చేయడానికి కావలసిన మట్టిని గాడేరు సముద్రాన్ని కలిసేచోట డ్రెడ్జర్ల సహాయంతో తవ్వి తీశారు. ఈ పనిలో డ్రెడ్జర్లు (తవ్వోడలు) అటూ ఇటూ తిరగడంతో గాడేరులో ఇసుక అడ్డదిడ్డంగా మేటవేసింది. వేటకోసం

బయలుదేరిన మత్స్యకారుల పడవలు మేట వేసిన ఇసుకలో చిక్కుకుపోసాగాయి. తవ్వోడల హడావిడి వల్ల చేపలు తదితర జలచరాల పునరుత్పత్తి బాగా దెబ్బతింది. వేగంగా దూసుకుపోయే రిలయన్స్ కంపెనీ వారి పడవల దెబ్బకు మత్స్యకారులు విసిరిన వలలు తెగిపోసాగాయి.

ఇదంతా సహజ వాయువు సరఫరా మొదలు కాకముందే జరిగిపోయింది. 'ఆన్‌షోర్' కట్టడాల నిర్మాణం జరుగుతున్న దశలోనే జరిగిపోయింది. ఈ నష్టాన్ని కాదనలేకపోయిన ప్రభుత్వం, ఇది కేవలం కట్టడపు పనుల దశలోనే జరుగుతుందనీ, ఆ తరువాత తవ్వోడల హడావుడి ఉండదు కాబట్టి మత్స్యకారులు స్వేచ్ఛగా వేట చేసుకోవచ్చుననీ చెప్పి, 6 నెలల కాలానికి ఒక్కొక్క నావకు నెలకు 6,000 రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించే ఏర్పాటు చేసింది. అయితే ఇది కూడా సమంగా జరగలేదు. ఇన్స్యూరెన్స్ గానీ, మత్స్యశాఖ గుర్తింపు కార్డు గానీ ఉంటేనే లెక్కలోకి తీసుకుంటామని చెప్పి గాడిమొగలో ఉన్న 600 నావలకు గాను 150 నావలకు, భైరవపాలెంలోని 776 నావలకు గాను 400 నావలకు మాత్రమే ఈ నష్టపరిహారం పరిమితం చేశారు.

అసలు సమస్య ముందుంది. ఆఫ్‌షోర్‌లో (సముద్రంలో) డ్రిల్లింగ్ చేసి వెలికితీసే సహజ వాయువును, కొంత పెట్రోలియంను రిలయన్స్‌వారు గొట్టాల ద్వారా గాడిమొగ వద్ద నిర్మిస్తున్న ఆన్‌షోర్ (సముద్రతీరం మీదనున్న) ప్రాసెసింగ్ కేంద్రానికి తీసుకురావాలి. చుట్టూ ఉన్న రిజర్వ్ ఫారెస్టు, మడ అడవులు, కోరింగ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలకు నష్టం కలిగించకుండా ఉండవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పైపులైన్లను నీటిలో నుండి వేసి గాడిమొగ వద్ద తీరం మీదికి తీసుకురావాలని ప్రతిపాదించారు. సముద్ర గర్భంలోను, నది గర్భంలోను నేలకింద ఒకటిన్నర మీటర్ల లోతున ఈ పైప్‌లైన్ వేయబడుతుంది. పైప్‌లైన్ నీటికింద నేలలో పూడ్చి పెట్టబడుతుంది కాబట్టి సముద్ర జీవులకేమీ కష్టం కలగదని రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణాధికారి అంటాడు గానీ ఈ పైప్‌లైను వేసేటప్పుడు కంపెనీ పడవల హడావుడి చాలా ఉంటుందని, మత్స్యకారుల పడవలు స్వేచ్ఛగా తిరగలేక పోవచ్చునని ఆయనే ఒప్పుకుంటాడు. ఈ హడావుడి వల్ల నీళ్ళు బురదై జలజీవాల పునరుత్పత్తి దెబ్బతినగలదని పర్యావరణ అనుమతిపత్రం గుర్తించింది. పైప్‌లైన్ల ద్వారా సహజవాయువే కాక పెట్రోలియం కూడా కొంత వెలికి తీయబడుతుంది కాబట్టి

పెట్రోలియం ప్రమాదవశాత్తు నీటిలోకి ఒలికిపోయే ప్రమాదం (ఆయిల్ స్పిల్) లేకపోలేదని కూడా పర్యావరణ అనుమతి పత్రం గుర్తించింది. అది ఒక్కసారి జరిగితే ఇంక ఆ నీళ్ళు నీళ్ళుకావు. ఆయిల్ స్పిల్ ఎప్పుడోగానీ సంభవించకపోవచ్చును గానీ రసాయన కాలుష్యం, డ్రైనేజీ నీటి కాలుష్యం మాత్రం నిత్యం ఉంటాయి. నీటి సహజత్వం, నీటి ప్రవాహ సహజత్వం ధ్వంసం అవుతాయి. ఆ తరువాత గాడిమొగ, భైరవపాలెం గ్రామాల మత్స్యకారులు అక్కడ రొయ్యలు, చేపలు పట్టుకొని బతకడం కల్ల.

వాళ్ళంతా ఏం కావాలి అన్న ప్రశ్న ప్రభుత్వానికి అక్కరలేదా? దేశ అభివృద్ధికి కావలసిన ఇంధనాల వెలికితీత కోసం నదులనూ, సముద్రాలనూ, అడవులనూ, సమస్త ప్రకృతినీ రిలయన్స్ వంటి కంపెనీల చేతిలో పెట్టడం తప్పనిసరి అని భావించేటట్టయితే, ఆ ప్రకృతి పైన ఆధారపడి బతుకుతున్న ప్రజల జీవనాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం మీద లేదా? 60 సంవత్సరాల స్వతంత్ర భారతంలో అభివృద్ధి నిమిత్తం భూములూ వనరులూ జీవన అవకాశాలూ కోల్పోయిన ప్రజలకొక పునరావాస హక్కంటూ ఇంతవరకు కల్పించలేదు. లక్షలాది ప్రజానీకాన్ని భిక్షగాళ్ళను చేస్తూ 'దేశాన్ని' అభివృద్ధి చేస్తున్నారు. అడవి ప్రాంతాలలో ఆదివాసులు, తీరప్రాంతాలలో మత్స్యకారులు భారీగా దీనికి మూల్యం చెల్లించారు. ఇది అన్యాయమని ఆందోళన చేయగా చేయగా ప్రాజెక్టు బాధితుల పునరావాసానికొక విధానం రూపొందిస్తున్నామని కొంతకాలంగా అంటూ వస్తున్నారు. అదెప్పటికీ 'జరగబోతూ' ఉంటుంది గానీ ఈ లోపల అభివృద్ధి పేరిట ప్రజల విస్థాపన మాత్రం 'జరిగిపోతూ' ఉంటుంది. ప్రజలు నోరులేని జీవాలలాగ తలవంచి ఊళ్ళు ఖాళీ చేస్తున్నంత కాలం ఈ వంచన సాగుతుంది. సాగనివ్వమని బాధితులే కాదు బాధితుల తరఫున యావత్ సమాజం లేచి నిలబడిన రోజున మాత్రమే అభివృద్ధిని గురించి మానవీయంగా ఆలోచించడం పాలకులు నేర్చుకుంటారు.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**20 ఫిబ్రవరి 2008**

# సెజ్‌లు అన్ని విధాలా వినాశనకరం

ప్రత్యేక ఆర్థిక మండలులు (సెజ్‌లు) ఈ మధ్య కాలంలో తరచుగా వార్తలలో ఉంటున్నాయి. సెజ్‌కు భూములు అప్పగించం అని ఎదురు తిరిగిన ప్రజలను ప్రభుత్వాలు కాల్పులు, లాఠీ దెబ్బలు, అరెస్టులతో అణగదొక్కడం చూస్తున్నాం. నందిగ్రాం కాల్పులు దేశమంతటి దృష్టినీ ఆకర్షించగా మన రాష్ట్రంలో కాకినాడ సమీపంలో జరిగిన అరెస్టులు రేపు ఇంకేం జరగబోతుందో అన్న ఆందోళన కలిగించాయి.

ఎగుమతులను ప్రోత్సహించడం కోసం కంపెనీలకు సకల సదుపాయాలూ, అనేక రాయితీలూ కల్పించే ఆలోచనే సెజ్‌లకు మూలం. దీనికోసం పార్లమెంటు 2005లో సెజ్ చట్టం చేసింది. ఆ తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టానికి అనుబంధంగా నియమాలు ప్రకటించాయి. అయితే ఈ విధంగా చెప్పుకుంటే సెజ్ వ్యవస్థలోని దుర్మార్గం అర్థం కాదు. ఎంత ఆర్థిక క్రమశిక్షణ పాటించినా దేశానికి విదేశీ మారకద్రవ్యం అవసరమే కాబట్టి, ఎగుమతులు చేయగల సంస్థలకు రాయితీలిస్తే తప్పేముంది అనగలరు. అందుకే సెజ్ వ్యవస్థ గురించి కొంచెం వివరంగా తెలుసుకోవాలి.

ఎగుమతులు బాగా చేయగల సంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం సెజ్ వ్యవస్థ ప్రకటించుకున్న లక్ష్యమైనప్పటికీ, మొదట రంగంలోకి దిగేది అటువంటి సంస్థలు కాదు. కొన్ని వేల ఎకరాలు (12,500 ఎకరాల దాకా ఉండవచ్చు) చేతబట్టుకుని,

ఎగుమతులు చేయగల సంస్థలను పిలుచుకొచ్చి సెజ్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చే డెవలపర్ మొదట రంగంలోకి దిగుతాడు. ఇతను వ్యక్తి కావచ్చు, కంపెనీ కావచ్చు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కావచ్చు, రాష్ట్ర ప్రభుత్వమే కావచ్చు. లేక రాష్ట్ర ప్రభుత్వమో, రాష్ట్ర ప్రభుత్వ సంస్థో తొలుత చట్టం కళ్ళు కప్పడానికి డెవలపర్‌గా ముందుకొచ్చి ఆ తరువాత అస్మదీయుడైన వ్యాపారవేత్తను కో–డెవలపర్‌గా సరసన చేర్చుకోవచ్చు.

సీలింగ్ చట్టాలు వచ్చిన తరువాత అంత భూమి ఎవరి దగ్గరా ఉండదు కదా! మరి డెవలపర్ దగ్గర అంత భూమి ఎక్కడి నుండి వస్తుంది? ఇదొక మాయ. సెజ్ చట్టం ఈ ప్రశ్న వేసుకోదు, జవాబు చెప్పదు. సెజ్‌ల కోసం భూములెక్కడి నుండి వస్తాయన్న ప్రస్తావన ఆ చట్టంలో ఎక్కడా లేదు. తెర తీసేసరికే వేల ఎకరాలు చంక కింద పెట్టుకున్న డెవలపర్ స్టేజి మీద ఉంటాడు.

ఈ మాయ గురించి మరికొన్ని మాయమాటలు మీడియాలో వింటున్నాం. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ గారు, జైరాం రమేశ్ వంటి కాంగ్రెస్ ప్రముఖులూ సెజ్‌ల కోసం ప్రభుత్వాలు భూసేకరణ చేయకూడదని, కంపెనీలు లేదా డెవలపర్ స్వయంగా రైతుల నుండి కొనుక్కోవాలని అనడం వింటున్నాం. రైతులేమైనా పిచ్చివాళ్ళా అడిగిన వాడికి భూములమ్మేయడానికి? ఆ సలహాయే పాటిస్తే దేశంలో ఇప్పటికే అనుమతి పొందిన వందలాది సెజ్‌లు సాధ్యమయ్యేవా?

చెప్పేదొకటి, చేసేదొకటి. డెవలపర్‌గారే రైతుల దగ్గర కొనుక్కోవడం అంటే ఎట్లాగుంటుందో తెలుసుకోవాలంటే కాకినాడకు పోవాలి. కాకినాడ పోర్ట్ ఆధారిత సెజ్ పేరిట ఏర్పడుతున్న 10 వేల ఎకరాల మండలిని చూడాలి. మొదట కొంతమంది దగ్గర కొన్ని ఎకరాలు డెవలపర్ కె.వి.రావు స్వచ్ఛందంగానే కొన్నాడు. భూములమ్ముకొని బయటపడదామని ఎదురుచూసే వారు ఏ ఊరిలోనైనా కొంతమంది ఉంటారు. పట్టణాలలో వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుంటూ ఉండి వ్యవసాయ భూమిని కౌలుకిచ్చి కౌలుదార్లతో వేగలేక ఎప్పుడు అమ్ముకొని పోదామా అని ఎదురుచూసే వారుంటారు. వారి నుండి కె.వి.రావు ఎకరానికి 3 లక్షలిచ్చి మొదట కొంత భూమి కొన్నారు. ఆ తరువాత పక్క భూమి యజమానిని కె.వి.రావు మనుషులు, రెవిన్యూ సిబ్బంది బెదిరించడం మొదలుపెట్టారు. కె.వి.రావుకే అమ్మేస్తే ఈ 3 లక్షలొస్తాయి –

లేకపోతే ప్రభుత్వం లక్ష చిల్లరకు బలవంతంగా స్వాధీనం చేసుకొని కోర్టుల చుట్టూ తిప్పుతుంది అన్నారు. అబద్ధాలూ చెప్పారు. 'అరే! నీ పొలం చుట్టూ ఉన్న భూమి అంతా అమ్మేశారే. నువ్వొక్కడివే ఉండిపోయావు. నీ పొలం చుట్టూ సెజ్ వచ్చాక నువ్వేం వ్యవసాయం చేస్తావు?' అని బుకాయించారు. అది అబద్ధం అని ఆ రైతు గ్రహించే లోపల అమ్మకం జరిగిపోయి ఉంటుంది.

అయితే అన్ని చోట్లా డెవలపరే కొనుక్కోవాలి అన్న నియమాన్ని పాటించడం లేదు. డెవలపర్ కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తే అది చట్టం కళ్ళలో చెల్లుబాటు కాకపోవచ్చు కాబట్టి మధ్యేమార్గంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వసతుల కార్పొరేషన్ (ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ – ఎ.పి.ఐ.ఐ.సి)ని రంగంలోకి దింపుతున్నారు. ఈ సంస్థ పరిశ్రమలను అభివృద్ధి చేయడం కోసం ఏర్పడింది కాబట్టి దాని చేతిలో భూమి పెట్టడానికి బలవంతపు భూసేకరణ చేపడితే అది చట్టం కళ్ళలో చెల్లుబాటవుతుందని ప్రభుత్వం భావన. విశాఖపట్నం దగ్గర రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో చేపట్టిన సెజ్ విషయంలో ఈ మార్గమే అనుసరించింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ విధంగా చేజిక్కించుకున్న భూమిలో ఎ.పి.ఐ.ఐ.సి. తానే డెవలపర్ అవతారం ఎత్తవచ్చు లేదా మరొక వ్యక్తినో కంపెనీనో కో–డెవలపర్‌గా పక్కన తెచ్చుకొని కూర్చోబెట్టుకోవచ్చు.

ఈ విధంగా మోసం చేసో, భయపెట్టో, భ్రమలు పెట్టో వేల ఎకరాల భూమి చేజిక్కించుకున్న డెవలపర్ సెజ్ నాటకం తెరతీసేసరికి రంగం మీద ఉంటాడని చెప్పాము కదా. ఇతనిది నిష్కామకర్మ కాదు. అంటే చేజిక్కించుకున్న వేల ఎకరాలన్నీ ఎగుమతులు చేసే కంపెనీలకు అప్పగించి, ఖర్చుమీద అయిదు శాతమో, పది శాతమో వారి నుండి తీసుకొని ఇల్లు చేరుకునే పాత్ర కాదు (ప్రస్తుత రాజకీయార్థిక వాతావరణంలో దీనిని నిష్కామకర్మ అనవచ్చు. ఆంగ్లంలో ఫెసిలిటేటర్ అన్నమాట వాడుతున్నారు). సెజ్ భూభాగంలో 25 నుండి 35 శాతం మాత్రమే వస్తువులు లేక సేవలు ఉత్పత్తిచేసే ఆర్థిక సంస్థలుంటాయి. తక్కిన 65 నుండి 75 శాతం భూభాగంలో దానికి అనుబంధ వసతుల అభివృద్ధిని డెవలపర్ చేపడతాడు. వసతులు అంటే రోడ్లు, కరెంటు తీగలు, నీళ్ళ పైప్‌లైన్లు మాత్రమే అనుకునేరు. అదేం కాదు. సకల 'పారిశ్రామిక, వ్యాపార, సామాజిక వసతుల' అభివృద్ధీ దానిలో భాగమేనని సెజ్

చట్టం సెక్షన్ 2(ఎస్)లో అంటుంది. వైద్య సదుపాయాలు, విద్యాసంస్థలు, కాలక్షేప వ్యవస్థ, నివాసాలు, వ్యాపార కేంద్రాలు అన్నీ అందులో భాగమేనంటుంది. అంటే డెవలపర్ చేసేది ప్రధానంగా ఎగుమతి సంస్థలకు దారి సుగమం చేయడం కాదు. అది అతనికి సంబంధించినంతవరకు అనుబంధ కార్యక్రమం మాత్రమే. అతను ప్రధానంగా చేసేది వసతుల అభివృద్ధి పేరు మీద రియల్ ఎస్టేట్ వ్యాపారం. అది కూడా అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉండాలి. అంటే ఒక్కొక్క సెజ్ ఒక చిన్నపాటి అమెరికా పట్టణంలాగ ఉంటుంది. చుట్టూ (ఇంకా మిగిలి) ఉన్న పల్లెలకు రోజుకు ఆరు గంటలు కూడా కరెంటు దక్కకపోవచ్చు. ఇక్కడ మాత్రం ఇరవై నాలుగు గంటలూ ఉంటుంది. ఇక్కడ నల్లాల్లో నాలుగుసార్లు కాచి చల్లార్చిన నీళ్ళు నిరంతరాయంగా ప్రవహిస్తాయి. చుట్టూ (ఇంకా మిగిలి) ఉన్న పల్లెలలో కాలిబాటలూ, బండ్లబాటలూ మాత్రమే ఉండవచ్చు. ఇక్కడ టాటావారి చిన్నకారు పల్టీలు కొట్టేంతటి నున్నటి రోడ్లుంటాయి.

ఇదంతా ఎగుమతులను ప్రోత్సహించే పేరుమీద జరుగుతుంది. దేశంలో ఇప్పటికే వందల సంఖ్యలో సెజ్‌లు ఆమోదం పొందాయంటే కారణం ఎగుమతి సంస్థల ఉత్సాహమా లేక డెవలపర్‌ల రియల్ ఎస్టేట్ దాహమా? ఆలోచించండి. ఈ రియల్ ఎస్టేట్ అభివృద్ధి సెజ్‌లో 25 లేక 35 శాతం భూభాగంలో ఉండే ఉత్పత్తి లేక సేవారంగ సంస్థకు అనుబంధంగా జరుగుతుందని పైన అన్నాము. కానీ అన్ని విషయాలూ స్పష్టంగా వివరించే సెజ్ చట్టం ఈ రియల్ ఎస్టేట్ వ్యవహారం (లేక వ్యాపార, సామాజిక వసతుల అభివృద్ధి) ఆ ఆర్థిక సంస్థ సిబ్బంది, అధికారుల అవసరాలకు మాత్రమే పరిమితం కావాలని చెప్పలేదు. అది దానంతటదే ఒక లాంకోహిల్స్, ఒక సింగపూర్ సిటీలాంటి విలాసవంతమైన టౌన్‌షిప్ కాగలదు. డెవలపర్ అక్కడి భూములను ఎవరికీ అమ్ముకోవడానికి వీలులేదు గానీ లీజుకి ఇచ్చుకోవచ్చు. నిర్మాణాలు చేపట్టి కిరాయికిచ్చుకోవచ్చు. ఎంత మందినైనా కో–డెవలపర్లుగా చేర్చుకొని వ్యాపారంలో భాగం చేసుకోవచ్చు.

ఈ కార్యక్రమానికి అవసరమైన అన్ని సదుపాయాలూ అందిస్తామని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలి. ముఖ్యంగా విద్యుత్ సరఫరాకు, నీటి సరఫరాకు హామీ ఇవ్వాలి. భూసేకరణకు సహకరించాలి. అప్పుడే సెజ్‌కు ఆమోదం లభిస్తుంది.

రంగం మీది కొచ్చిన డెవలపర్ ఒక చేతిలో వేల ఎకరాల యాజమాన్య పత్రాలు, మరొక చేత రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి పత్రం పట్టుకొని ఉంటాడు. అప్పుడే కేంద్ర ప్రభుత్వం అతని ప్రతిపాదనను ఓకే చేస్తుంది.

కోట్ల ధనం పెట్టుబడులు పెట్టి మరిన్ని కోట్లు సంపాదించుకోవడానికి ధనవంతులకు మహదవకాశమైన ఈ ప్రక్రియ కోసం జనం ఊళ్ళకు ఊళ్ళు ఖాళీ చేసి ఎందుకు వెళ్ళిపోవాలి? ఈ సందర్భంగా మరికొన్ని మాయమాటలు కాంగ్రెస్ పార్టీ ప్రముఖుల నుండి వింటున్నాం. సెజ్‌ల కోసం సారవంతమైన భూములు సేకరించడం జరగదనీ, సారహీనమైన భూములు, బంజరు భూములు మాత్రమే సేకరించడం జరుగుతుందని చెప్పగా వింటున్నాం. భూమి సారవంతమైనదైనా సారహీనమైనదైనా దానిమీద ఆధారపడిన వారికి అదే జీవనం. యజమానికైనా అదే, ఆ భూమిలో కూలి చేసుకుని బతికే వారికైనా అదే. సారవంతమైన భూమి సేకరిస్తే కనీసం నష్టపరిహారం ఎక్కువ రాగలదు. సారహీనమైన భూమికి అది కూడా రాదు. బంజరు భూమి అంటే వ్యవసాయానికి పనికి రాదేమో గానీ దేనికీ పనికి రాదని కాదు. పశువుల కాపర్లకు, కల్లుగీత కార్మికులకు, వాగులలో కుంటలలో చేపలు పట్టుకునే మత్స్యకారులకు, రాళ్ళుకొట్టి అమ్ముకునే వడ్డెరలకు బంజర్లే జీవనాధారం. పేదలకు పొయ్యిలో కట్టెకు, గుడిసె వాసాలకు, స్తంభాలకు బంజర్లే ఆధారం.

కాగా, ఏరి ఏరి సారహీనమైన భూమిని మాత్రమే సెజ్‌లకు ఇవ్వడం సాధ్యం కాదు. సెజ్ కోసం డెవలపర్ ప్రతిపాదించే భూమి అవిచ్ఛిన్నమైనదిగా ఉండాలని ఆ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నియమాలలోని నియమం 5(2)(ఎ) అంటుంది. అంతేగాక ఒక్కొక్క సంస్థ ఒక్కొక్క చోట ఉండి ఒక్కొక్క దానికోసం విడి విడిగా వసతులు అభివృద్ధి చేయడం కంటే అన్నీ గుంపుగా ఒకేచోట ఉండి అన్నిటి కోసం ఉమ్మడిగా ఎగుమతులను అభివృద్ధి చేయడం పొదుపరితనం అన్న వాదన సెజ్‌లకు మద్దతుగా చేస్తున్న ప్రధానమైన వాదనలలో ఒకటి. కాబట్టి సారవంతమైన భూములను సెజ్‌ల నుండి మినహాయించాలన్నది ప్రజలను మభ్యపెట్టడానికి కాంగ్రెస్ పెద్దలు చేస్తున్న ఓదార్పు ప్రవచనమే తప్ప సెజ్‌ల భావనకు అతికే అభిప్రాయం కాదు. ఆచరణీయం అసలే కాదు. కాబట్టి సెజ్‌ల కోసం ఊర్లకు ఊర్లు ఖాళీ కావలసిందే.

మరైతే ప్రజలకు ఆగ్రహం కలగడం సహజం కాదా? సెజ్‌ల ఉద్దేశం మంచిదే అని కొంచెంసేపు అనుకున్నా, దానికోసం తమకు జీవనం ఇస్తున్న భూముల్ని అప్పగించి వెళ్ళిపోయి వాళ్ళు ఎక్కడ బతకాలి? ఏం చేసుకొని బతకాలి? స్వంత భూములకు, ఇళ్ళకు 1894 నాటి భూసేకరణ చట్టం కింద కొంత నష్టపరిహారం ఇస్తారు. అది వలసకాలం నాటి చట్టం అని గుర్తించి దానినే ఇంకా వినియోగించడాన్ని ఇప్పుడందరూ విమర్శిస్తున్నారు. అయితే ఆ వలసకాలం నాటి చట్టం సెజ్‌ల కోసం, అంతర్జాతీయ విమానాశ్రయాల కోసం, పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేయడానికి ఉద్దేశించినది కాదు. అప్పట్లో వలస పాలకులకు భారీ ప్రాజెక్టులు కట్టే ప్రణాళిక లేదు. ఊరుమ్మడి అవసరాల కోసం ఒక రోడ్డు వేయడానికి, ఒక స్కూలో, ఆస్పత్రో కట్టడానికి, ఏదైనా ప్రభుత్వ కార్యాలయం నిర్మించడానికి భూమి అవసరమైనప్పుడు ఆ ఊరిలో అనువైనచోట ప్రభుత్వ భూమి లేనట్టయితే, రైతులెవ్వరూ స్వచ్ఛందంగా ఇవ్వడానికి ఇష్టపడకపోతే, కొంత నష్టపరిహారం ఇచ్చి బలవంతంగా భూమి సేకరించడం కోసం 1894 నాటి భూసేకరణ చట్టం ఉద్దేశించబడింది. స్వాతంత్ర్యం వచ్చాకే దానిని భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం చేసే భూసేకరణ కోసం వినియోగించడం మొదలయింది. ప్రజావసరాల కోసమే కాక కంపెనీల కోసం కూడా భూసేకరణ ఆ చట్టం కింద చేయవచ్చునని 1984లో పార్లమెంటు సవరణ తీసుకొచ్చింది.

ఇప్పుడు మొత్తంగానే భూసేకరణ ప్రక్రియను తిరగరాసి మానవీయమైన పద్ధతిని ప్రవేశపెట్టబోతున్నారని వింటున్నాం. ఒక కొత్త బిల్లు పార్లమెంటు ముందు ఉంది. దానిని పార్లమెంటు చర్చించి అనుమతిస్తుందో లేక రాజకీయ వివాదాల నడుమ సమయం లేక చర్చించకుండానే అనుమతిస్తుందో తెలీదు. పార్లమెంటు చర్చించినా చర్చించకున్నా సమాజానికి ఆ బిల్లు చట్టం కాకముందే దానిలో ఏముందో తెలియాలి. దానిని చర్చించే అవకాశం ఉండాలి. కాగా, ఇప్పటిదాకా నష్టపరిహారం స్థిరాస్తుల మీద యాజమాన్య హక్కు ఉన్న వారికే పరిమితం అయింది. యాజమాన్య హక్కు లేకుండా ప్రకృతి వనరులపైన ఆధారపడి బతికేవారికి అటువంటిదేం లేదు. వివిధ రాష్ట్రాలు ఆడపాదడపా ఈ వర్గాలకు కూడా కొంత నష్టపరిహారం, ఒక పునరావాస కాలనీ కట్టిచ్చే విధానాలను రూపొందిస్తున్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వం 2005లో జీవో

నెం. 68 రూపంలో అటువంటి విధాన ప్రకటన చేసింది. అయితే నిర్వాసితులకు పునరావాస హక్కు కల్పించే చట్టమొకటి కేంద్ర ప్రభుత్వమే తీసుకొస్తున్నదని చాలాకాలంగా వింటున్నాం. ఇది కూడా ఇప్పుడు బిల్లు రూపంలో పార్లమెంటు ముందు ఉంది. దీనిని కూడా సమగ్రంగా చర్చించే అవకాశం, సవరణలు సూచించే అవకాశం సమాజానికి ఉండాలి.

నష్టపరిహారం, పునరావాసాల విషయంలో చట్టాలు అసమగ్రంగా అసంతృప్తికరంగా ఉన్న విషయం గుర్తించామని చెప్తున్న వారు కొత్త విధానాలూ, చట్టాలూ ఇంకా రూపొందే దశలో ఉండగానే లక్షలాది ఎకరాలను సెజ్‌ల పేరిట, ఇతర 'అభివృద్ధి' కార్యకలాపాల పేరిట కోటీశ్వరులకు ధారాదత్తం చేసి ప్రజలను ఆ భూముల నుండి బలవంతంగా నెట్టివేయడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

ఇది చాలక ఉద్యోగావకాశాల గురించి ఆడుతున్న అబద్ధాలొకటి. మన ముఖ్యమంత్రి గారైతే లక్షల సంఖ్యకు తగ్గడు. తాను చేపడుతున్న 'అభివృద్ధి' కార్యకలాపాల వల్ల 25 లక్షల ఉద్యోగాలొస్తాయని పదే పదే ప్రకటిస్తున్నాడు. ఏ సెజ్‌లోకి ఏ కంపెనీ రాబోయేదీ, ఏం తయారుచేయబోయేదీ, ఎన్ని పనులు కల్పించబోయేదీ తెలియనప్పుడు ఎంతమందికి ఉద్యోగాలొస్తాయో ఎట్లా చెప్పగలడు? ఉద్యోగాలు అనేదాంట్లో అన్ని రకాల ఉపాధి అవకాశాలనూ – సెజ్ గేటు బయట పాన్‌డబ్బా పెట్టుకునే అవకాశంతో సహా – లెక్కిస్తున్నాడనే ఉదారంగా భావిద్దాం. అయినప్పటికీ ఎంతమందికి పని దొరికేదీ ఆయనకెట్లా తెలుసు? అయినా ఎగుమతుల కోసం ప్రధానంగా ఉద్దేశించిన సెజ్‌లలో ఆటోమేటిక్ ప్రక్రియలను అనుసరించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులకే తప్ప వందలమందికి పనులు కల్పించే పాతకాలపు ఉత్పత్తి విధానాలకు చోటులేదు. నెల్లూరు జిల్లా మాంబట్టులో మామూలు పరిశ్రమగా మొదలై సెజ్‌గా రూపాంతరం చెందిన అపాచీ పాదరక్షల కంపెనీ 35 వేల ఉద్యోగాలు కల్పిస్తుందన్న హామీతో మొదలై ఇప్పుడు 5,000 మందికి మాత్రమే కల్పిస్తున్నది. అందులో నిర్వాసితులు 200 మంది కూడా లేరు.

ఒకవేళ పనులంటూ దొరికినా సెజ్‌లలోని పని పరిస్థితులేమిటి? సెజ్‌లోని కంపెనీలను ఏ చట్టం నుండైనా పూర్తిగా గానీ, పాక్షికంగా గానీ ఒక నోటిఫికేషన్ (ఆదేశం) ద్వారా ప్రభుత్వం మినహాయించవచ్చునని సెజ్ చట్టంలోని సెక్షన్ 49(1)

అంటుంది. దాని తరువాత వచ్చే 49(2) విచిత్రమైనది. కార్మిక చట్టాల నుండి సెక్షన్ 49(1) కింద ఏదైనా సెజ్‌లోని సంస్థలకు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఆదేశం జారీ చేసినట్టయితే దానిని మరొక ఆదేశం ద్వారా వెనక్కి తీసుకోవడానికి వీలులేదని సెక్షన్ 49(2) అంటుంది. దానిని వెనక్కి తీసుకోవాలంటే చట్ట సవరణ అవసరం అవుతుందని దీని భావం.

వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు సెజ్‌ల కోసం ఇప్పటికే కార్మిక చట్టాల నుండి మినహాయింపులు, సవరణలు జారీ చేశాయి. మన రాష్ట్ర ప్రభుత్వం సెజ్‌లలో పనిగంటల పైన పరిమితిని తొలగించింది. ఓవర్‌టైం వేతనం చెల్లించేటట్టయితే ఎన్ని గంటలైనా పని చేయించుకోవచ్చు. (చికాగో అమరవీరులు తమ సమాధుల నుండి లేచి వస్తున్నట్టు అనిపిస్తున్నదా?) కనీస వేతనాలు చెల్లించవలసిందే గానీ వేతనం ఎంత చెల్లిస్తున్నదీ, సంస్థలో ఎంతమంది పని చేస్తున్నదీ తెలియజేసే వేతనం రిజిస్టర్లు, రికార్డులు యాజమాన్యం నిర్వహించనక్కర లేదు. (అంటే కనీస వేతనం ఇస్తున్నదీ లేనిదీ నిరూపించే అధారమేమీ ఉండదు.) పనిగంటలు, కూలిరేటు ప్రకటించనక్కరలేదు. అంటే కార్మికులు కోర్టుకు పోయి న్యాయం పొందడానికి ఏ లిఖిత ఆధారమూ ఉండదు.

కార్మికుల ఆరోగ్యానికీ భద్రతకూ తదనుగుణమైన సదుపాయాలకూ సంబంధించిన శాసనం ఫ్యాక్టరీ చట్టం. దాని నుండి ఏ ఫ్యాక్టరీకీ మినహాయింపు లేదు. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సెజ్‌లలో నెలకొల్పే ఫ్యాక్టరీలను భద్రత, ఆరోగ్య నియమాల నుండి మినహాయించే అధికారం ఒక నోటిఫికేషన్ ద్వారా తనకు తాను ఇచ్చుకునింది. ఇప్పటి దాకా కాంట్రాక్ట్ కార్మిక చట్టం నుండి అత్యవసర సందర్భాలలో మాత్రమే మినహాయింపు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. కానీ సెజ్‌లలో ఎప్పుడైనా ఏ సంస్థకైనా ఏ మినహాయింపు అయినా ఇచ్చే అధికారం మన రాష్ట్ర ప్రభుత్వం తనకు తాను కల్పించుకుంది.

కార్మిక సంఘాలు సమర్థంగా పనిచేయాలంటే అనుభవజ్ఞులైన బయటివాళ్ళ పాత్ర అవసరం అని గుర్తించిన కార్మిక సంఘాల చట్టం, కార్మిక సంఘం బాధ్యులలో సగానికి మించకుండా బయటివాళ్ళు ఉండవచ్చుననింది. మన రాష్ట్ర ప్రభుత్వం సెజ్

సంస్థల కార్మిక సంఘాలలో బయటివాళ్ళు ఒక్కరూ ఉండడానికి వీలులేదని ఆదేశం జారీ చేసింది. పైగా సంస్థలోని కార్మికులలో 30 శాతం సభ్యులుగా ఉన్న సంఘానికే 'గుర్తింపు' ఉంటుందని ఆదేశం జారీ చేసింది. అసలు కార్మిక సంఘానికి 'గుర్తింపు' అనేది చట్టంలో ఉన్న భావన కాదు. మొండి యాజమాన్యాలు చట్టబాహ్యంగా తెచ్చిపెట్టిన భావన. గతంలో ఏడుగురు సభ్యులుంటే కార్మిక సంఘం రిజిస్టర్ చేసుకోవచ్చు. 2001 తరువాత సంస్థలోని కార్మికులలో 10 శాతం సభ్యులుంటే కార్మిక సంఘం రిజిస్టర్ చేసుకోవచ్చుని మార్చారు. రిజిస్టర్ అయిన కార్మిక సంఘాలన్నిటినీ యాజమాన్యం గుర్తించవలసిందే. అన్నిటితోనూ వ్యవహరించ వలసిందే. ఇప్పుడు సెజ్‌లలోని సంస్థలలో 30 శాతం కార్మికులు సభ్యులుగా ఉన్న సంఘానికి మాత్రమే కార్మిక సంఘంగా వ్యవహరించే హక్కు ఉంటుంది. ఇతర సంఘాలతో యాజమాన్యం మాట్లాడనక్కరలేదు. ఇది కార్మిక సంఘాల ఉనికినే దాదాపు అసాధ్యం చేస్తుంది.

అసలు కార్మికశాఖ స్వతంత్రతనే సెజ్ చట్టం దెబ్బతీసింది. కార్మిక శాఖలో అవినీతి ఆద్యంతం ఉంది గానీ సూత్రప్రాయంగా అది కార్మిక సంక్షేమం తప్ప వేరే లక్ష్యమేదీ లేని ప్రభుత్వశాఖ. సెజ్ చట్టం సెజ్‌లోని పారిశ్రామిక సంస్థలకు సంబంధించినంత వరకు దీనిని తొలగించేసింది. ఎగుమతుల వృద్ధిని లక్ష్యంగా గల సెజ్ ఆ లక్ష్యాన్ని అందుకునేటట్టు చూసే బాధ్యత గల డెవలప్‌మెంట్ కమిషనర్ అనే కేంద్ర ప్రభుత్వ అధికారి ప్రతీ సెజ్‌కూ ఒకరు నియమితులై ఉంటారు. సెజ్‌లు ఫలవంతంగా ఉత్పత్తి చేసేటట్టు చూడడం అతని కర్తవ్యం. సెజ్ చట్టం అతనికే కార్మికశాఖ అధికార బాధ్యతలు అప్పగించింది. సెజ్‌ల వ్యాపారదక్షత బలహీనపడకుండా ఉన్న మేరకే కార్మికులకు హక్కులుంటాయని దీని భావం. మన రాష్ట్ర ప్రభుత్వం ఇంకొంచెం ముందుకుపోయి కార్మికుల ఉద్యోగ భద్రత విషయంలో తనపైన ఉన్న ఒక ముఖ్యమైన బాధ్యతను కూడా అదే అధికారికి అప్పగించింది. ఇది కార్మికులను తొలగించడానికీ, లేఆఫ్ చేయడానికీ పారిశ్రామిక సంస్థలకు పారిశ్రామిక వివాదాల చట్టంలోని 5–బి అధ్యాయం కింద అనుమతి ఇచ్చే అధికారం. అంటే కార్మికులకు ఉండే ఇతర హక్కులే కాదు, ఉద్యోగ భద్రత కూడా సెజ్‌ల ఎగుమతి సామర్థ్యం దెబ్బతినకుండా ఉన్న మేరకే లభ్యం అవుతాయి.

సెజ్‌లు వస్తే ఉద్యోగాలు వస్తాయి, వస్తాయి అంటున్నారు. వాళ్ళు చెప్పే దానిలో 5 శాతం కూడా రావన్న సంగతి అటుంచి, వచ్చిన ఉద్యోగాలు ఇంత భద్రంగా ఉంటాయి! సౌదీ అరేబియా వంటి దేశాలలో పనిచేసేందుకు పోయిన మన వారి కథలు పత్రికలలో చదువుతున్నారు కదా ! ఇంక మీదట ఆ కథల కోసం అంత దూరం పోనక్కర లేదు. మీ దగ్గరున్న సెజ్‌లోనే చూడవచ్చు.

ప్రజలకిచ్చేది ఇదైతే సెజ్‌లో సంస్థలు నెలకొల్పే వారికి అరచేతిలో సకల వసతులతో పాటు అనేక రకాల పన్ను రాయితీలూ లభిస్తాయి. ఎగుమతి–దిగుమతి సుంకాలు, ఎగుమతి – దిగుమతి నియమాల విషయంలో సెజ్ విదేశీ భూభాగం వంటిదని సెజ్ చట్టంలోని సెక్షన్ 53 అంటుంది. అయితే ఎగుమతి దిగుమతి సుంకాలే కాదు, వారికి అన్ని రకాల పన్నుల నుండి ఎంతో కొంత మినహాయింపు లభిస్తుంది. చివరికి సెజ్‌లోని కంపెనీల డైరెక్టర్లకు వ్యక్తిగత ఆదాయపన్ను రాయితీలు కూడా లభిస్తాయి. నిజానికి వారికి లభించే రాయితీల జాబితా రాసుకుంటూ పోతే మళ్ళీ ఇంత కరపత్రం అవుతుంది.

ధనవంతులు తమ వ్యాపారాలతో దేశానికి సేవచేస్తారని చెప్పుకుంటారు గానీ వారు ఇచ్చేదేమైనా ఉంటే అది పన్నుల రూపంలోనే. దానికి మినహాయింపు ఇచ్చేసి సకల వనరులనూ అభివృద్ధి చేసి వారికి అప్పగించే వ్యవస్థ సెజ్ వ్యవస్థ. ఈ దాస్యాన్ని దేశమెందుకు సహించాలి? ఆర్థిక అభివృద్ధి వేరే ఏ రకంగానూ రాదా? ప్రజల చేతిలో ఉన్న వనరులను వారి వద్దనే ఉంచి వాటినీ, వారినీ అభివృద్ధి చేసే ఆర్థిక వ్యూహం రచించలేమా?

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**28 ఫిబ్రవరి 2008**

# భూమి మాకు, పట్టా మీకు!

పేదలకు భూమి హక్కు ఎట్లా కల్పించాలా అని ప్రభుత్వాలు ఆలోచించిన రోజులుండేవి. చివరికి కల్పించింది తక్కువే అయినా అనేక చట్టాలు చేశారు. వాటి అమలుకు యంత్రాంగాలు రూపొందించారు. కోర్టులలో దాడిని ఎదుర్కొన్నారు. రాజ్యాంగాన్ని ఒకటికి రెండుసార్లు సవరించారు. అయినప్పటికీ సాగుభూమిలో నూటికి మూడెకరాలు మించి పేదవారికి కట్టబెట్టలేకపోయారంటే అన్ని చట్టాల అమలుకూ, రాజ్యాంగం అమలుకూ తొలి సూత్రమైన సంకల్పం లోపించడమే కారణమని చాలామంది విశ్లేషకులు గుర్తించారు. అయితే సంకల్పలోపం ఏమరపాటు నుంచి పుట్టలేదు. కాకతాళీయం అసలే కాదు. ఉన్న వాడిని మరీ ఇబ్బంది పెట్టకుండ లేనివారికి ఎంత చేయగలమో అంత మాత్రమే చేయాలన్న రాజకీయ నీతి దానికి కారణం. ఈ రాజకీయ నీతి పేదలకు అన్యాయం చేసిందని ఒక వైపు అంటుంటే వారిని కొట్టి వీరికివ్వాలన్న ఆలోచనే అభివృద్ధికి అడ్డం వచ్చిందని అవతలి వైపు నుంచి దాడి జరిగింది.

1980ల నుంచి అంతర్జాతీయంగా ఆ దాడి బలం పుంజుకుంది. ఉన్నవాడికి మరింత కట్టబెట్టడమే అంతిమ (అంటే మరణానంతర అని కూడా కావచ్చు) పరిశీలనలో లేనివారికి కూడా మేలని సూత్రీకరించిన ఆర్థికశాస్త్రవేత్తలు ఒక వరుసక్రమంలో నోబెల్ పురస్కారం పొందారు. 1990ల నుంచి అది అన్ని దేశాల పాలక రాజనీతిలో భాగం అయింది. దీనికి ప్రపంచ బ్యాంకును తిడుతుంటాం గానీ మనవాళ్ళకూ ఇష్టమే. అప్పటి నుంచి పేదవాళ్ళ భూములను స్వాధీనం చేసుకొని ధనవంతులకు ఎట్లా కట్టబెట్టాలా అన్న ఆలోచన మన ప్రభుత్వాలలో మొదలయింది. దానికి ఎన్ని మార్గాలు

కనిపెట్టారో చూస్తే, పూనుకోవాలే గానీ మనవాళ్ళు ఏమైనా సాధించగలరని గ్రహిస్తాం. పాలకులు చేతకాని వాళ్ళని అప్పుడప్పుడూ కసికొద్దీ అంటూంటాం కానీ వాళ్ళు ఏమైనా కావచ్చును గానీ అయోగ్యులు మాత్రం కారు. చట్టం విషయంలో పేదలు తరచుగా ఉదాసీనంగా ఉంటారు. వాళ్ళను నిరక్షరాస్యులుగా ఉంచేయడం వల్ల పెత్తందారీ వర్గాలకు ఒనగూడిన ప్రధాన ప్రయోజనాలలో ఇదొకటి.

తమ అధీనంలో ఉన్న భూమికి పట్టా పొందాలని వాళ్ళు ఆరాటపడరు. భూమి మన దగ్గరే ఉంది కదా ఎవరు తీసుకుంటారులే అనుకుంటారు. దీనివల్ల గతంలో భూస్వాములు చాలా ప్రయోజనం పొందారు. ఇప్పుడు ప్రభుత్వం పొందుతున్నది. నిస్సిగ్గుగా పొందుతున్నది. ప్రభుత్వ బంజర్లను పేదలు సాగుచేసుకుంటున్నట్టయితే వారిని తొలగించ వద్దనీ, వారు నిజంగా అర్హులా కాదా అన్నది పరిశీలించి వారికి పట్టాలు ఇమ్మనీ స్వాతంత్ర్య పూర్వకాలం నుంచి అమలులో ఉన్న రెవెన్యూశాఖ ఆదేశాలు చెప్తాయి. తాసీల్దార్లు తమంతటతాము ఈ పనిచేయాలి. కానీ వారు చేయరు. జనం అడిగితే ఎప్పుడయినా మీకిచ్చేదే కదా తొందరేముంది లెమ్మని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు.

జనం తమకు హక్కుందని తెలియక అడగకపోతే కనుక ఇచ్చే సమస్యే లేదు. కనీసం అడంగల్ (పహాణీ)లో అనుభవదార్లుగా వారి పేర్లు కూడా నమోదు కాకపోవచ్చు. జాగీరు భూములు, శ్రోత్రియం భూములు, జమిందారీ భూములలో అనుభవదార్లయిన వారు సెటిల్‌మెంట్ పట్టాకు అర్హులు. చట్ట పరిజ్ఞానం ఉన్నవారు దీనిని వాడుకొని పట్టాలు పొందుతున్నారు. ఒక్కోసారి తమ అనుభవంలో లేని భూమి కూడా పొందుతున్నారు. పేదలకు ఈ హక్కు గురించి తెలీదు. వారికి తెలియజెప్పాలని ప్రభుత్వం భావించదు. అటువంటి భూమంతా ఇప్పుడు ప్రభుత్వం తనదేనని తీసుకొంటున్నది. ఏ సెజ్‌కో, అస్మదీయులైన వ్యాపారవేత్తలకో అప్పగిస్తున్నది. గ్రామీణ భూములు కోట్లాది రూపాయలకు అమ్ముడుపోయిన మొట్టమొదటి ఉదంతంగా సంచలనం సృష్టించిన కోకాపేట భూముల నుంచి జమ్మలమడుగు దగ్గర బ్రాహ్మణి స్టీల్స్‌కు ఎవ్వరి అనుభవంలో లేని బంజరు భూమి అంటూ అప్పగించిన వేల ఎకరాల భూమి దాకా చాలాచోట్ల ఈ రకమైన మోసం జరిగింది.

మొదటి ఉదంతంలో నష్టపోయినవారు మాదిగలు. రెండో చోట సుగాలీలు. నిజానికి ఒక్క కోకాపేటే కాదు. హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా గ్రామాలలో

భూముల ధరలు విపరీతంగా పెరగడం వల్ల నిన్నటిదాకా రైతులయినవారు ఇవాళ కార్లలో తిరుగుతుండవచ్చు గానీ, చట్టపరమైన హక్కులు స్థిరీకరించుకోకుండా వ్యవసాయం చేస్తున్నవారు, బంజర్లపైన ఆధారపడిన యాదవులు, వడ్డెరలు, గీత కార్మికులు చిన్నా చితకా సెజ్‌ల కోసమూ, పత్రికలలో నిలువు పేజీ అడ్వర్టయిజ్‌మెంట్లలో దర్శనమిచ్చే విలాసవంతమైన కాలనీల కోసమూ ప్రభుత్వం ఎవరి సాగులో లేని బంజర్లు అంటూ భూములు అప్పగించడం వల్ల ఎంతగా జీవనం కోల్పోయారో లెక్కించిన రోజున హైదరాబాద్ 'అభివృద్ధి' అని పిలవబడేదానికి రంగారెడ్డి జిల్లా పేదలు ఎంత మూల్యం చెల్లించారో బయటపడుతుంది.

పోలవరం డ్యాం వల్ల నిర్వాసితులయ్యే ఆదివాసులకు ఏజెన్సీలోనే పునరావాసం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పుడు అదెట్లా సాధ్యం అవుతుందని అనుకున్నాం గానీ, ఆదివాసుల అనుభవంలోని భూములనే నిర్వాసితుల పునరావాసం కోసం పైసా నష్టపరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకునే మార్గం ప్రభుత్వం ఎంచుకుంటుందని ఊహించలేదు. ఆదివాసుల అనుభవంలోని భూములకు ఏ గిరిజనేతరుడో సెటిల్‌మెంట్ అధికారి జరిపే ఏకపక్షమైన విచారణలో పట్టా పొందిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. తాసీల్దారును మంచి చేసుకుంటే ఇది కష్టమేం కాదు. ఆదివాసులకీ సంగతి తెలియకనే పోవచ్చు. తెలిసినా సెటిల్‌మెంట్ డైరెక్టర్ దగ్గర అప్పీల్ వేసి ఆ పట్టాను రద్దుచేయించే స్థోమత లేక ఊరుకుండిపోతారు. భూమి తమ అనుభవంలోనే ఉంది కదా అని ధైర్యంగా ఉంటారు. అటువంటి భూమినిప్పుడు పట్టా ఉన్న గిరిజనేతరుల నుంచి ప్రభుత్వం నేరుగా కొనేస్తున్నది.

పైగా వీటిని భూసేకరణ చట్టం కింద కూడా సేకరించడం లేదు. భూసేకరణ చట్టం కింద పోతే అనుభవదార్లు అభ్యంతరం చెప్పొచ్చు. కాబట్టి పట్టా ఉన్నా భూమి అనుభవించే స్థితిలో లేని గిరిజనేతరుడితో బేరంపెట్టి నేరుగా కొనేస్తున్నారు. ఇది నిజానికి చట్టరీత్యా చెల్లదు. ఏజెన్సీలో గిరిజనేతరులు భూములు అమ్ముకోదలచుకుంటే ఆదివాసులకే అమ్మాలనీ, కొనేవారెవరూ దొరకకుంటేనే ప్రభుత్వానికి అమ్మవచ్చుననీ ఎల్‌టిఆర్ చట్టం అంటుంది. దానిని ఖాతరు చేయకుండ ఆదివాసుల పునరావాసం కోసం ఆదివాసుల అనుభవంలో వున్న భూమిని గిరిజనేతరుల నుంచి కొంటున్నారు. ఈ ఆలోచన చేసిన రెవెన్యూ అధికారి పేరు ప్రకటించి వారికి ప్రత్యేక పురస్కారం ఇవ్వడం ఉచితంగా ఉంటుంది! శ్రద్ధ తీసుకొని, శ్రమకోర్చి, తాము అనుభవిస్తున్న

బంజరు భూమికి అసైన్‌మెంట్ పట్టా పొందిన పేదల భూమి హక్కయినా భద్రంగా ఉందా అంటే అదీ లేదు.

నిజానికి రైతుల పట్టా భూమికన్నా అసైన్డ్ భూమినే ఎక్కువగా ప్రభుత్వం పరిశ్రమల కోసం అప్పగిస్తున్నది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చింది ప్రభుత్వం తీసేసుకుంటుంది అనుకుంటారు తప్ప తమ భూమి పోయిందని ఆగ్రహించరన్న ఆశ ఒకటి. దానికి తగినట్టు అసైన్‌మెంట్ పట్టాలో తప్పనిసరిగా ఒక షరతు ఉంటుంది. ఈ భూమిని ఎప్పుడయినా ప్రజావసరాల కోసం ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకోవచ్చు అని రాసి వుంటుంది. అసైన్డ్ భూమి స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకించే హక్కుదారుకు అధికారులు ఈ షరతులను చూపించి చదవలేదా? అని అడుగుతున్నారు. ఆ షరతు చెల్లదని మన రాష్ట్ర హైకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2004లో ప్రకటించిన విషయం చెప్పరు.

కాగా అసైన్డ్ భూమిని భూసేకరణ చట్టం కింద తీసేసుకుంటే ఎంత నష్టపరిహారం ఇవ్వాలన్నది చట్టరీత్యా అనిశ్చితంగా ఉంది. పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలని చెప్పిన ఏడుగురు న్యాయమూర్తుల తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ సవాలు ఇంకా తేలలేదు. ఈ లోపల స్థానిక ఒత్తిడులను బట్టి బుద్ధికి తోచినంత నష్టపరిహారం ఇస్తున్నది. కొన్నిచోట్ల పట్టా భూమితో సమానంగా ఇస్తున్నది. కొన్నిచోట్ల అందులో సగం ఇస్తున్నది. కొన్నిచోట్ల ఎంతిచ్చేది చెప్పడం లేదు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో ఫ్యాబ్ సిటీ కోసం సేకరించిన అసైన్డ్ భూముల చుట్టూ కంచె వేసి స్వాధీనం చేసుకొని రెండేళ్ళయింది గానీ దమ్మిడీ నష్టపరిహారం ఇప్పటికీ ఇవ్వలేదు. భూసేకరణకు పేదల కిచ్చిన అసైన్డ్ భూములే అందంగా కనబడటానికి మరొక రెండు కారణాలున్నాయి.

నష్టపరిహారం సంగతి అటుంచి, మిగతావాళ్ళయితే అసలు ఆ భూసేకరణ చట్టరీత్యా చెల్లుతుందా అని కోర్టులో సవాలుచేసే అవకాశం ఉంటుంది. స్వంత భూములున్న రైతులు తరచుగా ఆ పని చేస్తుంటారు. పేదలు వ్యాజ్యం ఖర్చులు భరించలేక ఆ సాహసం చేయరు. సందేహాస్పదమైన భూసేకరణ కోర్టుల దృష్టికి పోకుండా ఉండాలంటే అసైన్డ్ భూములను ఎంపిక చేసుకోవటం ఒక మార్గం. మహేశ్వరం మండలంలోనే రాంకీ అనే ప్రైవేట్ సంస్థ చేపట్టే టౌన్‌షిప్ నిర్మాణం కోసం ప్రభుత్వమే భూసేకరణ చేపడుతున్నది. ఈ రకమైన భూసేకరణ ఎంతమేరకు

చెల్లుబాటవుతుందనేది అనుమానమే. అందువల్ల భూసేకరణ నోటిఫికేషన్‌లో ప్రైవేట్ సంస్థ కోసం అని చెప్పకుండ 'టౌన్‌షిప్ కోసం' అని రాశారు. సేకరిస్తున్న 300 ఎకరాలూ పేదల అసైన్డ్ భూమే కాబట్టి అది కోర్టు దృష్టికి పోదని ఆశిస్తున్నట్టున్నారు.

చివరి కారణం ఏమిటంటే పేదలకు అసైన్‌మెంట్ కింద ఇచ్చిన బంజరు భూములను వారు బాగుచేసుకోలేక, పెట్టుబడులు లేక ఎవరికో అమ్ముకున్న ఉదంతాలు ఎక్కువ. ఒకనాడు ఆ అమ్మకాన్ని రద్దుచేసి తాసీల్దారుకే తిరిగి అప్పగించాలన్న చట్టపరమైన నియమం ఉండింది. ఆ నియమం కాగితాలపైన ఇప్పటికీ ఉంది గానీ ప్రభుత్వం 'నోటిఫై' చేసిన ప్రాంతాలలో ఆ భూమిని వెనక్కి అప్పగించనవసరం లేదనీ ప్రభుత్వపరం చేసుకోవచ్చనీ అసైన్డ్ భూముల (బదలాయింపుపైన నిషేధం) చట్టానికి 2007లో చేసిన సవరణలో రాసుకున్నారు. కాబట్టి అటువంటి భూమిని భూసేకరణ కోసం ఎంపిక చేసుకున్నట్టయితే ఈ చట్టసవరణ కింద నోటిఫికేషన్ జారీచేస్తే చాలు. ఆ భూమి ప్రభుత్వానిదయిపోతుంది. నష్టపరిహారం అమ్మినవారికి గానీ కొన్నవారికి గానీ ఇచ్చే ప్రసక్తే లేదు. రాష్ట్రంలో చాలాచోట్ల ఏరి ఏరి ఈ రకమైన భూమిని పరిశ్రమలకూ, టౌన్‌షిప్‌లకూ, సెజ్‌లకూ కట్టబెడుతున్నారు.

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలో జిందాల్ వారి బాక్సైట్ పరిశ్రమకు అప్పగిస్తున్న భూమి, కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలో ఎపిఐఐసికి అప్పగించిన భూమి రెండు ఉదాహరణలు మాత్రమే. (ఎ.పి.ఐ.ఐ.సికి భూమిని అప్పగించడం చట్టం కళ్ళు గప్పే తాత్కాలిక ఏర్పాటు మాత్రమే. అది త్వరలో ఏ అస్మదీయుడిపరమో అవుతుంది.) ఇదంతా కాంగ్రెస్ పాలనలోనే మొదలయిందనుకుంటే పొరపాటు. తెలుగుదేశం పాలనలో హైదరాబాద్ చుట్టూ ఐ.టి. కంపెనీల కోసం సేకరించిన భూమి యావత్తూ పేదల అనుభవంలో ఉన్న అసైన్డ్ భూమే. ఆనాడు మొదలయి ఈనాడు కొనసాగుతున్న 'అభివృద్ధి' ప్రక్రియలో పేదల అనుభవంలో ఉన్న ఎన్ని వేల ఎకరాల భూమి వారిది కాకుండా పోయిందో లెక్కిస్తే తప్ప పెద్దలందరూ ఆహ్వానం పలుకుతున్న ఈ అభివృద్ధికి మూల్యం ఎవరు చెల్లిస్తున్నారో అర్థం కాదు.

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**18 మార్చి 2008**

# సాగుభూమిని ముంచకుండా తాగునీరు ఇవ్వలేమా?

ప్రొద్దుటూరు పట్టణానికి తాగునీరు అందించడానికి చిన్నశెట్టిపల్లె, పర్లపాడు తదితర గ్రామాలకు చెందిన వెయ్యి ఎకరాల సారవంతమైన సాగుభూమిని ముంచనక్కర లేదని, భూసేకరణ అవసరం లేని ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ఎంత చెప్పినా వినకుండా మొండిగా ముందుకెళ్తున్న ప్రభుత్వ వైఖరిని ఖండించవలసిందిగా ప్రజలను కోరుతున్నాం.

'ఎవరెన్ని అన్నా కాలవ తవ్వేదే' అని తిరస్కారంగా మాట్లాడుతున్న ఎంఎల్ఏ వైఖరిని కూడా ఖండించవలసినదిగా ప్రజలను కోరుతున్నాం. ప్రజా ప్రతినిధులుండేది ప్రజల అవసరాలకు, అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించడానికే గాని, ప్రజల నెత్తినెక్కి సవారి చేయడానికి కాదు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలవల్ల నష్టపోయే ప్రజలు సహేతుకమైన అభ్యంతరం తెలిపితే ఆ అభ్యంతరానికి సహేతుకంగానే జవాబు చెప్పాలి. అంతే తప్ప 'ఎవరేమన్నా చేసేది చేసేదే' అనడం అహంకారం అనిపించుకుంటుంది. ప్రజాస్వామ్య వైఖరి అనిపించుకోదు.

ప్రొద్దుటూరుకు తాగునీరు అవసరమే, దాంట్లో సందేహం లేదు. కానీ గ్రామీణ ప్రజల వ్యవసాయాన్ని కాపాడడమూ అవసరమే. దాంట్లోనూ సందేహం గానీ విభేదం గానీ ఉండరాదు. పల్లె ప్రజలకు నష్టం కలిగించకుండ ప్రొద్దుటూరుకు తాగునీరియ్యడం సాధ్యమే కాకపోతే అప్పుడేం చేయాలన్నది వేరే విషయం. ప్రత్యామ్నాయం ఉన్నప్పుడు వాటిని లెక్కలోకే తీసుకోమనడం ఏం న్యాయం?

నగరాలకూ పట్టణాలకూ తాగునీళ్ళెప్పుడూ పైప్‌లైన్ల ద్వారా తీసుకొస్తారు. హైదరాబాద్‌కు తాగునీరు సింగూరు, అక్కంపల్లి రిజర్వాయర్ల నుండి పైప్‌లైన్ల ద్వారా వస్తుంది. విశాఖపట్నంకు తాగునీరు మేఘాద్రి గెడ్డ నుండి, తాటిపూడి రిజర్వాయర్ నుండి పైప్‌లైన్ ద్వారానే వస్తుంది. బెంగుళూరుకు తిప్పగొంబీన హళ్ళి చెరువు నుండి, కృష్ణరాజసాగర్ రిజర్వాయర్ నుండి తాగునీరు పైప్‌లైన్ ద్వారానే వస్తుంది. ఈ సంగతులు ప్రొద్దుటూరు పట్టణంలో గానీ పరిసర గ్రామాలలో గానీ నివసించే రైతులకు, కూలీలకు తెలియకపోవచ్చు. నాయకులకు ఆ నగరాలలో ఆస్తులున్నాయి, వ్యాపారాలున్నాయి కదా! అక్కడ తాగునీరు ఎట్లా ఇస్తున్నారో తెలుసుకోలేకపోయారా? ప్రొద్దుటూరు ఎంత మహానగరమని హైదరాబాదుకు, బెంగుళూరుకు పనికొచ్చిన పైప్‌లైన్ సరఫరా ప్రొద్దుటూరుకు పనికి రాకుండా పోయింది?

పట్టణాలకు తాగునీరు పైప్‌లైన్ ద్వారా అందియ్యడానికి కారణం ఉంది. తాగు నీటిని సరఫరా చేసే నీరు శుభ్రంగా ఉండడం అవసరం. మార్గమధ్యంలో నీటిచౌర్యాన్ని అదుపు చేయడం అవసరం. తాగునీటికి కేటాయించే నీటి పరిమాణం భారీగా ఉండదు. కాబట్టి (ప్రొద్దుటూరుకు ఇచ్చేది 1 టి.ఎం.సి మాత్రమే) పైప్‌లైన్ల వాడకంలో అసౌకర్యమేమీ ఉండదు. సాగునీటి కాలువలు మార్గమధ్యంలో డిస్ట్రిబ్యూటరీల ద్వారా పొలాలకు నీళ్ళిచ్చుకుంటూ పోతాయి. అందువల్ల సాగునీటి సరఫరా కాలవల రూపంలో ఉండక తప్పదు. పట్టణానికి తాగునీరు ఇచ్చే వ్యవస్థ నేరుగా పట్టణాలకే వస్తుంది. నీటిలో అశుభ్రం చేరకుండ చూసుకోవడమూ అవసరం. కాబట్టి ఏ రకంగా చూసినా కాలవ కంటే పైప్‌లైనే ఉచితమైనది. పైగా కాలవ అలైన్‌మెంట్ ఒక రకంగా ఉంచారా అంటే అదీ లేదు. మొదట ఇంజనీర్లు వేసిన నమూనా కూడా వ్యవసాయ భూములను ముంచేదే అయినా నివాసాల పక్కనుండి పోదు, ప్రొద్దుటూరు పట్టణంలో ఎవరినీ నిర్వాసితులను చేయదు. కానీ కాంట్రాక్టర్ చేపట్టిన రెండవ అలైన్‌మెంట్‌లో ప్రొద్దుటూరులో దాదాపు భాగం అయిపోయిన పెద్దశెట్టిపల్లెలోని శ్రీగురు కాలనీ, ఎస్పినగర్ కాలనీలలో 750 ఇళ్ళ ప్లాట్లకు పైగా మునుగుతాయి. ఎన్నడో ప్లాట్లు కొనుక్కున్న ప్రజలు ఇప్పుడు ఇళ్ళు కట్టుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఆ అవకాశాన్ని వాళ్ళు కోల్పోతారు. రెండు స్మశానాలు, ఒక కబరస్తాన్ (ముస్లింల స్మశానం) కూడా మునుగుతాయి.

మునిగే వ్యవసాయ భూములకైనా, ఇళ్ళ ప్లాట్లకైనా నష్టపరిహారం ఇస్తాము కదా అంటారేమో! ప్రత్యామ్నాయాలు ఆలోచించకుండా బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోవడం ఎందుకు, నష్టపరిహారం ఇవ్వడం ఎందుకు? అయినా ఇచ్చిన ఆ నష్టపరిహారాన్ని రైతులు ఏం చేసుకోవాలి? వాళ్ళకు వ్యవసాయం తప్ప వేరే ఏ వ్యాపకమూ తెలీదు. వ్యవసాయానికి మళ్ళీ భూమి కొనుక్కోవాలంటే ఉన్న ఊరిలోనైనా పక్క ఊరిలోనైనా ఎకరానికిచ్చిన నష్టపరిహారంతో ఎకరంలో నాలుగవ భాగం కూడా రాదు. దూరం పోయి కొనుక్కుంటే ఇల్లిక్కడ, సేద్యం అక్కడ అవుతుంది. ఇక ప్రొద్దుటూరు పరిసరాలలో ఇళ్ళ స్థలాలు మునిగేవారు వేరే  ఎక్కడ కొనుక్కోవాలి? ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో ఇప్పటి ధరలకు ప్రొద్దుటూరు శివారులో ఎక్కడా ఇళ్ళస్థలాలు దొరకవు. అందుకే ఎంఎల్ఏ కుటుంబానికి చెందిన రాధానగర్, అమృత్‌నగర్ కాలనీలలో మాకు ప్రత్యామ్నాయంగా ప్లాట్లిస్తారా అని అడుగుతున్నారు వాళ్ళు. 'కాలవ తవ్వేదే' అంటున్న వరదరాజులు రెడ్డిగారు మరి వారందరికీ ఉచితంగా ప్లాట్లిస్తారా?

వేరే రెండు ప్రత్యామ్నాయాలు కూడా సూచించడం జరిగింది. మైలవరం ప్రాజెక్టు లోని లోటును భర్తీ చేయడం కోసమని ఎస్.ఆర్.బి.సి వరద కాలవ ప్రతిపాదించబడింది. అది దాదాపు పూర్తయింది. దాని నుండి 1 టి.ఎం.సిని ప్రొద్దుటూరు తాగునీటి అవసరాలకు ఎందుకు కేటాయించకూడదు? ఇప్పుడు తవ్వుతున్న కుందుకాలవ కూడా వరదనీటి కాలవే. కాబట్టి అదయినా ఇదయినా వరదనీటి ప్రాజెక్టే. పైగా ఆ ప్రత్యామ్నాయం ఎంచుకున్నట్టయితే ఎవరికీ నష్టం ఉండదు.

చివరి ప్రత్యామ్నాయం గండికోట నుండి నీటి తరలింపు. గాలేరు – నగరి ప్రాజెక్టును శరవేగంగా పూర్తిచేయడానికి పనులు జరిగిపోతున్నాయి. దానికి భరోసా ఇవ్వడం కోసం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి ఇతర ప్రాంతాల వారిచేత తిట్లు తినడమూ జరిగింది. అది పూర్తయిన వెంటనే గండికోట రిజర్వాయర్ నుండి 1 టి.ఎం.సి నీరు ప్రొద్దుటూరు అవసరాల కోసం పెన్నా నదిలోకి వదలడం కష్టమా?

అసలు ప్రొద్దుటూరుకు నీటి ఎద్దడి ఎందుకు వచ్చింది? పెన్నా నదిలో నీళ్ళెందుకు లేకుండా పోయాయి? ప్రొద్దుటూరు ప్రజల మీద ప్రేమ ఒలకబోస్తున్న

నాయకులు జవాబు చెప్తారా? పెన్నా నదిలోని ఇసుకను నిరంతరాయంగా తరలిస్తున్న వ్యాపారమే దానికి కారణం కాదా? ప్రొద్దుటూరు మీద ప్రేమే ఉంటే ఆ ఇసుక వ్యాపారం ఎన్నడో నిలిపి ఉండేవారు కాదా? నదిలోని ఇసుకంతా తీసేసి నీళ్ళు నిలవకుండ చేసి లక్షలాది రూపాయల లాభం ఆర్జించి ఇప్పుడు అయ్యో పాపం ప్రొద్దుటూరు ప్రజలకు త్రాగునీరు తక్కువయిందే అని వెయ్యి ఎకరాల సాగుభూమిని ముంచి కుందునది నీళ్ళు తీసుకొచ్చే ప్రాజెక్టు తయారు చేశారు.

కాగితం మీద ఎవరి పేర్లున్నా ప్రాజెక్టు కాంట్రాక్టు ప్రొద్దుటూరు ఎంఎల్ఏ కుమారునిదే అనేది జగమెరిగిన సత్యం. అధికార యంత్రాంగం వారి జేబులో ఉంది కాబట్టి అంత మొండిగా ఏ మార్పుకూ ఒప్పుకోం అని దబాయిస్తున్నారు. సమస్య సృష్టి లోనూ వారిదే లాభం, దాని పరిష్కారంలోనూ వారిదే లాభం. అన్నిరకాలుగాను నష్టపోవలసింది ప్రజలే.

ఈ కుతర్కాన్ని తిరస్కరించమని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రొద్దుటూరు తాగునీటి కోసం ఏ ముంపూ ఉండని ప్రత్యామ్నాయాలను అనుసరించవలసినదిగా డిమాండ్ చేద్దాం రమ్మని ఆహ్వానం పలుకుతున్నాం. ప్రొద్దుటూరు పట్టణ ప్రజలే కాదు, గ్రామీణ ప్రజలు కూడా పౌరులేననీ వారు కూడా ఓటర్లేననీ గుర్తించి ప్రతిపక్షాలు కూడా ఈ ఆందోళనలో భాగం కావాలని పిలుపునిస్తున్నాం.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**30 మే 2008**

# యెల్లంపల్లి, మిడ్ మానేరు నిర్వాసితులకు న్యాయం చేయండి

**యె**ల్లంపల్లి, మిడ్‌మానేరు ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం, పునరావాసం కల్పించిన తరువాతే ప్రాజెక్టు పనులు కొనసాగించాలి అన్న డిమాండుతో ఆగస్టు 25వ తేదీ శనివారం ఉ॥ 9.00 గంటల నుంచి కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయవలసిందిగా ప్రజలను కోరుతున్నాం.

ఎప్పటి నుండో హామీలుగా ఉన్న యెల్లంపల్లి, శ్రీరాంసాగర్ వరదకాలువ (అందులో భాగమైన మిడ్ మానేరు ప్రాజెక్టు) ఇన్నాళ్ళకు కార్యరూపం తీసుకుంటున్నందుకు సంతోషించడం సహజం. అయితే ఒకరి సంతోషం మరొకరి విచారం కాకూడదు. విషాదం అసలే కాకూడదు. దేశ అభివృద్ధి అన్నా, రాష్ట్ర అభివృద్ధి అన్నా, తెలంగాణ ప్రాంత అభివృద్ధి అన్నా అక్కడ బతికే వారందరి అభివృద్ధిగా అర్థం చేసుకున్నప్పుడే అది న్యాయమైన భావన అనిపించుకుంటుంది. ప్రాజెక్టులు కడితే జీవన పరిస్థితులు మెరుగవుతాయి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, ఆదాయాలు పెరుగుతాయి అని భావిస్తాం. అందుకే వాటిని ఆహ్వానిస్తాం. వాటివల్ల వచ్చే మార్పును అభివృద్ధి, ప్రగతి అంటాం. అయితే ప్రాజెక్టులకు భూములు కావాలి. పెద్ద ప్రాజెక్టులకు పెద్ద మొత్తంలో భూములు కావాలి. వాటిని ప్రాజెక్టు కోసం అప్పగించినప్పుడు వాటిపైన ఆధారపడి బతుకుతున్న ప్రజలు తమ జీవనాధారాన్ని కోల్పోతారు. అందులో పట్టాభూములున్న రైతులుంటారు. ప్రభుత్వ భూమిలో

అసైన్‌మెంట్ లేక లావోణి (డి–ఫారం) పట్టాపొందిన భూమిలేని పేదలు ఉంటారు. రైతుల భూములలో కూలిచేసుకొని బతికే రైతు కూలీలుంటారు. ప్రభుత్వ బంజర్లలో తాటిచెట్ల కల్లుగీసి అమ్ముకునే గీత కార్మికులు, పశువులను మేపుకొని బతికే పశువుల కాపర్లు, రాళ్ళు కొట్టి బతికే వడ్డెరలు, వాగులలో, కుంటలలో చేపలు పట్టుకొని బతికే మత్స్యకారులు, బట్టలుతుక్కొని బతికే రజకులు ఉంటారు. భూములు ప్రాజెక్టుకు అప్పగిస్తే ఈ ప్రజలంతా తమ జీవనాధారాన్ని కోల్పోతారు. ఈ ప్రజానీకం జీవితాలను, జీవన మార్గాలను కాపాడే పథకం రచనలో భాగం అయినప్పుడే దానిని నిజమైన అభివృద్ధి అనగలం. అదేమీ లేకుండా ప్రాజెక్టులు కట్టేసి కొన్ని వందల, లేక వేల కుటుంబాల జీవనాధారాన్ని తొలగించి దేశాన్ని అభివృద్ధి చేశామంటే అంగీకరించడానికి వీలులేదు.

జీవనాధారం కోల్పోయే వాళ్ళలో స్వంత ఆస్తి ఉన్న రైతులకు మాత్రమే భూసేకరణ చట్టం కింద కొంత నష్టపరిహారం దక్కుతుంది. అయితే ఆ నష్టపరిహారం మళ్ళీ అంత భూమి కాదు కదా, అందులో సగం భూమి కొనుక్కోవడానికి కూడా సరిపోదు. యెల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామాలు రామగుండం ప్రాంతంలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ధర ప్రకారమయితే అక్కడ ఎకరం భూమి ధర 60,000 రూపాయలు మించి లేదు. ఆ మొత్తం తీసుకొని పెంపుదల కోసం కోర్టులో కేసువేసి సంవత్సరాలు తరబడి కొట్లాడే ఓపిక లేని వారు ప్రభుత్వంతో ఒప్పందానికి వచ్చి కోర్టుకు పోమని హామీ ఇచ్చి 60,000 రూపాయల కంటే ఎక్కువ నష్టపరిహారం ఒకేసారి తీసేసుకోవచ్చు. దానికి ఒప్పుకోవడానికి ఇష్టపడినట్లయితే రెండు పంటలకు నీటి వసతి ఉన్న భూమికి ఎకరానికి 1,60,000 రూపాయలు, ఒక పంటకు శ్రీరాంసాగర్ కాలువ నీళ్ళొచ్చే భూమికి 1,50,000 రూపాయలు, మెట్టకు 90,000 రూపాయలు ఇవ్వడానికి ప్రభుత్వం ఒప్పుకుంది. ఇది చాలదనీ, అదే మండలంలోని ఇతర గ్రామాలలో చెరువు కింద భూములు ఎకరం 2,50,000 రూపాయలకు అమ్ముడు పోతున్నాయని ముంపు గ్రామాల రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం లెక్క పెట్టలేదు. ఇచ్చింది తీసుకో, లేకపోతే 60,000 తీసుకొని ఒక దశాబ్ద కాలం కోర్టుల చుట్టూ తిరుగు అనేది ప్రభుత్వ సమాధానం.

నిజానికి ఆ 1,60,000 కూడా రైతు దగ్గర మిగలవు. మన గ్రామాలలో భారీగా అప్పు పడని రైతులెవరూ లేరు. అందులోనూ మన రాష్ట్రం ప్రత్యేకత ఏమిటంటే ప్రభుత్వ బ్యాంకులు లేక సహకార సంఘాల వద్ద కంటే ప్రైవేటు వ్యక్తుల వద్ద చేసే అప్పులే ఎక్కువ. రైతు ఊరిలో ఉంటే వ్యవసాయం చేస్తున్నంతకాలం అప్పులవాళ్ళు పెద్దగా ఒత్తిడి పెట్టకపోవచ్చును గానీ భూములు అప్పగించి ఊరు విడిచిపెట్టి అప్పుచేసి వెళ్ళిపోతాడని తెలిస్తే బాకీ మొత్తం తీర్చి పొమ్మంటారు. ఆ పనిచేస్తే ఇక మిగిలేదానితో కోల్పోయిన భూమిలో నాల్గవ వంతు కూడా ఎక్కడా కొనుక్కోలేరు.

ఇలా లావోణి పట్టా (అసైన్‌మెంట్, లేక డి-ఫారం) ఉన్నవారి విషయంలో ఒక విధానమేదీ అమలులో లేదు. స్వంత భూమి ఉన్న రైతులకు ఏ లెక్కన నష్టపరిహారం ఇస్తారో అదే లెక్కన అసైన్‌మెంట్ భూమి ఉన్నవారికీ ఇవ్వాలని మన రాష్ట్ర హైకోర్టు ఏడుగురు జడ్జిల బెంచి తీర్పు ఇచ్చింది. దానిని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసి స్టే తీసుకుంది. ఇప్పుడొక విధానమంటూ లేదు. ఎట్లాగయినా భూమి స్వాధీనం చేసుకోవాలనుకున్న చోట డి-ఫారం పట్టా ఉన్న వారికి కూడా పూర్తిస్థాయి నష్టపరిహారం ఇస్తామన్న హామీని ఎరగా చూపిస్తున్నారు. అయినా ఇచ్చింది మాత్రం ఎక్కడా లేదు. వేరే చోట్ల ఏమీ మాట్లాడటం లేదు. యెల్లంపల్లి ముంపు గ్రామాలైన మురుమూరులో 300 మంది దాకా అసైన్‌మెంట్ భూములున్నవారు ఉన్నారు. మిడ్‌మానేరు ముంపు గ్రామమైన కొదురుపాకలో అసైన్‌మెంట్ భూమి 1,000 ఎకరాల దాకా ఉంది. చీర్లవంచలోనూ 600 ఎకరాల దాకా ఉంది. ఈ ప్రజలంతా రేపు ఏమవుతారు? వారి భవిష్యత్తుకు ఏ హామీ లేకుండా ఖాళీచేసి పొమ్మంటే ఎక్కడికి పోవాలి? ఎందుకు పోవాలి?

యెల్లంపల్లికి రెండువైపులా ముంపు గ్రామాలున్నాయి. అటు ఆదిలాబాద్ జిల్లాలో, ఇటు కరీంనగర్ జిల్లాలో. భూములన్నీ ఒకే రకమైనవి. వేసే పంటలూ ఒకే రకమైనవే. అయితే ఆదిలాబాద్ జిల్లాలోని ముంపు గ్రామాల వారు పట్టుదలగా ఉద్యమం చేయగా వారికి ప్రభుత్వం ఎకరానికి 1,80,000 ఇవ్వడానికి సిద్ధపడుతున్నది. కరీంనగర్ జిల్లా రైతులకు మాత్రం 1,60,000 రూపాయలేనట. ఈ వివక్షకు హేతుబద్ధమైన కారణం ఏమైనా ఉందా? ఒక లక్షా ఎనభై వేలయినా అరవై వేలయినా అంత భూమి మళ్ళీ కొనుక్కోలేరనేది నిజమే అయినా ఆ తక్కువలోనూ

ఎక్కువ ఆందోళన చేసిన వారికి కొంచెం ఎక్కువ ఇవ్వడం ఏం చెబుతుంది? ఈ ప్రభుత్వం తనంతట తాను న్యాయం చేయదు. మీరు ఎంత ఒత్తిడిపెడితే అంత చేస్తుంది అనేనా? అట్లా అయితే ఆందోళనకారులను అణచివేయడానికి చేయగల ప్రయత్నాలన్నీ ఒక్కపక్క చేస్తూ, వాళ్ళవల్లనే ఇతర రైతులకు నష్టం జరుగుతున్నదని ఇతరులను రెచ్చగొడుతూ, ఏ ఆందోళన చేయని వారికి మొండిచేయి చూపించే కుతంత్రాన్ని ఏమనాలి?

పాలన కుతంత్రాలమయం కాబట్టే 'భూమికి భూమి' అన్న నినాదం నిర్వాసితుల నుంచి ప్రపంచవ్యాప్తంగా ముందుకొస్తున్నది. ఎంత భూమి తీసుకుంటారో, ఎటువంటి భూమి తీసుకుంటారో అంత భూమి, అటువంటి భూమి అందరికీ ఒకేచోట, సామాజిక బంధాలు తెగకుండా కల్పించండి అన్న డిమాండ్ ఇవ్వాళ వస్తున్నది. అది ఆచరణ సాధ్యంకాని చోట వేరే ఏ రూపంలోనైనా నిర్వాసితుల జీవన ప్రమాణం పడిపోకుండా ఉండేటట్టు వారికి పునరావాసం కల్పించాలి. కానీ మన దేశంలో అటువంటి విధానమేదీ లేకుండానే ప్రాజెక్టులు కట్టేస్తున్నారు. 'అభివృద్ధి' సాధించేస్తున్నారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాలలో రైతులు వ్యవసాయం చేసుకొని బతుకుతున్నారు. చేతిలో నాలుగు రాళ్ళు పెట్టి వారినక్కడి నుంచి తరిమేస్తే వేలాది ఆ ప్రజానీకం ఏమవుతారని ప్రభుత్వం అనుకుంటున్నది? ఎకరానికి 6 లక్షల రూపాయలిస్తే తప్ప అంత భూమి మళ్ళీ దొరకదని వాళ్ళు ప్రభుత్వాన్ని అడగగా, ఎకరానికి 2 లక్షల 10 వేలు ఇవ్వడానికి మాత్రమే ప్రభుత్వం ఒప్పుకుంది. ఇక భూమిలేని పేదలకు నష్టపరిహారం, ఊరందరికీ ఒకేచోట ఉమ్మడి పునరావాసం కల్పించే దిశగా 2005 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల శాఖ ద్వారా జీవో నెం. 68ని జారీ చేసింది. దీనికి సహాయ పునరావాస విధానపత్రం అని పేరు పెట్టారు. దీని అమలుకోసం జరగవలసిన ఏ పనీ యెల్లంపల్లి ముంపు గ్రామాలలో గానీ, మిడ్‌మానేరు ముంపు గ్రామాలలో గానీ జరగలేదు. దానికి ముందుగా వివిధ వృత్తులు చేసుకొని బతికేవారి జాబితా తయారుచేయాలి. దానిని గ్రామ పంచాయితీలో ప్రదర్శించి అభ్యంతరాలు ఆహ్వానించి వాటిని పరిశీలించి తుదిరూపం ఇవ్వాలి. వ్యవసాయ కూలీలకు 750 రోజుల కనీస వేతనాన్ని, ఇతర వృత్తుల వారికి 625 రోజుల కనీస వేతనాన్ని నగదు రూపంలో చెల్లించాలి. దీని మొట్టమొదటి మెట్టయిన జాబితా తయారీ కూడా ఇప్పటిదాకా ఏ ఊరిలోనూ జరగలేదు.

అసలు ఈ పనులు చేయడానికి నియమించ వలసిన జాయింట్ కలెక్టర్ హోదా గల అధికారి (అడ్మినిస్ట్రేటర్) నియామకమే జరిగిన దాఖలాలు లేవు.

ముంపు గ్రామాలవారు చెట్టుకొకరూ, పుట్టకొకరూ చెదిరిపోకుండా ఒకేచోట ఉండదలచుకున్నట్టయితే ఈ అడ్మినిస్ట్రేటర్ వారిని కూర్చోబెట్టి వారి అభిప్రాయం తీసుకొని అన్ని వసతులూ గల పునరావాస గ్రామాన్ని తయారు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారిని మినహాయించి మిగిలిన వాళ్ళు తమ ఇల్లు తామే కట్టుకోవాలి గానీ గ్రామానికి లే అవుట్ వేసి, రోడ్లు, చెట్లు, నీళ్ళు, పంచాయితీ భవనం, స్కూలు వగైరా తయారుచేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత మాత్రం ప్రభుత్వానిదే.

యెల్లంపల్లి ముంపు గ్రామాలకు సంబంధించి ఈ ప్రయత్నమేదీ మొదలయిన దాఖలాలు లేవు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల విషయంలో కొంత మొదలయింది గానీ నిర్వాసితుల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా అధికార్లు తమ నిర్ణయాలు వారిపైన రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. చీర్లవంచ గ్రామవాసులు ముంపుకు గురికాగా ఆ ఊరి భూమిలో ఇంకా మిగిలిన దానిలోనే పునరావాసం ఇస్తామని అంటున్నారు. ఎలాగూ గ్రామం ఖాళీ చేసిపోయేటట్లయితే సిరిసిల్ల – కరీంనగర్ రహదారిపైన, వీలయితే కరీంనగర్‌కు దగ్గరగా పునరావాస గ్రామం నిర్మించినట్టయితే పిల్లలను చదివించుకొని కరీంనగర్‌లో ఏదయినా చేసుకొని బతుకుదామని గ్రామస్తుల ఆలోచన. పునరావాసం సంగతి నిర్వాసితులను సంప్రదించి నిర్ణయించాలని జీవో 68లో చెప్పిన సూత్రాన్ని మరిచిపోయి అధికార్లు వారిని బలవంతపెడుతున్నారు. ఈ బాధ్యత అప్పగించబడ్డ అధికారి చీర్లవంచకే చెందిన భూస్వామ్య కుటుంబీకుడు. అతను అధికారిలాగా కాక ఊరి దొరలాగా వ్యవహరిస్తున్నాడని రైతుల అభియోగం. ఒక్కమాటలో చెప్పాలంటే 'అభివృద్ధి'కి బలవుతున్న ప్రజలను ప్రభుత్వం లెక్కలో రానివారిగా భావిస్తూ వారి సమస్యలనూ, భయాలనూ, ఆకాంక్షలనూ హేళన చేస్తూ ప్రాజెక్టులు కట్టుకుంటూ పోతున్నది. ప్రజల జీవితాల మెరుగుదలకూ, తెలంగాణ ప్రాంత అభివృద్ధికీ ఈ ప్రాజెక్టులు అవసరం అని ఎంతగా ఆరాటపడి సాధించుకున్నారో అంతే పట్టుదలగా నిర్వాసితుల హక్కులకు అండగా నిలబడాలని కరీంనగర్ జిల్లా ప్రజలందరికీ విజ్ఞప్తి.

1. యెల్లంపల్లి, మిడ్ మానేరు ప్రాజెక్టులలో భూములు కోల్పోయే రైతులకు భూమికి భూమి లేదా దానికి సమానంగా నష్టపరిహారం ఇవ్వాలి.

2. లావోణి లేక అసైన్డ్ భూములున్న వారికి పట్టా భూములున్న రైతులకిచ్చినంత నష్టపరిహారం ఇవ్వాలి.

3. భూమిలేని కూలీలకూ ఇతర వృత్తుల వారికీ జీవో 68 నిర్దేశించిన నష్టపరిహారం ఒక్క పైసా తక్కువ కాకుండా ఇవ్వాలి. ప్రాజెక్టు పనులు ఆపి ఈ వర్గాల జనాభా సర్వే ముగించాలి.

4. పునరావాస గ్రామం ఎంపిక నిర్వాసితుల ఆకాంక్షలకు అనుగుణంగా చేపట్టాలి.

5. ప్రజలను పురుగులలాగా చూడడం మానేయాలి.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**

**25 ఆగస్టు 2008**

# పోరాట పటిమను కోల్పోయామా?

మొదట నందిగ్రాం, ఇప్పుడు సింగూర్. పారిశ్రామికీకరణ పేరిట ప్రజల జీవనాధారమైన భూమిని, నీటిని, గాలిని, చెట్లను కార్పొరేట్ కంపెనీలకు ఎడాపెడా కట్ట బెడుతున్న రెండంకెల వృద్ధిరేటు విధానాన్ని ఏ విధంగా ఎదుర్కోవచ్చునో పశ్చిమబెంగాల్ రైతాంగం దేశానికి చూపిస్తున్నారు. బాధిత ప్రజానీకం ఒక్కటిగా నిలబడితే, ప్రతిపక్ష పార్టీలూ, ప్రజా సంఘాలూ టీవీ ఛానెళ్ళముందే కాక నేల మీద కూడా ప్రతిఘటనకు సిద్ధపడితే, కొట్టినా కాల్చినా అరెస్టు చేసి జెయిల్లో పడేసినా సరేననుకున్నట్టయితే గ్రామాలనూ, భూములనూ ఖాళీ చేయించకుండా ఉమ్మడిగా అడ్డుతగలడం సాధ్యమేనని రుజువు చేశారు. గతంలో అనేక చారిత్రక సందర్భాలలో వామపక్ష పార్టీల నేతృత్వంలో ప్రజా పోరాటాలకు మార్గదర్శకులుగా నిలబడ్డ బెంగాల్ ప్రజలు ఈసారి వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్షవాది కాని నాయకురాలి నేతృత్వంలో మళ్ళీ అదే పాత్ర పోషిస్తున్నారు. వారికి ధన్యవాదాలు.

నందిగ్రాంలో జరిగిన హింస సింగూర్‌లో పునరావృతం కాలేదు. ప్రస్తుత ప్రయత్నాలు సఫలం అయితే కాకపోవచ్చు. అప్పట్లో సింగూరు పోరాటం శాంతియుతంగా జరిగింది కాబట్టే ఓడిపోయిందనీ, అందుకే నందిగ్రాంలో భూమి పోరాటం అనివార్యంగా హింసాత్మక రూపం తీసుకుందనీ చాలామంది వ్యాఖ్యానించారు గానీ అది తొందరపాటు వ్యాఖ్య అనుకోవలసి ఉంటుందేమో. అయిపోయిందనుకున్న సింగూరు భూ పోరాటం మళ్ళీ పుంజుకుంది. ఉమ్మడిగా జనం కంపెనీవారి పనులకు

అడ్డంపడి ప్రభుత్వాన్నీ టాటా వారినీ చర్చలకు లాక్కురాగలిగారు. నందిగ్రాంలో సెజ్ స్థాపనను వ్యతిరేకిస్తున్న వారి తరపున నిలబడ్డ 'భూమి ఉచ్ఛేద్ ప్రతిరోధ్ సమితి'కీ, ప్రభుత్వ విధానాన్ని అమలు చేయడం తమ పార్టీ బాధ్యతగా భావించిన సిపిఎం కార్యకర్తలకూ మధ్య ఘర్షణ మొదటి నుంచి హింసాత్మకంగానే సాగింది. హింస ఇరువైపులా జరిగింది. చివరికి ప్రభుత్వానికుండే పాలనా హక్కును నిలబెట్టడానికి పోలీసులూ సాయుధ సిపిఎం కార్యకర్తలూ ఉమ్మడిగా చేసిన దాడి దేశవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షించింది. తీవ్ర విమర్శకు కారణమయింది.

ఆనాడు అది అన్యాయం అన్న ఆ రాష్ట్ర గవర్నర్ గోపాలకృష్ణ గాంధీ చొరవను ఆ రాష్ట్ర ప్రభుత్వం 'అధిక ప్రసంగం'గా వర్ణించింది. తన పరిధి (కాబినెట్ పంపించిన కాగితాల మీత సంతకంపెట్టి విశ్రాంతి తీసుకోవడం) దాటిపోతున్నాడనింది. ఇప్పుడు బహుశా వారు నాలుక కరుచుకుంటున్నారేమో. గవర్నర్‌గారు మళ్ళీ పరిధి దాటిపోయి సామరస్య సాధనకు పూనుకున్నారు. ఇప్పటివరకు ఆ ప్రయత్నం ప్రజాస్వామికంగానే సాగుతున్నట్టు అనిపిస్తుంది. ఆయన ఆ చొరవే తీసుకోకపోతే ఒక పక్క రైతుల పట్టుదల, మరొకపక్క 'ఇట్లాగయితే ఈ రాష్ట్రం వదలి వెళ్ళిపోతాం' అన్న టాటా వారి బ్లాక్‌మెయిల్, దానికి తోడుగా 'మా ఊరికి రండి' అంటూ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పలుకుతున్న ఆహ్వానం, అన్నీ కలిసి మళ్ళీ భారీగా పోలీసులను దించడాన్ని 'అనివార్యం' చేసేవనడంలో సందేహం లేదు. సంఘర్షణ ఒక్కొక్కసారి ఎంత తప్పనిసరి అనుకున్నా, మానవ ప్రాణాలకు విలువ ఉందని భావించే వారందరూ దానిని నివారించే చొరవను, ఆ చొరవకు ఉద్యమకారుల వైపు నుంచి లభించే స్పందనను హర్షిస్తారు.

ఈ పోరాట స్ఫూర్తి ఇతర రాష్ట్రాల ప్రజలకు ఎందుకు కొరవడిందనేది ఆవేదన కలిగిస్తున్న ప్రశ్న. నిజానికి పారిశ్రామీకరణ పేరు మీద జరుగుతున్న అడ్డగోలు భూ సంతర్పణలో పశ్చిమ బెంగాల్‌ది మొదటి స్థానం కాదు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ లాంటి రాష్ట్రాలు చాలా ముందున్నాయి. మనది బహుశా అగ్ర భాగాన ఉన్న రాష్ట్రం. పెట్టుబడి పెడతానని ముందుకొచ్చిన వాడు ఎంత భూమి అడిగితే అంత, అక్కడ ఏ పరిశ్రమ పెడతాడో, ఏ సాంకేతిక ప్రక్రియ వాడతాడో, ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తాడో, ఎంత కాలుష్యం పుట్టిస్తాడో ఏమీ తెలియకుండా ఏమీ

అడగకుండా అప్పగించేస్తున్నారు. ఒక్కొక్కసారి అటువంటి వాడెవడూ కనుచూపు మేరలో లేకున్నా, 'భవిష్యత్ పారిశ్రామిక అవసరాల' పేరు మీద ఊర్లూ పొలాలూ ఖాళీచేసి 'ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ కార్పొరేషన్'కు అప్పగించేస్తున్నారు. గ్రామాలేమయినా చీమల పుట్టలా, భవిష్యత్ అవసరాల కోసం సాఫుచేసి భూమిని శుభ్రంచేసి ఏ టాటా వారో అంబానీగారో రాకపోతారా, ఆ భూమిలో రూపాయలు పండించకపోతారా అని నిరీక్షించడానికి?

గ్రామాలు చీమల పుట్టలే అయ్యాయి. తెలుగుదేశం హయాంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం 5000 ఎకరాల భూమిని సేకరించినప్పటి నుంచి నిన్న మొన్న జమ్మలమడుగు దగ్గర స్టీల్ ప్లాంట్‌కు భూమి అప్పగింత దాకా, ఏ భూసేకరణలోనైనా 'ఇంత భూమి ఎందుకు?' అన్న ప్రశ్నకు జవాబులేదు. ఆ ప్రశ్నను వేయవలసిన పద్ధతిలో వేస్తే అంత భూమి నిజానికి అక్కరలేదన్న జవాబు లభిస్తుందనీ, అక్కరలేని భూమి వెనక్కి వస్తుందనీ సింగూరు అనుభవం తెలుపుతుంది. కానీ మన దగ్గర అడగవలసిన పద్ధతిలో అడగలేకపోయాం. కాకినాడ దగ్గర 10 వేల ఎకరాల భూమిలో సెజ్ నెలకొల్పే ప్రతిపాదన మొదట వచ్చినప్పుడు అది ఒ.ఎన్.జి.సి వారి కోసం అన్నారు. వారి రిఫైనరీలు నెలకొంటాయన్నారు. కాని తనకా భూమి వద్దని ఒ.ఎన్.జి.సి అనింది. అప్పుడు ఒ.ఎన్.జి.సి కాకపోతే ఇంకొకరెవరో వస్తారన్నారు. అనంతపురం జిల్లాలో 60 వేల ఎకరాల సెజ్ భూతానికి మొదట ముందుకొచ్చిన డెవలపర్ వెనక్కిపోగా ఇంకొకరిని తీసుకొస్తామంటున్నారు. ఒక అవసరం కోసం భూములు సేకరిస్తారా లేక భూములు సేకరించి అవసరాన్ని వెతుక్కుంటారా? ప్రజలకు జీవనాధారం అయిన భూమి అంత పనికిరానిదయి పోయిందా?

ఈ క్రమంలో, పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి కోసం ఏర్పడ్డ ఎ.పి.ఐ.ఐ.సి ఒక భూముల బ్రోకర్ అయింది. నగర అభివృద్ధి కోసం పథక రచనచేసి దాని అమలు కోసం చొరవ తీసుకునే లక్ష్యంతో ఏర్పడ్డ 'హుడా' ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు, ప్రత్యేకించి బిల్డర్లకు కట్టబెట్టే ప్రక్రియలో మధ్య దళారీగా మారినట్లే, ఎ.పి.ఐ.ఐ.సి కూడా ప్రజలకు జీవనాధారమైన భూములను కంపెనీలకు కట్టబెట్టే ప్రక్రియలో అదే పాత్ర పోషిస్తున్నది. హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా

గ్రామాలలో ప్రతి భూసేకరణ వెనుక ఉన్నది ఈ కథే. మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లి దగ్గర ఏ సెజ్ ప్రస్తావనా లేకుండా ఎ.పి.ఐ.ఐ.సి కి గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ పార్క్ నెలకొల్పడం అనే నిరపాయకరంగా ధ్వనించే లక్ష్యం కోసం అని చెప్పి గ్రామీణ భూములు అప్పగించి, ఆ తరువాత అక్కడ అత్యంత కాలుష్య కారకాలయిన మందుల కంపెనీల సెజ్ నెలకొల్పారు. పోలేపల్లిలో భూములు కోల్పోయిన వారి ఆందోళనే ఇప్పటిదాకా చూశాము. ఇంకా మిగిలి ఉన్న వారు కాలుష్యం వల్ల రేపు ఊరు ఖాళీ చేసే రోజు రాబోతుంది.

అభయారణ్యాలు, రిజర్వ్ అడవులు, తీరప్రాంత పరిరక్షిత భూములు ఎంత పవిత్రమైనవో, అక్కడ పుల్లలు ఏరుకోవడం సహితం ఎంత నష్టకరమో ప్రభుత్వాలూ, న్యాయ స్థానాలూ చెప్పగా విన్నాం. ఆదివాసులకు భూమి హక్కులు కల్పించే 'అటవీ హక్కుల చట్టం' వల్ల జీవవైవిధ్యం ధ్వంసం అవుతుందన్న కారణంగా కనీసం మూడు హైకోర్టులు ఆ చట్టం అమలుపైన 'స్టే' ఇచ్చాయి. కానీ ఈ పవిత్ర విషయాలు కంపెనీలకు చేసే భూ సంతర్పణకు అడ్డురావడం లేదు. తూర్పుగోదావరి జిల్లా గాడిమొగ దగ్గర రిలయన్స్ వారికి, కృష్ణా జిల్లా పోలాటితిప్ప దగ్గర ఒక కాంగ్రెస్ ఎంపీగారికి మడ అడవులున్న భూమిని అప్పగించారు. వారిద్దరూ రాత్రికి రాత్రే స్థానిక గ్రామస్తులకే కొంచెం ఎక్కువ కూలి ఇచ్చి మడ చెట్లు కొట్టించారు. ఇదేం అన్యాయం అని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌ను అడగగా వారు రిలయన్స్‌ను కేంద్ర ప్రభుత్వమే ఏమీ చేయలేదని అన్నారట. కృష్ణా జిల్లా కలెక్టర్‌ను అదే ప్రశ్న అడగగా వారు ఆ భూమి అసలు నిషిద్ధ ప్రాంతంలో లేదన్నారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో నిజాంపట్నానికి దక్షిణాన నెలకొంటున్న పారిశ్రామిక కారిడార్ మడ అడవులను విస్తారంగానే మింగేయనున్నది. కర్నూలు జిల్లాలో జిందాల్ వారు ఆలస్యంగా భాగస్వాములయిన ఒక కంపెనీకి సిమెంట్ పరిశ్రమ కోసం 300 ఎకరాల మేత పోరంబోకుతో సహా 1500 ఎకరాల భూమిని అప్పగించారు. మేత భూములను సిమెంటు పరిశ్రమకెట్లా ఇస్తారని హైకోర్టులో కేసు వేయగా గ్రామ అడంగల్‌లో అది మేత భూమిగా నమోదయిన మాట వాస్తవమే గానీ అది మేత భూమిగా ఎప్పుడు మారిందో సూచించే కాగితాలేవీ లభ్యం కావడం లేదని కోర్టుకు జవాబు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా తేలినీలాపురం గ్రామంలో గుబురుగానున్న ఎత్తయిన చెట్ల మీదికి

ఆరు నెలల పాటు వేల రకాల పక్షులు వలసవచ్చి పిల్లల్ని పొదిగి తీసుకుపోతుంటాయని పర్యాటకులకు తెలుసు. ఇప్పుడు దానికి దగ్గరున్న కాకరపల్లి శివారులో దాదాపు 20 వేల ఎకరాల పొలాల నడుమ 1400 ఎకరాలలో బొగ్గుతో నడిచే థర్మల్ ప్లాంట్ వచ్చి వాలనుంది. ఏ పర్యావరణ ప్రమాణాల ప్రకారమూ ఇది జరగగూడదు గానీ స్థానిక ప్రజలకు ఏ సమాచారమూ లేకుండా జరిగిపోతూ ఉంది.

మరిక్కడ నందిగ్రాంలూ సింగూర్‌లూ ఎందుకు జరగడం లేదు? ఒక కారణం పాలకుల కుటిల నీతి. పాలకులు అంటే కేవలం రాజకీయ నాయకులు కాదు, కలెక్టర్ స్థాయి అధికారులు కూడా. వారు అబద్ధాలు చెప్తున్నారు. 'భూములు పోతే పోతాయి, మీకందరికీ ఉద్యోగాలొస్తాయి' అని చెప్తున్నారు. 'మీ ఊరికి కాలుష్య ప్రభావం అసలే ఉండదు' అంటున్నారు. 'మీకు రోడ్లొస్తాయి, షాపులొస్తాయి, మీరంతా అభివృద్ధి చెంది పోతారు. ఇది ఇష్టపడనివారు మీకు అబద్ధాలు చెప్తున్నారు' అంటున్నారు. గ్రామాలలో పెత్తందార్లను, కుల పెద్దలను చేరదీసి, వారికి అక్కడ రాబోయే సెజ్‌లో లేక పరిశ్రమలో చిన్నాచితకా కాంట్రాక్టులు ఇస్తామన్న హామీ యిస్తున్నారు. వారు తమ పెత్తనాన్ని వాడుకొని ప్రజలను అదుపు చేస్తున్నారు. లేదా గ్రామం రెండుగా చీలి ఘర్షణలు నెలకొంటున్నాయి.

పార్టీల, ప్రజాసంఘాల వైఫల్యమూ ఉంది. కొందరు నిజాయితీగా ప్రయత్నం చేసి విఫలం అవుతుండగా కొందరి పోరాటాలు టీవీ కెమెరాలను దాటిపోవడం లేదు. ఉద్యమాలకు పుట్టినిల్లుగా తన గురించి తాను చెప్పుకునే తెలుగు సమాజం ఎక్కడో ఏ ఘడియలోనో ఉద్యమించే శక్తిని కోల్పోయింది. ప్రజలను ఒక తాటిమీద సంఘటిత పరచి అన్యాయానికి అడ్డంగా నిలబెట్టే శక్తిని పార్టీలు, ప్రజాసంఘాలు కోల్పోయాయి. ఆరునెలలు టీవీ చానెళ్ళకు సెలవిచ్చి మమతా బెనర్జీని రాష్ట్రానికి ఆహ్వానిద్దామా?

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**10 సెప్టెంబర్ 2008**

# తప్పును సవరించుకుంటే తప్పా?

పోలేపల్లి భూములకు అదనంగా నష్టపరిహారం ఇచ్చే ప్రసక్తి లేదు అని ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి రెండు రోజుల క్రింద ప్రకటించిన విషయం మీడియా ప్రముఖంగానే చూపించింది, వినిపించింది. ఆ భూములకు 2003లో నష్టపరిహారం ఇచ్చేసారనీ, ఇప్పుడు మళ్ళీ దానిని తిరగదోడినట్టయితే పాత భూసేకరణ కేసులన్నీ తిరగదోడాలన్న ఒత్తిడి ప్రభుత్వం మీద పడుతుందనీ ఆయన స్పష్టంగా అన్నాడు.

ఇచ్చినప్పుడు చట్టాలనూ నియమాలనూ ప్రజల హక్కులనూ గౌరవించి నడుచుకొని ఉంటే ఈ మాటలలో ఒక తర్కం అయినా ఉందని ఒప్పుకుందుము. కానీ పోలేపల్లి భూసేకరణ ఆద్యంతం చట్టాలకూ నియమాలకూ విరుద్ధంగా జరిగింది. అయినప్పటికీ దానిని తిరగదోడకూడదా?

పోలేపల్లి భూసేకరణగా పేరుపడినది నిజానికి రెండు గ్రామాలలో జరిగింది. అవి ముదిరెడ్డిపల్లి (239.09 ఎకరాలు), పోలేపల్లి (439.09 ఎకరాలు). ఈ రెండు గ్రామాలలో కలిపి 678.18 ఎకరాల రైతుల పట్టాభూమి సేకరించడమే కాక పోలేపల్లిలోని 350 ఎకరాల లావోణి (అసైన్డ్) భూమిని కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఇది 2003లో జరిగిపోయిందని రాజశేఖరరెడ్డి అంటున్నాడు. తెలుగుదేశం పార్టీ మీదికి తప్పు నెట్టేయడం ఆయన ఉద్దేశం కావచ్చు. కానీ ప్రజలకు తప్పు ఏ పార్టీ పాలనలో జరిగిందనేది ముఖ్య విషయం కాదు. తప్పుచేసింది ప్రభుత్వమైనప్పుడు ప్రభుత్వమే దానిని సవరించుకోవాలని వారు కోరతారు. తప్పుకూ సవరణకూ మధ్య పాలకపార్టీ మారి ఉండవచ్చునుగాక. అయితేనేం?

2003లోనే శంషాబాద్‌లో విమానాశ్రయం కోసం కూడా భూసేకరణ జరిగింది. శంషాబాద్, పోలేపల్లి ఏమంత దూరాన ఉన్న ఊర్లు కావు. పైగా రెండూ జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. కాని శంషాబాద్‌లో ఎకరానికి 5 లక్షల రూపాయల దాకా నష్టపరిహారం ఇవ్వగా, పోలేపల్లి భూసేకరణలో అత్యధికం 2 లక్షల చిల్లర (ముదిరెడ్డిపల్లి భూములకు) ఇచ్చారు. పోలేపల్లి గ్రామ భూములకయితే 1 లక్ష రూపాయలు కనాకష్టంగా ఇచ్చారు. ఇది ఎవరి వల్ల జరిగిన వివక్ష అయితేనేం, ఇప్పుడు సవరించకూడదా?

రెండు చోట్లా 'సమ్మతి' అవార్డులే జారీ అయ్యాయి. అంటే ప్రభుత్వం మార్కెట్ విలువగా తాను గుర్తించిన మొత్తం చేతిలో పెట్టి ఇంకా కావాలంటే కోర్టుకు పొమ్మని చెప్పే పద్ధతి కాకుండా రైతులకు సమ్మతం అయిన మొత్తం వారితో మాట్లాడి ఇచ్చే పద్ధతినే పాటించారు. మరి శంషాబాద్ రైతులు 5 లక్షలు కోరగా పోలేపల్లి రైతులు 1 నుండి 2 లక్షలతో సంతృప్తి చెందారనుకోవాలా?

జరిగిందేమిటంటే, శంషాబాద్ భూసేకరణలో రైతుల సమ్మతి పొందడానికి ఒక పద్ధతి పాటించారు. దీని కోసం 1992లో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నియమాలు జారీ చేసింది. దాని ప్రకారం రైతులతో సంప్రదింపులు జరపడానికి జిల్లా స్థాయిలోనూ రాష్ట్ర స్థాయిలోనూ రెండు సంప్రదింపుల కమిటీలు ఉంటాయి. ఈ కమిటీలలో జిల్లా జడ్జి, కలెక్టరు తదితర పెద్దమనుషులు ఉంటారు. వారు రైతులందరినీ సంప్రదించి వారికి ఆమోదనీయమైన ధర, ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధపడే ధర నిర్ణయించి దానిని సమ్మతి అవార్డుగా ప్రకటిస్తారు. శంషాబాద్‌లో దీనిని పాటించారు. అందువల్ల ఎకరానికి 5 లక్షల రూపాయలొచ్చాయి. లావోణి భూములకు కూడా ఒకటిన్నర  లక్ష వచ్చింది. లావోణి పట్టా సహితం లేకుండ ప్రభుత్వ భూములలో వ్యవసాయం చేసుకుంటున్న 'చొరబాటుదారులకు' కూడా ఎకరానికి 65 వేల రూపాయల నష్టపరిహారం దక్కింది.

పోలేపల్లిలో సమ్మతి ఆ విధంగా నిర్ణయించలేదు. ఎంఆర్‌వో, ఆర్‌డివో తదితర అధికారగణం గ్రామంలో ఒక డజను మంది 'పెద్దమనుషులను' చేరదీసి వారితో భూమి ధర గురించి ఒక అవగాహనకు వచ్చింది. ఆ తరువాత ఆ పెద్దమనుషులు తమ 'పెద్దరికాన్ని' వినియోగించి భూములు కోల్పోయిన వారినందరినీ ఒప్పించారు. ఈ పెద్దమనుషులెవరై ఉంటారో పెద్దగా ఊహించనక్కరలేదు. పాలక పార్టీకి

చెందినవారు కావచ్చు, ఆ భూములలో రేపు రాబోయే పరిశ్రమలలో చిన్నాచితకా కాంట్రాక్టుల హామీ పొందినవారు కావచ్చు, లేదా రేపు రాబోయే ఎన్నికలలో సీట్ల హామీ పొందినవారు కూడా కావచ్చు.

నియమ విరుద్ధంగా నిర్ణయమైన ఆ 'సమ్మతి'ని రద్దుచేసి, 1992 నాటి నియమాలను గుర్తించి జిల్లా స్థాయి కమిటీ, రాష్ట్రస్థాయి కమిటీలను నియమించి, సరయిన పద్ధతిలో రైతులకు సమ్మతమైన రేటెంతో ఎందుకు తేల్చకూడదు? లావోణి భూములకు శంషాబాద్ భూసేకరణలో ఎకరానికి లక్షన్నర రూపాయల నష్టపరిహారం లభించిందని చెప్పుకున్నాము. పోలేపల్లి భూసేకరణలో ఆ భూములకు ఎకరానికి 18 వేలే ఇచ్చారు. ఇది ఘోరమైన అన్యాయమే కాక తత్సంబంధమైన నియమాలకు విరుద్ధం కూడా. 1993లో రాష్ట్ర ప్రభుత్వం '1307 జీవో' అనే ఆదేశాన్ని జారీ చేసింది. అంతకుముందు భూసేకరణలో అసైన్డ్ భూములకు నష్టపరిహారం ఇచ్చేవారు కాదు. ఇది అన్యాయమని గుర్తించి 1307 జీవోను జారీ చేయడం జరిగింది. దాని ప్రకారం లావోణి పట్టా భూములకు కూడా ప్రభుత్వం మౌలిక మార్కెట్ వెలతోపాటు అందులో 30 శాతం కలిపి నష్టపరిహారంగా ఇవ్వాలి.

పోలేపల్లి భూసేకరణలో సేకరించిన భూముల మార్కెట్ ధరను భూసేకరణ అధికారి తన ఆర్డర్లలో ప్రస్తావించారు. సేకరిస్తున్న భూములను ఆయన నాలుగు రకాలుగా విడగొట్టి ఒక్కొక్క రకానికి చెందిన మౌలిక మార్కెట్ విలువ లెక్కించాడు. అన్నిటికంటే తక్కువ ధర గల భూమి విలువ ఎకరానికి 24 వేలు అని తేల్చాడు. లావోణి పట్టా భూములన్నీ ఈ కోవకు చెందినవే అనుకున్నా, లావోణి భూములకు ఎకరానికి 24 వేలు, దానికి అదనంగా అందులో 30 శాతం, అంటే మొత్తం 32 వేలు ఇచ్చి ఉండవలసింది. 18 వేలే ఎట్లా ఇచ్చారు? 24 వేలకు 30 శాతం చేర్చే బదులు తీసేస్తారా? ఈ తప్పును సవరించమని అడగడం తప్పా? అది చేయకూడని పనా?

పునరావాసానికని చెప్పి పోలేపల్లి దగ్గర ప్రభుత్వమే ఏకపక్షంగా ఒక స్థలం చూపి అక్కడికి పోయి నివాసాలు ఏర్పరచుకునేటట్టయితే ఖర్చు కొంత ఇస్తానని అంటున్నది. పునరావాసం ఎక్కడ ఏర్పాటు చేయబోయేదీ ప్రభుత్వమే ఏకపక్షంగా నిర్ణయించడమూ నియమ విరుద్ధమే. నిర్వాసితులతో చర్చించి వారి సమ్మతితో

పునారావాస స్థలాన్ని ఎంపిక చేయాలని 2005లో జారీ చేసిన సహాయ పునరావాస విధానం (జీవో 68) అంటుంది. దాని కోసం ఒక జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారిని నియమించాలని అంటుంది. ఆ నియామకమేం జరగలేదు. కాగా, ఉపఎన్నికలలో జడ్చర్ల శాసనసభ్యునిగా ఎన్నికైన మల్లు రవిగారు మాత్రం ప్రజలనెట్లాగయినా పునరావాస స్థలంలో ఇళ్ళు కట్టుకునే పనిలో నిమగ్నం చేసేస్తే ఇంక ఆందోళన ఆగిపోతుందని భావించి ఆరాటపడుతున్నారు. తినే వాళ్ళకు తినబెట్టడం, తాగేవాళ్ళకు తాగబోయడం, ఇంటి ఖర్చుకు అదనంగా ఇప్పిస్తానని హామీలు గుప్పించడం చేస్తున్నారు.

2003లో జరిగిపోయింది అని రాజశేఖరరెడ్డి అంటున్నాడు గానీ అప్పుడేం చెప్పి భూములు సేకరించారు? ఇప్పుడేం చేస్తున్నారు? అప్పటికి దేశంలో సెజ్ చట్టం లేదు. అక్కడ సెజ్ నెలకొల్పే లక్ష్యం లేదు. 'పారిశ్రామిక అభివృద్ధి' అనే నిర్దిష్టమైన లక్ష్యంతో అప్పుడు భూసేకరణ చేశారు. 'ఇండస్ట్రియల్ పార్క్' అన్న మాట వాడడంతో అక్కడేదో పార్కు పెడతారంట అని పోలేపల్లివాసులు అనుకున్నారు. 'గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రీస్' అన్న ప్రయోగం కూడా చేయడం వల్ల మొత్తానికి ఏదో పచ్చగానే ఉండబోతుందను కున్నారు. (ప్రజలలో అవగాహన పెరగడంతో ఈ మధ్య పాలకులు, పారిశ్రామికవేత్తలు తెలివిమీరి అందవికారమైన కార్యక్రమాలకు అందమైన పేర్లు పెట్టడం మొదలుపెట్టారు.) చివరికి చేస్తున్నదేమిటంటే మందుల పరిశ్రమ ప్రత్యేక ఆర్థిక మండలిని నెలకొల్పడం. ఈ నిర్ణయం రాజశేఖరరెడ్డి గారు ప్రజలకు చెప్పారా? ఏదయితేనేం అనుకోవద్దు, ఎందుకంటే మందుల పరిశ్రమలు, రసాయన పరిశ్రమలు విపరీతమైన కాలుష్యం కలిగిస్తాయి. పోయిన భూములు పోగా మిగిలిన వాటిలో వ్యవసాయం చేయటం సాధ్యం కాదు. నీటి వనరుల కాలుష్యం విపరీతంగా ఉంటుంది. కాబట్టి ఆ పరిసరాలలో నివాసం కూడా సాధ్యం కాదు. మొదటే అక్కడ మందుల పరిశ్రమలు రాబోతున్నాయని చెప్పి ఉంటే, పటాన్‌చెరు అనుభవం తెలిసిన వారు పోలేపల్లి వాసులకు సలహా ఇచ్చి ఉందురు. వారు తగిన నిర్ణయం తీసుకొని ఉందురు. ఏదో చెప్పి ఏదో చేయొచ్చును గానీ భూసేకరణ నష్టపరిహారాన్ని గురించి మాత్రం పునరాలోచన చేయడానికి వీలులేదా?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**30 సెప్టెంబర్ 2008**

# విస్థాపనే అభివృద్ధా !

**భూ**మిలేని వాళ్ళు భూముల కోసం పోరాడే రోజులు పోయి భూములు ఉన్న వాళ్ళు వాటిని కాపాడుకోవడం కోసం పోరాటం చేసే రోజులొచ్చాయి.

ఇది గడచిన 10 సంవత్సరాలలో వచ్చిన ఒక ముఖ్యమైన మార్పు. 'అభివృద్ధి' తీసుకొచ్చిన మార్పు. భూమిలేని వాళ్ళు భూములొచ్చేసాయని పోరాటాలు మానేయలేదు. పోరాడి లాభం లేదని మానేశారు. అప్పుడెప్పుడో చట్టాన్ని ధిక్కరించి ఆక్రమించుకొని, పట్టాల కోసం ఎంఆర్‌వో కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయిన తర్వాత కొన్ని భూములకు భూపంపిణీ పేరుమీద ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది గానీ ఇక కొత్తగా ఇచ్చేదేమీ ఉండదని స్పష్టం అయింది. ఇప్పుడు భూమంతా 'అభివృద్ధి'కి కావాలి. పేదలు భూమి పొంది రెండు పూటలా తినడం 'అభివృద్ధి' కాదు కాబట్టి వారికి ఇక భూములు రావు.

కానీ ఉన్నవి పోగలవు, పోతున్నాయి. ప్రజలు తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములను, ప్రభుత్వం అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిన భూములను, పట్టా లేకున్నా చాలా కాలంగా కష్టించి బాగుచేసి సాగుచేసుకుంటున్న భూములను బలవంతంగా సేకరించి పరిశ్రమలకు ఇవ్వడం లేదా పరిశ్రమలకు ఎప్పటికైనా పనికొస్తాయని చెప్పి ముందస్తుగా ఎ.పి.ఐ.ఐ.సి.కి ఇచ్చి ఉంచటం, రోడ్లూ అవీ వేసి కార్పొరేట్ కంపెనీలను ఆహ్వానించి సెజ్‌ను ఏర్పాటు చేస్తానని ముందుకొచ్చిన డెవలపర్ చేతిలో పెట్టడం పెద్దెత్తున మొదలయింది. చంద్రబాబు పాలనలో హైదరాబాద్ పరిసరాలలో సాఫ్ట్‌వేర్ కంపెనీలకూ, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికీ భూములివ్వడం

దీనికి నాంది. రాజశేఖరరెడ్డి హయాంలో దేశంలో ఎక్కడా లేనంత భారీగా పరిశ్రమలకూ, గనులకూ, సెజ్‌లకూ, ఓడరేవులకూ, పారిశ్రామిక కారిడార్‌లకూ, విమానాశ్రయాలకూ భూముల్ని సంతర్పణ చేయడం జరుగుతున్నది.

హైదరాబాద్ పరిసరాలలోని రంగారెడ్డి జిల్లా గ్రామాలలో ఔటర్ రింగ్ రోడ్డు కోసం 6750 ఎకరాలు, ఇతర అవసరాలకు 20 వేల ఎకరాలు, విశాఖపట్నం దగ్గర రెండు, కాకినాడ దగ్గర ఒకటి కలిపి మొత్తం మూడు పెద్ద సెజ్‌లకు 27 వేల ఎకరాలు, విశాఖపట్నం జిల్లాలోనే చిన్నాచితకా సెజ్‌లకు, ఇతర పరిశ్రమలకు కలిపి 15 వేల ఎకరాలు, వాన్‌పిక్ అని పిలవబడే పారిశ్రామిక కారిడార్‌కు గుంటూరు – ప్రకాశం జిల్లాల్లో 28 వేల ఎకరాలు, చిత్తూరు జిల్లాలోని సత్యవేడు – వరదయ్యపాలెం మండలాల సెజ్‌కు 12 వేల ఎకరాలు, కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలో రానున్న ఉక్కు కర్మాగారానికీ, విమానాశ్రయానికీ కలిపి 16 వేల ఎకరాలు, నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో వస్తున్న సెజ్‌లు, ఓడరేవులు, థర్మల్ కేంద్రాలకు కలిపి 29 వేల ఎకరాలు...ఇప్పటికే పెద్దమొత్తంలో తీసేసుకున్న లేక తీసేసుకోబడుతున్న భూములు. వెయ్యి, రెండువేల ఎకరాల స్థాయిలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ తీసుకున్న భూములన్నీ ఏకరువు పెడితే ఈ కరపత్రం చాలదు.

ఇవి కాక ఏ రోజయినా తుదిరూపం తీసుకోగలవన్న భారీ భూసేకరణ ప్రతిపాదనలూ ఉన్నాయి. సింగరేణి బొగ్గు గనుల యాజమాన్యం ప్రతిపాదించిన 72 ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో భూ సేకరణ ఇప్పుడిప్పుడే మొదలుపెట్టింది. అంతా పూర్తిచేస్తే దాదాపు ఒక లక్ష ఎకరాలు అవుతుంది. సైనిక సిబ్బందికి కాల్పులలో శిక్షణ ఇవ్వడం కోసం నల్గొండ జిల్లాలో లంబాడా తండాలు ప్రధానంగా ఉండే రాచకొండ ప్రాంతంలో 18 వేల చిల్లర ఎకరాలలోనూ, పక్కనే రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో 9 వేల ఎకరాలలోనూ ఫీల్డ్ ఫైరింగ్ రేంజి ఏర్పాటుచేసే ప్రతిపాదన చాలాకాలంగా ప్రజలను బెదిరిస్తున్నది. ప్రభుత్వం లేదు లేదు అంటుంది గానీ అడపా దడపా సర్వేలు జరుగుతూనే ఉంటాయి. ఇది చాలక అనంతపురం జిల్లాలోని కంబదూరు, కనగానపల్లి మండలాలలో 13 వేల ఎకరాలలో ఫీల్డ్‌ఫైరింగ్ రేంజి నెలకొల్పే ప్రతిపాదన ముందుకొచ్చింది. అవి కూడా ప్రధానంగా లంబాడా తండాలు ఉండే ప్రాంతాలే.

ఇవన్నీ ఒకెత్తయితే 276 ఆదివాసీ గ్రామాలను ముంచే పోలవరం ప్రాజెక్టు మరొకెత్తు. ఇది ఎంత లేదన్నా లక్షన్నర జనాభాను నిర్వాసితులను చేస్తుంది. విస్థాపనలో దీనితో పోల్చదగ్గది కోస్టల్ కారిడార్ ప్రతిపాదన ఒక్కటే. సుదీర్ఘమైన తూర్పుతీరం వెంబడి విశాలమైన రోడ్లు, పెట్రోలియం ఆధారిత పరిశ్రమలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సెజ్‌లను ఏర్పరిచే ఈ ప్రతిపాదన వాస్తవ రూపం తీసుకున్నట్టయితే కేవలం భీమిలి-కాకినాడల మధ్యనే అది లక్షన్నర ఎకరాల భూమిని కబళిస్తుంది. 'కోస్టల్ కారిడార్ పేరుమీద మేము భూసేకరణ చేయడం లేదు. కేవలం రహదారి కోసం చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లా రోడ్‌షోలో చేసిన ప్రకటన తెలిసీ చెప్పిన అబద్ధం. కోస్టల్ కారిడార్‌లో భాగమైన వాన్‌పిక్ భూసేకరణ ప్రకటనలలో 'పారిశ్రామిక కారిడార్ కోసం' అని స్పష్టంగా రాశారు. ఇవికాక అనంతపురం జిల్లాలో ఒకటిన్నర మండలాలను మింగే ఐటి, బయోటెక్నాలజీ కంపెనీలతో కూడిన 60 వేల ఎకరాల సెజ్ వస్తుందన్న వదంతి ఉంది. ఇప్పుడు దానికి బదులు వేరే ఏదో సెజ్ వస్తుందంటున్నారు. ఈ సెజ్ భూతం వస్తే గిస్తే దేశంలోనే అతి పెద్దది అవుతుంది.

ఈ సంతర్పణను సమర్థించుకోవడానికి ప్రభుత్వం చేసే వాదన ఏమిటి?

ఫ్యాక్టరీలకు భూములు కావాలి, ఓడరేవులకు భూములు కావాలి, రహదార్లకు భూములు కావాలి, విమానాశ్రయాలకు భూములు కావాలి, అభివృద్ధికి ఇవన్నీ కావాలి అన్నది ప్రభుత్వం వాదన. అవుననే కొంచెంసేపు అనుకుందాం. కానీ వ్యవసాయానికీ భూములు కావాలి, పశువులను మేపుకోవడానికీ భూములు కావాలి, సముద్రంలో చేపల వేట చేసుకోవడానికీ తీరంవెంబడి భూములు కావాలి, కట్టెపుల్లలకూ, వాసాలకూ, తాటాకులకూ, ఇంటిగోడల కోసం మట్టికీ బంజర్లు కావాలి, కుంకుడుకాయల నుండి పనసకాయల దాకా కోసుకొని అమ్ముకోడానికీ, తిని బతకడానికీ అడవి భూములు కావాలి. మరి వీటి మీద బతికే ప్రజలు బాగుండడం అభివృద్ధికి అక్కరలేదా? ఈ రెండు అవసరాల మధ్య వైరుధ్యం లేదా? వైరుధ్యమేమీ లేనట్టు, ప్రకృతి నుండి ప్రజలు పొందే జీవనానికి మారుగా నాలుగు రూపాయలిచ్చి ఒక కాలనీ కట్టిస్తే సరిపోతుందనీ, ఎంత భూమి కావాలంటే అంత పరిశ్రమలు వగైరాలకు ఇచ్చుకోవచ్చుననీ భావించే పాలనా నీతిని ఏమనాలి?

'నాలుగు రూపాయలు' అనేది కేవలం వెక్కిరింత కాదు. ఇప్పుడున్న భూసేకరణ ప్రక్రియలో భూములకు దొరికే నష్టపరిహారం వారు కోల్పోయిన దానిలో నాలుగవ వంతు కొనుక్కోవడానికి కూడా సరిపోదనేది అందరూ ఎరిగిన సత్యం. వేరొకచోట స్థిరపడి ఊరుమ్మడి బతుకు కొనసాగించడానికి అవసరమైన పునరావాసం గానీ, భూములు లేని వారికి ఇచ్చే నష్టపరిహారం గానీ ఈనాటికీ ఒక హక్కు కాదు. దానికొక చట్టం లేదు. అమలు అయీ కాని పాలనా విధానాలే వాటికి ఈనాడున్న ఆధారం.

నిజానికి మన పాలకులు చేస్తున్న అభివృద్ధి వాదనకు సహితం ఇప్పుడు జరుగుతున్న భూసంతర్పణ అవసరమా అన్న అనుమానం భూమిని రియల్ ఎస్టేట్ దృష్టితో చూడడం అలవడని వారికి రాకమానదు. దేశ అభివృద్ధికి విమానాశ్రయాలు అవసరమనే అనుకుందాం. పెదనందిపాడులోనూ, జమ్మలమడుగులోనూ కూడా అవసరమా? ఓడరేవులు కూడా అవసరమనే అనుకుందాం, విశాఖపట్నానికీ కాకినాడకూ మధ్య అయిదు ఓడరేవులు అవసరమా? విశాలమైన రోడ్లు అవసరమనే అనుకుందాం. దేశంలో ఎక్కడా లేనిది 500 అడుగుల వెడల్పున్న 8 లేన్ల రోడ్డు హైదరాబాద్ చుట్టూ అవసరమా? బొగ్గు సమృద్ధిగా అవసరమే అనుకుందాం. ఆదిలాబాద్ నుండి ఖమ్మం దాకా గోదావరి తీరం వెంబడి ఓపెన్‌కాస్టు తవ్వకాలు చేపట్టి ఊర్లు ఖాళీ చేయించి మట్టి గుట్టలూ, బొందలూ మిగల్చడం అవసరమా?సాగు నీటి ప్రాజెక్టులు అవసరమనే అనుకొందాం. ఎక్కడికక్కడ నీటిని చిన్న ప్రాజెక్టుల ద్వారా తీసుకొని విశాల ప్రాంతానికి నీరిచ్చే ప్రత్యామ్నాయం ఉండగా పోలవరం వంటి భారీ ప్రాజెక్టులు కట్టి ఫలమంతా దిగువకే ఇచ్చి ఎగువన ఆదివాసీ ప్రాంతంలో 276 గ్రామాలను ముంచడం అవసరమా? సైనికులకు కాల్పులు జరపడంలో శిక్షణ అవసరమనే అనుకుందాం. కంటోన్మెంట్లన్నింటిలోనూ ఫైరింగ్ రేంజ్‌లు కావలసినన్ని ఉండగా అదనంగా మూడు జిల్లాలలో లంబాడా గిరిజనులు కష్టంచేసి సాగులోకి తెచ్చిన 40 వేల ఎకరాల బంజరు భూమి ఇచ్చేయవలసిందేనా? విద్యుదుత్పత్తిని వేగంగా పెంచడానికి సూపర్ థర్మల్ ప్లాంట్లు అవసరమనే అనుకుందాం. దానికోసం పర్యావరణరీత్యా సున్నితమైన తీరప్రాంతాలలో నాలుగు భారీ థర్మల్ కేంద్రాలు – శ్రీకాకుళం జిల్లా తేలినీలాపురం పక్షుల అభయారణ్యం దగ్గరొకటి, సిఆర్‌జెడ్‌లో ఉన్న గుంటూరు జిల్లా డిండి దగ్గరి ప్రాంతంలో ఒకటి, నెల్లూరు జిల్లా కృష్ణపట్నం

దగ్గర ఒకటి, కృష్ణాజిల్లా పోలాటితిప్ప దగ్గర మడ అడవుల ప్రాంతంలో ఒకటి – నెలకొల్పడం సముచితమా?

ఉద్యోగాలొస్తాయనేది ప్రభుత్వం ప్రజలకు చూపిస్తున్న ఎర. భూముల నుండి వెలివేయడం వల్ల జీవనం కోల్పోయే ప్రజలను లెక్కగట్టి ఒక్కొక్కరికీ అక్కడ వెలిసే ఫ్యాక్టరీలలో, ఓడరేవులలో, గనులలో ఉద్యోగాలు, ఉపాధి కల్పించే విధానమేదయినా ప్రభుత్వానికి ఉందా అంటే లేదు. ఉన్నా అవన్నీ ప్రైవేట్ సంస్థలు కాబట్టి కోర్టుల దృష్టిలో అది చెల్లదు. పైగా ఇప్పుడొచ్చే టెక్నాలజీ ఎక్కువ పెట్టుబడిని, తక్కువ శ్రమనూ వినియోగించి ఉత్పత్తి సాగిస్తుంది కాబట్టి రాగల ఉద్యోగాలూ అతి తక్కువే. గడచిన పాతిక సంవత్సరాలలో భారత ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో ఉత్పత్తి ఎన్నోరెట్లు పెరిగింది గానీ కార్మికులు, ఉద్యోగుల సంఖ్య ఒక్క శాతం కూడా పెరగలేదని అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. మొదటి దశలో రోడ్లు, బిల్డింగ్‌లు మొదలైన నిర్మాణాలు చేపట్టే పనిలో కొంత ఉపాధి దొరుకుతుంది కాబట్టి బలవంతంగా విస్థాపనకు గురయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి లభించినట్టే అనిపిస్తుంది. కానీ ఆ దశ దాటిపోయిన తరువాత ఏమీ ఉండదు.

అయితే నష్టపరిహారం, పునరావాసాల గురించే కాక అభివృద్ధి విధానాల గురించే పునరాలోచన చేయవలసిన అవసరం ఉంది. అమెరికా తరహా విధ్వంసకరమైన అభివృద్ధిని మనం అనుకరించవలసిన అవసరం ఉందా అన్న ప్రశ్న వేసుకోవలసిన అవసరం ఉంది. మన దేశంలో అత్యధిక భాగం ప్రజలు ప్రకృతిపైన ఆధారపడి జీవిస్తున్నారు. వారిని ఆ ప్రకృతి నుండి వెలివేసి దానిని రియల్ ఎస్టేట్‌గా మార్చే అభివృద్ధి విధానం మనకు ఉచితమా? పర్యావరణ సమతుల్యాన్ని గౌరవిస్తూ ఆ ప్రకృతి వనరులను ఆ ప్రజలకోసమే అభివృద్ధి చేయలేమా? తద్వారా వారి జీవితాలను మెరుగుపరచి ఆ మెరుగుదలను భూమిక చేసుకొని దేశాన్ని అభివృద్ధి చేసే విధానాలు రూపొందించలేమా? అటువంటి ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించడం, వాటికోసం ఆందోళన చేయడం అవసరం. ఈ లోపల విధ్వంసకరమైన అభివృద్ధి వల్ల విస్థాపనకు గురవుతున్న ప్రజల హక్కులకు, వారి ఆందోళనలకు అండగా నిలబడటం అవసరం.

ప్రతిపక్ష పార్టీల నినాదాలలో ఆ ఆలోచనల ఛాయల కోసం వెతకటం వృధా ప్రయాసే. ప్రజల మనసెరిగి నినాదాలు ఇవ్వడం ప్రతిపక్ష పార్టీలు, ప్రతిపక్ష పాత్ర

పోషిస్తున్న పత్రికలూ నేర్చుకున్నాయి కాబట్టి రాజశేఖర్‌రెడ్డి అనుసరిస్తున్న వికృతమైన అభివృద్ధి విధానాలను వారు విమర్శిస్తున్నట్లే అనిపిస్తుంది. కానీ జాగ్రత్తగా పరిశీలిస్తే వారు విమర్శిస్తున్నది అభివృద్ధి విధానాల అమలులోని అక్రమాలనే తప్ప అభివృద్ధి విధానాలే అక్రమం అని కాదని అర్థం అవుతుంది. ఒక్కొక్కసారి కేవలం రాజశేఖరరెడ్డి మనుషులే ప్రయోజనమంతా తీసుకుంటున్నారనీ, తమవారికేమీ మిగల్చటం లేదనీ వెళ్ళగక్కుతున్న అక్కసు తప్ప వారి విమర్శలో ఇంకేమీ కనిపించటం లేదు. ప్రజలకు జరుగుతున్న అన్యాయం ప్రస్తావన అతి స్వల్పం. అనంతపురం జిల్లా ఓబుళాపురం గనుల గురించి, వాటి లీజు గురించి పుంఖాను పుంఖాలుగా పత్రికలలో చదివాము, తెలుగుదేశంవారి నోట విన్నాము. అయితే గాలి జనార్ధనరెడ్డి గారి కంపెనీ దళితులకు ఉపాధి కల్పిస్తామన్న అబద్ధపు హామీ ఇచ్చి 350 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా ఆక్రమించుకొని వారి పొట్టకొట్టిందనీ, ఆ భూమిని దళితులకు వెనక్కి ఇప్పించవలసిన రెవెన్యూ అధికారులు దానిని ప్రభుత్వపరం చేసి వారికి హక్కే లేకుండా చేశారనీ, ఆ భూమిని జనార్ధనరెడ్డికే కట్టబెట్టడానికి మార్గం సుగమం చేశారనీ ఆ ప్రచారంలో మనం వినలేదు.

విధ్వంసక అభివృద్ధిలో మధ్యదళారులయిన వారి అంతఃకలహాలుగా ప్రతిపక్ష ఆందోళనలను వర్ణిస్తే వారు నొచ్చుకుంటారేమో గాని అది తొంభైశాతం సత్యం. దాని నుండి ప్రజలకు కావలసిన చర్చ పుట్టదు. పోలేపల్లి, కాకినాడ సెజ్‌లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల నుండి, ఆదివాసుల బాక్సైట్ వ్యతిరేక ఆందోళన నుండి, మత్స్యకారుల కోస్టల్ కారిడార్ వ్యతిరేక ఉద్యమాల నుండి మాత్రమే పుట్టగలదు. ఆ ఆందోళనలకు బాసటగా నిలిచి, ఆ చర్చ చేపట్టి, మానవీయమైన అభివృద్ధి విధానాన్ని ఆవిష్కరించుకుందాం రమ్మని ఆహ్వానం పలుకుతూ...

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**
**1 నవంబర్ 2008**

# అభివృద్ధి వికృత ఫలితాలు

ఇచ్చిన హామీలు అమలు కావని ప్రజలు గ్రహించారని అర్థం అయ్యేసరికి రిలయన్స్ వారికి గాభరా పట్టుకుంది. మామూలుగా ఎవరైనా కలవాలని ప్రయత్నం చేస్తే తమ వద్ద అంత సమయం లేదని ఫోజుకొట్టే రిలయన్స్ అధికారులు ప్రజలను ప్రభావితం చేయగల వారి దగ్గరకు తామే వెతుక్కుంటూ వచ్చి వివరణ ఇచ్చుకుంటున్నారు.

తూర్పుగోదావరి జిల్లా తాళ్ళరేవు మండలంలో గాడేరు వాగు సముద్రాన్ని కలిసే చోట రిలయన్స్ వారు సహజవాయువును వెలికి తీసే ప్రాజెక్టు చేపట్టారు. సముద్రం లోపల 'ఆఫ్‌షోర్' డ్రిల్లింగ్ ద్వారా సహజవాయువును వెలికి తీసి, పైప్‌లైన్ల ద్వారా యానాం దగ్గర తీరం ఎక్కించి, అక్కడి నుండి మళ్ళీ పైప్‌లైన్ల ద్వారానే తాళ్ళరేవు మండలం లోని గాడిమొగ గ్రామం దగ్గరకు తీసుకొస్తారు. అక్కడ ఆ సహజవాయువులోని తడిని తొలగించి పొడిగా మార్చే 'ఆన్‌షోర్' ప్రాసెసింగ్ కేంద్రం నెలకొల్పారు. అదయిన తరువాత పొడి వాయువు దేశమంతా సరఫరా అవుతుంది.

గాడిమొగ ఏడు గ్రామాలున్న పంచాయితీ. అందులో నాలుగు పూర్తిగా మత్స్యకారుల గ్రామాలు కాగా మూడు దళితులు, ఇతర భూమిలేని కూలీలు బతికే గ్రామాలు. ఈ మత్స్యకారులు సముద్రంలో వేటకు పోరు. సముద్రపు పోటుని నేలమీదికి తీసుకొచ్చే ఉప్పునీటి కాలవలలో వేట చేస్తారు. ఆ విధంగా రోజుకు 300 నుండి 400 రూపాయలు సంపాదించేవారమని వారు అంటారు. ఉప్పునీటి కాలవలే కాక వారికి వేరే రెండు జీవనాధారాలు ఉండేవి. ఒకటి, గాడిమొగ సమీపంలో ఉన్న 80 ఎకరాల భూమిలోని మడ అడవిలో పీతలు, రొయ్యల వేట. మడ చెట్ల వేర్లు నేలపైకే

వుంటాయి. వాటి కింద చిన్న చిన్న నీటి మడుగులు ఏర్పడతాయి. ఆ నీటి మడుగులు రొయ్యల పునరుత్పత్తి కేంద్రాలు. రెండు, ఆ మడ అడవులను ఆనుకొని వున్న ప్రభుత్వ బంజరులో నిర్మించుకున్న చేపల చెరువులు. ఇవి మత్స్యకారులవి కాగా, ఈ చేపల చెరువులకు అవసరమయిన కూలి పని గాడిమొగ పంచాయితీలోని ఇతర కులాల భూమిలేని పేదలకు జీవనం కల్పించింది.

ఈ జీవనాధారాలన్నిటిపైనా రిలయన్స్ దాడి చేసింది. మడ అడవులు, వాటి పక్కన ఉన్న బంజరు భూమి కలిపి మొత్తం 203 ఎకరాలలో తన 'ఆన్‌షోర్' ప్రాసెసింగ్ వ్యవస్థను నెలకొల్పింది. దాని కోసం మడ అడవులు మొత్తం నరికేయించింది. నేల చదును చేయడానికి ఉప్పు నీటి కాలువల్ని పూడ్చేసింది. చేపల చెరువులను పూడ్చేసింది. నేలను చదును చేయడానికి అవసరమైన మట్టిని గాడేరు వంటి వాగుల గర్భం నుండి డ్రెడ్జింగ్ చేసి తీసుకురావడం వల్ల ఆ ఉప్పునీటి వాగులు కలుషితం అయ్యాయి. సముద్రపు పోటు తెచ్చే నీరు బురదనీరయ్యింది. అందులో చేపలు తదితర జలజీవాలు కరువయ్యాయి.

ఇది శాశ్వతంగానే గాడిమొగ తదితర గ్రామాల ప్రజల జీవనాన్ని దెబ్బతీసింది. ఇక్కడ రిలయన్స్ చాలా తెలివిగా వ్యవహరించింది. అక్కడి మడ అడవుల్ని కొట్టేయడానికి స్థానిక ప్రజలనే కూలీలుగా పెట్టుకుంది. ఆ ప్రాంతంలో సగటున దొరికే కూలీ రేటు కంటే ఎక్కువ ఇచ్చి కొట్టేయించింది. అక్కడ ఫ్యాక్టరీ వస్తుందని చెప్పకుండ, ఏవో పెద్ద చెరువులు వస్తాయన్న అభిప్రాయం కలిగించింది. ఆ తరువాత వాళ్ళేమయినా అంటే మీరే కదా డబ్బులు తీసుకొని కొట్టేశారు అని ఎదురు దబాయించడానికి దారి సుగమం చేసుకుంది. నిజానికి మొదట అంతకంటే పెద్ద ఎత్తుగడే వేసింది. ఆ భూమిలో చేపల చెరువులున్న వారే ఆ భూమి యజమానులన్న కథ కల్పించి వారి నుండే వాటిని 'కొనుక్కునే' ప్రయత్నం చేసింది. అయితే ఈ సంగతి బయటపడి ప్రభుత్వ భూమిని రిలయన్స్ వారు ప్రైవేటు వ్యక్తుల నుండి కొనుక్కుంటున్నారని రచ్చ జరిగేసరికి అడవి కొట్టించేసి ప్రభుత్వం నుండే ఆ భూమిని పొందింది. మడ అడవి ఉన్న భూమిని ప్రభుత్వం ఏ పరిశ్రమకూ ఇవ్వకూడదు. కానీ ఈ 203 ఎకరాలు రిలయన్స్‌కు ఇచ్చే నాటికి అక్కడ మడ అడవి లేదు కదా!

చేపల వేట చేసుకునే ఉప్పునీటి వాగులను పూడ్చి వేసినట్టు గానీ, వాటిలోని నీరు కలుషితమయినట్టు గానీ రిలయన్స్ ఒప్పుకోదు. గాడిమొగను తాళ్ళరేవు మండల కేంద్రానికి కలిపే రోడ్డుకు ఇరువైపులా ఉన్న వాగులు మాత్రమే దెబ్బతిన్నాయని రిలయన్స్ అధికారులు దబాయిస్తున్నారు. అయితే చేపల వేట దెబ్బతిన్నందుకు ఒక్కొక్క నావకూ నెలకు 6000 రూపాయల నష్టపరిహారం ఇస్తున్నామన్న అభిప్రాయం కలిగించారు. ఇది శాశ్వతం అని మత్స్యకారులలో చాలామంది అనుకున్నారు గానీ యానాం దగ్గర గోదావరికి అడ్డంగా పైప్‌లైన్ వేసినప్పుడు, కొన్ని వాగుల మీద వంతెనలను కట్టినప్పుడు, ఆ నిర్మాణాలు చేపట్టినన్ని రోజులు మాత్రమే చేపల వేట ఆపవలసి వచ్చిందనీ, ఆ మేరకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చామనీ రిలయన్స్ ఆ తరువాత స్పష్టం చేసింది. ఆ నష్టపరిహారం కూడా 9 నెలలు మాత్రమే ఇచ్చింది.

కంపెనీలో పని కల్పిస్తామన్నది మొదట్లో ప్రజల నోళ్ళు మూయించడానికి రిలయన్స్ ఇచ్చిన ప్రధానమైన హామీ. ఆన్‌షోర్ కట్టడపు పనులు జరుగుతున్న రోజులలో కాంట్రాక్ట్ లేబర్‌గా గాడిమొగకు చెందిన 450 మందికి పని ఇచ్చారు. ఆ పంచాయితీలోని కుటుంబాల సంఖ్య 4000 పై చిలుకే. అందులో సగానికి పైగా తమ జీవనాన్ని కోల్పోయారు కాబట్టి కొద్దిమందికి పని ఇస్తే కుదరదనీ, అందరికీ ఇవ్వాలనీ గ్రామస్తులు పట్టుబట్టారు. కొంతమందికే ఇవ్వడం గ్రామంలో కలహాలకు దారితీస్తున్నది కాబట్టి అందరికీ ఇవ్వకపోతే ఎవరమూ పనిచేయము అని ఒక దశలో గ్రామస్తులు అనడం రిలయన్స్‌కు మంచి సాకు కల్పించింది. అయితే పని దొరికితే పోవడానికి అవసరం ఎక్కువున్న వారు ఇప్పటికీ సిద్ధంగానే ఉన్నారు. కానీ గాడిమొగ గ్రామస్తులకు పని ఇయ్యవద్దని కాంట్రాక్టర్లకు రిలయన్స్ చెప్పిందనీ, తాము కాకినాడ అడ్రసు ఇచ్చి పని చేయవలసి వస్తున్నదనీ పనిచేస్తున్న కొద్ది మంది అంటున్నారు. గాడిమొగ వారు అక్కడ పని చేయడం తమ హక్కుగా భావిస్తారు కాబట్టి వారిని అదుపు చేయడం కష్టమని రిలయన్స్ అధికారుల అభిప్రాయం కావచ్చు.

మొత్తానికి ఒక సంవత్సరం తిరిగేసరికి స్థానికులకు నష్టపరిహారం నిలిచిపోయింది, పనులు ఇవ్వడం ఆగిపోయింది. ఇంక కొద్ది నెలల్లో నిర్మాణం పనులు అయిపోతాయనీ, ఆ తరువాత మొత్తం ఉద్యోగులు 300 లేక 400 మించి ఉండరనీ, ఇంక స్థానికులకు ఇవ్వదలుచుకున్నా ఇవ్వగల పనులు ఉండవనీ రిలయన్స్

అధికారులు అంటున్నారు. ఈ సంగతి అర్థం అయిన మత్స్యకారులు ఆందోళనకు దిగడం రిలయన్స్ అధికారులకిప్పుడు చెమటలు పట్టిస్తున్నది. ఏదో ఒక రకంగా వాళ్ళను శాంతింపజేసినట్టయితే కొన్నాళ్ళకు వాళ్ళకూ ఈ స్థితి అలవాటయిపోతుందనీ, ఆపైన వ్యాపారం సాఫీగా సాగించుకోవచ్చుననీ వారి నమ్మకం. కాంగ్రెస్ నాయకులు ఈ సహాయం చేసిపెడతారని వారి ఆశ. భవిష్యత్ విస్తరణ కోసం వారు ఇప్పటికే ఈ 203 ఎకరాలను అనుకొని ఇంకొక 180 ఎకరాల ప్రభుత్వ భూమిని చేజిక్కించుకున్నారు. వేరొకచోట మల్లవరం గ్రామస్తుల స్వంత భూమి 500 ఎకరాల దాకా కొన్నారు. ఆ ఆందోళన చల్లారిపోతే ఆ విస్తరణకు ఢోకా ఉండదని వారి ఆశ.

ఇది ఒక రకంగా అన్ని 'అభివృద్ధి' కేంద్రాల చిత్రం. లక్షలాదిగా ఉద్యోగాలు వస్తాయనీ, ప్రజలకు అభివృద్ధి దొరుకుతుందనీ రాజశేఖరరెడ్డి ప్రకటిస్తున్నాడు గానీ తొలినాటి ఆవేశం చల్లారేదాకా కొంత నష్టపరిహారం, కట్టడపు పనులు జరిగే కాలంలో కాంట్రాక్ట్ లేబర్‌గా కొంత పని దొరుకుతాయి తప్ప ఆ తరువాత భూములు, జీవనం కోల్పోయిన ప్రజలకు ఏమీ లభించదు. ఆపైన వారిని ఆందోళనకు దిగకుండ అదుపు చేయడానికి ఏ మార్గాలు అనుసరించాలన్నదే కంపెనీలనూ ప్రభుత్వాన్నీ వేధించబోయే ప్రశ్న. పోలీసులను ప్రయోగించాలా? మరిన్ని ప్రలోభాలు కల్పించాలా? అవినీతి పరులయిన పాలక పార్టీ నాయకులు ప్రజలలోని అవినీతిపరులను చేరదీసి వారి సహాయంతో ఇతర ప్రజల నోర్లు మూయించే మార్గం ఎంచుకోవాలా? స్థానిక గ్రామాల నుండే గూండా గుంపును తయారు చేసి ఆందోళనకారులపైన ప్రయోగించాలా?

ఆయా ప్రాంతాలలో, ఆయా సందర్భాలలో అన్ని ప్రయోగాలనూ చేయబోతా రనడంలో సందేహమేమీ లేదు. రాబోయే రోజులలో వీటి వికృత ఫలితాలు దండిగా చూడబోతాం.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**22 ఫిబ్రవరి 2009**

## కాకినాడ, పోలేపల్లి

# రెండు సెజ్ వ్యతిరేక పోరాటాలు

**57** సెజ్‌లు అధికారికంగా ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్‌లో రెండుచోట్ల మాత్రమే ప్రజల నుండి ఉద్యమం రూపంలో ప్రతిఘటన రావడం రాష్ట్రంలో ప్రజా ఉద్యమాల బలహీన స్థితికి అద్దం పడుతుంది. ఆ రెండు చోట్ల కూడ ప్రజలను కూడగట్టింది, కదిలించింది ఏ వామపక్ష ఉద్యమమూ కాదు, ప్రజాసంఘమూ కాదు. స్థానిక స్వచ్ఛంద సంస్థల కార్యకర్తల కృషే ప్రజల నిరసనకు ఉద్యమరూపం ఇచ్చింది.

### కాకినాడ సెజ్ వ్యతిరేక పోరాటం

'కాకినాడ పోర్ట్ ఆధారిత సెజ్'కు వ్యతిరేకంగా రెండు మండలాల ప్రజలు రెండేళ్లకు పైగా చేస్తున్న పోరాటం మీడియా ద్వారా రాష్ట్రం దృష్టిని బాగానే ఆకర్షించింది. ఇది రాష్ట్రంలో మొదట వచ్చిన సెజ్‌లలో ఒకటి. మిగిలిన రెండు చిత్తూరు (సత్యవేడు, వరదాయపాలెం మండలాలలో శ్రీసిటీ అనే ప్రైవేట్ డెవలపర్ చేపట్టిన సెజ్), విశాఖపట్నం (రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో ఆంధ్రప్రదేశ్ మౌలిక వసతుల కార్పొరేషన్ (ఎ.పి.ఐ.ఐ.సి) చేపట్టిన సెజ్) జిల్లాలలో అదే సమయంలో వచ్చాయి. కాని ఇక్కడే ప్రతిఘటన ఉద్యమం రావడానికి కారణం సకాలంలో చురుకయిన కార్యకర్తలు రంగంలోకి దిగడం ఒక్కటే కాదు. వేరే కారణాలు చాలా ఉన్నాయి.

అన్నిటికంటే బలమైనది, తొలినాడు కాకినాడ-సామర్లకోట రహదారికి సమీపంలో ప్రతిపాదించి భూసేకరణ నోటిఫికేషన్ సహితం జారీ చేసిన సెజ్‌ను

అకస్మాత్తుగా అక్కడి నుండి రాజకీయంగా నోరులేని తొండంగి, యు. కొత్తపల్లి మండలాల తీరప్రాంత గ్రామాలకు తరలించడం. రెండవది, ఒ.ఎన్.జి.సి. ఆధ్వర్యంలో పెట్రోలియం రిఫైనరీల స్థాపన కోసం ఉద్దేశించింది అని తొలుత ప్రకటించిన సెజ్ పట్ల ఒ.ఎన్.జి.సి. తనకు ఆసక్తి లేదని ప్రకటించిన తరువాత కూడా కె.ఎస్.ఇ.జడ్ అనే ప్రైవేట్ డెవలపర్ ద్వారా దానిని కొనసాగించడం. మూడవది ఫలవంతమైన నేలలను సారహీనమైనవిగా వర్ణించి సెజ్ స్థాపనవల్ల జీవనానికేమీ నష్టం లేదని బుకాయించడం, నాలుగవది డెవలపర్ కొంత కొనుక్కుంటాడు, ప్రభుత్వం కొంత సేకరిస్తుంది అనే పేరుమీద వారి కొనుగోలుకు వీరి ఒత్తిడిని తోడుచేసి చవకగా భూములు తీసుకోవడం.

మొదటి ప్రతిపాదనలోనూ యు.కొత్తపల్లి మండలంలో 4946 ఎకరాలు తీసుకునే ఆలోచన ఉండింది గానీ అవి రహదారికి సమీప గ్రామాలు. అదనంగా, కాకినాడ రూరల్ మండలంలో 3778 ఎకరాలు, సామర్లకోట మండలంలో 369 ఎకరాలు, పిఠాపురం మండలంలో 777 ఎకరాలు ఆ ప్రతిపాదనలో ఉన్నాయి. ఇవి సారవంతమైన మాగాణి భూములు, చాలావరకు రియల్ ఎస్టేట్‌గా రూపాంతరం చెందుతున్న భూములు. వాటి యజమానులు రాజకీయంగా బలవంతులు కూడ. ఈ కారణంగానే భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసిన తరువాత కూడ ఆ ప్రతిపాదనను మార్చి, యు. కొత్తపల్లి, తొండంగి మండలాల్లో కూడ సముద్రతీరానికి దగ్గరగా ఉన్న ప్రాంతంలో భూసేకరణ మొదలుపెట్టారని ప్రజలు నమ్ముతున్నారు. ఈ శంక పలుమార్లు, పలు వేదికల నుండి వ్యక్తం చేసినప్పటికీ అంతకంటే సంతృప్తికరమైన కారణమేదీ ప్రభుత్వం చెప్పలేదు. కాబట్టి ఇదే నిజమని నమ్మడంలో తప్పు లేదు.

మొదటి ప్రతిపాదనను అనుసరించి భూసేకరణ నోటిఫికేషన్ 11 అక్టోబర్ 2005 నాడు వెలువడింది. అయితే 29 డిసెంబర్ 2005, 1 జనవరి 2006 తేదీలలో వేరే నోటిఫికేషన్ పత్రికలలో వచ్చింది. దీని ప్రకారం అవే 9869 ఎకరాలను యు. కొత్తపల్లి, తొండంగి మండలాలలో, కాకినాడ నుండి ఉప్పాడ మీదుగా తునికి వెళ్ళే తీరప్రాంత రహదారి సమీపంలో సేకరిస్తారు. ఈ నోటిఫికేషన్ చూసిన తరువాతే మొదటి భూసేకరణ ప్రతిపాదన రద్దయి కొత్తది వచ్చిందని ప్రజలకు తెలిసింది. అయితే అదే సమయంలో కర్నాటి వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని డైరెక్టర్‌గా కలిగిన

కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్‌కి (ఎస్.ఇ.జడ్) చెందిన మనుషులు రెవిన్యూ అధికారులతో కలిసి ఊర్లలోకి వచ్చి భూములు అమ్మమని రైతులపైన ఒత్తిడి పెట్టసాగారు. ఈ కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే దాని పూర్వనామధేయం కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్. సెజ్ చట్టం అనేది దేశంలో లేకముందే ఈ సంస్థకు (2002 నవంబర్ 27న) కాకినాడ సమీపంలో ఒక పోర్ట్ ఆధారిత ప్రత్యేక ఆర్థికమండలి నెలకొల్పడానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. ఒక సంవత్సరం లోపల వివరమైన ప్రతిపాదనలు సమర్పించాలన్న షరతుతో ఇచ్చిన ఈ అనుమతిని ఆ కంపెనీ అటువంటి ప్రతిపాదనలేవీ సమర్పించకుండానే సంవత్సరానికొకసారి పొడిగించుకుంటూ వచ్చింది. 2005లో సెజ్ చట్టం వచ్చిన తరువాత తన పేరును కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకొని వివరమైన ప్రతిపాదనలు సమర్పించి, చివరికి 27 జూన్ 2006న 'బహుళ ఉత్పత్తుల ప్రత్యేక ఆర్థిక మండలి' నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి పొందింది. అయితే దీని ఏర్పాటు ఎక్కడ జరుగుతుందన్న ప్రస్తావన ఆ అనుమతిపత్రంలో లేదు. 'తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో' అని మాత్రమే ఉంది.

మొదట ఈ భూసేకరణ ఒ.ఎన్.జి.సివారి రిఫైనరీ, తదితర పెట్రోలియం ఆధారిత పరిశ్రమల సెజ్ కోసం అన్న అభిప్రాయంతో ప్రజలున్నారు. అయితే 2005 చివరి భాగానికి వచ్చేసరికి ఈ ప్రాజెక్టు పట్ల వారికి ఆసక్తి లేదన్న వదంతి వ్యాపించింది. అదే సమయంలో కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు రెవెన్యూ వారిని వెంటబెట్టుకొచ్చి ఒత్తిడిపెట్టి భూములు కొనుగోలు చేయసాగారు. భూసేకరణ నోటిఫికేషన్ విడుదలయిన తరువాత భూములు కొనుగోలు చేయడంపైన నిషేధం లేదుగానీ అటువంటి కొనుగోళ్లను రిజిస్టర్ చేయరు. వాటిని రెవెన్యూ అధికారులు అసలే ప్రోత్సహించకూడదు. కొంతకాలానికి తేలిందేమిటంటే 2005లో కేంద్రప్రభుత్వ పెట్రోలియం మంత్రిత్వశాఖ, ఒ.ఎన్.జి.సి. కొత్త మేనేజ్‌మెంట్ ఆ సంస్థ వ్యవహారాలను సమీక్షించే క్రమంలో చమురు వెలికితీతకే ఒ.ఎన్.జి.సి. పరిమితం కావాలనీ రిఫైనరీల వంటివాటి జోలికి పోకూడదనీ నిర్ణయించారని. ఆ కారణంగా కాకినాడ సెజ్‌పైన ఒ.ఎన్.జి.సి.కి ఆసక్తి పోగా వారికోసం మొదలుపెట్టిన భూసేకరణను ఆపవలసిన ప్రభుత్వం కాకినాడ సెజ్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి ఆ భూమిని అప్పగించే ఆలోచన చేసింది. భూమికి ప్రజల జీవనాధారంగా ఏ విలువా లేదనీ, ఒక వ్యవసాయేతర

ప్రయోజనం కోసం కాకపోతే మరొక దానికోసం దానిని బదలాయించ వచ్చుననీ నమ్మే ఒక స్పష్టమైన వైఖరి ఇక్కడ కనిపిస్తుంది.

## మోసపూరిత భూసేకరణ వ్యూహం

ఒక ప్రయోగంగా, ఈ భూమిని కొంత డెవలపర్ కొనుక్కుంటే కొంత ప్రభుత్వం సేకరిస్తుందన్న వ్యూహాన్ని అనుసరించారు. ప్రైవేట్ కంపెనీలకు అవసరమైన భూమిని వారే కొనుక్కోవాలనీ, ఏమయినా తక్కువ పడితేనే ప్రభుత్వం భూసేకరణ చట్టం ద్వారా సేకరించాలనీ ఇప్పుడు చాలామంది అంటున్నారు కాబట్టి వినడానికి అందంగా అనిపించే ఈ వ్యవస్థ ఆచరణలో ఏ విధంగా ఉంటుందో కాకినాడ సెజ్‌లో చూడవచ్చు. దీనిని బాధితుల మాటలలోనే చూస్తే బాగుంటుంది. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కాకినాడ సెజ్ వ్యతిరేక సమితి ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఇచ్చిన వివరణకు సమాధానంగా బాధితులు ఏమన్నారో చూడండి.

> *4850 ఎకరాల మేరకు రైతులు ఇప్పటికే ఎకరాకు మూడు లక్షల చొప్పున కె.ఎస్.ఇ.జడ్ డెవలపర్‌కు అమ్మేసారని జిల్లా కలెక్టర్ అన్నారు. అయితే ఈ అమ్మకం ఏ విధంగా జరిగిందో తెలిస్తే అది ఎంతమాత్రం స్వచ్ఛందం కాదని తెలుస్తుంది. గ్రామ కార్యదర్శులు, ఎంఆర్‌వోలు, ఆర్‌డివోలు వచ్చి మూడు లక్షలకు అమ్మకపోతే ప్రభుత్వ రేట్ల ప్రకారం ఒక లక్ష లేక ఒక లక్షా యాభైవేలు మాత్రమే ఇస్తామనీ, ఆపైన కోర్టులో వ్యాజ్యం నడుపుకోవలసి వస్తుందనీ బెదిరించారు. మోసమూ చాలా జరిగింది. కొంతమందితో 'నీ ఇరుగు పొరుగు వారు తమ భూమిని అమ్మేసారు' అని అబద్ధాలు చెప్పి అమ్మించారు. ఒకరు తన భూమిని అమ్మితే దానిని కొలుచుకునే పేరిట పక్కవారి భూమిని కొంత కలిపేసుకోవడం చాలా సందర్భాలలో జరిగింది. పక్కవారు దాని గురించి అధికారులకు ఫిర్యాదు చేయగా, 'నీ భూమిని కూడా అమ్మేస్తే నీకు మొత్తం నష్టపరిహారం వచ్చేటట్టు చూస్తాం తప్ప నీ భూమిని కలిపేసుకోకుండ ఆపలేము' అన్నారు. ఎక్కువ మంది ఈ రకంగా అమ్మినవారే. రైతుల మీద ఒత్తిడి పెట్టడంలో కె.ఎస్.ఇ.జడ్ డెవలపర్ తరఫున వచ్చిన వ్యక్తి, గ్రామ కార్యదర్శులు, ఎంఆర్‌వోలు, ఆర్‌డివో*

*కలిసి పనిచేసారు. ఈ సమాధానంతో 112 మంది ఇచ్చిన వాంగ్మూలాలు జతచేస్తున్నాము. వాటిని పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి.*

మూడు రకాల ఒత్తిళ్లు, మోసాల గురించి, అందులో ప్రభుత్వ సిబ్బంది పాత్ర గురించి ఈ వాక్యాలు తెలుపుతాయి. డెవలపర్ ఇచ్చే 3 లక్షలకు నీ భూమి అమ్మకపోతే ప్రభుత్వం అందులో సగం చెల్లించి భూసేకరణ చట్టం కింద నీ భూమిని తీసుకుంటుంది, ఆపైన నువ్వు కోర్టుల చుట్టూ ఒక దశాబ్ద కాలం తిరగాలి అని రెవెన్యూ సిబ్బందే బెదిరించడం; నీ పక్క కమతం యజమాని అమ్మేసాడు, అక్కడ సెజ్ వచ్చేస్తుంది, నువ్విక వ్యవసాయం ఏం చేసుకుంటావని బెదిరించి కొనుక్కోవడం. చాలా సందర్భాలలో ఆ రైతు తరువాత వాకబు చేస్తే పక్క రైతు అమ్మనేలేదని తెలిసింది. మూడవది, ఒకరి భూమి రెండెకరాలు కొని దానికి గట్టు పెట్టుకునే క్రమంలో పక్క పొలాన్నీ కలిపేసుకోవడం. అధికారులకు ఫిర్యాదు చేస్తే వాళ్లు చేతులెత్తేసి నీ భూమి కూడ అమ్మేయరాదా, డబ్బులయినా వస్తాయి అనడం, బాధితులు జతచేసిన 112 వాంగ్మూలాలలో ఈ మూడు రకాల అనుభవాలూ నమోదయినాయి.

ఈ అమ్మకాలలో ఇంకొక విచిత్రమైన విషయం కూడ వుంది. అన్ని క్రయ పత్రాలలోనూ అమ్ముతున్న వ్యక్తి 'ఆ భూమి నుండి సరయిన ఆదాయం రావడం లేదు కాబట్టి' అమ్ముకొంటున్నానని రాసాడు. వందల క్రయ పత్రాలలో అమ్మకానికి ఈ కారణమే చూపించారంటే ఇది కొనుగోలుదారు రాయించిన కారణమే తప్ప అమ్మకందారు స్వచ్ఛందంగా రాసింది కాదని స్పష్టం అవుతుంది. భూమి సరయిన ఫలం ఇవ్వడం లేదని రాయించడం వల్ల సెజ్ డెవలపర్‌కు వచ్చే ప్రయోజనం ఏమిటి? అది అతని ప్రయోజనార్థం కాదు, ప్రభుత్వం ప్రయోజనార్థం. అతను కొనుక్కోగా మిగిలిన భూమిని ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి సేకరించవలసి ఉంటుంది కదా. చుట్టుపక్కల భూములు సరయిన ఆదాయం ఇవ్వని కారణంగా రైతులు అమ్మేసుకున్నారన్న ఆధారం కల్పించినట్టయితే భూసేకరణను తక్కువ ధరకే చేయవచ్చు.

మొదట రైతులపైన ఒత్తిడి పెట్టి వారి భూముల్ని డెవలపర్‌కు 'స్వచ్ఛందంగా' అమ్మించడానికి ప్రభుత్వ సిబ్బంది సహకరిస్తారు. తక్కిన భూమిని ప్రభుత్వం చవకగా సేకరించడానికి అవసరమైన ఆధారం క్రయపత్రాలలో డెవలపర్ రాసి పెడ్తాడు.

## వ్యవసాయానికి పనికిరాని భూములా?

చవకగా సేకరించడానికే కాదు, భూసేకరణను సమర్థించుకోవడానికి కూడ వారికి ఈ అబద్ధం అవసరం అయింది. సెజ్‌ల కోసం భూసేకరణ మొదలయినప్పటి నుండి సాగు భూములలో సెజ్‌లు నెలకొల్పడం వల్ల వ్యవసాయ ఉత్పత్తి దెబ్బతింటున్నదన్న విమర్శ దేశంలో బయలుదేరింది. కాబట్టి సెజ్‌ల కోసం సారహీనమైన భూములు మాత్రమే తీసుకుంటున్నామన్న దబాయింపు ప్రభుత్వాలు మొదలుపెట్టాయి. అది నిజంకాని చోట ఈ దబాయింపే రైతులకు ఎక్కువ కోపం తెప్పించింది. కాకినాడ సెజ్ ప్రాంతమే కాదు, విశాఖపట్నం జిల్లాలోని రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలలో జరిపిన భూసేకరణలోనూ ఆ భూమి సారహీనమయినదని ప్రభుత్వ నివేదికలలో రాసారు. మాకు తిండిపెట్టే భూముల్ని బలవంతంగా తీసేసుకోవడం కాక అది పనికిరాని భూమి అంటారా అని రైతులు చాలా ఆగ్రహం వ్యక్తం చేసారు.

అక్కడయినా, ఇక్కడయినా సేకరణ చేస్తున్న భూములు చాలా ఫలవంతమైనవి. వాటిలో అధిక భాగానికి సాగునీటి సదుపాయం లేనిమాట వాస్తవమే. ఆ కారణంగా వాటిని 'మెట్ట' భూములుగా వర్గీకరించి ఉండవచ్చును గానీ, అవి ఇచ్చే ఆదాయాన్ని బట్టి లెక్కిస్తే అవి మంచి భూములు. సరుగుడు తోట మూడేళ్ళలో ఎకరానికి రూ. 1,50,000– ఆదాయం ఇస్తుంది. సరుగుడు నారు పోసి అమ్మినట్టయితే ఎకరానికి 3 లక్షలదాకా ఆదాయం లభిస్తుంది. పండ్లతోటలు సగటున సంవత్సరానికి 30 నుండి 40 వేల రూపాయల ఆదాయం ఇస్తాయి. కొబ్బరితోట సంవత్సరానికి 50 వేల రూపాయల ఆదాయం ఇస్తుంది. ఇసుక నేలలు అధికంగా ఉన్నందువల్ల ఈ భూములలో సరుగుడు తోటలు, మామిడి తోటలు, కొబ్బరి తోటలు విస్తారంగా వేసారు. జీడిమామిడి తోటలూ ఉన్నాయి. సపోటా చెట్లు ఉసిరి చెట్లు కూడా ఉన్నాయి. నీటి వసతి ఉన్నచోట వరి పండిస్తున్నారు. నిజానికి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలలో సెజ్‌లు నెలకొల్పుతున్న ప్రాంతమంతా ఎటు చూసినా పచ్చదనంతో చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చదనంలో విశాఖపట్నం జిల్లా రాంబిల్లి మండలం కోనసీమ వంటిదని పేరు పొందింది. ఈ మండలంలో సెజ్ కింద పోతున్న గ్రామాలలో అధికం కొబ్బరి తోటలపైనే ప్రధానంగా ఆధారపడినవి. అయినప్పటికీ అధికార

రికార్డులలో ఇవి ఇసుకనేలలుగా, మెట్టభూములుగా నమోదయి ఉన్నాయి. అందుకే సారవిహీనమైన, నిష్ఫలమైన భూములనే సేకరిస్తున్నామని ప్రభుత్వం దబాయిస్తున్నది.

తూర్పుగోదావరి జిల్లా సెజ్ ప్రాంతమయితే అధికంగా సాగునీటి వసతి ఉన్న ప్రాంతం కూడ. ఆ సత్యాన్ని కూడ ప్రభుత్వం దాచిపెట్టింది. గోదావరి నుండి ధవళేశ్వరం ఎడమ కాలువ, ఏలేరు కాలవ ఈ ప్రాంతంలోని చెరువులను నింపుతాయి. తొండంగి మండలం భూములకు మల్లవరం గ్రామం దగ్గరున్న పెద్ద చెరువు, ఎ.వి. నగరం దగ్గరున్న మూడు చెరువులు సాగునీరిస్తాయి. ఈ చెరువులకు గోదావరి, ఏలేరు నీళ్ళొస్తాయి. ఈ రకంగా సాగయ్యే భూములు 4500 ఎకరాల దాకా ఉన్నాయి.

ఇన్ని కారణాలుగా అసంతృప్తితో ఉన్న కాకినాడ సెజ్ బాధిత రైతులు ఇప్పటికి రెండేళ్లుగా సంఘటితంగా ఆందోళన చేస్తున్నారు. సెజ్ కోసం దాదాపు 10 వేల ఎకరాలు కావలసి ఉండగా అందులో 4850 ఎకరాలను రకరకాల అక్రమ పద్ధతులలో డెవలపర్ ఇప్పటికే కొనుక్కోవడం జరిగిందని చెప్పాము. సెజ్‌ల నైజాన్ని గురించి అవగాహన ఏర్పడిన తరువాత రైతులు అమ్మడం మానేసారు. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తానిచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను అనుసరించి తక్కిన భూమిని సేకరించడం మొదలుపెట్టింది. రైతులు దాదాపు ఎవ్వరూ ఈ భూసేకరణ ప్రక్రియలో పాల్గొనలేదు. అయినప్పటికీ దానిని పూర్తిచేసి నష్టపరిహారం కోర్టులో డిపాజిట్ చేసి, సేకరించిన భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వ సిబ్బంది బయలుదేరారు. రైతులు వారిని ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తూనే ఉన్నారు. దిమ్మలు పాతితే పీకేస్తున్నారు. సర్వే కోసం వస్తే వెనక్కి పంపించేస్తున్నారు. పోలీసులు రంగంలోకి దిగి సెజ్ వ్యతిరేక సమితి నాయకులపైన కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నా ఆందోళన కొనసాగిస్తున్నారు. డెవలపర్ రైతుల నుండి కొనుక్కున్న భూములను స్వాధీనం చేసుకోవడానికి అతని మనుషులు వస్తే కూడ రైతులు అటకాయించి పంపించేస్తున్నారు. ఈ కొనుగోలు అక్రమమని రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఉన్నాము కాబట్టి అది తేలేంతవరకు ఆ భూమిపైకి రావద్దని రైతులు అన్నారు. దీనిమీద కూడ కేసులు, అరెస్టులు జరిగాయి.

నిజానికి రాష్ట్ర మానవహక్కుల కమిషన్ 2007 డిసెంబర్ 24 నాడు జారీచేసిన ఆదేశంలో బాధితుల ఫిర్యాదుపైన విచారణ పూర్తయ్యేంత వరకు 'జిల్లా కలెక్టర్ గానీ, పోలీసులు గానీ భూసేకరణ అధికారులు గానీ రైతులను తొలగించడానికి ఎటువంటి

బలవంతపు చర్యలకు పాల్పడవద్దు' అని ఆదేశించింది. అటువంటప్పుడు రైతుల ఇష్టానికి వ్యతిరేకంగా సేకరించిన లేక కొనుగోలు చేసిన భూములలో దిమ్మలు పాతి స్వాధీనం చేసుకోవడం తప్పు. దానిని ప్రతిఘటించిన రైతులపైన కేసులు పెట్టడమూ తప్పే. ఈ విషయాన్ని కమిషన్ తన తదుపరి ఆదేశంలో స్పష్టం చేసింది. రైతుల అరెస్టులకు స్పందిస్తూ కమిషన్ 2008 జనవరి 21నాడు జారీ చేసిన ఆర్డర్‌లో ఈ విధంగా అనింది.

తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు ఈ కమిషన్ 2007 డిసెంబర్ 24వ తేదీన జారీ చేసిన ఆదేశాన్ని అతిక్రమించి భూమిని స్వాధీనం చేసుకోవడానికి బలవంతపు చర్యలు తీసుకుంటున్నాడనీ, ప్రతిఘటించిన రైతులను అరెస్టు చేసి జైలుకు పంపించాడనీ ఫిర్యాది అంటున్నారు. సెక్షన్ 144ను ప్రయోగించడం జరిగిందని కూడ ఫిర్యాదు. భూసేకరణ చేయని భూముల మీదికి కూడా సిబ్బంది వస్తున్నారని అభియోగం.

సెక్షన్ 144 ఎందుకు ప్రయోగించవలసి వచ్చిందో, రైతులను ఎందుకు అరెస్టు చేయవలసి వచ్చిందో తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు మాకు తెలపాలి. తమ భూములు స్వాధీనం చేసుకుంటున్న అధికారులను ప్రతిఘటించిన రైతులను సాధారణ నేరగాళ్లలాగ చూడడం, హుటాహుటిన అరెస్టు చేయడం తగదు. ఇటువంటి విషయాలలో నచ్చచెప్పే వైఖరి చాలా అవసరం. జిల్లా కలెక్టర్ తన తొందరపాటు వైఖరివల్ల సమస్యను మరింత జటిలం చేయడనీ సానుభూతిగా అర్థం చేసుకుంటాడనీ కమిషన్ ఆశిస్తున్నది, విశ్వసిస్తున్నది. రైతులందరినీ బేషరతుగా విడిచిపెట్టడం సబబని కమిషన్ భావిస్తున్నది.

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఈ ఆర్డర్‌ను సైతం తూర్పుగోదావరి జిల్లా అధికారులు గౌరవించలేదు. వాళ్లు భూములు స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు, రైతులు ప్రతిఘటిస్తూనే ఉన్నారు, పోలీసులు కేసులు పెడుతూనే ఉన్నారు. జనం ఆందోళన చేస్తున్న చోట రాజకీయనాయకుల రాకపోకలకు కొదవ ఉండదు. నిజాయితీగా వచ్చి సంఘీభావం తెలియజేసినా, ఆందోళనలో పాల్గొన్నా అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు. కాని కేవలం పాపులారిటీ కోసం తమకే విశ్వాసం లేని మాటలు మాట్లాడేవారిని మాత్రం విమర్శించవలసి ఉంది. గుజరాత్‌లో

అత్యంత విధ్వంసకరమైన 'అభివృద్ధి'ని అమలు చేస్తున్న భారతీయ జనతాపార్టీకి చెందిన మన రాష్ట్ర నాయకులు సైతం కాకినాడ సెజ్ ప్రాంతంలో పర్యటించి సెజ్‌ను రద్దు చేయాలంటూ భీకరంగా ఉపన్యాసాలిచ్చారు. కేంద్రం ఒక సెజ్ చట్టాన్ని జారీ చేయకముందే 2002 సంవత్సరంలో కాకినాడ సెజ్ డెవలపర్‌కు ప్రత్యేక ఆర్థికమండలి ఏర్పాటు చేయడానికి అనుమతిచ్చిన తెలుగుదేశం ప్రభుత్వ వారసులు సహితం 2008లో ఈ గ్రామాలలో పర్యటించి చివరి దాకా పోరాటంలో ఉంటామని హామీ ఇచ్చి పోయారు.

మత్స్యకారుల విషయం చెప్పి ఈ నివేదిక ముగిద్దాం. కాకినాడ సెజ్ భూభాగం సముద్రతీరానికి సమాంతరంగా సాగుతుంది గానీ తీరాన్ని తాకదు. సెజ్ భూభాగానికీ, సముద్రతీరానికీ మధ్య ఒక విశాలమైన కారిడార్ లాంటిది ఉంది. అక్కడ అనేక మత్స్యకారుల గ్రామాలున్నాయి. యు. కొత్తపల్లి మండలంలో 8 గ్రామాలు, తొండంగి మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. వీటిలో కొన్ని పూర్తిగా మత్స్యకారుల గ్రామాలు కాగా కొన్నిటిలో ఇతర ప్రజలూ ఉన్నారు. దాదాపు 50 వేల మత్స్యకారుల జనాభా ఉందని అంచనా. వీరంతా సెజ్‌కూ సముద్రానికీ మధ్య చిక్కుకొని బతకాలి. ఏలేరు నది గొల్లప్రోలు దగ్గర పాయలుగా చీలి సెజ్ భూభాగం గుండా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. ఈ పాయలు ప్రస్తుతం ఎగువ గ్రామాల వ్యవసాయ భూములకు డ్రైన్‌గా కూడ పని చేస్తున్నాయి. మత్స్యకారులు వాటిలో పీతలు, రొయ్యలు, చేపలు పట్టుకుంటు న్నారు. ఈ వేట మొత్తం రేపు పోతుంది. అంతేకాక ఇవ్వాళ్టిదాకా పంటపొలాల డ్రైన్‌గా పనిచేసిన ఈ పాయలు రేపు సెజ్ కాలుష్యానికి డ్రైన్‌గా పనిచేస్తాయి. రిఫైనరీలు గానీ పెట్రోకెమికల్ ఉత్పత్తులు గానీ సెజ్‌లో నెలకొల్పినట్టయితే చాలా కాలుష్యం బయటికొస్తుంది. దానిని శుద్ధి చేయకుండ నీటి వనరులలోకి విడుదల చేయకూడదని కాలుష్య నియంత్రణ బోర్డు ఆంక్షలు పెడుతుంది, అందులో సందేహం లేదు కానీ అటువంటి ఆంక్షలు ఎంత మేరకు అమలవుతాయనేది హైదరాబాద్ పరిసరాలలోని పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం తెలుపుతుంది. ఈ కాలుష్యమంతా సముద్రంలోకి చేరుతుంది. దానివల్ల మత్స్యకారులు తమ జీవనాన్ని భారీగా కోల్పోతారు.

## పోలేపల్లి సెజ్ వ్యతిరేకపోరాటం

కాకినాడ సెజ్ తెలుగుదేశం హయాంలో ప్రారంభమయి కాంగ్రెస్ హయాంలో కొనసాగిందని చూసాము. పోలేపల్లి సెజ్ కూడ అంతే. ఎటొచ్చీ 2001లో ఇది

మొదలయినప్పుడు ఇక్కడ సెజ్ నెలకొల్పుతామని ప్రభుత్వం అనలేదు. పారిశ్రామీకరణ కోసం 1000 ఎకరాలు సేకరించి ఆం.ప్ర. పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎ.పి.ఐ. ఐ.సి) చేతిలో పెడతామని మాత్రమే అన్నారు. దానికి 'గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్' అని పేరు పెట్టారు. గ్రీన్ అనీ, పార్కు అనీ ఉండేసరికి కళ్లకు పచ్చదనం కనిపిస్తుంది. అదే వారికి కావలసింది. పరిశ్రమలు నెలకొల్పుతామనగానే కాలుష్యాన్ని గురించి, దాని నుండి వచ్చే వివిధ రకాల అసౌకర్యాన్ని గురించి స్థానిక ప్రజలు ఆందోళన చేస్తారు. 'పచ్చటి' పారిశ్రామీకరణ చేస్తామన్న హామీ ఈ ఆందోళనను చల్లార్చడానికి ఉద్దేశించింది. దానిని నిజాయితీగా ఆచరించినట్టయితే కాలుష్య నియంత్రణ వీలయినంత సమర్థంగా అమలుచేసే సంస్థలను అక్కడ స్థాపించవచ్చు. అయినప్పటికీ గాలిలోకి చేరక తప్పని అపాయకరమైన వాయువులను బ్యాలన్స్ చేయడానికి ప్రాణవాయువును గాలిలోకి వదిలే చెట్లను ఆ సంస్థ కోసం కేటాయించిన భూమిలో కొంత భాగంలోనైనా పెంచవచ్చు. అయితే ఆ సంస్థ కోసం తీసుకున్నది వ్యవసాయ భూమి లేక తోపులు, అడవులు అయినట్టయితే వారికోసం ఆ భూమి స్వాధీనం చేసుకోకపోతే అక్కడ మొక్కలు చెట్లు పెరిగేవే కాబట్టి ఈ గ్రీనరీ వల్ల కొత్తగా వచ్చేదేం లేదు. ఎటొచ్చీ పచ్చటి గడ్డి సహితం కనిపించని పారిశ్రామిక ప్రాంతాలను చూడడం అలవాటయిన వారికి ఒక కేశోరాం సిమెంట్స్‌వారో, ఒక ఉయ్యూరు షుగర్స్‌వారో 'వారి' భూములలో చెట్లు, మొక్కలు పెంచడం ముచ్చటగా తోచవచ్చు.

పోలేపల్లి సెజ్ విషయానికొస్తే 'గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్'గా మొదలయినది సెజ్‌గా మారి మందుల కంపెనీలకు కేంద్రం కానుంది. రెండు సంస్థలు ఇప్పటికే నెలకొన్నాయి. ఇంకొక 10 నుండి 25 దాకా రానున్నాయి. మందుల పరిశ్రమ తెచ్చే కాలుష్యం అతి భయంకరమైనది అయినప్పటికీ ఈ సెజ్ వాకిట గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అన్న పచ్చటి రంగు బోర్డు అట్లాగే ఉంది.

సెజ్‌ల ఏర్పాటులో చెప్పేదొకటి, చేసేదొకటి అనే నైజానికి కూడ పోలేపల్లి సెజ్ ఒక ఉదాహరణ. దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే ఎగుమతులపైన ప్రధానంగా ఆధారపడాలనీ, దానికోసం ఎక్కువ పెట్టుబడులు అవసరమయ్యే నాణ్యమైన సాంకేతిక ప్రక్రియలను నెలకొల్పాలనీ, అందుకోసం ప్రపంచస్థాయి మౌలిక

సదుపాయాలుగల పారిశ్రామిక కేంద్రాలు ఏర్పాటు చేయాలనీ, పూర్తిస్థాయిలో పన్ను రాయితీలు ఇవ్వాలనీ, ఇబ్బందికరమయిన ఆంక్షలను సడలించాలనీ, పారిశ్రామిక సంస్థలకు సామాజిక బాధ్యతలు కట్టబెట్టే సంక్షేమ చట్టాల నుండి మినహాయింపు ఇవ్వాలనీ సెజ్‌లను సమర్థించుకోవడం కోసం వాదిస్తూ వచ్చారు. ఈ వాదనలోని అనేక లోపాలను అటుంచి, అసలు జరిగేది అది కూడ కాదని పోలేపల్లి సెజ్‌లాంటివి తెలుపుతాయి.

చాలాకాలంగా ఫార్మాసూటికల్ (మందుల) పరిశ్రమకు కేంద్రంగా పేరుగాంచిన హైదరాబాద్ నుండి ఒకటొకటిగా మందుల పరిశ్రమలు ఉత్తరాదికి వెళ్ళిపోతున్నాయంట. ఎందుకోసమంటే హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల ప్రభుత్వాలు వారికి అనేక రాయితీలిచ్చి అక్కడికి తీసుకుపోతున్నాయంట. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఆ ప్రభుత్వాలను అదుపు చేసి మందుల పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్ స్టేటస్‌ను కాపాడమని కోరిందంట. అయినా కేంద్ర ప్రభుత్వం తనకా అధికారం లేక కొంత, వినియోగించడానికి ఇష్టంలేక కొంత, ఏం చేయలేదంట. ఈ లోపల 40 కంపెనీలు హైదరాబాద్ నుండి వెళ్ళిపోయాయి. ఇంకొక 50 వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ వలసకు విరుగుడుగా మనవాళు ్ళ కూడా అవే రాయితీలు ఇచ్చి కంపెనీలను వెళ్లిపోకుండ ఆపవచ్చును కదా? కానీ హిమాచల్ ప్రదేశ్‌లాగ, ఉత్తరాఖండ్‌లాగ ఆలోచిస్తే మన గొప్పదనం ఏముంది? విడివిడిగా ఒకటీ రెండు రాయితీలివ్వడం కాదు. ఊహకందే అన్ని రాయితీలూ ఇచ్చే మందుల కంపెనీల సెజ్‌ల (ఫార్మాసెజ్) ఏర్పాటు చేయాలన్నది మనవాళ్ళకొచ్చిన ఆలోచన. దాని ఫలితమే విశాఖపట్నం జిల్లాలో రెండు ఫార్మాసెజ్‌లను, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి దగ్గర గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం తీసుకున్న 1000 ఎకరాల భూమిలో ఒక ఫార్మాసెజ్‌ను నెలకొల్పాలన్న నిర్ణయం.

ఈ ఆలోచనలు, ఏర్పాట్లు ఒక పక్క జరుగుతుండగా భూసేకరణ మరొకపక్క జరిగిపోతూ ఉంది. జడ్చర్ల మండలం పోలేపల్లిలో 439 ఎకరాల పట్టాభూమి, 350 ఎకరాల లావోణి పట్టా (డి-ఫారం లేక అసైన్‌మెంట్ పట్టా) భూమి, పక్కనే ఉన్న బాలానగర్ మండలం రాజాపూర్ శివారు గ్రామమైన ముదిరెడ్డిపల్లిలో 239 ఎకరాల పట్టా భూమి స్వాధీనం చేసుకొని ఎ.పి.ఐ.ఐ.సికి అప్పగించారు. 2001లో గ్రీన్

ఇండస్ట్రియల్ పార్క్ నెలకొల్పాలనుకున్నప్పుడు ఎ.పి.ఐ.ఐ.సి అక్కడ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు కల్పించి కంపెనీలకు భూమి లీజుకిచ్చే మధ్యవర్తి. పాత్రలు మారకుండ నాటకాన్ని మార్చి ఇండస్ట్రియల్ పార్క్‌ను ఫార్మాసెజ్‌గా రూపాంతరం చేసిన క్రమంలో ఎ.పి.ఐ.ఐ.సి. ఆ సెజ్‌కు డెవలపర్ అయింది. 2005 ఫిబ్రవరి నెలలోనే జిల్లా కలెక్టరు పట్టా భూములకు సంబంధించిన అవార్డు ప్రకటించారు. రైతులందరికీ నష్టపరిహారం ఇచ్చారు. లావోణి పట్టా భూముల వారికీ నష్టపరిహారం ఇచ్చేసారు. దానితో ఆ భూమంతా ప్రభుత్వపరం అయింది. 2005 సంవత్సరం జూన్ నెలలో పార్లమెంట్ సెజ్ చట్టాన్ని జారీ చేసింది. అది 2006 ఫిబ్రవరి 10 నుండి అమలులోకి వచ్చింది. ఆ చట్టాన్ని అనుసరించి పోలేపల్లి గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఫార్మాసెజ్‌గా ప్రకటించడం, ఎ.పి.ఐ.ఐ.సిని దానికి డెవలపర్‌గా నియమించడం జరిగింది. ఎ.పి.ఐ.ఐ.సి మొదటగా అరబిందో ఫార్మా, హెటరో డ్రగ్స్ అనే రెండు మందుల కంపెనీలను ఆహ్వానించి వారిరువురికి కలిపి 240 ఎకరాల భూమిని ఎకరా 7 లక్షల రూపాయలకు అమ్మింది.

ఈ వార్త విని పోలేపల్లి భగ్గుమనింది. అప్పటినుండి ఇవ్వాల్టి దాకా భూములు కోల్పోయిన పోలేపల్లి రైతుల ఆందోళన ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంది. వారికంత కోపం రావడానికి కారణం ఏమిటంటే వారెవ్వరికీ ఆ భూమికి 7 లక్షలలో 7వ వంతు కూడ నష్టపరిహారం దక్కలేదు. తమ దగ్గర కారుచవకగా భూములు తీసుకొని మందుల కంపెనీలకు ఎకరా 7 లక్షలకు అమ్ముకున్న ప్రభుత్వం దళారీ బుద్ధి వారి కడుపులు రగిల్చింది.

ఈ సెజ్ ప్రాంతం హైదరాబాద్ నుండి బెంగుళూరు వెళ్లే జాతీయ రహదారి నెం. 7కు కుడిపక్కన (పడమటి దిక్కున), జడ్చర్లకు దగ్గరగా ఉంది. నష్టపరిహారం లెక్కించడం కోసం ప్రభుత్వం ఈ భూమిని నాలుగు రకాలుగా విభజించింది. అవి – హైవేకి దగ్గరగా ఉన్న ఆరుతడి పంటల భూములు, హైవేకి దగ్గరగా ఉన్న మెట్టభూములు, హైవేకి దూరంగా ఉన్న ఆరుతడి పంటల భూములు, హైవేకి దూరంగా ఉన్న మెట్ట భూములు. వీటి మార్కెట్ ధర... వరుస క్రమంలో ముదిరెడ్డిపల్లిలో 1 లక్ష, 81 వేలు, 95 వేలు, 76 వేల రూపాయలు. పోలేపల్లిలో 40 వేలు, 30 వేలు, 34 వేలు, 24 వేల రూపాయలు. ఇది 'బేసిక్' మార్కెట్ ధర. అంటే ఆ ప్రాంతంలో

గడచిన మూడు సంవత్సరాలలో జరిగిన భూముల అమ్మకాల సగటు రిజిస్ట్రేషన్ ధర. ఈ రెండు గ్రామాలు వేరువేరు మండలాల్లో ఉన్నప్పటికీ పక్కపక్కనే ఉన్నాయి. వాటి బేసిక్ మార్కెట్ ధరలో ఇంత తేడా ఉందంటే నమ్మడం కష్టం. పైగా జడ్చర్ల దగ్గర జాతీయ రహదారి పక్కన బోరుబావులు పెట్టుకొని ఆరుతడి పంటలు పండించే భూమి వెల 2005లో ఎకరానికి 40 వేలేనంటే నమ్మడం మరీ కష్టం.

ఈ 40 వేలకు, బలవంతపు సేకరణకు గాను పరిహారం (సోలేషియం) 30 శాతం చేర్చి, ఆపైన నోటిఫికేషన్ విడుదలయిన నాటినుండి అవార్డు ఇచ్చే నాటిదాకా 12 శాతం వడ్డీ (దీనిని అదనపు మార్కెట్ విలువ అంటారు) కలిపి ప్రభుత్వమిచ్చే నష్టపరిహారంగా లెక్కించారు. అది 65 వేల దాకా ఉంటుంది. ఇదే ఇచ్చివుంటే రైతులు కోర్టుకుపోయి పైన చెప్పిన విషయాలనూ ఇతర ఆధారాలనూ ప్రాతిపదిక చేసుకొని ఎక్కువ నష్టపరిహారం తెచ్చుకొని ఉందురు. కానీ మన రాష్ట్రంలో ప్రభుత్వాలు ఈ మధ్యకాలంలో 'ఒప్పుకోలు అవార్డులు' లేక 'సమ్మతి అవార్డుల' వైపు మొగ్గు చూపుతున్నాయి. అంటే భూసేకరణ చట్టం ప్రకారం ఇచ్చే నష్టపరిహారానికి రైతుకూ, ప్రభుత్వానికీ ఆమోదనీయమైనంత చేర్చి ఇంక కోర్టుకు పోనని రైతుచేత రాయించుకొని ఆ మొత్తం ఇవ్వడం. ఇది మధ్యదళారులు, వకీళ్ల దోపిడీని (రెండూ కలిపి రైతుకొచ్చే నష్టపరిహారంలో 50 శాతం దాకా ఉండగలదు) అరికట్టడానికి పనికొస్తుంది కాబట్టి ఇది మంచి ఆలోచనే గానీ దీనిని ప్రభుత్వం వేరే ఉద్దేశ్యంతో అమలు చేస్తున్నది. సక్రమంగా చేసినట్టయితే (1992లో జారీ చేసిన నియమాల ప్రకారం) రైతులతో సంప్రదింపులు జరపడానికి ఒక జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ, ఒక రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ నెలకొల్పాలి. జిల్లాస్థాయి కమిటీలో జిల్లా కలెక్టరు, ఒక సీనియర్ సివిల్‌జడ్జి, ఒక రిటైర్డు జిల్లా జడ్జి ఉండాలి. వీరు 'ఒప్పుకోలు అవార్డు' పొందే ఆసక్తి చూపిన రైతులందరితోనూ చర్చించాలి. వారు చూపించిన ఆధారాలన్నీ పరిశీలించాలి. ఈ క్రమంలో స్వచ్ఛందమైన ఒప్పుకోలు జరగాలి. రైతులు కాంక్షిస్తున్నది ఒక మోతాదు దాటిపోతే, సంప్రదింపులు రాష్ట్రస్థాయి కమిటీ చేపట్టాలి.

పోలేపల్లిలో జరిగింది అది కాదు. ఏ సంప్రదింపుల కమిటీ ఏర్పడలేదు. ఆర్‌డిఓ కొందరు 'పెద్దమనుషులను' (అంటే పాలక పార్టీకి చెందినవారని బ్రాకెట్లో రాసుకోండి) పిలిపించుకొని, ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇవ్వవలసిన నష్టపరిహారానికి

50 శాతం అదనంగా చేర్చి దీనికి ఒప్పుకొమ్మని నచ్చజెప్పారు. అంటే పోలేపల్లి గ్రామంలో అత్యధిక నష్టపరిహారం (65 వేలు, మళ్లీ అందులో సగం) ఎకరానికి 1 లక్ష రూపాయల కంటే కొంచెం తక్కువే. వాళ్లు ఒప్పుకున్న తరువాత తక్కిన రైతుల పైన ఒత్తిడి పెట్టారు. ఒప్పుకుంటే దీనికి ఒప్పుకో – లేకపోతే ప్రభుత్వమిచ్చే నష్టపరిహారం తీసుకొని ఒక దశాబ్దకాలం కోర్టుల చుట్టూ తిరుగు అని బెదిరించారు. 'దాదాపు రైతులందరూ ఒప్పుకున్నారు' అని కలెక్టర్ తన అవార్డులో సగర్వంగా రాసుకున్నాడు.

రోడ్డు పక్కనున్న ఆరుతడి పంట భూములకు ఇచ్చిన నష్టపరిహారం ఇది. ఆ భూమిని ఒక సంవత్సరం తిరిగే లోపల ఎ.పి.ఐ.ఐ.సి ఎకరా 7 లక్షలకు అమ్ముకుందని తెలిస్తే వారికి కోపం రాదా మరి!

ఇది భూమిపైన స్వంత హక్కు ఉన్న రైతుల సంగతి. వీరుకాక 350 ఎకరాలలో లావోణి పట్టా ఉన్న రైతులున్నారని చెప్పాము. వీరికి ఎకరాకు 18 వేలు మాత్రమే ఇచ్చారు. ఈ లెక్క ఏ విధంగా చేసారు? 23 డిసెంబర్ 1993న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 1307 (రెవెన్యూ) ప్రకారం డి–ఫారం లేక లావోణి పట్టా ఉన్నవారికి ప్రభుత్వం నిర్ణయించిన బేసిక్ మార్కెట్ ధర, దానిపైన బలవంతపు సేకరణకుగాను పరిహారంగా (సొలేషియం) 30 శాతం ఇవ్వాలి. ఆపైన మాత్రం వారికి కోర్టుకు పోయి నష్టపరిహారం పెంపుదల కోరే హక్కు ఉండదు. అయితే జీవో 1307 లోని ఈ షరతును మన రాష్ట్ర హైకోర్టు 2004లో 'భూసేకరణ అధికారి, చేవెళ్ల వర్సస్ మేకల పాండు' అనే కేసులో కొట్టేసి, డి–ఫారం పట్టా ఉన్న రైతులను పూర్తి హక్కుదారుడయిన రైతుతో సమానంగా చూసి సమానంగా నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసిన కారణంగా మన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదు కాని కనీసం జీవో 1307 నయినా అమలు చేయాలి కదా? పోలేపల్లి భూముల అతి తక్కువ బేసిక్ మార్కెట్ ధర (హైవేకి దూరాన ఉన్న మెట్ట భూముల ధర) ఎకరానికి 24 వేలని పైన చూసాం. దానికి 30 శాతం సోలేషియం కలిపితే 32 వేలవుతుంది. మరి 18 వేలే ఎట్లా ఇచ్చారు? రెండు సంవత్సరాలకు పైగా పోలేపల్లి ఉద్యమం ఈ ప్రశ్న అడుగుతూనే ఉన్నా దీనికి జవాబు లేదు. కానీ ఈ భూమిని కూడ ఫార్మాసూటికల్ కంపెనీలకు ఎకరానికి 7 లక్షలు తీసుకొని అమ్మారు!

నిర్వాసితులయిన వారి పునరావాసం విషయంలోనూ ప్రభుత్వం ఇదే రకంగా వ్యవహరించింది. నిర్వాసితులు తాము మోసపోయామని ఆందోళనకు దిగడంతో వాళ్లచేత ఎట్లాగయినా పునరావాస పథకాన్ని స్వీకరింపజేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. అప్పుడు ఆందోళనను విరమింపజేసినట్టవుతుందని వారి భావన. అయితే రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం (జీవో నెం. 68) ప్రకారం పునరావాసాన్ని ఏకపక్షంగా నిర్ణయించడానికి వీలు లేదు. సంబంధిత అధికారి నిర్వాసితులను సంప్రదించి నిర్ణయించాలి. పోలేపల్లిలో ఆ ప్రయత్నం సఫలం కాదన్న భయంతో కాబోలు అధికారులే పునరావాస కాలనీ స్థలాన్ని నిర్ణయించి బాధితుల చేత దానిని ఆమోదింపజేయాలని నానా ప్రయత్నాలు చేసారు. వాళ్ళ అనుమతి లేకుండా వారి పేర్లమీద బ్యాంక్ ఖాతాలు తెరిచి పునరావాస స్థలంలో ఇళ్లు కట్టుకోవడానికని చెప్పి 70 వేల రూపాయలు ఆ ఖాతాలలో జమ చేసారు. పునరావాస పథకాన్ని ఆమోదిస్తే నష్టపరిహారం కొంచెం ఎక్కువిస్తామని ఆశ చూపారు. 2008 మే నెలలో జరిగిన ఉప ఎన్నికలలో జడ్చర్ల ఎంఎల్ఏగా గెలిచిన కాంగ్రెస్ నాయకుడు మల్లు రవిగారు అన్ని రకాలుగానూ వారిపైన ఒత్తిడిపెట్టే ప్రయత్నం చేసారు. అయినప్పటికీ పోలేపల్లి సెజ్ వ్యతిరేక ఐక్య సంఘటన ఆధ్వర్యంలో ప్రతిఘటన సాగుతూనే ఉంది. అత్యధికంగా దళితులయిన లావోణి పట్టాదారులు ఈ ప్రతిఘటనలో అగ్రభాగాన ఉన్నారు.

తమ భూమి తమకు వెనక్కి ఇచ్చేయమనీ కావాలంటే తీసుకున్న నష్టపరిహారం వెనక్కి ఇచ్చేస్తామనీ వారి డిమాండ్. 1000 ఎకరాలకు గాను 240 ఎకరాలలో ఇప్పటికే అరబిందో ఫార్మా, హెటెరో డ్రగ్స్ వారి ఫ్యాక్టరీల నిర్మాణం దాదాపు జరిగిపోయింది. కానీ తక్కిన భూమి ఇప్పటికీ ఖాళీగానే ఉంది కాబట్టి దానిని వెనక్కి ఇచ్చేయమన్న డిమాండ్ నిరర్థకం కాదు. భూసేకరణ విషయంలో అన్యాయం సంగతి అటుంచి మిగిలిన 760 ఎకరాలలోనూ మందుల కంపెనీలు వచ్చేస్తే ఆ పరిసరాలలోని నీటివనరులపైన, భూగర్భ జలాలపైన కాలుష్య దుష్ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

పోలేపల్లి బాధితులు వినూత్నమైన ఎన్నికల పోరాట రూపాన్ని ఎంచుకున్నారు. తమ ఆందోళనకు ఏ ఒక్క రాజకీయ పార్టీ, ఏ ఒక్క అభ్యర్థి మద్దతు తెలపడం లేదన్న కోపంతో తామే బహుళ సంఖ్యలో నామినేషన్లు వేసి పోటీ చేస్తున్నారు. 2008 మే నెలలో జరిగిన జడ్చర్ల అసెంబ్లీ ఉపఎన్నికలో 13 మంది (అందరూ లావోణి

పట్టా భూములు కోల్పోయిన వారే) పోటీ చేసారు. 13 మందికీ కలిపి 8600 ఓట్లు వచ్చాయి. మళ్లీ 2009 ఏప్రిల్ నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానానికి పోలేపల్లి బాధితులు 16 మంది నామినేషన్ వేసారు. ఊరూరూ ఇల్లిల్లూ తిరిగి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించి చెపుతూ ప్రచారం చేసారు. అందరికీ కలిపి 7,51,786 ఓట్లు వచ్చాయి.

పోలేపల్లి సెజ్ వ్యతిరేక ఐక్య సంఘటన ఈ ఉద్యమాన్ని బాధిత రైతులకే పరిమితం చేయకుండ, చుట్టుపక్కల గ్రామాల వారికి ఉండగల కాలుష్యం ప్రమాదాన్ని కూడ తెలియజెప్పి వారిని కూడ ఇందులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నది. మందుల కంపెనీల కాలుష్యం తీవ్రతకు హైదరాబాద్ సజీవ సాక్షి అని ఇదివరకే చెప్పాము. ఇప్పటికే పోలేపల్లి దగ్గర రెండు ఫార్మా కంపెనీలు వచ్చి ఉన్నాయి. అదే పరిమాణం గలవయితే ఇంకొక 6 నుండి 8 దాకా రాగలవు. అయితే ఇంక రాబోయేవి చిన్నవనీ, మొత్తం 20 పైనే మందుల కంపెనీలు పోలేపల్లి సెజ్‌లో స్థాపించబోతారనీ వింటున్నాం. అన్ని ఫార్మా కంపెనీలు 1000 ఎకరాల స్థలంలో నెలకొనడం పర్యావరణానికి చాలా ప్రమాదకరం. ఈ సెజ్‌కు దాపుననే బాలానగర్ మండలంలో దుందుభి వాగు ప్రవహిస్తుంది. అది డిండి నదిలోనూ తద్వారా కృష్ణా నదిలోనూ కలుస్తుంది. ఫార్మా కంపెనీల కాలుష్యం విషపూరితమైన వ్యర్థ పదార్థాల రూపంలో చుట్టుపక్కల ఉన్న నీటి వనరులలో కలుస్తుంది కాబట్టి దుందుభి వాగు, తద్వారా పరిసరాల భూగర్భజలాలు, డిండి ప్రాజెక్టు రిజర్వాయరు క్రమంగా కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ విషయాలు సంబంధిత గ్రామాల ప్రజలకు తెలియజెప్పి వారిని కూడ పోరాటంలో భాగం చేయాలన్న పోలేపల్లి బాధితుల ప్రయత్నం సఫలం అవుతుందని ఆశిద్దాం.

**మానవహక్కుల వేదిక బులెటిన్–10**

**జూన్ 2009**

## సింగరేణి బొగ్గుబీళ్ళ పాలసీ

# ఓపెనయ్యేకొద్దీ విధ్వంసం

గడచిన అయిదు సంవత్సరాల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల కోసం, విమానాశ్రయాల కోసం, ఓడరేవుల కోసం, సెజ్‌ల కోసం చేపట్టిన భూసేకరణ ఒకెత్తయితే ఉత్తర తెలంగాణ జిల్లాలలో ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ప్రాజెక్టుల కోసం జరుగుతున్న భూసేకరణ ఒకెత్తు.

ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో సింగరేణి బొగ్గుగనుల కంపెనీ తలపెట్టిన 70 చిల్లర ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల కోసం అధికారికంగా 1.00 నుండి 1.50 లక్షల ఎకరాల భూమిని మొదటి దశలో తీసుకోవడం జరుగుతుంది. ఆపైన వాటి డంప్ విస్తరణ కోసం కాలక్రమంలో ఇంకొంత భూమిని విడతలు విడతలుగా తీసుకుంటారు. వారు తీసుకునేది కాక తీవ్ర కాలుష్యం, నీటికొరత, రాకపోకల అసౌకర్యం తదితర కారణాలవల్ల ప్రజలే విడిచిపెట్టి లేదా అమ్ముకొనిపోయే భూములు మరికొంత ఉంటాయి. ఖమ్మం జిల్లాను దాటి పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, టి. నర్సాపురం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాలకూ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు విస్తరిస్తాయని వింటున్నాం. ఇవన్నీ లెక్కబెట్టుకొంటే ఎంత లేదన్నా 2 లేక 2.5 లక్షల ఎకరాల భూమి వ్యవసాయానికీ, పశుగ్రాసానికీ, కట్టెపుల్లలకూ – మొత్తంగా జీవనానికి ఉపయోగపడే ప్రాకృతిక ఉత్పత్తులకు కాకుండా పోతుంది. ఆదిలాబాద్ జిల్లా ఉత్తర భాగాన మొదలయ్యే ఈ విధ్వంసం ఉత్తర తెలంగాణ సరిహద్దు వెంబడి తూర్పుకు ప్రయాణమై పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం డ్యాం పరిసరాలలో

ముగుస్తుంది. అక్కడి నుండి పైకి పోలవరం ముంపు మొదలవుతుంది. అది మళ్ళీ దీనిలో సగందాకా ఉంటుంది.

ఇంత విధ్వంసం జరగకుండ ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదా?

మన రాష్ట్రంలోని గోదావరి నదీలోయలో ఉన్న బొగ్గు గనులు ఖనిజాలకు నిలయమైన మధ్యభారత పీఠభూమి దక్షిణపు అంచులో ఉన్నాయి. ఇక్కడ బొగ్గు తవ్వకం 1889 నుండి జరుగుతున్నది. అప్పట్లో బొగ్గు తవ్వకం చేపట్టిన కంపెనీ పేరు హైదరాబాద్ దక్కన్ మైనింగ్ కంపెనీ. ఇది ఇంగ్లండ్‌కు చెందిన కంపెనీ అయినప్పటికీ ఇందులో 75 శాతం పెట్టుబడి హైదరాబాద్ ప్రభుత్వానిదే. ఖమ్మం జిల్లాలోని సింగరేణి గ్రామం దగ్గర తవ్వకం మొదలయింది. 1920లో సింగరేణి కాలరీస్ కంపెనీ (ఎస్.సి.సి.) ఏర్పడి గనులను తన చేతిలోకి తీసుకుంది. మొదటి నుండి ఈ కంపెనీ హైదరాబాద్ ప్రభుత్వ నియంత్రణలో ఉండేది. కాగా 1944లో దానిని ప్రభుత్వం కొనేసి ప్రభుత్వ సంస్థగా నడపసాగింది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి యాజమాన్యంలో ఉంది.

వ్యవసాయకంగా వెనుకబడివున్న ఉత్తర తెలంగాణ ప్రాంతానికి ఈ బొగ్గుగనులు కాలక్రమంలో ఒక ముఖ్యమైన ఉపాధి వనరుగా ఎదిగాయి. మొదట్లో గనులలో పని చాలా కష్టంగా ఉండేది. అండర్‌గ్రౌండ్‌లో విపరీతమైన వేడిలో, సరయిన భద్రత లేకుండా పనిచేయవలసి వచ్చేది. వేతనాలు చాలా తక్కువగా ఉండేవి. ఈ కారణంగా తొలినాడు వేరే ఏ జీవనాధారం లేని నిరుపేదలు మాత్రమే గనులలో పనికి వెళ్ళేవారు. ప్రమాదాలు కూడా తరచుగా జరిగేవి. అయితే కాలక్రమంలో సంఘాలు పెట్టుకొని కొట్లాడి కార్మికులు తమ జీవిత పరిస్థితులను కొద్ది కొద్దిగా మెరుగుపరుచుకోగలిగారు. బొగ్గు గనులకు ఒక ప్రత్యామ్నాయ ఉపాధి కేంద్రంగా గుర్తింపు లభించింది. వేతనాలు కూడా పెరిగి చిన్న రైతు కుటుంబాలలో పుట్టిన వారికి వ్యవసాయం కంటే మెరుగయిన జీవితం బొగ్గు బావులలో లభించింది. 1950లో సింగరేణి బొగ్గు గనులలో 11,600 మంది కార్మికులుండేవారు. 1990ల మధ్యభాగానికి ఈ సంఖ్య 1,15,000 కు చేరింది. గ్రామాలే ప్రధానంగా ఉన్న గోదావరి లోయలో ఇల్లందు, కొత్తగూడెం, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లి లాంటి పట్టణాలు వెలిశాయి.

అండర్‌గ్రౌండ్ గనులకు కూడా భూసేకరణ అవసరమే. కానీ ఆ అవసరం పరిమితమైనది. ఖనిజం తవ్వకం జరుగుతున్న ప్రాంతమంతా తీసేసుకోవలసిన అవసరం ఉండదు. నేలకింద బొగ్గు తవ్వకం జరుగుతుండగా పైన వ్యవసాయం చేసుకోవచ్చు. ఇళ్ళు వేసుకొని బతకవచ్చు. లోతయిన బోర్లు వేసుకోలేకపోవడం, గనులకు సమీపంలో ఉన్న గ్రామాలలో ఒక్కొక్కసారి భూగర్భ జలాలు ఇంకిపోయి బావులు ఎండిపోవడం జరిగేది. దీనివల్ల స్థానిక ప్రజలకూ సింగరేణి కంపెనీకీ కొంత ఘర్షణ అడపాదడపా జరుగుతూనే ఉన్నా, మొత్తం మీద ఉపాధి అవకాశాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా పెంచిన వ్యవస్థగా సింగరేణికి ఉత్తర తెలంగాణ గ్రామీణ ప్రజలలో ఆదరణ లభించింది. ఆ వ్యవస్థ ఉత్పత్తి చేసిన బొగ్గు ఆధారంగా మరిన్ని పరిశ్రమలు నెలకొల్పివుంటే ఉపాధి మరింత లభించి ఉండేది. కొత్తగూడెం, రామగుండం థర్మల్ విద్యుత్తు కేంద్రాలు, రామగుండంలో ఒక బొగ్గు అధారిత ఎరువుల కర్మాగారం, మంచిర్యాల దగ్గర బొగ్గు ఆధారిత రసాయన ఉత్పత్తుల కేంద్రం స్థాపించారు తప్ప బొగ్గుతో విస్తృతమైన పారిశ్రామికీకరణ చేపట్టే ప్రయత్నం జరగలేదు.

## సంస్కరణల ప్రభావం

1989లో సింగరేణి కంపెనీ బొగ్గు గనుల శతాబ్ది ఉత్సవాలు నిర్వహించింది. ఆ ఉత్సవాల సందర్భంగా ఒక పెద్ద భవిష్యత్ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. 2000 సంవత్సరం నాటికి కొత్తగా 85 అండర్‌గ్రౌండ్ గనులు, 14 ఓపెన్‌కాస్ట్ గనులు ప్రారంభించబోతున్నట్లు ఆ ప్రణాళిక చెప్పింది. జిల్లాల వారీగా ఎక్కడ ఎన్ని అని కూడా చెప్పింది. ఆ ప్రణాళిక అమలయివుంటే ఇంకొక 40,000 మందికి అదనంగా పనులు లభించేవి. కానీ 1991లో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో ఈ ప్రణాళిక బుట్టదాఖలయి వేరే ప్రణాళిక అమలులోకి వచ్చింది. ఉపాధి కల్పన కాక ఉత్పాదకత పెరుగుదల, ఉత్పత్తి ఖర్చుల తగ్గింపు, ప్రైవేటీకరణ ద్వారా వేతనం బిల్లు తగ్గింపు, యంత్రీకరణ మొదలయినవి ప్రధాన నియమాలయ్యాయి. అండర్‌గ్రౌండ్ గనుల స్థానంలో ఓపెన్‌కాస్ట్ గనులు నెలకొల్పడం, క్రమంగా కొత్త తవ్వకాలు కూడా ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో చేపట్టడం, 1990ల మధ్యభాగం నుండి కొత్త రిక్రూట్‌మెంట్‌ను బంద్‌చేసి ఉన్న కార్మికులను వయోభారమనీ అనారోగ్యమనీ క్రమశిక్షణ అనీ తొలగించడం, మిగిలిన వారిపైన పనిభారం

విపరీతంగా పెంచడం దీనికి సాధనాలయ్యాయి. దాంట్లో భాగమే ఈ భారీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల పరంపర.

## ఓపెన్‌కాస్ట్ వల్ల ఏం నష్టం?

మొదట చెప్పుకోవలసింది వాటి వల్ల స్థానిక ప్రజలకు ప్రయోజనం ఏమీ లేదనేది. అండర్‌గ్రౌండ్ బొగ్గు బావుల వల్ల కూడా కొంతమేరకు ప్రజలు భూములు కోల్పోయినా, భూగర్భ జలాలపైన కొంత దుష్ప్రభావం ఉన్నా, ఈ నష్టం కంటే ఎక్కువ తూగే ప్రయోజనం ఉపాధి అవకాశాలు, ఆదాయాల పెరుగుదల రూపంలో స్థానిక ప్రజలకు లభించింది. పట్టణాలు వెలసి విద్యావకాశాలూ పెరగడం వల్ల విద్యాప్రమాణాలూ పెరిగాయి. వ్యవసాయాధార జీవితం నుండి ఉద్యోగరంగంలోకి చెప్పుకోదగ్గ సంఖ్యలో స్థానిక యువకులు ప్రవేశించగలిగారు.

ఓపెన్‌కాస్ట్ వల్ల వచ్చే ప్రయోజనం శూన్యం. ఓపెన్‌కాస్ట్ ఉత్పత్తి యంత్ర ప్రధానమైనది. భారీ యంత్రాలతో కొద్దిమంది మాత్రమే పనిచేసే ప్రక్రియ అది. అందులోనూ ఓవర్‌బర్డెన్ (పైమట్టి) తొలగింపును కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు కాబట్టి, కాంట్రాక్టర్లు అత్యధికం బయటి ప్రాంతాలవాళ్ళు కాబట్టి, స్థానికులకు ఆ కొన్ని ఉద్యోగాలలో కూడా ఎక్కువ వాటా దొరకదు. కాంట్రాక్టర్లు పనికోసం తమవాళ్ళనే తెచ్చుకుంటారు. ఈ మధ్యన పైమట్టి తొలగింపేకాక బొగ్గు వెలికితీత కూడా కాంట్రాక్టర్లకు అప్పగించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది.

నష్టం మాత్రం అండర్‌గ్రౌండ్ బొగ్గుబావుల కంటే ఓపెన్‌కాస్ట్‌లు చాలా ఎక్కువ కలుగజేస్తాయి. బొగ్గు మొత్తం పైనుండే తీస్తారు కాబట్టి ఎంత విస్తీర్ణంలో బొగ్గు తవ్వకం జరిగితే అంత విస్తీర్ణంలోనూ భూమిని కంపెనీకి అప్పగించాలి. అంతేకాదు. బొగ్గు పొరను చేరుకొనే లోపల మట్టి చాలా వస్తుంది. ఈ పైమట్టిని (ఓవర్‌బర్డెన్ లేక ఓ.బి.) తీసి పక్కనే కుప్పలుగా పోస్తారు. దీనిని ఓ.బి. డంప్ అంటారు. దీనికోసం విడిగా భూమి కావాలి. అది కాక ఒక్కొక్క గని దగ్గరా కంపెనీ కార్యాలయాలు వగైరాలకు భూమి కావాలి. చుట్టూ 'క్లియరెన్స్'కు చాలా భూమి కావాలి. ఒక ఉదాహరణ తీసుకుంటే విషయం స్పష్టం అవుతుంది. ఆదిలాబాద్ జిల్లా ఇందారం దగ్గర ఓపెన్‌కాస్ట్ గని కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రకటన జారీచేసింది. ఆ

ప్రాజెక్టుకు అవసరమైన భూమి వివరాలు ఇట్లా ఉన్నాయి. బొగ్గు క్వారీ కోసం 870 ఎకరాలు, ఓ.బి. డంప్ కోసం 625 ఎకరాలు, క్లియరెన్స్ కోసం రెండింటి చుట్టూ మరో 375 ఎకరాలు, బిల్డింగ్‌లు వగైరాల కోసం 75 ఎకరాలు వెరసి 1875 ఎకరాలు అవసరమని తేల్చారు. అన్ని ప్రాజెక్టులూ ఇంతే పరిమాణంలో ఉండకపోవచ్చు కాబట్టి ఒక్కొక్క దానికీ 1500 నుండి 2000 ఎకరాల దాకా భూమి కావాలని భావించవచ్చు. ప్రస్తుతం ప్రతిపాదనలో ఉన్న 70 చిల్లర ఓపెన్‌కాస్ట్‌లకు మొత్తం 1.50 లక్షల ఎకరాల దాకా అవసరం అవుతుంది. కొన్ని వందల గ్రామాలు పూర్తిగా పోతాయి. ఆదిలాబాద్ జిల్లాలోనయితే 50 వేల జనాభా వున్న రామకృష్ణాపూర్, 1 లక్ష జనాభావున్న బెల్లంపల్లి పట్టణాలు ఖాళీ అయ్యే సూచనలున్నాయి. మొదటి దశలో చేసే భూసేకరణతో పని అయిపోదు. బొగ్గు తవ్వేకొద్దీ మట్టి ఇంకా వస్తూనే ఉంటుంది కాబట్టి కొంతకాలానికి ఓ.బి. డంప్‌కు ఇంకా భూమి కావలసి ఉంటుంది. క్వారీ విస్తీర్ణాన్ని కూడా - బొగ్గు లభ్యతను బట్టి పెంచవచ్చు. కాబట్టి ఒక్కొక్క ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కోసం విడతలు విడతలుగా భూసేకరణ చేస్తూ పోయే అవకాశం చివరికి 1.50 లక్షల ఎకరాల దగ్గర మొదలయిన భూసేకరణను 2.00 లేక 2.50 లక్షల ఎకరాల దాకా తీసుకుపోవచ్చు.

ఖాళీ అయిన గ్రామాలు పోగా చుట్టుపక్కల ఉన్న గ్రామాల పరిస్థితి ఏమిటి? ఓ.బి. డంప్‌లు పెద్ద మట్టి గుట్టలు. వాటిని ఎప్పటికప్పుడు తడుపుతూ ఉండాలనీ వాటి పైన చెట్లు పెట్టాలనీ కంపెనీని ప్రభుత్వం ఆదేశించినట్టు పత్రికలలో చదువుతుంటాం. ఓపెన్‌కాస్ట్ తవ్వకం అయిపోయిన తరువాత ఓ.బి. డంప్‌లోని మట్టితోనే ఆ బొందను నింపబోతారని కూడా వింటున్నాం. (ఇవి రెండూ ఎట్లా జరుగుతాయో మాత్రం తెలీదు). వాస్తవానికి జరిగేదేమిటంటే ఆ మట్టిగుట్టలు అట్లాగే ఉంటాయి. వాటిని అప్పుడప్పుడే తప్ప నిరంతరాయంగా నీళ్ళతో తడపరు. ఆ మట్టి ఎండకు ఎండి గాలికి ఎగిరి వర్షాలకు బురదయి చుట్టుపక్కల ఇళ్ళనూ పొలాలనూ అన్ని సీజన్లలోనూ పాడుచేస్తుంటుంది. ఇది కాక బొగ్గును తవ్వడానికి చేసే బ్లాస్టింగ్ ఒక పెద్ద సమస్య. దగ్గరలో ఉన్న ఇళ్ళ గోడలు బీటలు వారడం, కొంతకాలానికి కూలిపోవడం ఓపెన్‌కాస్ట్ గనుల సమీపంలోని అన్ని గ్రామాల అనుభవమూ. కరీంనగర్ జిల్లాలోని రామగుండం ఓ.సి.పి-4 వల్ల ఇళ్ళు బీటలు వారిన మేడిపల్లి, ఖమ్మం

జిల్లాలోని మణుగూరు సెంటినరీ ఓ.సి.పి విస్తరణవల్ల బీటలు వారడమే కాదు ఇళ్ళు కూలిపోయిన పినపాక మండలం శ్రీరంగాపురం దీనికి ప్రత్యక్ష నిదర్శనాలు. మామూలుగా బ్లాస్టింగ్ వల్ల ఇంటిగోడలు నెర్రెలు బారినట్టు సింగరేణి కంపెనీ ఒప్పుకోదు. మీరు నాసిరకం వస్తువులతో ఇళ్ళు కట్టుకొని నెపం మామీద పెడుతున్నారు అంటుంది. కానీ శ్రీరంగాపురంలోని ఇళ్ళ స్థితి ఎంత ఘోరమంటే కంపెనీయే ఒప్పుకోక తప్పలేదు. ఆ ఊరిలోని 90 కుటుంబాలలో మెజారిటీ ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోగా 37 మాత్రం మిగిలాయి. అందరికీ కొంత దూరాన కాలనీ కట్టియ్యడానికి కంపెనీ ఒప్పుకుంది. మూడవ సమస్య భూగర్భ జలాలు ఇంకిపోవడం. ఓపెన్‌కాస్ట్ తవ్వకం భూమిలోనికి పోయేకొద్దీ నీళ్ళు ఊరుతుంటుంది. ఆ నీటిని ఎప్పటికప్పుడు బయటకు తోడి కంపెనీ అవసరాల కోసం వాడుకుంటారు. ఆయా ప్రాంతాలలో నేలలోని పొర స్వభావాన్ని బట్టి కొన్నిచోట్ల దాని ఫలితంగా సమీపంలోని వాటర్ టేబుల్ కుంగిపోగలదు. చివరి సమస్య రాకపోకలకు అంతరాయం. ఒక గ్రామం పక్కన ఓపెన్‌కాస్ట్ గని నెలకొనడం వల్ల ఆ గ్రామానికి పొరుగు గ్రామాలతో, సమీపంలోని రహదార్లతో, నీటివనరులతో, అడవితో ఉన్న సంబంధం తెగిపోవచ్చు. ఇది ఆ గ్రామస్తుల జీవితంపైన, జీవన ప్రమాణంపైన తీవ్ర ప్రభావం వేయగలదు.

అంటే ఈ 70 చిల్లర ఓపెన్‌కాస్ట్‌ల కోసం జరిగే ఒకటిన్నర లక్షల ఎకరాల భూసేకరణ వల్ల ప్రత్యక్షంగా వ్యవసాయ భూములూ ఇళ్ళూ కోల్పోయేవారే కాక మళ్ళీ దాదాపు అందులో సగం మంది వాటి పర్యావరణ ప్రభావం వల్ల తమ జీవన ప్రమాణం చెప్పుకోదగ్గ మోతాదులో కోల్పోతారు. ఇది చిన్న విధ్వంసం కాదు.

అకస్మాత్తుగా ఇంత పెద్దెత్తున ఓపెన్‌కాస్ట్ బొగ్గుగని ప్రాజెక్టులు చేపట్టాలని సింగరేణి కాలరీస్ కంపెనీ ఎందుకు నిర్ణయించింది? ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం కాదు. 1991లో మొదలయిన ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని పైన ప్రస్తావించాము. దాని గురించి ఇంకొంచెం చెప్పుకుంటే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. ఆర్థిక సంస్కరణలు ఒక అభివృద్ధి నమూనాతో ముడిపడి ఉన్నాయి. వేగంగా, భారీగా పెట్టుబడులు పెట్టి విదేశీ మార్కెట్ లక్ష్యంగాగల ఉత్పత్తులను ప్రైవేట్‌రంగంలో పెద్దెత్తున చేపట్టాలి; దానికి అవసరమైన సాంకేతిక సామగ్రీ ప్రక్రియలనూ ఎంత ఖర్చయినా ఆహ్వానించాలి; దానికి కావలసిన సకల సదుపాయాలూ మౌలిక వసతులూ ప్రభుత్వం సమర్థంగా విరివిగా చవకగా తన

బాధ్యతగా కల్పించాలి అనేది ఈ అభివృద్ధి నమూనా. మౌలిక వసతులలో అతి ముఖ్యమైనది విద్యుత్తు. విద్యుత్ ఉత్పత్తికి మన దేశంలో ఇప్పటికీ ప్రధాన మూలం బొగ్గు (మొత్తం విద్యుదుత్పత్తిలో 66 శాతం థర్మల్ విద్యుత్తే). అందువల్ల థర్మల్ పవర్ ప్లాంట్ల స్థాపన, భారీగా బొగ్గు తవ్వకం అత్యవసరమైన విషయాలు. కోస్టల్ కారిడార్‌లో భాగంగా థర్మల్ ప్లాంట్లు తీరంవెంబడి పెద్దెత్తున నెలకొల్పుతున్న విషయం ఇప్పటికే చూసాము (అయితే వాటికి సింగరేణి బొగ్గుకాక బూడిద పాలు తక్కువ ఉండే విదేశీ బొగ్గు అధికంగా వాడుతున్నారు. చుట్టూ పొలాలూ, ఆవాసాలూ ఎక్కువ ఉన్న కారణంగా ఇది అవసరం అయింది). సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని భారీస్థాయిలో చేపట్టాలన్న నిర్ణయం ఈ నేపథ్యంలో తీసుకున్నదే. జనావాసాలు తక్కువ ఉన్న ప్రాంతాలలో బూడిద కాలుష్యం ఎక్కువ ఉన్నా ఫరవాలేదని భావిస్తారు కాబట్టి దేశంలో అటువంటి ప్రాంతాలలో నెలకొల్పే థర్మల్ ప్లాంటులకు ఈ బొగ్గును తరలిస్తారు కాబోలు.

ఈ 70 చిల్లర ఓపెన్‌కాస్ట్ పాజెక్టులూ వాటి విస్తరణా చేపట్టి గరిష్ట ఉత్పాదకత లభించే స్థాయిలో తవ్వుకుంటూపోతే 20 లేక 30 సంవత్సరాలో ఓపెన్‌కాస్ట్‌ల ద్వారా తీయగల బొగ్గంతా అయిపోతుంది. ఆ తరువాత ఉత్తర తెలంగాణ పరిస్థితి ఏమిటంటే గోదావరి లోయ ప్రాంతమంతా బొందలు, మట్టి గుట్టలు ఉంటాయి. అక్కడ మళ్ళీ వ్యవసాయం సాధ్యం కావడానికి కొన్ని శతాబ్దాలు పడుతుంది. ఇది అభివృద్ధి పేరిట ఈ ప్రాంత జీవితంపైన జరుగుతున్న దుర్మార్గమైన దాడి తప్ప వేరే ఏం కాదు.

## ప్రతిఘటన

ఇప్పటికి రెండుచోట్ల ప్రజలు ఈ దుర్మార్గాన్ని ప్రతిఘటించి ఆపగలిగారు. ఆ విజయం తాత్కాలికమేనా అన్న సందేహం ఉన్నప్పటికీ దాని గురించి చెప్పుకోవడం అవసరం. ఈ రెండు పోరాటాలూ అత్యంత వెనుకబడిన జిల్లా అయిన ఆదిలాబాద్‌లో జరిగాయి. సాధించిన ప్రజలు సమాజంలో అత్యంత బలహీనులుగా భావించబడే ఎస్.సి, ఎస్.టిలు.

కాశిపేట, ముత్యంపల్లి గ్రామాలు షెడ్యూల్డు ప్రాంతంలో ఉన్నాయి. వాటి మధ్య ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ప్రతిపాదన వచ్చేనాటికే ప్రజలు సింగరేణితో గొడవ

పడుతున్నారు. అక్కడ 1995లో అండర్‌గ్రౌండ్ గని ప్రారంభం అయింది. 1997 నుండి ఆ గ్రామాలకు నీటి సమస్య మొదలయింది. అన్ని బావులలోనూ నీళ్ళు ఇంకిపోయాయి. జనం సింగరేణి పనులు బంద్ పెట్టించి ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం ప్రజలతో ఒప్పందానికి వచ్చి గనిలోని ఊటనీటిని ఫిల్టర్ చేసి ఈ గ్రామాలకు పైప్‌లైన్ ద్వారా సరఫరా చేయడం మొదలుపెట్టింది. అయితే అది ఇంటి అవసరాలకే తప్ప చేలకు కాదు. ఈ మధ్య ఫిల్టర్ కూడా సరిగ్గా చేయకపోవడం వల్ల మురికి నీళ్ళు వస్తున్నాయి. ఈ దశలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన వచ్చేసరికి జనం గట్టిగా ఎదురు తిరిగారు. అండర్‌గ్రౌండ్ గనితోనే మాకిన్ని సమస్యలు వచ్చాయి. ఇక ఓపెన్‌కాస్ట్ వస్తే బతకలేం అని అడ్డు తగిలారు. ఏజెన్సీకి వర్తించే చట్టాలను ప్రస్తావించి మా అనుమతి లేకుండా ఎట్లా నెలకొల్పుతారో చూస్తాం అని హెచ్చరించారు. సింగరేణి యాజమాన్యం వెనక్కి తగ్గినట్టే కనిపిస్తోంది. 2008 ఫిబ్రవరిలో జరగవలసిన పర్యావరణ బహిరంగ విచారణను వాయిదా వేశారు. మళ్ళీ జరిపే ప్రయత్నం చేయలేదు.

నెన్నెల మండలంలోని శ్రావణపల్లి, జెండా వెంకటాపూర్ గ్రామాలు, వాటిని ఆనుకొనివున్న మందమర్రి మండలంలోని మామిడిగట్టు గ్రామం ఒక సంవత్సరంపైగా తమ ఊరిలోకి సింగరేణి అధికారులను అడుగుపెట్టనీయకుండా నిరోధించాయి. ఈ మూడు గ్రామాల భూములలో సింగరేణి ఒక ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును ప్రతిపాదించింది. దానిని 'శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్' అని ప్రజలు పిలుస్తున్నారు. శ్రావణపల్లి పూర్తిగా లంబాడీ గిరిజనులు నివసించే గ్రామం. జెండా వెంకటాపూర్ వాసులందరూ నేతకాని కులానికి చెందిన దళితులు. మామిడిగట్టు భిన్న కులాలున్న గ్రామం. ఈ గ్రామాలు మామిడి తోటలకు ప్రసిద్ధిగాంచాయి. దాదాపు 4000 ఎకరాల మామిడితోటలున్నాయి. మన ప్రాంతంలో అరుదైన దస్సేరి పండ్లు పండుతాయి. ఒకప్పుడు నాగపూర్ నుండి దళారులు వచ్చి పండ్లు కొనుక్కొని పోయేవారు గానీ గత అయిదారేళ్ళుగా ఈ గ్రామాల యువకులే మామిడి పండ్లను నాగపూర్ తీసుకుపోయి వ్యాపారం చేయడం నేర్చుకున్నారు. మామిడి కాత బాగా ఉన్న సంవత్సరంలో ఎకరానికి 80 వేల రూపాయల దాకా ఆదాయం పొందుతున్నారు.

ఈ మామిడి తోటలే కాక, మళ్ళీ అంత భూమిలో వరిచేలు కూడా ఉన్నాయి. కుంటలు, బోర్లు ఉన్నాయి. రెండు పంటలూ వరి పంటే వేసే భూములూ ఉన్నాయి.

ఈ గ్రామాలకు చుట్టుపక్కల అయిదారు గ్రామాల నుండి కూలికి వస్తారు. సమీపంలో అడవులు ఉండడం వల్ల పశుగ్రాసమూ సమృద్ధిగా ఉంది. ఇంటింటికీ 15 నుండి 20 దాకా పశువులున్నాయి.

ఇన్ని కారణాలుగా ఈ పూర్ల ప్రజలు తమ జీవితాలను కాలక్రమంలో బాగు చేసుకొని గౌరవప్రదంగా బతకగలుగుతున్నారు. ఈ స్థితిలో ఓపెన్‌కాస్ట్ ప్రతిపాదన రావడం వీరికి గొడ్డలిపెట్టయింది. మొదటి దినం నుండి దానిని గట్టిగా వ్యతిరేకిస్తూ, సర్వే నిమిత్తం కూడా సింగరేణి అధికారులను రానివ్వకుండా అడ్డుపడుతూ వున్నారు. పోలీసు కేసులయినా ఖాతరు చేయలేదు. అన్ని ప్రజా సంఘాలనూ ఉద్యమకారులనూ పిలిచి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఒత్తిడి ఫలితంగా 'శ్రావణపల్లి ఓ.సి. ప్రాజెక్టు'ను వదులుకున్నట్టుగా సింగరేణి యాజమాన్యం నుండి వారికి సంకేతాలు అందాయి.

పూర్తిగా ఆపకపోయినా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వల్ల కలిగే నష్టాన్ని ఆందోళన చేసి తగ్గించుకున్న ఉదంతం ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణంలో జరిగింది. జెకె-5 గనిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చడానికి సింగరేణి చేపట్టిన భూసేకరణ ఇల్లందు పట్టణంలో 7 వార్డులను మింగేస్తుందని తెలిసి పట్టణ ప్రజలు అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ భూసేకరణ ప్రధానంగా ఒ.బి. డంప్ కోసం. ఇళ్ళు కోల్పోయేవారు కోల్పోగా మిగిలిన ఊరు పక్కనే పెద్ద మట్టి గుట్టను పెట్టుకొని ఎండాకాలానికి చెలరేగే ధూళిని భరిస్తూ బతకాలి. ఓపెన్‌కాస్ట్‌లో జరిగే బ్లాస్టింగ్ కాలక్రమంలో ఊరంతటినీ శిథిలం చేసినా ఆశ్చర్యం లేదు. జెకె-5లో అండర్‌గ్రౌండ్ పద్ధతిలో ఇంకా కొంతకాలం బొగ్గు తవ్వి తీసే అవకాశం ఉన్నా కంపెనీ దానిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చాలని ఎందుకు నిర్ణయించిందన్న ప్రశ్నకు జవాబేమీ లేకున్నా, ఆందోళన ఫలితంగా భూసేకరణ తగ్గించడమయితే జరిగింది. ఇప్పుడు ఇల్లందు పట్టణంలో 7 వార్డులు కాదు, 2 మాత్రమే పోతాయి. అయినప్పటికీ ఆ పట్టణ భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే ఉండిపోయింది.

ఇల్లందు జెకె-5 గని ఒక్కటే కాదు, చాలాచోట్ల ఇప్పుడొస్తున్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు అండర్‌గ్రౌండ్ గనులను ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా నెలకొంటున్నవి. అండర్‌గ్రౌండ్ పద్ధతిలో బొగ్గు తీయగలిగినంతా తీసేసి దానిని

మూసేసే స్థితి వచ్చినప్పుడు ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో కొనసాగించడం ఓపెన్‌కాస్ట్‌లను సమర్థించుకోవడానికి ఒకనాడు చేసిన వాదన. కానీ ఇప్పుడు ఇంకా చాలాకాలం అండర్‌గ్రౌండ్ పద్ధతిలో నడవగల గనులను కూడా ఓపెన్‌కాస్ట్‌లుగా మారుస్తున్నారు. ఇప్పటిదాకా పనిచేస్తున్న వందలమంది కార్మికులను తొలగించి చుట్టుపక్కల గ్రామాలనూ వ్యవసాయ భూములనూ ఖాళీ చేయించి అధిక ఉత్పత్తినీ అధిక ఉత్పాదకతనూ నమోదు చేసుకుంటున్నారు. వరంగల్ జిల్లాలోని భూపాలపల్లిలోనయితే 3ఎ ఇంక్లయిన్‌ను 2008 ఏప్రిల్ నెలలో ఆర్భాటంగా ఆవిష్కరించినట్టు చేసి ఉత్పత్తి మాత్రం మొదలుపెట్టకుండా దానిని ఓపెన్‌కాస్ట్‌గా మార్చే ప్రయత్నం మొదలుపెట్టారు.

## ఆదివాసుల హక్కులు

అప్పుడెప్పుడో వచ్చిన అండర్‌గ్రౌండ్ గనులు ఎక్కువ భాగం (ముఖ్యంగా ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలలో) ఆదివాసీ ప్రాంతాలలోనే ఉన్నాయి. అప్పుడు వారికి రక్షణ కల్పించే చట్టాలు లేవు. వారిని అడవులలోకి నెట్టేసి గనులు ఏర్పాటు చేశారు. గనులలో ఒక్క ఆదివాసీకీ పని దొరకలేదు. ఇవ్వాళ్టికీ సింగరేణి గని కార్మికులలో ఆదివాసులు అతి తక్కువ. రేపు జరగబోయే ఓపెన్‌కాస్ట్ విస్తరణ మరొక విడత భారీగా ఆదివాసుల భూములను కబళించబోతుంది. ఇప్పుడెలాగూ పనులు స్థానిక ప్రజలెవరికీ పెద్దగా దక్కబోయేది లేదు కాబట్టి భూములు కోల్పోయే ఆదివాసులకూ దక్కవు. అయితే ఇప్పుడు ఆదివాసులకు బలం కల్పించే చట్టాలున్నాయి. వాటిని పాలకులు గౌరవించి ఉంటే ఈ విస్తరణ జరిగేదే కాదు. ప్రజలు వాటిని అర్థం చేసుకొని సంఘటితమై అడ్డుపడినా నిలిచిపోతుంది కానీ ఆ చట్టాల గురించి ప్రజలకే కాదు, వారి తరఫున మాట్లాడుతున్న పార్టీలకూ, ప్రజాసంఘాలకూ కూడా అవగాహన లేదు.

షెడ్యూల్డు ప్రాంతాలకు పెసా (PESA) చట్టం వర్తిస్తుంది. పెసా అనేది కేవలం చట్టం కాదు, రాజ్యాంగ ఆదేశం. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశంలోని పంచాయతుల రూపురేఖలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించినప్పుడు, దానిని షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేయకుండా ఆ పని తగురీతిలో పార్లమెంట్ చేస్తుందని అనడం జరిగింది. 1996లో పెసా చట్టం ద్వారా పార్లమెంటు 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరింపజేసింది. ఆదివాసుల ప్రత్యేక స్థితిని దృష్టిలో

## ‘పెసా’ చట్టం

‘పెసా’ చట్టం పూర్తి పేరు ‘పంచాయత్స్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్’ చట్టం.

దేశ రాజ్యాంగం రాసినప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు గానీ స్థానిక సంస్థల అధికారాలకు కల్పించలేదు. వాటి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టానికి వదిలేశారు. ఇది స్థానిక సంస్థలను చాలా బలహీనపరిచిందని గుర్తించి 1992లో 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతులకు, మునిసిపాలిటీలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. అయితే ఈ సవరణలను షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజేయలేదు. వాటిని షెడ్యూల్డు ప్రాంతాలకు ఉన్నదున్నట్టు కాకుండ ఆదివాసీ ప్రజల అవసరాలనూ, ఆకాంక్షలనూ దృష్టిలో ఉంచుకొని తగిన పద్ధతిలో సవరించి వర్తింపజేయాలని భావించారు. భవిష్యత్తులో పార్లమెంటు ఆ పనిచేస్తుందని 73, 74వ రాజ్యాంగ సవరణలు అంటాయి. మునిసిపాలిటీల విషయంలో ఇది ఇప్పటికీ జరగలేదు గానీ, పంచాయతుల విషయంలో పార్లమెంటు భూరియా కమిటీ ప్రతిపాదనలను లెక్కలోకి తీసుకొని 1996లో పెసా చట్టం ద్వారా 73వ రాజ్యాంగ సవరణను షెడ్యూల్డు ప్రాంతాలకు విస్తరింపజేసింది.

వివిధ పాలనాంశాలలో ఆదివాసీ ప్రాంత గ్రామసభకూ పంచాయత్‌రాజ్ వ్యవస్థలకూ స్వయంప్రతిపత్తి కల్పిస్తూ ఆయా రాష్ట్రాల పంచాయత్‌రాజ్ చట్టాలను తిరగ రాయాలని ‘పెసా’ చట్టం రాష్ట్రాలను ఆదేశిస్తుంది. ఈ స్వయంప్రతిపత్తి స్వభావాన్ని ‘పెసా’ చట్టంలోని సెక్షన్ 4(డి) సూచిస్తుంది. అదేమిటంటే గ్రామసభకు ‘ప్రజల సంప్రదాయాలు, ఆచారాలు, సాంస్కృతిక ప్రత్యేకతలు, ఉమ్మడి వనరుల’ను కాపాడుకునే హక్కు ఉంటుందనేది. ఉమ్మడి వనరులలో ఊరి చుట్టూ ఉన్న భూమి, అడవులు, నీటివనరులు వస్తాయి. ఈ సాధారణ అధికారమే కాక, భూసేకరణ చేసేముందు, నిర్వాసితుల పునరావాసం చేపట్టేముందు గ్రామసభను గానీ పంచాయితీరాజ్ వ్యవస్థలో నిర్దేశిత స్థాయి వ్యవస్థను గానీ తప్పనిసరిగా సంప్రదించాలన్న నియమం కూడా సెక్షన్ 4(ఐ) కల్పించింది. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు ఈ ‘నిర్దేశిత స్థాయి వ్యవస్థ’ మండల ప్రజాపరిషత్.

ఉంచుకొని ప్రత్యేక అంశాలను చేర్చింది. వాటిలో ప్రస్తుతానికి వర్తించేవి రెండు. ఒకటి – షెడ్యూల్డు ప్రాంత గ్రామసభకు 'ప్రజల సంప్రదాయాలనూ, ఆచారాలనూ, సాంస్కృతిక ప్రత్యేకతలనూ, ఉమ్మడి వనరులనూ' కాపాడే అధికారం, సంరక్షించే అధికారం ఉంది. 'ఉమ్మడి వనరులు' అనేదానిలో గ్రామ కంఠం, బీళ్ళు, పోరంబోకులు, నీటివనరులు, అడవులు వస్తాయని వివరించి చెప్పనవసరం లేదు. వీటిని కాపాడే అధికారం, సంరక్షించే అధికారం గ్రామసభకు ఉన్నాయి అంటే అర్థం గ్రామసభ సమ్మతి లేకుండా వాటిని ప్రభుత్వం సహితం వేరే అవసరాల కోసం తీసేసుకోవడానికి, వినియోగించడానికి వీలులేదని. రెండు – ఏ అభివృద్ధి పథకం కోసమయినా భూసేకరణ చేసే ముందు, వాటివల్ల నిర్వాసితులయ్యే ప్రజలకు పునరావాసం కల్పించే ముందు స్థానిక మండల పరిషత్‌ను సంప్రదించాలి. ఇక్కడ సంప్రదింపు అనేది మొక్కుబడిగా ఉండడానికి వీలులేదు. అర్థవంతమైన సంప్రదింపు జరగాలంటే ప్రాజెక్టుకూ పునరావాసానికీ సంబంధించిన పూర్తి సమాచారాన్ని సంబంధిత మండల పరిషత్ ముందు ఉంచి తగు హోదాగల అధికారి మండల పరిషత్ సమావేశానికి హాజరై వారికి అన్నీ వివరించి, వారి ప్రశ్నలకు జవాబులు చెప్పి వారి అభిప్రాయం కోరాలి.

ఇవి పెసా నుండి వచ్చిన హక్కులు కాగా అటవీ హక్కుల చట్టం (షెడ్యూల్డు తెగలు, ఇతర సంప్రదాయ అటవీవాసుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం) అడవులలో ఆదివాసులకూ, మూడు తరాలుగా అడవిపైన ఆధారపడి బతుకుతున్న ఆదివాసీయేతరులకూ ఇచ్చిన హక్కులను లెక్కలోకి తీసుకోకుండా కూడా భూసేకరణ జరగడానికి వీలు లేదు. 2005 డిసెంబరు 13వ తేదీకి ముందు ఎన్నడైనా అడవులలో అనుభవించిన సకల హక్కులకూ ఈ చట్టం గుర్తింపు ఇస్తుంది. అందులో సమిష్టి హక్కులూ ఉన్నాయి, వ్యక్తిగత హక్కులూ ఉన్నాయి. అంటే పోగొట్టుకున్న భూములకు పట్టాయేకాక ఒక గూడెం ప్రజలు సమిష్టిగా పశువులను మేపుకున్న భూభాగం మీద, సమిష్టిగా చేపలు పట్టుకున్న నీటి వనరుల మీద, సమిష్టిగా చిన్నతరహా అటవీ ఉత్పత్తులు సేకరించిన అటవీక్షేత్రం మీద కూడా సమిష్టి 'పట్టాలు' లభిస్తాయి. ఈ పట్టాలు మంజూరు చేసే క్రమం ఇప్పుడిప్పుడే మొదలయింది. అది పూర్తయి హక్కుల నిర్ధారణ సమగ్రంగా జరిగేదాకా అటవీ ప్రాంతాలలో ఎటువంటి భూసేకరణా జరగడానికి వీలు లేదు.

## పట్టణాలే మాయం

రామకృష్ణాపూర్ ఆదిలాబాద్ జిల్లా 'కోల్‌బెల్ట్'లోని పెద్ద ఊర్లలో ఒకటి. 50 వేల జనాభా ఉన్న ఈ ఊరిలో దానికి దగ్గర ఉన్న గనులలో పనిచేసే కార్మికులేకాక, మందమర్రి, శ్రీరాంపూర్‌లలో పనిచేసే కార్మికులు కూడా నివసిస్తున్నారు. అక్కడున్న సింగరేణి ఏరియా ఆస్పత్రి బాగా పెద్దది కూడా అయితే ఆ ఊరి భూమంతా అప్పుడెప్పుడో సింగరేణికి ప్రభుత్వం ఇచ్చినదే. కంపెనీయే ఇళ్ళస్థలాలు ఇచ్చి ఉచిత కరెంటు ఇచ్చి కార్మికులు నివాసాలు ఏర్పరుచుకోవడాన్ని ఒకనాడు ప్రోత్సహించింది. ఇప్పుడొక పెద్ద బజారు, స్కూళ్ళు తదితర వసతులతో రామకృష్ణాపూర్ ఒక పెద్ద ఊరయింది. ఆ ఊరికిప్పుడు చేటొచ్చింది. సింగరేణి యాజమాన్యం ఓపెన్‌కాస్ట్‌ల గురించి పారదర్శకంగా ఏమీ చెప్పదు. అకస్మాత్తుగా భూసేకరణ ప్రకటనో, బుల్‌డోజర్లో వచ్చిన రోజు తెలుసుకోవాలి. అయితే అందులో పనిచేసే ఉద్యోగుల ద్వారా కొంత సమాచారం తెలుస్తూనే ఉంటుంది. తెలిసిన సమాచారం ప్రకారం, మూసేసిన ఆర్‌కె-1, ఆర్‌కె-3, ఆర్‌కె-4 గనులను ఓపెన్‌కాస్ట్‌లుగా పునరుద్ధరించి, నడుస్తున్న ఎంకె-4, ఎంకె-4ఎ గనులను కూడా ఓపెన్‌కాస్ట్‌లుగా మార్చి ఒక బృహత్ ఓ.సి. ప్రాజెక్టు తయారు చేసే ఆలోచనలో సింగరేణి ఉంది. తొలుత ఈ ప్రాజెక్టుకు ఓ.బి. డంప్‌ను రామకృష్ణాపురం ఊరున్న చోట నెలకొల్పాలన్న ఆలోచన ఉండింది గానీ ఇది బయటకు పొక్కి కొంత అల్లరి జరిగేసరికి ఊరిబయట, మందమర్రి - శ్రీరాంపూర్ రోడ్డుకు ఆవల డంప్ నెలకొల్పబోతున్నట్లు కంపెనీ సంకేతాలు ఇచ్చింది. అయినప్పటికీ ధూళి వల్ల, బ్లాస్టింగ్ వల్ల రోడ్డుకు ఇవతల ఉన్న ఆర్‌కె-4 గడ్డ, శాంతినగర్ కాలనీలలో నివాసం అసాధ్యం అవుతుంది. అక్కడి జనాభా 15 నుండి 20 వేల దాకా ఉంటుంది. కాలక్రమంలో ఊరే ఖాళీ చేయవలసి రావచ్చు. →

ఈ చట్టాలను పాటిస్తే సింగరేణి యాజమాన్యం తలపెట్టిన ఓపెన్‌కాస్ట్ విస్తరణ మూడవ వంతు కూడా సాధ్యమయ్యేది కాదు. ఆదిలాబాద్ జిల్లాలోనూ వరంగల్ జిల్లాలోనూ చేపడుతున్న ఓపెన్‌కాస్టులు కొన్ని, ఖమ్మం జిల్లాలో చేపడుతున్న దాదాపు అన్నీ (సత్తుపల్లి దగ్గర నెలకొంటున్న ఓ.సి.పి-2 తప్ప అన్నీ) షెడ్యూల్డు ప్రాంతంలో, అడవి ప్రాంతంలో ఉన్నాయి. పైన చెప్పిన చట్టాల గురించి, అవి కల్పించే హక్కుల గురించి అడిగేవాళ్ళెవరూ లేరు కాబట్టి ఏ గ్రామసభ అనుమతీ తీసుకోకుండా, ఏ

బెల్లంపల్లి ఇంకా పెద్ద ఊరు. ఒక లక్ష దాకా జనాభా ఉన్న ఊరు. ఆ ఊరిని క్రమంగా ఖాళీ చేయించే ఆలోచన సింగరేణి యాజమాన్యానికి ఉన్నట్లు అనేక సంకేతాలు లభిస్తున్నాయి. 1976లో ఒక ప్రమాదం కారణంగా మూసేసిన 2 ఇంక్లయిన్ గనిని కేంద్రం చేసుకొని ఒక భారీ ఓపెన్‌కాస్ట్‌ను తయారుచేసే ఆలోచన ఉందని కార్మికుల అనుమానం. ఆ ఊరిలో కార్మికుల క్వార్టర్స్ 5000 దాకా ఉన్నాయి. ఇప్పుడు బెల్లంపల్లికి అనుబంధంగా గనులు లేవు. అబ్బాపూర్, ఖైరిగూడ, డొర్లి, గోలేటి తదితర ప్రాంతాలలోని గనుల కార్మికులకు ఈ క్వార్టర్స్ నివాసాలుగా కేటాయించేవారు. ఇప్పుడు ఒక్కొక్కటి ఖాళీ చేయిస్తున్నారు. పాడయిన వాటిని రిపేర్ చేయడం లేదు. ఖాళీ అయిన వాటిని వేరే ఎవ్వరికీ కేటాయించడం లేదు. నీటి సరఫరా రెండు మూడు రోజులకొకసారి చేస్తున్నారు. హైస్కూల్‌ను, డిస్పెన్సరీని, టింబర్‌యార్డ్‌ను, స్టోర్స్‌ను, ఏరియా వర్క్‌షాప్‌ను గడచిన నాలుగైదు ఏళ్ళలో ఒకటొకటిగా మూసేశారు. 608 పడకలు ఉండిన ఏరియా ఆస్పత్రిలో పడకల సంఖ్యను 250కి తగ్గించేశారు. ఇక్కడ భూమంతా ఏనాడో ప్రభుత్వం సింగరేణికి అప్పగించింది కాబట్టి వారి అనుమతి లేకుండ ప్రభుత్వ కార్యాలయాలు సహితం ఆ ఊరిలో కట్టుకోవడానికి వీలు లేదు. ఆ అనుమతి సింగరేణి ఇవ్వడం లేదు. చివరికి బెల్లంపల్లి మునిసిపాలిటీకి సహితం తన కార్యాలయం కోసం బిల్డింగ్ కట్టుకోవడానికి కంపెనీ అనుమతి నిరాకరించింది!

ఒక లక్ష జనాభాగల ఊరిని మెల్లమెల్లగా గొంతు నులిమి చంపేసి అక్కడ భారీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు నెలకొల్పాలని సింగరేణి యాజమాన్యం ప్రయత్నిస్తున్నదనడానికి ఇవన్నీ సంకేతాలే. అయితే కంపెనీ మాత్రం నోరువిప్పదు.

మండల పరిషత్‌నూ సంప్రదించకుండా, అటవీ హక్కుల గుర్తింపు కోసం ఆగకుండా భూములు తీసేసుకుంటున్నారు. పోలవరం వల్ల ఏడు మండలాలలో (వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గంపాడు, భద్రాచలం, కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు) భారీగా భూములు కోల్పోతున్న ఖమ్మం జిల్లా ఆదివాసులు ఓపెన్‌కాస్ట్‌ల వల్ల మరొక 5 మండలాలలో (ఇల్లందు, గుండాల, టేకులపల్లి, మణుగూరు, పినపాక) భూములు కోల్పోతారు. ఇది అడవి ప్రాంతం కాబట్టి ప్రతీ గ్రామంలోనూ పోడు భూములున్నాయి.

అటవీ హక్కుల చట్టం ఒకటి వచ్చిందని, దాని కింద పోడు భూములకు పట్టా లభిస్తుందని తెలియని ఆదివాసుల నుండి పోడు భూములు గుంజుకోవడం ప్రభుత్వానికి చాలా సులభం అయింది. పోడు కొట్టుకోవడం నిన్నటిదాకా నేరం అని మాత్రమే వారికి తెలుసును. అయినా ఊరికే ఖాళీ చేయమంటే ప్రతిఘటిస్తారు గానీ ఏదో కొంచెం చేతిలో పెడితే ప్రభుత్వం ఎంత దయగలది అనుకొని ఖాళీ చేయగలరు. కోయగూడెం ఓ.సి.పి-2 కోసం టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం అనే కోయ గ్రామంలో 250 ఎకరాల పోడుభూమిని ఎకరానికి 5 వేల రూపాయలు చేతిలోపెట్టి అన్యాయంగా సింగరేణి స్వాధీనం చేసుకుంది.

బాధితులకిచ్చే పునరావాసం గురించి ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం చాలా చెప్తుంటారు కాబట్టి ఖమ్మం జిల్లా మణుగూరు ఓ.సి. ప్రాజెక్టు బాధిత ఆదివాసీ గ్రామమైన కొండాపురం కథ చెప్పుకొని ముగిద్దాం. మణుగూరు దగ్గర సింగరేణి శతాబ్ది సందర్భంగా 1989లోనే సెంటినరీ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు వచ్చింది. ఆ తరువాత దాని పక్కనే మరికొన్ని ఓపెన్‌కాస్ట్‌లు ప్లాన్‌చేసి చివరికి అన్నిటినీ కలిపి ఒకే పెద్ద మెగా ఓ.సి.పి.ని తయారు చేస్తున్నారు. దీనికి కావలసిన భూమిని ఎగ్గడిగూడెం, గుండ్లసింగారం, పద్మగూడెం, కొమ్ము గూడెం, మల్లెపల్లి గ్రామాల నుండి తీసుకుంటున్నారు. గనికోసం, ఓ.బి. డంప్‌కోసం, కార్యాలయాలు వగైరా అవసరాల కోసమేకాక మరొక దానికోసం కూడా ఇక్కడ భూమి అవసరమయింది. ఈ ఓపెన్‌కాస్ట్‌కు దగ్గరగా గోదావరి నది ప్రవహిస్తుంది. ఈ ప్రాజెక్టు లెవెల్ గోదావరి వరద నీటిమట్టం కంటే తక్కువ ఉండడంతో గోదావరి వెంబడి మట్టికట్ట వేయవలసి వచ్చింది. దానికోసమూ భూమి సేకరిస్తున్నారు. నది నుండి పైప్‌లైన్‌లు వేసుకొని పొలాలకు సాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులకు ఇంక ఆ అవకాశం ఉండదు.

ఇది ఇవ్వాళ్టి సంగతి కాగా, 1996లోనే సెంటినరీ ఓ.సి ప్రాజెక్టు ఓ.బి. డంప్ కోసం అదనంగా భూమి అవసరమయి 42 ఆదివాసీ కుటుంబాలున్న కొండాపురాన్ని ఖాళీ చేయించారు. మణుగూరు దగ్గర కాలనీ కట్టిస్తామనీ, అందరికీ వ్యవసాయ భూములిస్తామనీ, ఉద్యోగాలిస్తామనీ హామీ యిచ్చారు. కనీసం ఇంటిస్థలం కూడా ఇయ్యకపోయేసరికి కొండాపురం ప్రజలు ప్రత్యక్షచర్యకు దిగారు. 1996 డిసెంబర్ 11 నుండి 26 దాకా ఓపెన్‌కాస్ట్ పనులకు అడ్డంపడి బంద్ పెట్టించారు.

అప్పుడు మణుగూరును ఆనుకొని ఒక్కొక్క కుటుంబానికి 5 సెంట్ల ప్లాట్ ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి తలా 40 వేల రూపాయలిచ్చారు. అది చాలకపోతే అందరూ అదనంగా ఖర్చుపెట్టుకొని ఇళ్ళు కట్టుకొని కాలనీకి 'కొత్త కొండాపురం' అని పేరు పెట్టుకున్నారు. ఉద్యోగాలిస్తామన్నారు కదా ఇమ్మంటే రిక్రూట్‌మెంట్ జరిగేటప్పుడు అందరితోపాటు పరుగుపందెంలో పాల్గొనండి ఇస్తాం అన్నారు. పరుగుపందెంలో సఫలమైతే ఎట్లాగూ ఇచ్చేదే కదా, మీరు నిర్వాసితులుగా మాకు ఇచ్చిందేమిటి అని కొండాపురం ఆదివాసులు అభ్యంతరం తెలిపారు. అట్లాగయితే కరీంనగర్‌లో, ఆదిలాబాద్‌లో ఉన్న గనులలో పోయి పనిచేయండి అన్నారు. మా భూములు మీరు గని కోసం తీసుకొని మమ్మల్ని వేరే జిల్లాకు పొమ్మంటే ఎందుకు పోతాం అని జనం గొడవ పెట్టుకున్నారు. చివరకి ఉద్యోగాలిచ్చేది లేదనీ, దాని బదులు 60,000 రూపాయలిస్తామనీ, అయితే ఇది స్వంత భూమి ఉండిన 17 కుటుంబాలకు మాత్రమే పరిమితం అనీ సింగరేణి అనింది. పోడుభూమి మీద బంజరు భూమి మీద ఆధారపడి బతికిన తక్కిన 25 కుటుంబాల వారు కూడా జీవనం కోల్పోయినప్పటికీ వారికేమీ ఇవ్వననింది. ఉద్యోగాల ప్రహసనం అట్లా ముగిసింది. ఇక భూముల విషయానికి వస్తే – మొదట ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 2 ఎకరాల భూమి ఇస్తానంది. స్వంత భూమి ఉండిన 17 కుటుంబాలకు 1998లో సాగుయోగ్యమైన భూమే ఇచ్చింది గానీ మిగిలిన వారికి మరొక నాలుగేళ్ళు తిప్పించుకొని 2002లో రాళ్ళు రప్పలతో నిండిన భూమి ఇచ్చింది. కానీ సాగు యోగ్యమైన భూమి పొందిన 17 కుటుంబాల వారికే అంతా సజావుగా జరగలేదు. దున్నుకుందామని పోతే ఇచ్చిన 2 ఎకరాలూ ఒకచోట లేవనీ, ఇక్కడ కొంచెం అక్కడ కొంచెం ఉన్నాయనీ గమనించారు. పోనీలే దున్నుకుందామని ప్రయత్నించగా గిరిజనేతరులు అడ్డుతగిలి అది తమ భూమి అని అన్నారు. భూమి పొందిన గిరిజనులు ఈ సంగతి మణుగూరు ఎంఆర్‌వో (తాసీల్దార్)కూ, ఎస్ఐకీ చెప్పగా వారు గిరిజనేతరులపైన ఆగ్రహించి 'మీకెట్లా అడ్డమొస్తారు? వాళ్ళను నరకండి' అని ఉచిత సలహా ఇచ్చారు. ఇన్ని హామీలు ఇచ్చి చివరికి ఏమీ ఇవ్వని ప్రభుత్వాన్ని పట్టుకొని నిలదీయకపోయారా అని కొండాపురం కోయ పెద్దను అడిగితే 'ఎట్లా పట్టుకునేది? దానికి జుట్టూ జందెం ఉంటే కదా' అని చమత్కరించాడు.

**మానవహక్కుల వేదిక బులెటిన్–10**

**జూన్ 2009**

# అభివృద్ధి పిడికిలిలో చిన్న జనం

సెజ్‌ల కోసం, గనుల కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో చేపడుతున్న భూసేకరణ వల్ల జీవనం కోల్పోతున్న వారికి ఆ భూసేకరణను, విచ్చలవిడి పారిశ్రామికీకరణను వ్యతిరేకించమని చెప్తున్న ఉద్యమకారులు ఆ ప్రజలకు మేలు చేస్తున్నారా, లేకపోతే ప్రభుత్వం ఆరోపిస్తున్నట్టు ఎదుగూబొదుగూలేని గ్రామీణ జీవితాన్ని విడిచిపెట్టి ప్రభుత్వం ఉదారంగా ఇచ్చే నష్టపరిహారాన్ని తీసుకొని పట్టణాలలో మెరుగయిన జీవితాన్ని వెతుక్కునే అవకాశానికి అడ్డుపడుతున్నారా? ఒక్కొక్క ఉదంతాన్నీ తీసుకొని నిర్దిష్టంగా బేరీజు వేసినప్పుడు మాత్రమే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. ప్రతీ ఊరిలోనూ కొంత ఎక్కువ భూమి ఉన్నవారూ, ఇప్పటికే పట్టణాలలో ఉద్యోగం చేసుకుంటున్న వారూ, వ్యాపార రంగంతో పరిచయమూ, అనుభవమూ ఉన్నవారు కొందరుంటారు. వారు ఈ భూసేకరణ ప్రక్రియను ఆహ్వానించగలరు. భూములు వదులుకొని డబ్బులు తీసుకొని పట్టణాలలో మరింత సంపూర్ణంగా స్థిరపడగలరు. ఈ చర్చ వారి గురించి కాదు. వారికి ఎవరూ హితవు చెప్పడం లేదు, చెప్పినా వారు వినరు. కాగా, వారినే ప్రభుత్వం ఉదాహరణగా చూపించి, ఇతరులను కూడ వారి బాట పట్టరాదా అని ఒత్తిడి పెడుతున్నది. వారు కూడ గ్రామంలో తమకున్న పెద్దరికాన్ని వాడుకొని ప్రభుత్వం తరఫున చిన్నజనం పైన ఒత్తిడి పెడతారు. మన చర్చ ఆ చిన్నజనం గురించి.

శ్రీకాకుళం జిల్లా సోంపేట మండల కేంద్రం సమీపంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వారి యాజమాన్యంలో 2640 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ కేంద్రం రాబోతున్నది. దానికోసం ఆ కంపెనీకి ప్రభుత్వం అప్పగించిన (దాదాపు) 1900 ఎకరాల భూమిలో రైతుల జిరాయితీ భూమి గానీ, భూమి లేని పేదలకిచ్చిన

అసైన్‌మెంట్ భూమి గానీ ఒక్క ఎకరం కూడ లేదు. ఒక్క గుడిసె గానీ పశువుల కొట్టం గానీ లేదు. ఎవరి భూమీ తీసుకోకుండ, ఎవరి ఇళ్ళూ కూల్చకుండానే పెద్ద థర్మల్ ప్లాంటు నెలకొల్పబోతున్నారు. దానివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. చుట్టుపక్కల భూముల ధరలూ పెరుగుతాయి. భరోసాలేని వ్యవసాయం మానుకొని థర్మల్ ప్లాంటు వల్ల వచ్చే ఉపాధి అవకాశాలు చేపట్టవచ్చు, చుట్టుపక్కల భూములున్నట్టయితే ధరలు పెరిగినాక అమ్ముకొని పలాసలోనో శ్రీకాకుళంలోనో, అదృష్టం బాగుంటే విశాఖపట్నంలోనో స్థిరపడి అభివృద్ధి ఫలాలు అందుకోవచ్చు. అందరికీ మేలుచేసే అభివృద్ధి ప్రయోగానికి ఇది చక్కటి ఉదాహరణ అని ప్రభుత్వం అంటోంది.

అయినప్పటికీ స్థానిక ప్రజలలో మెజారిటీ దీనిని గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. వాళ్ళకు అందుబాట్లో లేని సమాచారం వారికి ఉద్యమకారులు అందిచ్చి ఉండవచ్చును గానీ వ్యతిరేకించాలన్న నిర్ణయానికి మాత్రం వారే వచ్చారు. దానికి కారణాలు వారే చెప్తారు. ఒకటి, 'వ్యవసాయానికి పనికి రాని వ్యర్థ భూమి' అని ప్రభుత్వము, కంపెనీ వర్ణించే ఆ భూమిలో 1000 ఎకరాల విస్తీర్ణం గల నీటి వనరుంది. దానిని 'బీలా' అనీ, ఆ భూమిని 'బీలా భూమి' అనీ స్థానికులు అంటారు. సోంపేట ప్రాంతంలో తూర్పుకనుమలు సముద్రానికి దగ్గరగా రావటం వల్ల ఇక్కడ తీరప్రాంతం నిడివి తక్కువ. వర్షాకాలంలో కొండచరియల నుంచి వేగంగా వచ్చే వరదనీరు ఈ ఇరుకు ప్రాంతంలోని లోతయిన నేలలో నిలువ ఉండిపోవడం వల్ల బీలా భూములు ఏర్పడ్డాయి. నాగార్జునవారి కిచ్చిన ఈ భూమిలోని వెయ్యి ఎకరాల వైశాల్యం గల నీటి వనరు మాణిక్యాపురం అనే గ్రామానికి చెందిన ఒరియా మాట్లాడే 300 మత్స్యకార కుటుంబాలకు ఏకైక జీవనాధారం. ఇకమీదట అది ఉండదు. ఆ నీటివనరు నుంచి మోటార్లు పెట్టుకొని 2000 నుంచి 4000 ఎకరాల భూమిలో రెండవ పంటగా వరిసాగు చేసుకుంటున్న రైతులు 1000 నుంచి 2000 మంది (ఆయా సంవత్సరాలలో నీటి లభ్యతను బట్టి) ఉన్నారు. ఈ ఆధారమూ పోతుంది.

కాగా, థర్మల్ ప్లాంటుకు భారీ పరిమాణంలో అవసరమైన నీళ్లు దగ్గరలో ఉన్న సముద్రం నుంచి తీసుకోనున్నారు. నిజానికి నెల్లూరు నుంచి శ్రీకాకుళం దాకా తీరం వెంబడి డజన్ల సంఖ్యలో థర్మల్ కేంద్రాలను అనుమతించడం వెనకున్న

రహస్యం బంగాళాఖాతం పుణ్యాన సులభతరమైన ఈ నీటి లభ్యతే. ఈ సౌలభ్యం ముందు అన్ని అభ్యంతరాలూ తేలిపోయాయి. సోంపేట థర్మల్ ప్లాంటుకు రోజుకు 1 లక్ష 88 వేల ఘనపు మీటర్ల నీరు సముద్రం నుంచి పంప్‌చేసి తీసుకుంటారని అధికార సమాచారం. ప్లాంటులో ఆవిరయిన నీటిని కూలింగ్ టవర్లలో చల్లబరచి ద్రవీకరణ చేసి తిరిగి ప్లాంటులోనే వాడుకుంటామని అంటారు గానీ ఇది కొంతమేరకే సాధ్యం అవుతుంది. కొంత నీరు వెనక్కి సముద్రంలోకి పోతూనే ఉంటుంది. దాని ఉష్ణోగ్రత తీసుకున్న నీటి ఉష్ణోగ్రత కంటే 5 లేక 10 డిగ్రీలు ఎక్కువ ఉంటుంది. పంపింగ్ కారణంగా జరిగే నిరంతర సాగర మథనం వల్ల, నీటి ఉష్ణోగ్రత పెరగడం వల్ల తీర ప్రాంతంలో జల జీవాల పునరుత్పత్తి బాగా దెబ్బతింటుంది. అంటే తీరానికి దగ్గరగా చేసే చేపల వేట దెబ్బతింటుంది. దీని మీద ఆధారపడ్డ కుటుంబాలెన్నో కచ్చితమైన లెక్కలేదు గానీ 10 మత్స్యకార గ్రామాలున్నాయనేది వాస్తవం.

'వ్యవసాయానికి పనికిరాని వ్యర్థ భూములు' కంపెనీకి అప్పగించడం వల్ల ఇంతమంది జీవనాధారం ఇంతగా దెబ్బతింటుంది. (పెద్ద మోతాదులో విడుదలయ్యే సల్ఫర్‌డై ఆక్సైడ్ గురించి, మెర్క్యురీ గురించి, సాలీనా ఆ ప్లాంటు విసర్జించబోయే 50 లక్షల టన్నుల బూడిద గురించి, వీటి వల్ల రాగల రోగాల గురించి ఇప్పుడు మాట్లాడుకోవద్దు. అనుభవంలోకి వచ్చేదాకా ఈ చర్చ చాదస్తంగా భావించబడుతుంది.) కోల్పోతున్న ఈ ఉపాధికి మారుగా కంపెనీ కల్పించే ఉపాధి ఏ పాటిది? వారి లెక్కల ప్రకారమే ప్లాంటు నిర్మాణం జరిగే కాలంలో 2500 దాకా మట్టి మోసే కూలీ పనులు లభిస్తాయి. అదయిపోయిన తరువాత కంపెనీలో 750 ఉద్యోగాలుంటాయి. అందులో సాంకేతిక నైపుణ్యం, శిక్షణ అక్కరలేనివి ఎన్ని ఉంటాయో కంపెనీ చెప్పలేదు. ఎక్కువ ఉంటే చెప్పేవారు కాబట్టి తక్కువ ఉంటాయనే అనుకోవాలి. ఆ ఉద్యోగాలు సహితం స్థానికులకే ఇప్పిస్తామని ప్రభుత్వాధికారులు ప్రజలకు చెప్తున్నప్పటికీ 'యోగ్యతను బట్టి, అవసరాన్ని బట్టి వారికి ఉద్యోగాలు ఇచ్చే విషయం పరిశీలించడం జరుగుతుంది' అని మాత్రమే కాయితాలలో రాసి ఉంటుంది. అంతకంటే కచ్చితమైన ఆదేశం ప్రైవేట్ కంపెనీలకు జారీచేసే అధికారం ప్రభుత్వానికి లేదని సుప్రీంకోర్టు ఈ మధ్య అనేక తీర్పులలో స్పష్టం చేసింది కూడ. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీవారి థర్మల్ ప్లాంట్ వల్ల స్థానిక ప్రజలు కోల్పోయే ఉపాధి కంటే పొందగల ఉపాధి చాలా స్వల్పం అనేది

స్పష్టమే. పోనీ నష్టపరిహారం తీసుకొని పట్టణానికి పోయి దానిని పెట్టుబడిగా మలచుకొని అభివృద్ధి చెందే అవకాశం ఎవరికైనా ఉందా? ఎవరి భూములూ సేకరించడం లేదు కాబట్టి భూసేకరణకు మారుగా నష్టపరిహారం పొందుతున్న వారెవరూ లేరు.

భూమి కోల్పోకపోయినా ఉపాధి గణనీయంగా కోల్పోయినవారికి నష్టపరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ సహాయ పునరావాస విధానం (జీవో 68) అంటుందిగానీ చేపల వేట లేక దెబ్బతినబోయే తీరప్రాంత మత్స్యకారులను ఈ కోవకు చెందినవారుగా ప్రభుత్వం గుర్తించడం లేదు. బీలా నీటివనరు నుంచి సాగునీరు పొందుతున్న రైతులనూ ఉపాధి కోల్పోయేవారిగా గుర్తించడం లేదు. వారి భూముల ధర పెరగడమేమో గానీ ఈ నీటి వసతి కోల్పోవడమే కాక వారికి వేరే ప్రమాదం కూడ ఉంది. 1000 ఎకరాల నీటి వనరు స్థానంలో ఫ్యాక్టరీ కడితే ఏటా అక్కడికి వచ్చి చేరే వరద నీరు నలుదిక్కులకూ పొర్లి ప్రవహిస్తుంది. దీనికి విరుగుడుగా కాలవ ఒకటి తవ్వి దానిని కొత్తగా తవ్వబోయే చెరువులోకి పారిస్తామని కంపెనీ అంటున్నది. కానీ వారికిచ్చిన 190 ఎకరాలలో బూడిదను నిలువ ఉంచే చెరువుకే తప్ప ఈ కొత్త చెరువుకు చోటు లేదని వారు పర్యావరణ నివేదికకు జతచేసిన పటాన్ని బట్టి అర్థం అవుతుంది. కాబట్టి, వరదనీటి కాలవ నిర్మించడం అంటూ జరిగితే అది సముద్రంలోకే పోతుందనేది స్పష్టమే. అంటే బీలా నీటివనరు శాశ్వతంగా పోయినట్టే.

ఒక్క మాణిక్యాపురం మత్స్యకారులు మాత్రమే నష్టపరిహారానికి అర్హులుగా గుర్తింపు పొందినట్టు తెలుస్తున్నది. ఆ 300 కుటుంబాలకు నష్టపరిహారంగా నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ 1 కోటి 80 లక్షలు ఇవ్వజూపుతున్నట్లు వదంతి. అది పెద్ద మొత్తమనిపిస్తుంది గానీ 300 తో భాగిస్తే కుటుంబానికి 60 వేలవుతుంది. ప్రభుత్వం జీవో 68 కింద ఇచ్చినా దాదాపు అంతే వస్తుంది. ఈ 60 వేలు తీసుకొని ఆ ఒరియా మత్స్యకారులు పలాసకో శ్రీకాకుళానికో పోయి దానిని పెట్టుబడిగా మార్చుకొని పట్టణ జీవులు కాగలరా? 60 వేలు తక్కువనేది కాదిక్కడ విషయం. 2 లక్షలిచ్చినా దానిని పెట్టుబడిగా మార్చి వర్ధిల్లే నేర్పు గ్రామీణులందరిలోనూ ఉంటుందనుకోవడం భ్రమ. నేర్పు కులాన్ని బట్టి ఉండే మన సమాజంలో మత్స్యకారుల వంటి కులాలలో అది మరీ తక్కువ. ఒకవేళ ఉందనుకున్నా, 300 మంది తలా రెండు లక్షలు పట్టుకొని

వ్యాపారం చేసుకుందామని పొరుగున ఉన్న ఒకటి రెండు పట్టణాలకు బయలుదేరితే అందరి ఆకాంక్షలను ఇముడ్చుకునే ఆర్థిక వ్యవస్థ మన దగ్గర లేదు. మగవాళ్లు డబ్బు ఆశకు కొంచెం తొణికినా ఆడవాళ్ళు మాత్రం – ఒక్క సోంపేటలోనేకాదు – చాలా కోపంగా ఉన్నారు. వచ్చిన డబ్బంతా మగవాళ్లు ఇక్కడా అక్కడా పెట్టి వృధాగా తగలేస్తే పిల్లలకు తిండి ఉండదని వారి ఆవేదన. అది పూర్తిగా వాస్తవికమైన, హేతుబద్ధమైన ఆవేదన.

మరి సోంపేట థర్మల్ ప్లాంటును ప్రజలెందుకు వ్యతిరేకించకూడదు?

**ఆంధ్రజ్యోతి దినపత్రిక**
**12 ఆగస్టు 2009**

కె. బాలగోపాల్



# విస్థాపన - విధ్వంసం

కంపెనీలకు వచ్చే లాభాన్ని, వారి అభివృద్ధిని 'దేశం అభివృద్ధి'గానో, 'రాష్ట్ర అభివృద్ధి'గానో పిలిచేవారు నిర్వాసితులయ్యే వేలాది ప్రజలకు కలిగే నష్టాన్ని 'దేశం నష్టం'గాను, 'రాష్ట్రం నష్టం'గాను భావించి దేశం, లేక రాష్ట్రం దానిని భరించాలని ఎందుకు అడగరు? అటువంటి చట్టం గానీ, విధానం గానీ దేశంలో ఎందుకు లేదని ఎందుకడగరు? ఉన్నవాళ్ళ అభివృద్ధి కోసం లేనివాళ్లు పూర్తిగా పతనం అయ్యే ప్రగతిని మనం ఎందుకు అంగీకరించాలి?

మానవహక్కుల వేదిక ప్రచురణ

